వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 12 సంచిక : 8 హైదరాబాద్ 157 ఆగస్టు 2014 పేజీలు : 68 రు. 20

★ మోడీ తొలి బడ్జెట్‌పై రెండు వ్యాసాలు

★ తెలంగాణ ప్రభుత్వ విధానాల దిశ?

★ హైదరాబాద్‌పై గవర్నర్ గిరీ

★ గ్యాస్ ప్రమాదం - రైల్వే గేటు విషాదం

★ చరిత్ర మండలి అధ్యక్ష నియామకం

★ తెలుగు మీడియాలో అంధ దశ

★ గాజా - పాశ్చాత్య దేశాల కపటత్వం

వీక్షణంకు రాయండి, రాయించండి

పన్నెండు సంవత్సరాలుగా ప్రతినెలా దాదాపు ఇరవై వ్యాసాలతో పాఠకుల, ప్రజల సమాచార, అవగాహనా, విశ్లేషణా అవసరాలను తీర్చడానికి వీక్షణం రాజకీయార్థిక మాసపత్రిక చేస్తున్న కృషి మీకు తెలుసు. అయితే ఎంత కృషి చేసినా చేయవలసిన కృషి మిగిలిపోయేంత వైవిధ్యభరితమైన, వైరుధ్యపూరితమైన సమాజం మనది. ఎంత రాసినా సమాజం తనగురించి తాను ఆలోచించుకోవలసిన విషయాలు, రాయవలసిన విషయాలు, వెలుగు ప్రసరించవలసిన విషయాలు, అవగాహన పెంపొందించుకోవలసిన అంశాలు ఇంకా ఎన్నో మిగిలిపోతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఇటీవలి అంతర్జాతీయ, దేశీయ, ప్రాంతీయ పరిణామాలు ఇంకా ఎక్కువ రచనలను, ఆలోచనలను కోరుతున్నాయి.

పేదదేశాలను కబళిస్తున్న ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద రాజ్యాల, బహుళజాతి సంస్థల దుర్మార్గాలు, వారు తెచ్చిపెడుతున్న యుద్ధాలు ఎంత రాసిన తరగనివే. మతోన్మాద రాజకీయాల పునాది మీద, అభివృద్ధి భ్రమలతో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా రానున్న సంవత్సరాలలో అమలు కానున్న రాజకీయార్థిక విధానాలు నిశితంగా పరిశీలించి, ప్రజలకు తెలియజెప్పవలసినవే. కొత్తగా రూపొందిన రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పెల్లుబుకుతున్న ప్రజా సమస్యలు వివరంగా చర్చించుకోవలసినవే. తెలుగుదేశం పాలనలో కొత్త ఆంధ్రప్రదేశ్ లో ప్రకటిస్తున్న విజన్ 2020 అభివృద్ధి నమూనా, గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అమలై వినాశకరమైనదిగా రుజువైనదే. తెలంగాణలో ప్రజా ఉద్యమ క్రమంలో ఆకాంక్షలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో, వ్యవస్థ మార్పు తప్ప మరేదీ ఆ ఆకాంక్షలను తీర్చలేని స్థితిలో ప్రజా అసంతృప్తి పెరిగే అవకాశం ఉంది. అంటే దేశవ్యాప్తంగానూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ రానున్న కాలంలో తీవ్రమైన ప్రజా సమస్యలు, ప్రజా ఆందోళనలు విస్తరించే అవకాశం ఉంది.

సమాజం తనతో తాను జరుపుకునే సంభాషణకు గళంగా, ప్రజానుకూల చర్చావేదికగా వీక్షణం ఈ సామాజిక స్థితికి అద్దం పట్టదలచుకుంది. ఈ సామాజిక స్థితిని విశ్లేషించదలచుకుంది. గ్రామీణ, స్థానిక, ప్రాంతీయ స్థాయిలలో ఎక్కడెక్కడ ప్రజా సమస్యలు వ్యక్తమయినా, ప్రజా అసంతృప్తి పొడసూపినా, ఉద్యమ రూపం ధరించినా ఆ పరిణామాలన్నిటినీ వీక్షణం ప్రచురించదలచుకుంది. ఈ కర్తవ్య నిర్వహణలో భాగం కావలసిందిగా వీక్షణం తన పాఠకులకూ, అభిమానులకూ, ఆలోచనాపరులకూ, రచయితలకూ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నది. ఈ విషయాల మీద రాయడానికి ప్రయత్నించండి. రాయండి, రాయించండి. ప్రధాన స్రవంతి పత్రికలు విస్మరించే అంశాలపై, ప్రధాన స్రవంతి పత్రికలలో వెలువడినా భిన్నమైన ప్రజాకోణం ఉండే అంశాలపై వ్యాసాలు, అన్ని సామాజిక అంశాల మీద ప్రజాదృక్పథాన్ని అందించే వ్యాసాలు ప్రచురించడం వీక్షణం లక్ష్యం. వీక్షణంకు అటువంటి వ్యాసాలు రాయగలిగిందీ, రాయవలసిందీ, రాయించవలసిందీ మీరే. మీరే.

ISSN 2231-6892

157

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఆగస్టు 2014
సంపుటి : 12
సంచిక : 8

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; నల్గొండ – జి. వెంకటేశ్వర్లు; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విశాఖపట్నం – పి.వి. రమణ; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌లపై 'veekshanam' అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **01391101002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూల నిధికి సూరి (హైదరాబాదు) మూడు దఫాలుగా ఇచ్చిన మొత్తం రు. 21000, జె.ఆర్. నాగభూషణం (తమిళనాడు) రు. 200, ఎల్. సుబ్బయ్య (కర్నూలు) రు. 100 ఆర్థిక సహాయం అందజేశారు. అందరికీ కృతజ్ఞతలు. - సం.

జూలై నెల వీక్షణంలో 'భారత రాజకీయ మాయా జూదం' పేరున నేను రాసిన వ్యాసం చూసి దిగ్భ్రాంతికి గురికావడమే కాక చాల వ్యధచెందాను. ఎందుకంటే నేను రాయని వాక్యాలను చొప్పించి (భా.క.పా అంటే భాజపా, భారతీయ జనతాపార్టీ అని చొప్పించి) భారత కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భావం నాటి పార్టీ ఎజెండాను, కార్యక్రమాన్ని బిజెపి ఎజెండాగా, కార్యక్రమంగా అంటగట్టి అభాసుపాలు చేశారు. రచయితను బదనాం చేయాలని ఇలా చేశారేమో అని అనుకోవడం దూకుడే అవ్వొచ్చు గాని, ఎందుకని ఇలా జరిగిందో నాకైతే అర్థం కావడం లేదు. ఇది రచయితకే కాక, వీక్షణం ప్రతిష్ఠకు కూడా భంగమేనని నేను భావిస్తున్నాను. ఆఖరి పేరాను ముందు, పట్టిక వద్ద పేరాను ఆఖరుకు నెట్టి తింగరబింగర చేశారు. అసలు ఈవ్యాసం ఇలా తప్పులతడకగా వేసేకన్నా, వేయకుండా ఉంటే బాగుండేది కదా!

– బి.ఎస్. రాజు
హైదరాబాద్

(సాంకేతిక సమస్యల వల్ల వ్యాసంలో పొరపాట్లు దొర్లాయి. రచయితకు మనస్తాపం కలిగించినందుకు చింతిస్తున్నాం. – సం.)

వీక్షణం జూన్ 2014 సంచికలో కుల సమస్య పై మేం రాసిన నోట్‌లోని మూడవ భాగంలో కొన్ని అచ్చుతప్పులు చోటు చేసుకొన్నాయి. 58వ పేజీ రెండవ కాలంలోని మొదటి పేరాలో 'కమ్యూనిస్టు ఉద్యమం కుల నిర్మూలన ఎజండాను దృఢంగా ముందుకు తీసుకుపోవడానికి ఈ కారణం కూడా దోహదపడింది' అని ఉంది. 'తీసుకుపోకపోవడానికి' అని ఉండాలి. అట్లాగే 59వ పేజీ రెండవ కాలం మొదటి పేరాలో చివరి నుండి రెండో వాక్యంలో 'ఈ వెల్లువలోనే అర్థం చేసుకోవాలి' అని ఉంది. 'ఈ వెలుగులోనే' అని ఉండాలి. ఇవి కాక ఇంకా కొన్ని చిన్న చిన్న తప్పులు (క్రియకి సంబంధించినవి, అర్ధ విరామాలు, పూర్ణ విరామాలు) దొర్లి 'పంటి కింద రాయిలా' అడ్డం పడుతున్నాయి. ఇతర వ్యాసాల్లో కూడా జాగ్రత్త వహించగలరు.

విశ్వం రాసిన వ్యాసం బాగుంది. అయితే అసాల్ట్ అంటే కుదింపు అని ఎందుకు రాశారో అర్థం కాలేదు. ఏదైనా ప్రామాణికమైన రెఫరెన్స్ ఉంటే రాస్తారని ఆశిస్తున్నా. ఆంగ్లంలో అసాల్ట్ అంటే కుదింపు అనే అర్థం ఏమాత్రం లేదు. మరి రష్యన్ భాషలో అట్లా ఏమైనా అర్థం ఉందా? రైఫిల్ రేంజ్‌ని రెండు గజాలకు పరిమితమయ్యేలా డిజైన్ చేశాడని రాశారు. అది కూడా తప్పు. ఏ స్టాండర్డ్ ఆయుధాల పుస్తకంలోనూ ఎకె–47 రేంజ్ రెండు గజాలని ఉండదు. బహుశా రెండువందల గజాలకు బదులుగా రెండు గజాలు అని అచ్చు తప్పు పడి ఉండవచ్చు. అయినా దాని రేంజ్ ఇంకా ఎక్కువే.

ఇదే సంచికలో మాధవ రాసిన లేఖ చూసి కొంచెం ఆశ్చర్యం వేసింది. 'ఉత్పత్తి సంబంధాలను తీసేస్తే మిగతా సమాజం అంతా కేవలమైనదా? అసలు ఇట్లాగ మార్క్స్ ఎక్కడైనా చెప్పాడా?' అని రాశారు. మార్క్స్ అట్లా చెప్పాడని మా వ్యాసంలో ఎక్కడైనా రాశామా? ఉత్పత్తి సంబంధాలను తీసేసి మానవ సమాజం అసలు ఉంటుందా అనేది వేరే చర్చ కానీ, ఇక్కడ మేం అనని దాని గురించిన ప్రస్తావన ఎందుకు? పైగా తనకే స్పష్టత లేని దాని మీద 'వైకుంఠం బదులు పునాదిని కూకోబెట్టినట్టుందనీ' ఓ వ్యంగ్యం కూడా! లేఖలు చర్చకో, జ్ఞానం పెరగడానికో దారితీయకపోతే వాటి ప్రయోజనం ఏంటీ? రాసిన వాళ్లకి మేం కూడా రాశాం అనే తృప్తిని మిగల్చడం తప్ప. మార్క్స్ పుస్తకాలను ప్రత్యక్షంగా చదువుకోడానికి ఏ పార్టీ అడ్డుపడ్డదనీ? నిర్మాణ రాహిత్యం పట్ల మాధవకు ఉన్న మోజు మాత్రమే ప్రకటితమవుతోంది.

– ఎన్. రవి
మావోయిస్టు రాజకీయఖైదీ, విశాఖపట్నం

2014 ఏప్రిల్ 22న చుండూరు ఘటనపై హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు న్యాయానికి ఉరి వేసినట్లే. అందరూ నిర్దోషులైతే దళితులను హత్య చేసిందెవరు? పోలీసుల కనుసన్నలలో ముందు పథకం ప్రకారం అగ్రకుల రెడ్డి కాపులకు చెందినవారు దళితులను వెంటాడి వేటాడి నరికి చంపారు. పథకం ప్రకారం జరిగిన నరమేధం. నేరస్తులను రక్షించే ఉద్దేశంతోనే పోలీసులు ఎఫ్ఐఆర్, ఛార్జీ షీటులు తయారు చేశారు. న్యాయ వ్యవస్థలో ఉన్న లొసుగులతో ముద్దాయిలు ఆటలాడుకున్నారు. కుల ఆధిపత్యం ఆనాటి 1991లో ముఖ్యమంత్రి జనార్ధనరెడ్డి, హోంమంత్రి మైసూరారెడ్డి కుట్ర ఇందులో దాగి ఉంది. హైకోర్టు ధర్మాసనం విచారణ ప్రారంభించిన దగ్గర నుండి దోషులను ఎలా విడిచిపెట్టాలి అన్న కోణంలో పావులు కదిపి అందరూ నిర్దోషులని తీర్పుఇవ్వడం ద్వారా తమ అగ్రకుల తత్వాన్ని నిరూపించుకొన్నారు. ఎన్నికలపై ఎనిమిది వ్యాసాలు, నరేంద్రమోడీ నిజ స్వరూపం వ్యాసాలు బాగున్నాయి.

– తుంపాల శ్రీరామమూర్తి
గాజువాక, విశాఖపట్నం

తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయారు. వారి మౌలిక సమస్యలు వారిని వెంటాడుతూనే ఉన్నాయి. రెండు రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు ఎన్నికల వాగ్దానాల్లో ఎన్నో హామీలు కురిపించారు. కాని ఆచరణకు వచ్చేసరికి సాకుల కోసం వెతుకుతున్నారు. వీక్షణం రెండు రాష్ట్రాల ప్రజల తరపున వారి మౌలిక సమస్యలను ముందుకు తేవాలి. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో జరిగినట్టుగానే హైదరాబాదు కేంద్రంగా అభివృద్ధి చేస్తామనీ, నగరాన్ని విశ్వనగరంగా చేస్తామని ప్రచారం చేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే తెలంగాణలోని మిగతా ప్రాంతాలను విస్మరించే ప్రమాదం ఉంది. అట్లాగే ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక కారిడార్ల కోసం వేల ఎకరాల పంట భూములు, ఓడరేవుల నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, గనుల తవ్వకాల వంటి బహుళజాతి సంస్థలకు ఉపయోగపడే పథకాలను ముందుకు తెస్తున్నారు. వీటి వల్ల ఎందరో ఆదివాసులు, రైతులు, మత్స్యకారులు నిర్వాసితులవుతారు. ఇలా ప్రజా జీవితాలపై ప్రభావం చూపే అంశాలపై వీక్షణంలో వ్యాసాలు రావాలి.

– వి. సుబ్బారావు
ప్రకాశం జిల్లా

వీక్షణంలో వచ్చే వ్యాసాలు చాలా వరకు సమాచార పరంగానే ఉంటున్నాయి. వీక్షణం నుంచి విశ్లేషణ్మాతక రచనలు ఆశిస్తున్నాం. తెలుగు నేలపై జరిగే పరిణామాలపైనే కాక, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై కూడా ఇంకా ఎక్కువ వ్యాసాలు రావాలి. విషయం సమగ్రంగా ఉండి, పేజీల నిడివి కొంచెం తక్కువగా ఉంటే వ్యాసం చదవడానికి బాగుంటుంది. వ్యాసాలలో అచ్చు తప్పులు చాలా దొర్లుతున్నాయి. సంపాదకవర్గం ఈ వైపు కొద్దిగా దృష్టి సారించాలి.

– టి. రాములు
మిర్యాలగూడ

వీక్షణం జూలై సంచికలో 'అధికరణం 370' గురించి ఎ. నర్సింహారెడ్డి వ్యాసం బాగుంది. భారతీయ జనతాపార్టీ అధికారంలోకి కూడ వచ్చింది గనుక వారు ప్రచారం చేసే అబద్ధాల, అర్ధ సత్యాల జోరు పెరుగుతుంది. ఈ వ్యాసంలో లాగనే ఆ అబద్ధాలను వివరించి, వాస్తవ చరిత్రను విప్పి చెప్పడానికి ప్రతి సంచికలోనూ కొన్ని పేజీలు కేటాయిస్తే బాగుంటుంది.

– బి. నాగరాజు
హైదరాబాద్

అన్ని రంగాల్లోనూ స్పష్టమవుతున్న మోడీ రంగు

దేశంలోని పాలకవర్గ ముఠాలన్నీ ప్రజావ్యతిరేకమైనవే, సామ్రాజ్యవాద బహుళజాతిసంస్థల అడుగులకు మడుగులొత్తుతూ, దేశ వనరులను దేశదేశాల సంపన్నులకు దోచిపెట్టడానికీ దేశంలోని కాలంచెల్లిన సామాజిక వ్యవస్థను యథాతథంగా పరిరక్షించడానికీ పూనుకున్నవే. అందులో సందేహమేమీ లేదు. ఆ పాలకవర్గ ముఠాలలో ఏ ముఠా మేలు, ఏ ముఠా తక్కువ ప్రమాదకరం అనే చర్చకే ఆస్కారం లేదు. కాకపోతే ఒక్కొక్క ముఠాకూ ఒక్కొక్క రకమైన వ్యక్తీకరణ ఉంటుంది. ప్రాధాన్యతలలో ప్రత్యేకత ఉంటుంది. ఒక్కొక్క ముఠా ఒక్కొక్క రకంగా తన ప్రజావ్యతిరేక పాలనను కొనసాగిస్తుంది. భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ కూటమి అయినా భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ అయినా ఒకే తానులోని ముక్కలేనని రెండు నెలల మోడీ పాలన రుజువు చేస్తున్నది. ఇప్పటికే చాలమంది వ్యాఖ్యాతలు మోడీ పాలనను యుపిఎ మూడో పాలనగా విశ్లేషిస్తున్నారు. ఈ రెండు నెలలలో తమ ప్రభుత్వ విధానాల మీద విమర్శలు వచ్చినప్పుడల్లా కనీసం అరడజను సందర్భాలలో 'పాత ప్రభుత్వపు పనినే కొనసాగిస్తున్నాం' అని స్వయంగా ప్రధానమంత్రో, ఇతర మంత్రులో ప్రకటించారు. మరి పాత ప్రభుత్వపు పనినే కొనసాగించడానికి కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ఎందుకు, ఎన్నికల ప్రహసనం ఎందుకు, ఎన్నికలకు ముందు ఒకరి మీద ఒకరు తీవ్రమైన ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకోవడం ఎందుకు అనే కనీస ప్రశ్నలు తలెత్తడం లేదు.

ఈ రెండు నెలలలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, చట్ట, పాలనా, విదేశీ వ్యవహారాల రంగాలలో ఏ ఒక్క రంగంలోని చర్యలు చూసినా అవి పాత యుపిఎ ప్రపంచీకరణ విధానాల పరంపరలో భాగంగానో, తమ సొంత మతోన్మాద కార్యక్రమంలో భాగంగానో, వ్యక్తిగత ఇష్టాయిష్టాలలో భాగంగానో జరిగినవిగా కనబడతాయి. ధరల పెరుగుదల గురించి, అవినీతి గురించి, దేశభక్తి గురించి, స్వదేశీ గురించి, స్వావలంబన గురించి సంఘ్ పరివార్ దశాబ్దాలుగా చెపుతున్న మాటలన్నీ నీటి మూటలేనని, అధికారం కోసం తమ మౌలిక అవగాహనలను కూడ ఎటుపడితే అటు వంచగలరని నరేంద్ర మోడీ, ఆయన మంత్రివర్గ సహచరులు ప్రతిరోజూ రుజువు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రాజ్యాంగ మౌలిక ఆదర్శాలైన రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, సమానత్వం, సార్వభౌమాధికారం వంటి విలువల మీద తమకు ఏ మాత్రం గౌరవం లేదని చెప్పకనే చెపుతున్నారు.

యుపిఎ పాలనాకాలంలో ధరల పెరుగుదల మీద తీవ్రమైన విమర్శలు గుప్పించి, తాము అధికారంలోకి వస్తే పరిస్థితి మారిపోతుందని వాగ్దానాలు కురిపించిన భారతీయ జనతా పార్టీ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుంటే కనీసం అక్రమ నిలువదార్ల మీద దాడులు చేసి సరఫరా పెంచే చర్యలు తీసుకోవడం లేదు. ఉల్లిపాయలు, బంగాళా దుంపల ధరల పెరుగుదల మీద కదిలినట్టు నటిస్తూనే ఆ సమస్య పరిష్కారాన్ని కాలానికి వదిలేశారు. తొలి రైల్వే బడ్జెట్ లో ప్రయాణికుల ఛార్జీలతో సహా రవాణా ఛార్జీలు పెంచి, తద్వారా అన్ని సరుకుల ధరలు పెరిగిపోవడానికి ప్రత్యక్ష కారణంగా నిలిచారు. ఆ తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని సంపన్నులకు, బహుళజాతి సంస్థలకు ఇబ్బడి ముబ్బడిగా వరాలు కురిపిస్తూనే, ప్రజా సంక్షేమ నిధుల మీద కోత విధించడానికి పరిమితమైంది. కార్పొరేట్ ప్రయోజనాల పరిరక్షణ ఒకవైపు, హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోవడం మరొకవైపుగా సాగిన బడ్జెట్ అతి స్పష్టంగా ఈ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టేది ఏమీ లేదని చూపింది. రక్షణ రంగానికి విపరీతంగా నిధుల పెంపుదల, రక్షణ, బీమా రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితి పెంపు, కార్పొరేట్ పన్ను పెంచకపోవడం, బుల్లెట్ రైలు ప్రవేశపెట్టడం, పరిశ్రమల, వ్యాపారాల స్థాపన ప్రక్రియను వేగవంతం చేయడం వంటి చర్యల ద్వారా కార్పొరేట్ రంగ ప్రయోజనాలు తీర్చారు. మదన్‌మోహన్ మాలవీయ, వల్లభాయ్ పటేల్ వంటి జాతీయోద్యమ నాయకత్వంలో మతవాదులుగా గుర్తింపు పొందినవారికి, శ్యాంప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ వంటి సంఘ పరివార్ నాయకులకు పెద్దపీట వేయడం ద్వారా ప్రభుత్వ ప్రాధాన్యత ఏమిటో చెప్పారు. కశ్మీరీ పండిట్ల పునరావాసానికి రు. 500 కోట్లు, వల్లభాయి పటేల్ విగ్రహానికి రు. 200 కోట్లు ఇచ్చిన వారికి దేశవ్యాప్తంగా చిన్నారి ఆడపిల్లల చదువుకోసం రు. 100 కోట్లు ఇవ్వడానికి చేతులు రాలేదు. మరొకవైపు రాజ్యాంగం ఐదవ షెడ్యూల్ ప్రకారం, 1/70 చట్టం, పంచాయత్ రాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ చట్టం, పునరావాస, సహాయ నిబంధనలు చెప్పే విధివిధానాలనూ ఆంక్షలనూ తోసిరాజని క్షణాల మీద పోలవరం గ్రామాల ముంపు ఆర్డినెన్స్ తెచ్చారు. ఆ ఆర్డినెన్స్ పాత ప్రభుత్వం తయారు చేసినదేనని సాకు చెప్పారు. దాన్ని అంతే వేగంగా, చట్టవ్యతిరేకంగా పార్లమెంటులో లోకసభలో తమ మంద బలాన్నీ, రాజ్యసభలో కాంగ్రెస్ కుమ్మక్కునూ ఉపయోగించుకుని చట్టం చేసి, ఆదివాసుల నిర్మూలన తమ లక్ష్యమని చూపుకున్నారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ మారణ కాండను ఖండించడం అలా ఉంచి, చర్చించడానికి అనుమతించలేదంటే పాలకపక్షపు హంతక రాజకీయాలు బహిర్గతమవుతున్నాయి.

సంఘ్‌పరివార్ పాలన ఎలా భావజాల రంగాలలో కూడ విషకోరలు చాచడానికి ప్రయత్నిస్తుందో చూపడానికి నిదర్శనంగా ఈ రెండు నెలలలోపలే కులవ్యవస్థను సమర్థించే, ఇతర మతస్తుల పట్ల ద్వేషభావాన్ని ప్రచారం చేసే హిందూత్వ చరిత్ర అధ్యాపకుడిని ప్రతిష్ఠాత్మకమైన భారత చరిత్ర పరిశోధక మండలికి అధ్యక్షుడిగా నియమించారు. గుజరాత్ మారణకాండ నెత్తురు చేతులకంటినవాడు, ఇష్రాత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ హత్య కేసులో నిస్సందేహమైన నిందితుడు, జైలు పక్షి, ఉత్తరప్రదేశ్‌లో ముజఫర్‌నగర్ మతకల్లోలాలు జరిపించి మైనారిటీ మతస్తులను బెదిరించి భారతీయ జనతా పార్టీ విజయానికి శవసోపానాలు నిర్మించిన అమిత్ షా ను పాలక పార్టీ తన అధ్యక్షుడిగా ప్రకటించిందంటే ఈ దేశపు పార్లమెంటరీ రాజకీయాలు ఎంత పతనమయ్యాయో, నరహంతకులను నాయకులుగా అంగీకరించేంత కుళ్లిపోయాయో తేటతెల్లమవుతుంది. పైకి చూడడానికి భిన్నంగా కనబడే ఈ రాజకీయ పక్షాలన్నిటినీ తోసిరాజని, నిజమైన ప్రజా ప్రత్యామ్నాయ రాజకీయాలను, రాజకీయార్థిక విధానాలను, అభివృద్ధి నమూనాను గురించి ఆలోచించాలని, ఆవిష్కరించుకోవాలనీ చరిత్ర మనను ఆదేశిస్తున్నది. వీ

నవ తెలంగాణ నిర్మాణ దిశ ఇదేనా?

మొదటిసారిగా అధికార బాధ్యతలు చేపట్టినవారు తప్పటడుగులు వేయడం సహజమే కావచ్చు, కాని స్పష్టంగా తెలిసిన తప్పటడుగులు వేయగూడదు. అందులోనూ విశాల ప్రజారాశులు విస్తృతమైన ఆకాంక్షలతో సుదీర్ఘకాలం పోరాడిన ఫలితంగా రూపొందిన అధికారం ఆ ఆకాంక్షలను నెరవేర్చడానికే ప్రయత్నించాలి. నిజానికి ఇదేదో పాలకవర్గాల మీద అదనపు బాధ్యతను పెట్టడం కాదు. వారి బాధ్యతను గుర్తింపజేయడం మాత్రమే. ఉద్యమ క్రమంలో అనేకసార్లు ఆ నాయకులే నవ తెలంగాణను నిర్మిస్తామని, తెలంగాణను పునర్నిర్మిస్తామనీ వాగ్దానాలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడ ఆ వాగ్దానాలను పునరుద్ఘాటించారు. ఆ నేపథ్యంలో, ప్రజలు కోరినందుకో, రాజ్యాంగ ప్రవేశిక, ఆదేశిక సూత్రాలు నిర్దేశించినందుకో మాత్రమే కాదు, స్వయంగా మీ అంతట మీరే చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవడం మీ విధి అని సూచించవలసి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనను తెలంగాణ సమాజం ఎందుకు వ్యతిరేకించిందో, తన స్వయంపాలన కావాలని ఎందుకు కోరుకుని, దశాబ్దాల పాటు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ పోరాడిందో, త్యాగాలు చేసిందో తెలంగాణ ఏర్పడి రెండు నెలలు గడిచిన సందర్భంలో మరొకసారి గుర్తు చేసుకోవలసి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకుల మీద తెలంగాణ ప్రజల వ్యతిరేకతకు కారణాలు - పాలనలో కార్పొరేట్ సంస్థల మితిమీరిన జోక్యం, ప్రపంచీకరణ విధానాలు, ఆర్థిక, పారిశ్రామిక విధానాలలో బహుళజాతి సంస్థల ప్రయోజనాలే ప్రాధాన్యత వహించడం, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కేంద్రీకరణ జరగడం, సంపన్నులకు అవకాశాలు, పేద, మధ్యతరగతి వర్గాల మీద ఆంక్షలు, సామాజిక అంతరాలు తగ్గించడం మీద ప్రభుత్వం శ్రద్ధ పెట్టకపోవడం, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి అడుగడుగునా అవమానాలు జరగడం. ఏ కారణాల వల్ల తెలంగాణ ప్రజానీకం అసంతృప్తి చెంది, పోరాటానికి దిగిందో ఆ కారణాలలో కొన్ని తెలంగాణ ప్రభుత్వ పాలనలోనూ పునరావృతమైతే తెలంగాణ సమాజం ఏమి చేయాలి? ఆ కారణాలు అన్నిటికన్నీ యథాతథంగా పునరావృతమవుతున్నాయని కాదు, కాని కనీసం కొన్నయినా, హైదరాబాద్, ఐటి, సేవారంగం వంటి వాటిలో రూపు మార్చుకుని అయినా మళ్లీ ప్రవేశిస్తున్నాయి. తప్పనిసరిగా ప్రపంచీకరణ రాజకీయాలు, కార్పొరేట్ జోక్యం, కేంద్రీకరణ వంటి అవలక్షణాలు మరీ ముఖ్యంగా అధికారవర్గానికి అలవాటైన పాలనావిధానాల వల్ల, వారి మనఃస్థితి వల్ల తిరిగి తలెత్తుతున్నాయి. ఉద్యమ ఫలితంగా రూపొందిన పాలకపక్షం వ్యవస్థనంతా పరిమార్చి, కొత్త వ్యవస్థను తీసుకురావాలని అనుకోకపోవచ్చు. ఉన్న వ్యవస్థలో కొన్ని తెలంగాణ వ్యతిరేక అంశాలను సవరించడం అనే పరిమిత కార్యక్రమానికే కట్టుబడాలనుకోవచ్చు. కాని ఆ మేరకైనా పని జరగకపోతే, వ్యతిరేక దిశలో పనులు జరుగుతుంటే, నిరంతర జాగరూకతే ప్రజాస్వామ్యానికి మూల్యం అని తెలంగాణ సమాజానికి గుర్తుచేయవలసి వస్తుంది. సమరశీల చైతన్యం కలిగిన తెలంగాణ సమాజం దేన్నీ మౌనంగా సహించదనీ, నిరంతరం పోరాడుతుందనీ చెప్పవలసి వస్తుంది. వీ

అవే విధానాలు కొనసాగిస్తున్న చంద్రబాబు


తెనాలి రామలింగని పిల్లి అనేది తెలుగు జాతి తరతరాలుగా పాటిస్తున్న నైసర్గిక వివేకానికి ఒక ప్రతీక. ఒకసారి వేడి పాలతో పెదాలు కాలిన పిల్లి మరొకసారి చల్లని పాల దగ్గరికైనా పోదని ఆ ప్రతీక చెపుతుంది. చరిత్ర అవసరం లేదని బహిరంగంగానే ప్రకటించిన చంద్రబాబు నాయుడు ఈ ప్రతీకను గుర్తించదలచుకున్నట్టు లేరు. ఏ విధానాల వల్ల తన తొమ్మిది సంవత్సరాల పాలన ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నదో, తిరుగులేదనుకున్న తనకు ఓటమిని ప్రసాదించిందో ఆయనకు అనుభవం వచ్చినట్టు లేదు. అధికారానికి వచ్చిన వెంటనే గవర్నర్ ప్రసంగంలో చెప్పించుకున్నట్టుగానే, 1995-2004 నాటి విధానాలను యథాతథంగా అమలు చేయడానికే ఆయన ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఆర్థిక, రాజకీయ అధికార కేంద్రీకరణ వల్లనే తన మీద వ్యతిరేకత పెరిగిందనీ, అదే రాష్ట్ర విభజనకు ఒక కారణమైందనీ తెలిసినా ఆయన కొత్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడ అదే రకమైన కేంద్రీకరణ విధానాలు కొనసాగిస్తున్నారు. రాయలసీమ ప్రజల ప్రయోజనాలను ఖాతరు చేయకుండా, శ్రీ బాగ్ ఒడంబడిక నిబంధనలను పట్టించుకోకుండా, రియల్ ఎస్టేట్, కార్పొరేట్ రంగాలలోని ఒక సామాజిక వర్గం కోసం కేంద్రీకృత రాజధాని ఆలోచనలు చేస్తున్నారు. సుదీర్ఘ సముద్ర తీరాన్ని బహుళజాతి సంస్థలకు కట్టబెట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంకు నిర్దేశిత రాజకీయార్థిక విధానాలను ప్రవేశపెట్టడానికి ముందు, 1996-97లో ఆ ప్రపంచ బ్యాంకు మార్గదర్శకత్వంలోనే అనేక రంగాల మీద శ్వేతపత్రాలను ప్రకటించారు. తాను అవలంబించబోయే ప్రజావ్యతిరేక విధానాలకు మధ్యతరగతి మద్దతు కూడగట్టడానికి నిర్దేశించిన పత్రాలవి. మళ్లీ ఇప్పుడు కూడ శ్వేతపత్రాల ప్రకటన ప్రారంభమయింది. ఇప్పటికే విద్యుత్ రంగం మీద విడుదల చేసిన శ్వేతపత్రంలో తన పాత పాలనాకాలంలో విద్యుత్ రంగం అత్యద్భుతమైన పనితీరును కనబరిచిందనీ, ఆ తర్వాత పది సంవత్సరాలలో అది ధ్వంసమై పోయిందనీ ఆయన అన్నారు. నిజానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగాన్ని ధ్వంసం చేసినది చంద్రబాబు నాయుడి పాలనా విధానాలు. విద్యుత్ బోర్డును మూడు ముక్కలు చేయడం, విద్యుత్ రంగం మీద ప్రభుత్వ పర్యవేక్షణను వదులుకుని, దాన్ని స్వతంత్ర సంస్థ అనే తప్పుడు పేరుగల కార్పొరేట్ అనుకూల నియంత్రణ కిందికి తేవడం ఆ పాలనలోనే జరిగాయి. ఆ సంస్థ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించమని ఆందోళన చేసినందుకు హైదరాబాద్ నడిబొడ్డున ముగ్గురు ఆందోళనకారులను కాల్చిచంపినది ఆ పాలన లోనే. అప్పటి విద్యుత్ రంగ సంస్కరణలు అద్భుతమైనవని ఇవాళ శ్వేతపత్రం పొగుడుతున్నదంటే ఆ పాలనను తిరిగి ప్రవేశపెడతామని చెప్పక చెప్పడమే. ఈ పాలనా విధానాలను ఎప్పటికప్పుడు ప్రశ్నించకపోతే, ప్రతిఘటించకపోతే ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం రెండు మూడు సంవత్సరాలలోనే మళ్లీ ఒకసారి దుర్భర స్థితిలోకి దిగజారతారు. ఈ విధానాలను ప్రజాదృక్పథం నుంచి పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతులను చేస్తూ, ప్రభుత్వం అమలు చేసే ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించే ఉద్యమాలను నిర్మించడం, ఆ ఉద్యమాలకు సహకరించడం ఆంధ్రప్రదేశ్‌లోని బుద్ధిజీవుల బాధ్యత. వీ

వినండి గాజా విధ్వంస శోకం


పాలస్తీనా లోని గాజా ఇరవై రోజులుగా నెత్తురోడుతున్నది. ఇజ్రాయిల్ దురహంకార ప్రభుత్వం ఎడతెరిపి లేకుండా సాగిస్తున్న బాంబు దాడులలో గాజా ప్రాంతంలోని జనావాసాలన్నీ శిథిలాలుగా మారిపోతున్నాయి. అధికారిక అంచనాల ప్రకారమే ఇప్పటివరకు వెయ్యి మందికి పైగా గాజా పౌరులు, స్త్రీలు, చిన్నారిపిల్లలు, పురుషులూ బాంబు దాడులలో చనిపోయారు. వేలాది మంది గాయపడగా, ఇజ్రాయెల్ సైన్యాలు ఆసుపత్రులను కూడ లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. లక్షమందికి పైగా నిరాశ్రితులై గోడుగోడున విలపిస్తున్నారు. ప్రపంచదేశాలన్నీ, సభ్యసమాజమంతా మౌనసాక్షిగా ఈ దురంతంలో భాగం పంచుకుంటుండగా, అమెరికా, బ్రిటన్ వంటి సామ్రాజ్యవాద ప్రభుత్వాల మద్దతుతో, తన అరబ్ వ్యతిరేక జియోనిస్టు పాలకవర్గ మత దురహంకారంతో ఇజ్రాయెల్ విర్రవీగుతున్నది. ఇంత హింసకూ, విధ్వంసానికీ ఇజ్రాయెల్ పాలకవర్గాలు చూపుతున్న కారణం గాజా ప్రాంతంలో హమస్ దళాలు ఆశ్రయం పొందాయనీ, మొదట తమ పౌరులు ముగ్గురిని ఎత్తుకుపోయి చంపివేశాయనీ, ఆ తర్వాత రాకెట్ దాడులతో తమ పౌరులు 43 మంది చనిపోవడానికి కారణమయ్యాయనీ. హమస్ దళాలు చేసిన, చేస్తున్న ఈ హింసకు తమది ప్రతిహింస మాత్రమేనని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అంటున్నాడు. పాలకవర్గ భావజాలంతో ప్రభావితులైన కొందరు బుద్ధిమంతులు కూడ హమస్ దాడులనే ప్రశ్నిస్తున్నారు. నిజానికి పాలస్తీనా భూభాగాన్ని దురాక్రమించింది ఇజ్రాయెల్. అక్కడి నుంచి పాలస్తీనీయుల్ని వెళ్లగొట్టింది ఇజ్రాయెల్. పాలస్తీనియుల్ని వారి దేశంలోనే వారిని పరాయివారినీ, రెండో తరగతి పౌరుల్నీ చేసింది ఇజ్రాయెల్. ఈ దుర్మార్గాన్ని ఆపమని ప్రపంచ మానవాళి చేసిన అభ్యర్థనలనూ, హెచ్చరికలనూ లెక్కచేయక, ఎన్నో ఐక్యరాజ్యసమితి తీర్మానాలను ఉల్లంఘించింది ఇజ్రాయెల్. అమెరికా దన్నుతో పశ్చిమాసియాలో రౌడీగా ప్రవర్తిస్తున్నది ఇజ్రాయెల్. పాలస్తీనీయుల స్వాతంత్ర్య కాంక్షతో పోరాడుతున్న హమస్ గురించి మాట్లాడడానికి ఇజ్రాయెల్ కు అరత లేదు. యాసర్ అరాఫత్ నాయకత్వంలో పాలస్తీనా విమోచన సంస్థ జరిపిన సుదీర్ఘ పోరాటం గాని, ఐక్యరాజ్య సమితి దౌత్యం గాని విఫలమైనప్పుడు పాలస్తీనా విముక్తి లక్ష్యంతో ఏర్పడిన సాయుధ పోరాట సంస్థ హమస్. తమ భూమి అక్రమంగా ఆక్రమించి తమమీద హింస జరుపుతున్న దురాక్రమణదారుకు వ్యతిరేకంగా ఏర్పడిన ప్రతిహింసా సంస్థ హమస్. హమస్ ఏదైనా తప్పు చేసినా, వారు ముగ్గురు ఇజ్రాయెలీలను చంపారనేది, బాంబుదాడులను ప్రతిఘటిస్తూ రాకెట్ లాంచర్లతో 43 మందిని చంపారనేది నిజమే అయినా, సాధారణ జనావాసాల మీద బాంబుదాడులు జరిపి వెయ్యి మందిని బలిగొన్న ఇజ్రాయెల్ ముందుగా తన అక్రమాలకు సంజాయిషీ ఇవ్వాలి. బందిపోట్ల రాజ్యంగా నడుస్తున్న ప్రస్తుత ప్రపంచంలో ఈ బందిపోటు అక్రమాలు సజావుగా సాగడానికి పెద్దన్న అమెరికా సహకరిస్తున్నది. ఆ అమెరికా చెప్పుచేతల్లో భారత ప్రభుత్వం ఈ హత్యాకాండను చర్చించడానికి కూడ వీలు లేదంటున్నది. సామ్రాజ్యవాదం, దురహంకారం ఎంత అమానుషమైనవో గాజా నిరంతర శోకం ద్వారానైనా ప్రపంచంలోని ప్రజాస్వామిక ప్రియులు, మానవతావాదులు గుర్తించాలి. సామ్రాజ్యవాదాన్ని అంతమొందించకుండా ఈ ప్రజా విలాపాన్ని ఆపడం సాధ్యం కాదని గుర్తించాలి. వీ

1946 నుండి 2000 వరకు పాలస్తీనా కోల్పోయిన భూభాగం


పాలస్తీనా, యూదుల భూమి 1946 | ఐక్యరాజ్య సమితి ప్రతిపాదిత విభజన 1947 | 1949 - 1967 | 2000



19వ శతాబ్దం చివరి రోజుల నుంచి యూదులు తమ పవిత్ర భూమిగా ఎంచే పాలస్తీనాలో భూమి కొనుక్కొని స్థిరపడడం ప్రారంభించారు. మొదటి పటం 1946 నాటికి పాలస్తీనాలో యూదుల ఆవాసాలను చూపుతుంది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత దేశ దేశాల యూదులను పాలస్తీనాలో స్థిరపరచడానికి బ్రిటన్ చొరవతో ఐక్యరాజ్య సమితి చేసిన ఏర్పాటు పాలస్తీనాలో సగాన్ని ఇజ్రాయిల్‌కు ఇచ్చేసింది. అరబ్ దేశాలకూ, ఇజ్రాయిల్‌కూ యుద్ధం మొదలై 1949లో యుద్ధ విరమణ జరిగేనాటికి పాలస్తీనాలోని 77 శాతం భూమి ఇజ్రాయిల్ చేతికి చిక్కింది. 1967 ఇజ్రాయిల్ మరొక యుద్ధం జరిపి మరింత భూభాగాన్ని ఆక్రమించింది. ప్రస్తుత దాడులు ఆ భూభాగంలోని గాజా నుంచి పాలస్తీనీయులను తరిమివేసే వ్యూహం.



❖ **మన ప్రపంచం** – వారం వారం వ్యాఖ్యానం – దుప్పల రవికుమార్ – సిక్కోలు బుక్ ట్రస్ట్ – 176 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: దుప్పల రవికుమార్, 1-297, సైనిక్ నగర్, టెక్కలి – 532 201




❖ **మోట బొక్కెన** – తెలంగాణ పునర్నిర్మాణ ఆకాంక్షలు – సంపాదకులు: నల్లెల్ల రాజయ్య – వరంగల్ రచయితల సంఘం – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: నల్లెల్ల సూర్యప్రకాష్, ఇ.నెం. 7-1-384/6, పద్మాక్షి కాలనీ, హన్మకొండ, వరంగల్, సెల్ : 9989415571




❖ **శాంతివనం** – పిల్లలు అనుభవాలు ప్రయోగాలు – మంచికంటి – శాంతివనం ప్రచురణలు – 243 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్; నవోదయ పబ్లిషర్స్; విశాలాంధ్ర బుక్‌హౌస్;

ebook: www.kinige.com



❖ **గోదావరి** – త్రైమాసిక సాహిత్య పత్రిక – జూన్– ఆగస్ట్ 2014, సంపుటి 1, సంచిక 1 – 60 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: వంగాల సంపత్ రెడ్డి, ఇ.నెం. 1-1-850 & 850/1/202, ఫ్లాట్ నెం. 202, శ్రీ అవెన్యూ అపార్ట్‌మెంట్, సిద్ధార్థనగర్, కాజీపేట, వరంగల్ 506 004, తెలంగాణ, సెల్ : 8897463990




❖ **నా సైకిల్ యాత్రా దర్శనం** – మంచికంటి యాత్ర – శాంతివనం ప్రచురణలు – 198 పేజీలు, 1/8 డెమీ, రు. 180, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్; నవోదయ పబ్లిషర్స్; విశాలాంధ్ర బుక్‌హౌస్;


ebook: www.kinige.com




❖ **వినయపిటకం** – ప్రజాఉద్యమ కార్యకర్తలకు కరదీపిక – బొర్రా గోవర్ధన్ క్రాంతికిరణ్ – పాయసి ప్రచురణ – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు: బొర్రా గోవర్ధన్, శాంతినికేతన్, నగరం – 522 268, గుంటూరు జిల్లా, సెల్ : 93906 00157



❖ **తత్వశాస్త్రం** (చిన్న పరిచయం) – రంగనాయకమ్మ – స్వీట్ హోమ్ పబ్లికేషన్స్ – 232 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ – 520 002, ఫోన్ : 0866 2431181



❖ **వెలుగు రవ్వల జడి** (ఆలోచనలు, అనుభవాలు) – ఆలూరి భుజంగరావు – రాహుల్ సాహిత్య సదనం – 103 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్; విశాలాంధ్ర బుక్‌హౌస్; దిశ పుస్తక కేంద్రం; అన్ని ప్రముఖ పుస్తకాల దుకాణాలలో




❖ **విలోచనం** (సాహితీ విమర్శ వ్యాసాలు) – డా. అనుగూరు చంద్రశేఖర రెడ్డి – 156 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: డా. అనుగూరు చంద్రశేఖర రెడ్డి, ఇ.నెం. 12/305, హనుమప్ప వీధి, కడప – 516 001, చరవాణి: 9949299458



❖ **జర్నలిజం – ప్రొఫెషన్ అండ్ ట్రేడ్ యూనియన్ & వయలెన్స్ అగెనెస్ట్ వుమెన్** – ఎం. రత్నమాల – నూతన ప్రచురణలు – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: ఎం. రత్నమాల, మేఘా అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం. 302, నల్లకుంట, హైదరాబాద్ – 44, ఫోన్: 27662957; సెల్: 9440329445




❖ **ఐదో స్తంభం** – కథలు – మెట్టు మురళీధర్ – చెలిమి సాహిత్య సాంస్కృతిక వేదిక ప్రచురణ – 98 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు: మెట్టు రవిందర్, ఇ.నెం. 1-386/3, చాణక్యపురి, భీమారం, హన్మకొండ – 506015, వరంగర్; సెల్: 9908763566; ravinder.mettu8@gmail.com




❖ **కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు – 3 – జాతీయ సమస్యలు** – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు – పోరునేల ప్రచురణలు – 341 పేజీలు, 1/8 డెమీ, రు. 150



❖ **తెలంగాణ విద్యారంగం – ఉపాధ్యాయ ఉద్యమం** – డా. ఏరుకొండ నరసింహుడు – తెలంగాణ ఉపాధ్యాయ మిత్ర మండలి ప్రచురణ – 103 పేజీలు, 1/8 డెమీ, రు. 60




❖ **కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు – 4 – అంతర్జాతీయ సమస్యలు** – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు – పోరునేల ప్రచురణలు – 212 పేజీలు, 1/8 డెమీ, రు. 110



❖ **ప్రపంచీకరణ – ఆంధ్రవలసవాదం – తెలంగాణ ఉద్యమం** – డా. ఏరుకొండ నరసింహుడు – తెలంగాణ ఉపాధ్యాయ మిత్రమండలి ప్రచురణ – 67 పేజీలు, 1/8 డెమీ, రు. 40

పై రెండు ప్రతులకు: ఏరుకొండ శ్రీదేవి, 2-4-1204/ 8/10/129, కుడా కాలనీ, లష్కర్ సింగారం, హన్మకొండ, వరంగల్ – 9; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



❖ **కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు – 5 – తెలంగాణ ప్రజల సాయుధ పోరాటం** – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు – పోరునేల ప్రచురణలు – 645 పేజీలు, 1/8 డెమీ, రు. 220

పై మూడు ప్రతులకు: రాష్ట్రంలోని ప్రముఖ పుస్తక కేంద్రాలు

వర్తమాన చరిత్ర - రాజకీయార్థిక దృష్టి

నిధుల కొరతా, పెద్దల బ్యాంకు రుణాల ఎగవేతా?

దళిత, ఆదివాసి, వెనుకబడిన వర్గాల, మహిళల అభివృద్ధికి సంక్షేమ పథకాలు, రైతుల రుణమాఫీ, విద్యార్థులకు ఉపకార వేతనాలు, రైతులకు, వెనుకబడిన వర్గాలకు సబ్సిడీలు, ప్రాథమిక విద్య, ప్రాథమిక ఆరోగ్యం, ప్రజా రవాణా వ్యవస్థ వంటి పద్దులు వచ్చినప్పుడల్లా ప్రభుత్వానికి ఆర్థిక సంక్షోభం, నిధుల కొరత గుర్తుకొస్తూ ఉంటాయి. ఆ పథకాలకు కోత విధించడం ఎట్లా అని పాలకవర్గాలు, ప్రభుత్వాలు ఆలోచిస్తుంటాయి. ఇటీవల ఉన్నత మధ్యతరగతి లోకి ఎదుగుతున్న వర్గం, విద్యావంతులు కూడ ప్రభుత్వాల దగ్గర నిధులు ఎక్కడున్నాయి అనీ, ప్రభుత్వం ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నదనీ చిలకపలుకులు వల్లిస్తున్నారు.

దేశంలో, ముఖ్యంగా ప్రభుత్వాల దగ్గర సంపద చాలినంత లేదనే పచ్చి అబద్ధం మధ్యతరగతి బుద్ధిజీవుల మెదళ్లను పెద్ద ఎత్తున ఆక్రమించుకున్నది. నిజానికి ఈ పేద, మధ్యతరగతి వర్గాలకు ఇచ్చే రాయితీలు, సబ్సిడీలు, పథకాలు అన్నీ కలిపినా ఏ ఒక్క సంవత్సరం లోనూ ధనిక, వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు ముట్టజెప్పే నిధులకు మించవు. పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమ నిధులలో కూడ ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రకటించే అంకెకూ, చిట్టచివరి లబ్ధిదారుకు అందేదానికీ మధ్య ఎంతో అంతరం ఉంటుంది. చాల సబ్సిడీలు పేదల పేరు మీద పెద్దలు అందుకునేవే.

అవన్నీ అలా ఉండగా దేశంలో బడా పారిశ్రామిక, వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకుల ఆశ్రితులైన సంపన్నులు ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి రుణాలుగా తీసుకుని, సకాలంలో అసలుగాని, వడ్డీలు గాని చెల్లించక, ఏళ్లకు ఏళ్లు గడిపి చివరికి రాజకీయ మద్దతుతో ఆ రుణాలు మాఫీ చేయించుకుంటున్నవీ, ఎగ్గొడుతున్నవీ లెక్కవేస్తే ఏటేటా ఎన్ని వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఈ వ్యాపారవర్గాల బొక్కసాల్లోకి ప్రవహిస్తున్నదో అర్థమవుతుంది. పెట్టుబడిదార్లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు తమ సొంత డబ్బుతో సంస్థలు, వ్యాపారాలు, కార్ఖానాలు పెట్టి కార్మికులకు, ప్రజలకు ఉద్యోగాలు కల్పిస్తారనే అపోహ చాలమందికి ఉంది. కాని ఇప్పటివరకు ఏ పరిశ్రమ అయినా, వ్యాపారమైనా ప్రారంభకులు (ప్రమోటర్స్ అంటారు) నూటికి నూరు శాతం తమ చేతుల్లోంచి, జేబుల్లోంచి పెట్టుబడి పెట్టి ప్రారంభించినది కాదు. పది శాతమో, పదిహేను శాతమో, ఎక్కువలో ఎక్కువ ఇరవై ఐదు శాతమో తాము పెట్టుబడి పెట్టి, మిగిలినది బ్యాంకుల నుంచి, ఇతర ద్రవ్యసంస్థల నుంచి రుణాలుగానో, మిత్రుల దగ్గర, మదుపుదార్ల దగ్గర వాటాలుగానో సేకరించినవే. తాము పెట్టుబడి పెడుతున్నామని చెప్పే భాగాన్ని కూడ తాము కొనే పరికరాల ధరలు ఎక్కువ చూపి, వాటికి రుణాలు తీసుకున్నప్పుడు అందులో భాగం చేస్తున్నవాళ్లు, అంటే తమ చేతినుంచి ఒక్క పైసా కూడ పెట్టనివాళ్లు ఎందరో ఉన్నారు. సాధారణంగా ఈ బ్యాంకు రుణాలకు వడ్డీరేటు ఎక్కువగానే ఉంటుంది. కాని తిరిగి చెల్లించాలనే ఆలోచనే లేనప్పుడు, వడ్డీరేటు ఎక్కువ ఉంటే మాత్రం ఏం? ఈ రుణాలు తీసుకున్నవారు సాధారణంగా రాజకీయ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నవారు గనుక వారిని తిరిగి చెల్లించమని అడగడానికే బ్యాంకు అధికారులు సంకోచిస్తారు. ఎక్కడైనా ఒకచోట నియమ నిబంధనల పట్టింపు ఉన్న బ్యాంకు అధికారి అలా ప్రశ్నిస్తే రాజకీయ నాయకుల నుంచి 'తగిన' సూచనలు అందుతాయి, లేదా బదిలీలు జరుగుతాయి.

మొత్తం మీద బ్యాంకులు ఇటువంటి రుణాలను, మొండిబాకీలను నాన్ పర్‌ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పిఎ – నిరర్థక ఆస్తులు) అనే ముద్దుపేరుతో పిలవడం మొదలుపెట్టాయి. ఈ మొండి బకాయిదారులు ఏ పరిశ్రమ కోసం, వ్యాపారం కోసం రుణం తీసుకున్నారో అది నష్టాల బారిన పడిందని, మూసివేశామని చూపుతూ బాకీలు ఎగ్గొట్టి, అదే సమయంలో ఆ నిధులను తమ సొంత ఆస్తులకు మళ్లిస్తారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలను, రాజకీయ నాయకులను పట్టుకుని వడ్డీ మాఫీ, రుణ మాఫీ, రుణ పునర్వ్యవస్థీకరణ (డెట్ రిస్ట్రక్చరింగ్), వన్ టైమ్ సెటిల్మెంట్ వంటి అనేక పేర్లతో ఆ బాకీలు కొట్టేయించుకుంటారు. అలా ప్రతిసంవత్సరం వేల కోట్ల రూపాయల ప్రజాధనం ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల నుంచి సంపన్నుల సొంత బొక్కసాలకు బదిలీ అయి, వారి సొంత ఆస్తిగా మారుతున్నది. నూతన ఆర్థిక విధానాల తర్వాత ఈ డెట్ రిస్ట్రక్చరింగ్ నిరంతర కార్యక్రమంగా మారింది. పదివేలు, ఇరవైవేలు అప్పు పడి, కాలం అనుకూలిస్తే తిరిగి చెల్లించాలని ఆలోచించే రైతుల వంటపాత్రలు, ఇంటి సామాన్లు బైటికి విసిరేసి అవమానించే, వేధించే బ్యాంకు అధికారవర్గం వంద కోట్లు, వెయ్యి కోట్లు అప్పుపడి ఎగ్గొట్టే మార్గాలు వెతుకుతున్న సంపన్నులకు మాత్రం ఎర్రతివాచీలు పరిచి రాయితీలు ప్రకటిస్తుంది.

ఈ అక్రమాన్ని బైట పెట్టడానికి, తమ బ్యాంకులలో మొండి బాకీలు ఎవరివో, ఆ మొండి బాకీదారులను కాపాడడానికి యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఎట్లా ప్రయత్నిస్తున్నాయో బహిర్గతం చేయడానికి బ్యాంకు ఉద్యోగుల సంఘాలు కొన్నేళ్లకింద ప్రయత్నాలు ప్రారంభించాయి. ఆ వివరాలు బైటపెట్టడం అధికారిక రహస్యాల చట్టం కిందికి వస్తుందని, అది శిక్షార్హమైన నేరమని యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఆ జాబితాలు బైటికి రాకుండా చూశాయి. ఇటువంటి మొండిబాకీలు 2000 నాటికే లక్ష కోట్ల రూపాయలని, వాటిలో రు. 800 కోట్ల అప్పుతో హర్షద్ మెహతా అగ్రభాగాన ఉన్నాడని అప్పటి రాజ్యసభ సిపిఐ సభ్యుడు గురుదాస్ దాస్ గుప్తా రాజ్యసభలో అన్నాడు. మొండిబకాయిదారుల జాబితాలు బైటపెట్టడానికి వీలుగా అధికారిక రహస్యాల చట్టాన్ని సవరించాలని సూచించాడు.

పదిహేనేళ్లు గడిచిన తర్వాత ఇప్పుడు బ్యాంకు ఉద్యోగుల సంఘాల సమాఖ్య తాజా సమాచారం విడుదల చేసింది. దాని ప్రకారం గత

పదమూడు సంవత్సరాలలో ప్రభుత్వం రద్దు చేసిన మొండి బాకీలు రు. 2,04,000 కోట్లు. మొండి బాకీలను రిస్ట్రక్చర్ చేసి మంచి బాకీలుగా చూపిస్తున్నవి రు. 4,95,000 కోట్లు. బ్యాంకు యాజమాన్యాలే మొండి బాకీలుగా చూపుతున్నవి 2013 సెప్టెంబర్ నాటికే రు. 2,36,000 కోట్లు. అంటే ఈ మూడు పద్దులే చూసినా కనీసం దాదాపు పది లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం సంపన్నుల జేబుల్లోకి ప్రవహించింది. దేశవ్యాప్తంగా ఈ మొండి బకాయిదార్ల జాబితాలో కింగ్‌ఫిషర్ ఎయిర్ లైన్స్ అధిపతి, ప్రముఖ మద్యం, రాజకీయ పార్టీల పోషకుడు విజయ్ మాల్యా ఉండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ మొండి బకాయిదార్ల జాబితాలో మాజీమంత్రి కావూరి సాంబశివరావు, ప్రస్తుత ఎంపి సుజనా చౌదరి, మాజీ ఎంపిలు గిరీష్ సాంఘి, లగడపాటి రాజగోపాల్ వంటి వారెందరో ఉన్నారు.

బడ్జెట్ కేటాయింపుల మాయాజాలం

మామూలుగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఎండాకాలంతో కలిసి వస్తుంది. ఫిబ్రవరి చివరి రోజున బడ్జెట్ ప్రవేశ పెట్టి, మార్చ్ నెలంతా పార్లమెంటు ఉభయసభలూ చర్చించి, ఆర్థిక సంవత్సరం మొదలయ్యే ఏప్రిల్ 1 నుంచి అమలులోకి తేవాలని పాత సంప్రదాయం. ఆ సంవత్సరానికి సంబంధించిన విధాన ప్రకటనలు, వాటికి కేటాయింపులూ అన్నీ బడ్జెట్ ప్రసంగంలో ఉండడం తప్పనిసరి ఆనవాయితీ. కాని నూతన ఆర్థిక విధానాల తర్వాత బడ్జెట్ ప్రాముఖ్యత నానాటికీ తగ్గిపోతూ వచ్చి, అది కేవలం ఒకానొక పన్నుల ప్రకటనగా మారిపోయింది. సంవత్సరంలో ఎప్పుడైనా పాలకపక్షపు ప్రయోజనాలను బట్టి విధాన ప్రకటనలు, వాటికి నిధుల వాగ్దానాలు చేస్తూ ఉండవచ్చు. బడ్జెట్ కేటాయింపు ఉందా లేదా అనే దానితో సంబంధం లేదు. బడ్జెట్ ఆర్థిక సంవత్సరపు కాలక్రమాన్ని పాటించాలనే నియమం కూడ లేదు. ఎన్నికల రాజకీయాలను బట్టి బడ్జెట్ ప్రవేశపెట్టడం కూడ మారుతుండవచ్చు.

ఆర్థిక వ్యవస్థ ఎలా నడుస్తున్నదో, వనరులు ఏ రంగాల నుంచి ఏ రంగాలకు ప్రవహిస్తున్నాయో, పాలకవర్గాల ప్రయోజనాలు ఏ ఆర్థిక పరిణామాలలో వ్యక్తమవుతున్నాయో తెలుసుకోవడానికి బడ్జెట్ ఇప్పటికీ ఒక ముఖ్యమైన సూచికే. కాని దాని దుష్ప్రభావానికి అత్యంత తీవ్రంగా గురయ్యే విశాల సమాజానికి మాత్రం అర్థంకాని మాంత్రిక భాషలో అది తయారుకావడం వల్ల దాన్ని పట్టించుకోవలసినవాళ్లు పట్టించు కోవడం లేదు. ఆ మాంత్రిక భాష అర్థం కాకపోయినా బడ్జెట్ ప్రవేశపెట్టే రోజున పత్రికలు, చానళ్లు హడావిడి చేసి తమకు తోచింది వండి వారుస్తాయి. మధ్య తరగతి వేతనజీవులు తాము ఎంత ఆదాయం పన్ను చెల్లించాలో, తాము కొనే సరుకుల ధరలు ఎలా పెరుగుతాయో చూడడానికి మాత్రమే బడ్జెట్ చూస్తారు. పారిశ్రామిక, వ్యాపార వర్గాలు బడ్జెట్ తయారీకి ముందే ఆర్థిక మంత్రితో సమావేశాలు పెట్టి తమకు ఏం కావాలో చెప్పి ఉంటాయి గనుక, తాము అడిగినవి ఇచ్చారా లేదా అని చూస్తాయి. ఇంతకీ నూట ఇరవై కోట్ల మంది జీవితాలను శాసించే బడ్జెట్‌ను (ఆ మాటకొస్తే ఇతర ప్రభుత్వ విధానాలన్నిటినీ) పట్టించుకునేవారు ఒక కోటి మంది ఐనా ఉంటారా అనుమానమే.

ఇన్ని మాయలతో పాటు బడ్జెట్ లో మరొక మాయ ఉంది. ప్రతి బడ్జెట్‌లోనూ మూడు అంకెలు ఉంటాయి. ఒకటి, ఆక్చువల్స్, అంటే వాస్తవమైనవి. అవి రెండు సంవత్సరాల కిందటివి అయి ఉంటాయి. రెండో అంకె, రివైజ్డ్ ఎస్టిమేట్స్, అంటే సవరించిన అంచనాలు. అవి గడిచిన సంవత్సరానివి అయి ఉంటాయి. మూడో అంకె బడ్జెట్ ఎస్టిమేట్స్, అంటే రానున్న ఆర్థిక సంవత్సరంలో రాబడి, ఖర్చు, కేటాయింపు ఎంత ఉంటుందో అంచనా వేసేవి. బడ్జెట్ రాగానే ఇన్ని వేలకోట్లు, అన్ని వేలకోట్లు అని చెప్పేవి ఈ మూడో అంకెలే. ఈ అంకెకు ప్రభుత్వం కచ్చితంగా కట్టుబడి ఉండాలని నియమమేమీ లేదు. ఇప్పుడు ఫలానా రంగానికి వెయ్యి కోట్లు ఇస్తున్నాం అని ప్రకటించవచ్చు. రానున్న సంవత్సరమంతా వంద కోట్లో, పదకొండు వందల కోట్లో ఖర్చు పెట్టవచ్చు. అప్పుడు సవరించిన అంచనాలలో ఈ కొత్త అంకె ప్రకటించవచ్చు. అది కూడ కచ్చితమైన అంకె కాకపోవచ్చు. ఆ మరుసటి సంవత్సరం ఆక్చువల్స్‌లో గాని దాని అసలు రంగు బయటపడదు. ఈ భాగోతమంతా చెప్పేదేమంటే భారత ప్రభుత్వపు అంకెలకు విశ్వసనీయత లేదు అని. ఈ అంకెల గారడీ అంతా ప్రజలను మాయ చేయడానికే అని.

హోం మంత్రిత్వశాఖ–మావోయిస్టు ఉద్యమం

రాజకీయార్థిక పరిణామాలను పరిశీలించేటప్పుడు రాజకీయ, ఆర్థిక, సామాజిక, పాలనా విధానాలను వేరు చేసి చూడడానికి వీలులేదు. ప్రజా అసంతృప్తితో, ప్రజా ఉద్యమాలతో ఎలా వ్యవహరిస్తారనేది కూడ దేశ రాజకీయార్థిక వ్యవస్థ నిర్వహణలో కీలకమైనదే. కొత్త ప్రభుత్వం అధికారానికి వచ్చిన వెంటనే ఆయా రంగాలలో గత ప్రభుత్వాలు చేసిన రాజకీయ విధానాలను, ఆర్థిక లావాదేవీలను సమీక్షించడం, తాము చేయదలచిన పనిని నిర్దేశించుకోవడం మామూలే. నరేంద్రమోడీ ప్రధాన మంత్రిగా ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో హోం మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న రాజ్‌నాథ్ సింగ్ మావోయిస్టు ఉద్యమ సమీక్ష కోసం జూన్ 27న పది మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఆ సమావేశంలో మావోయిస్టు ఉద్యమం పై రాజకీయ, ఆర్థిక వైఖరులు రెంటినీ ఆయన ప్రకటించారు. చత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఒడిశా, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌లు, సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్ అధిపతులు హోం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు హాజరైన ఈ సమావేశంలో మావోయిస్టుల మీద ప్రతీకారం తీర్చుకోవడంలో 'తగిన విధంగా' జవాబివ్వమని ఆయన అధికారులను ఆదేశించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో రోడ్లు వేయడానికి, రవాణా, సమాచార సంబంధాలు మెరుగుపరచడానికి ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదన్నారు. రాష్ట్రాలు, కేంద్రం ఇతోధిక సమన్వయంతో పనిచేయాలని కోరారు. భద్రతా చర్యల కోసం రాష్ట్రాలు పెట్టే ఖర్చును తిరిగి చెల్లించే కేంద్ర నిధిని రు. 200 కోట్ల నుంచి రెట్టింపు చేసి, రు. 400 కోట్లుగా ప్రకటించారు. మావోయిస్టులతో చర్చలకు వెళ్లాలను కోవడం లేదని అన్నారు. మావోయిస్టుల వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు ఎలా విఘాతం కలుగుతున్నదో పెద్ద ఎత్తున ప్రచారం చేసి, ఆదివాసులను మావోయిస్టుల నుంచి దూరం చేయాలన్నారు. వీ

గ్యాస్ ప్రమాదం - రైల్వే గేటు విషాదం

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో గ్యాస్ లీకు ప్రమాదం, తెలంగాణలోని మెదక్ జిల్లా రైల్వే ప్రమాదానికి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే కారణమని అంటున్నారు **సి. రాజశేఖర్**

కోనసీమలో అగ్గిరాజేసిన గెయిల్

జూన్ 27 తెల్లవారుజామున తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలో సహజవాయువు సరఫరా చేస్తున్న పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకై అంటుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో పదిహేను మంది మరణించగా, ముప్పై మంది తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారి సమీపంలోనే టీ హోటల్ నడుపుతున్న గటికుంటి వాసు హోటల్ తెరిచి టీ కోసం స్టవ్ అంటించగానే గ్యాస్ అంటుకుంది. సుమారు 18 అంగుళాల పైప్‌లైన్ ద్వారా సరఫరా అవుతున్న గ్యాస్ అంతకుముందు అర్ధరాత్రి నుంచి లీక్ అవుతూ దాదాపు యాభై ఎకరాల పరిధిలో దట్టంగా అలుముకుంది. స్టవ్ వెలిగించిన క్షణాల్లోనే గ్యాస్ ఆవరించిన ప్రాంతమంతా మంటల్లో చిక్కుకుంది. టీ హోటల్ నడుపుతున్న వాసు, అతని తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో సహా మొత్తం కుటుంబం ఈ అగ్నికీలల్లో కాలి బూడిదయ్యారు. యాభై మీటర్లకు పైగా మంటలు విస్తరించడంతో ఆ పరిధిలోని ఇళ్లు, పశువులు, చెట్లు, చెట్లపైనున్న పక్షులు మంటల్లో మాడి మసైపోయాయి. ప్రమాదం సంభవించినప్పుడు గ్రామం ఇంకా పూర్తిగా మేల్కొనలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశం దగ్గర్లోనే స్కూలు ఉంది. అదే ప్రమాదం పూర్తిగా తెల్లవారిన తరువాత జరిగి ఉంటే ప్రాణనష్టం భారీగా ఉండేది.

పేలుడు దుర్ఘటనలో చనిపోయిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి ఐదు లక్షల రూపాయల పరిహారం ఇచ్చాయి. గెయిల్ సంస్థ ఇరవై లక్షల రూపాయలు, మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ప్రకటించింది. గాయపడ్డవారికి ప్రభుత్వం, గెయిల్ నుంచి లక్ష రూపాయలు, చికిత్సకు అయ్యే ఖర్చును గెయిల్ భరిస్తుంది.

ఈ ప్రమాదానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) అధికారుల బాధ్యతారాహిత్యమే ప్రధాన కారణం. భారత చమురు, సహజవాయు సంస్థ (ఒఎన్‌జిసి) సహజవాయువును వెలికితీసి గెయిల్‌కు చెందిన పైప్ లైన్ ద్వారా నగరం సమీపంలోని గ్యాస్ సేకరణ కేంద్రం నుంచి కృష్ణా జిల్లా కొండపల్లిలోని ల్యాంకో విద్యుదుత్పత్తి కేంద్రానికి సరఫరా చేస్తుంది. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం వేసిన ఈ పైప్‌లైన్‌లు తగిన నిర్వహణ లేక పలుమార్లు గ్యాస్ లీకవుతోంది. అక్కడక్కడ గ్యాస్ లీక్ అయినా గాలిలో కలిసిపోయేది. ఇలా గ్యాస్ లీక్ అయిన ప్రతిసారీ గెయిల్ అధికారులు చిన్న చిన్న మరమత్తులు చేసి వదిలేసేవారు. మూడు నెలల వ్యవధిలో రెండుసార్లు ఈ పైపులైన్ లీక్ అయింది.

కోనసీమ ప్రాంతంలో రెండున్నర దశాబ్దాలుగా ఒఎన్‌జిసి సహజవాయువును వెలికితీసి గెయిల్ పైప్‌లైన్ ద్వారా ఎన్‌ఎఫ్‌సిఎల్, జిఎఫ్‌సిఎల్, ల్యాంకో తదితర కంపెనీలకు సరఫరా చేస్తోంది. కృష్ణా - గోదావరి (కెజి) బేసిన్‌లో సుమారు ఇరవై ఐదేళ్ల క్రితం వేసిన పైప్‌లైన్ల ద్వారానే ఈ సరఫరా సాగుతోంది. వీటి నిర్వహణ అంతా గెయిల్ పర్యవేక్షిస్తుంది. వివిధ ప్రాంతాల్లో తరచూ పైప్‌లైన్ల నుంచి గ్యాస్ అవుతున్నది. స్థానిక ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా నామమాత్రపు పనులతో సరిపుచ్చుతూ వచ్చారు. వారి నిర్లక్ష్యమే ఈసారి పదిహేను మంది నిండు ప్రాణాలను బలిగొంది.

లాభాపేక్షతో సరైన భద్రతా ప్రమాణాలను పాటించని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి. ప్రాణ, ఆస్తి నష్టాన్ని వారు ప్రకటించే నష్టపరిహారం ఏమాత్రం పూడ్చలేదు. ప్రభుత్వ అధికారుల అవినీతి, ప్రైవేట్ సంస్థల లాభాపేక్ష ఇలాంటి ప్రమాదాలకు ముఖ్య కారణాలు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా, ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాన్ని హరించే కాలుష్యాన్ని నివారించడంలో ప్రభుత్వ అధికారులు బాధ్యత వహించాలి.

చిన్నారుల ప్రాణాలు హరించిన నిర్లక్ష్యం

జూలై 24న మెదక్ జిల్లా మాసాయిపేట వద్ద కాపలా లేని రైల్వే గేటు పద్నాలుగు మంది చిన్నారి విద్యార్థులను చిదిమేసింది. తూప్రాన్‌లోని కాకతీయ టెక్నో స్కూల్‌కు చెందిన బస్సు తూప్రాన్ మండలంలోని గుండ్రెడ్డిపల్లి, ఇస్లాంపూర్, కిష్టాపూర్, వెంకటయ్యపల్లి తదితర గ్రామాల్లో విద్యార్థులను ఎక్కించుకొని వెల్దుర్తి మండలం మాసాయిపేట గ్రామానికి వెళ్తున్న సమయంలో 44 జాతీయ రహదారికి కొద్ది అడుగుల దూరంలో కాపలా గేటు లేని రైలు పట్టాలను దాటుతున్న సమయంలో ఉదయం 9 గంటలకు నాందేడ్ - హైదరాబాద్ ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. పట్టాలపైనే కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. దీంతో బస్సు నుజ్జునుజ్జయిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో 36 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాద స్థలంలోనే పన్నెండు మంది విద్యార్థులు, డ్రైవర్ చనిపోయారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు చనిపోయారు. క్షతగాత్రులను సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రికి తరలించారు. ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. చనిపోయిన వారు నాలుగేళ్ల నుంచి పద్నాలుగేళ్ల వయసు ఉన్న వాళ్లే.

ఈ ప్రమాదం మరోసారి రైల్వే శాఖ, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపింది. ప్రమాదం జరిగిన చోట ఎన్నో ఏళ్లుగా గేటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రైలు వచ్చే సమయంలో గేటు వద్ద ఎటువంటి కాపలా లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో కూడా ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయి, వికలాంగులైన వారు ఉన్నారు. పలుమార్లు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో గేటు పనులు ప్రారంభించారు, కాని పూర్తి చేయలేదు.

ఈ ప్రమాదానికి ప్రభుత్వానిది కూడా బాధ్యత ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలో రైల్వే కాపలా గేట్లు ఏర్పాటు విషయాన్ని రైల్వే శాఖతో సమన్వయం చేసుకొని ఏర్పాటు వేగిర పరచాల్సిన బాధ్యత ప్రభుత్వానిది.

యుపిఎ మూడవ ప్రభుత్వమే మోడీ ప్రభుత్వం

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి విధానాలు ప్రజలకు ఎటువంటి ఆశలూ కల్పించలేదనీ, ఇప్పుడు అమలవుతున్నవి ఇంతకు ముందున్న ప్రభుత్వ విధానాల కొనసాగింపేనని అంటున్నారు **వి. హనుమంతరావు**

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మారింది కాని విధానాలు మారలేదనేది 2014-15 బడ్జెట్‌ను అలా అలా పేజీలు తిరగేస్తే తెలిసిపోతుంది. మార్పు రావాలని ప్రజలు కోరుకున్నారని ఇదిగో మార్పు తెచ్చాం అంటున్నాడు మోడీ. నిజమే కాని ప్రజలు కోరిన మార్పు ధరలు, పేదరికం, వైద్యం, విద్య, కూడు, గూడు గురించే; పార్టీ మార్పు కాదు. కాని గత నెల రోజుల్లో మోడీ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలు చూస్తే ఏ రాయి అయితేనేం పళ్లూడగొట్టుకొనడానికి అనే సామెత గుర్తుకు వస్తోంది. కాంగ్రెస్, బిజెపి దొందుదొందే. రెండూ ఒకే వర్గం నుంచి వచ్చిన పార్టీలే కాగా విధానాల్లో తేడా ఎందుకుంటుంది? మార్పు కావాల్సింది విధానాలు, ఆచరణ. 'జిడిపి పెరుగుదల ప్రభుత్వం బాధ్యత, ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టడం మా బాధ్యత' అని రిజర్వు బ్యాంక్ గవర్నర్ రాజన్ స్పష్టీకరించారు. ఉత్పత్తి పెరిగితే జిడిపి పెరుగుతుంది, ధరలు తగ్గుతాయి. మోడీ ప్రధాని పీఠాన్ని అధిరోహించిన తరువాత ఉల్లిపాయల, బంగాళా దుంపల కొరత, ధరల పెరుగుదల, చమురు ఉత్పత్తుల ధరల పెరుగుదల, రైల్వే ఛార్జీల పెంపు, సరుకు రవాణా ఛార్జీల పెంపు - ఈ చర్యల వల్ల ధరలు పెరిగి, సామాన్యుల మీద అదనపు భారం పడుతుంది. ఈ దుస్థితి నుంచి మార్పు కావాలన్నారు. అందుకు కావాల్సిన విధానాల్లో మార్పు కావాలన్నారు. బడిలో పిల్లలు నూటికి 31 మార్కులు వస్తే ఫెయిల్ అవుతారు. మోడీ కూడా అంతే. ఇప్పుడు ఇంకో విపత్తు వచ్చి పడింది. ఇరాక్ దేశంలో అంతర్గత పరిణామాల కారణంగా చమురు దిగుమతులకు అంతరాయం ఏర్పడి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. వాటి ధరలు పెరిగితే దేశంలో రైలు, లారీల రవాణా ఛార్జీలు పెరుగుతాయి. ఆ పెరుగుదలను వ్యాపారులు వినియోగదారుల నుంచి వసూలు చేసుకొంటారు. ఈ సాకు చూపించి కార్పొరేట్లు, ఇతర పారిశ్రామిక వేత్తలు వాళ్లవంతు ధరలు పెంచుతారు. కాగా ఇటు పరిపాలన పగ్గాలను, ఇటు పార్టీ పగ్గాలను తన అధీనంలో తీసుకొన్నంత సులువుగా ధరలను తగ్గించలేరు. ధరలు పెరుగుతూనే ఉంటాయి.

వ్యవసాయం

ధరల తర్వాత అందరినీ, ముఖ్యంగా గ్రామీణ ప్రజానీకాన్ని కలవర పరుస్తున్నది వ్యవసాయ రంగం. కార్పొరేట్ల గుప్పిట్లో ఉన్న అప్పటి ప్రధాని, ఇప్పటి ప్రధాని వ్యవసాయం గురించి శ్రద్ధ ఎప్పుడు తీసుకున్నారు? నూటికి సుమారు 70 శాతం మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యవసాయం మీద ఆధారపడే రంగానికి కేంద్ర ప్రణాళికలో వ్యవసాయం తత్సంబంధిత రంగాలకు కేటాయించింది. రు. 21910 కోట్లు అంటే మొత్తం ప్రణాళిక కేటాయింపు రు. 484532 కోట్లలో ఈ రంగం కేటాయింపు కేవలం 4.52 శాతం మాత్రమే. సస్య విప్లవం తర్వాత ఉత్పాదకత గణనీయంగా పెరగలేదని 2013-14 ఆర్థిక సర్వే తెలియ చేస్తోంది. జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 11వ ప్రణాళికలో 15.4 శాతం నుంచి 2013-14 అంచనా ప్రకారం 13.9 శాతానికి దిగజారింది. రసాయనిక ఎరువుల్లో వివిధ రకాల శక్తి గల ఎరువులను

నిత్యం ఎన్నో చోట్ల ఇటువంటి ప్రమాదాలు జరుగుతూ, ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు, అవిటి వాళ్లు అవుతున్నారు. ప్రమాదం జరిగిన ప్రతిసారీ నష్టపరిహారం ప్రకటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత శాఖలు చేతులు దులుపుకుంటున్నాయి.

ఇక ప్రైవేట్ స్కూళ్ల లాభాపేక్ష విద్యార్థుల పట్ల శాపంగా మారింది. పాఠశాలలను జనావాసాలకు దూరంగా, ఇరుకు ఇరుకు గదుల్లో నిర్వహిస్తారు. విద్యార్థులను టెక్నో స్కూళ్లు అనీ, డిజిటల్ స్కూళ్లు అనీ ఆకర్షిస్తారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు బాగలేకపోవడంతో, తమ పిల్లలు పెద్ద పెద్ద చదువులు, ఇంగ్లిష్ చదువులు చదవడానికి కాన్వెంట్ స్కూళ్లే అవసరమని తల్లిదండ్రులు భారీ ఫీజులకు కూడా వెనుకాడకుండా ఈ స్కూళ్లలో చేర్పిస్తారు. స్కూళ్లకు చేర్చడానికి ప్రతి స్కూలు తమ తమ ప్రత్యేక స్కూలు బస్సులను ఏర్పాటు చేసుకుంటాయి. వాటికి భారీ ఫీజులు. అలా కాకుండా కొంతమంది సొంత వాహనాలలో, ఆటోలలో పిల్లలను స్కూళ్లలో దిగబెడతారు.

స్కూలు యాజమాన్యం నడిపే స్కూలు బస్సులలో వచ్చే పిల్లల పరిస్థితి చాలా దయనీయంగా ఉంటుంది. ఉదయం 9 గంటలకు స్కూలు మొదలవుతుంది గనుక, ఒక బస్సులో సుమారు ముప్పై మంది పిల్లలను వారి వారి ఇండ్ల నుంచి తీసుకురావడానికి ఉదయం 7.30 గంటల నుంచే పిల్లలను ఎక్కించుకుంటుంటారు. స్కూలు బస్సు కొనుగోలు, దానికి నిపుణుడైన డ్రైవర్, వాటిని నిత్యం పర్యవేక్షించడం చాలా ముఖ్యం. కాని లాభాపేక్షతో నడిచే ప్రైవేట్ స్కూళ్లకు ఇవేవీ పట్టవు. బస్సులను పర్యవేక్షణ చేయాల్సిన రవాణా శాఖ అధికారులు కూడా అవినీతికి అలవాటు పడి ఫిట్‌నెస్ లేని బస్సులకు కూడా 'నో ఆబ్జెక్షన్' సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు. ఇలాంటి బస్సులే పిల్లల ప్రాణాలను బలిగొంటున్నాయి. తక్కువ జీతాలు ఇస్తూ, సరైన శిక్షణ లేని డ్రైవర్లను నియమించడం ద్వారా కూడా ఈ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా రైల్వే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి రైల్వే క్రాసింగ్ గేట్ల ఏర్పాటు చేసేలా చూడాలి. ప్రైవేట్ స్కూళ్లపై, వారు నడిపే బస్సులపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలి. మరోసారి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా, తల్లిదండ్రులకు గర్భశోకం మిగల్చకుండా చర్యలు తీసుకోవాలి. వీ

(రచయిత పాత్రికేయులు)

(ఉదాహరణ యూరియాను ఎక్కువ వాడడం) వాడడం, నీటి కొరత వల్ల ఉత్పత్తి, ఉత్పాదాకత దెబ్బతింటోంది. వ్యవసాయ ఖర్చు పెరగడం, సబ్సిడీల తగ్గింపు, పంటకు ఖర్చు పోను రైతు చేతికి అందే ఆదాయం తగ్గడం వల్ల రైతులు వ్యవసాయ రంగం నుంచి నిష్క్రమిస్తున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎకనామిక్ సర్వే ప్రకారం 2001లో రైతుల సంఖ్య 127.3 మిలియన్లు ఉండగా 2011 జనాభా లెక్కల ప్రకారం 118.7 మిలియన్లకు పడిపోయింది. వ్యవసాయ జిడిపి 2010-11లో 8.6 శాతం నుండి 2012-13లో 1.4 శాతానికి పడిపోయింది. 2013-14లో 4.7 శాతానికి పెరిగిందని అంచనా. అలాగే వ్యవసాయం తత్సంబంధిత రంగాల్లో ఉపాధి కల్పన 04.05/2011-12 మధ్య 360 లక్షల మేరకు పడిపోయింది. బడ్జెట్ సమయంలో పార్లమెంట్ సభ్యులకు అందచేసే ఆర్థిక సర్వేలో ఆహార ధాన్యాల తలసరి లభ్యత ప్రస్తావిస్తారే కాని తలసరి వినియోగం గురించి చెప్పరు. చెపితే గుట్టురట్టవుతుంది. ఫుడ్ కార్పొరేషన్ ఆహార నిల్వలు గుట్టలుగా పేరుకపోతుంటే, తిండి గింజలను ఎగుమతి చేస్తారు. కాని పేదల ఆకలి తీర్చడానికి సరఫరా చేయరు. వర్షాభావ పరిస్థితులు (ఎల్‌నినో) ఏర్పడతాయోనని ప్రభుత్వం ఒక పక్క ఆందోళన వెలిబుచ్చుతుంది. అయితే దేశంలో తిండి గింజల నిల్వలు మస్తుగా ఉన్నాయని భరోసా పలుకుతుంది. కాని ఇలా పంటలు దెబ్బ తిన్నప్పుడు వ్యాపారస్తులు ధరలు పెంచేస్తారు. ఆ ధరకు పేదలు కొనుక్కోలేరు. చౌక ధరల దుకాణాల్లో తలసరి ఐదు కిలోలే లభ్యమవుతాయి. వినియోగదారుడు మిగతా అవసరాన్ని బజారులో కొనుక్కోవాల్సిందే. ఇటీవల కాలంలో చర్యలంత లభ్యత గురించి కాదు. పేదలు తినే తిండిలో పోషకాహార విలువల అలభ్యత గుచించే. ఈ విషయాన్ని గురించి కూడా గణనలోకి తీసుకుంటే పరిస్థితి మరింత అధ్వాన్యంగా ఉంటుంది. సాధారణంగా రైతులు తమ పంటనుంచే విత్తనాలకు పనికివచ్చే మంచి గింజలను ఏరి మరుసటి సంవత్సరానికి దాచుకుంటారు.

ప్రభుత్వం విత్తనరంగంలో నూరు శాతం విదేశీ పెట్టుబడులనీ ఆహ్వానించడానికి నిర్ణయించింది. ప్రభుత్వం ఇదివరకే ప్రపంచంలోనే గుత్త వ్యాపార సంస్థ మోన్‌సాంటో కంపెనీని అనుమతించింది. ఫలితం విత్తనాల ధరలు కూడా అందుబాటులో లేకుండా పోతాయి. ఇది పరోక్షంగా రైతులను వ్యవసాయం నుంచి నిష్క్రమించే పరిస్థితి కల్పించడమవుతుంది. పంట భూమి కార్పొరేట్ల, విదేశీ సంస్థల చేతుల్లోకి పోతుంది.

పరిశ్రమలు

పారిశ్రామిక రంగం అంటే తయారీ వ్యవస్థ గనులు, విద్యుచ్ఛక్తి, నిర్మాణ రంగాలుంటాయి. 2012-13లో జిడిపిలో ఈ రంగం వాటా కేవలం ఒక్క శాతానికి పడిపోయింది. ఇలా పడిపోవడానికి కారణాలు గనులు, తయారీ రంగాల్లో ఉత్పాదకత తగ్గిపోవడమే కారణమని ఆర్థిక సర్వే చెపుతుంది. కాని అసలు కారణం పారిశ్రామికవేత్తల సమ్మె! కార్మికుల సమ్మెలు చేస్తారు కాని పారిశ్రామిక వేత్తలా? అవును. పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి కోట్ల రూపాయల రుణాలు తీసుకుంటారు. దాని మీద వడ్డీ చెల్లించాలి. ఆ వడ్డీ రేటును తగ్గించాలని ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతూ వచ్చినా, రిజర్వు బ్యాంకు అంగీకరించలేదు. అప్పట్లో చిదంబరం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ వడ్డీ రేటు తగ్గించమని బ్యాంకుపై ఒత్తిడి తీసుకొని వచ్చినా ఫలితం లేకపోయింది. కార్పొరేట్లు మరింత ఒత్తిడి పెంచే దిశగా, అసలు, వడ్డీ చెల్లించకుండా లక్షల కోట్లు బ్యాంకుల మొండి బకాయిలకు కారణమయ్యారు. మీరూ, నేనూ అసలు, వడ్డీ చెల్లించకపోతే మన ఆస్తులు వేలం వేసి రాబట్టుకుంటారు. అప్పు తీసుకున్న రైతు చెల్లించకపోతే, రైతు ఇంట్లో తట్టా బుట్టా, చెంబూ, తపాళా బయటకు విసిరేస్తారు. కాని కార్పొరేట్లను అప్పటి, ఇప్పటి ప్రభుత్వాలు కార్పొరేట్ల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడుతాయి. కాబట్టి ఎటువంటి చర్య తీసుకోకుండా తాత్సారం చేస్తూ వచ్చాయి. ఫలితంగా తయారీ రంగం ఉత్పత్తి పడిపోయింది. దేశంలో ప్రస్తుత ఆర్థిక దుస్థితికి ఇదొక మూల కారణం. మోడీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తల మీద చర్యలు తీసుకునే దమ్ము లేక ఈ మొండి బాకీలన్నీ అస్సెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీలకు బదలాయించే పంథా చేపట్టింది. ఈ కంపెనీలు సామదాన దండోపాయాలు ఉపయోగించి మొండిబాకీలను వసూలు చేస్తాయి. బ్యాంకు పుస్తకాల్లో మొండి బాకీలు మాయమైపోతాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ వైపుగా ప్రయాణం ప్రారంభించింది. కార్పొరేట్ల దగ్గర నిధులు లేకపోవడం వల్ల బ్యాంకులకు అప్పు తిరిగి చెల్లించలేని పరిస్థితి వల్ల కాదు. వీరు విదేశాల్లో పరిశ్రమలు కొనేస్తున్నారు. లేదా కొత్తగా స్థాపిస్తున్నారు. ప్రపంచ కుబేరుల జాబితాలో చోటు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఈ సర్దుబాటు చేయడంతో తయారీ రంగం పుంజుకోవడం ప్రారంభించింది. పారిశ్రామికవేత్తల సంఘాలు ఆహా, ఓహో అంటూనే కార్పొరేట్లకు మరిన్ని రాయితీలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రెండో పక్క రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను దోచుకునే చట్టం తెచ్చింది. అలాంటి చట్టమే దేశానికంతా వర్తించే విధంగా మోడీ ప్రభుత్వం ఒక చట్టం తీసుకుని వస్తే ఆశ్చర్యపడాల్సిన పని లేదు.

ఆదాయవ్యయాలు

రెవెన్యూ పద్దు కింద లోటు రు. 3,78,348 కోట్లు. ద్రవ్యలోటు రు. 5,31,177 కోట్లు. అంటే ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ. అంటే అప్పు చేసి ఆ లోటును పూడ్చడం ప్రభుత్వాలు మామూలుగా చేసే ప్రక్రియ. రుణాల మీదనే ప్రభుత్వం బండి లాగుతోంది. అప్పు తెస్తే వాయిదాల్లో రుణం, వడ్డీ చెల్లించాలి. వాయిదా చెల్లింపుల కన్నా వడ్డీ చెల్లింపులే ఎక్కువవుతున్నాయి. ఇలా వాయిదా, వడ్డీ చెల్లింపులు 2012-13లో రు. 4,28,387 కోట్లయితే 2013-14లో రు. 5,43,267 కోట్లు (సవరించిన అంచనా) మోడీ ప్రభుత్వం 2014-15లో ఇందులకు గాను రు. 6,43,301 కోట్లు కేటాయించింది. మరోలా చెప్పాలంటే 2014-15లో ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో ఈ చెల్లింపులు 43.7 శాతం. అంటే ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే ప్రతీ నూరు రూపాయల్లో 43.7 రూపాయలు అసలు, వడ్డీల చెల్లింపులకే పోతుంది. ఆ అభివృద్ధి కార్యక్రమాలకు మిగిలేది 56 రూపాయలే.

రక్షణ రంగంతో సహా అనేక రంగాల్లోకి విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం ప్రభుత్వ రంగ పరిశ్రమల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ లాంటి ముఖ్యమైన విషయాలగురించి ఇతర వ్యాసకర్తలు విశ్లేషిస్తారు. కాబట్టి నేను వాటి గురించి రాయడం చర్వితచరణం అవుతుంది. కాబట్టి నేను వాటి జోలికి పోవడం లేదు. వాటి గురించి రాయడమంటే యుపిఎ మూడో ప్రభుత్వం గురించి రాయడమే అవుతుంది. మార్పు ఉంటేగా రాయడానికి.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

కార్పొరేట్ అనుకూల బడ్జెట్

***ఎన్‌డిఎ ప్రవేశపెట్టిన బడ్జెట్ విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులు మరింత బలపడేలా ఉందనీ, సామాన్యులకు ఇస్తున్న సబ్సిడీలను సైతం తగ్గించి తమను అధికారంలోకి తెచ్చిన ధనాఢ్యుల విశ్వాసాన్ని చూరగొందనీ అంటున్నారు* ఎ. నర్సింహారెడ్డి**

దేశాన్ని అమాంతం ఉద్ధరించే మహామాంత్రికుడుగా కార్పొరేట్ మీడియా చేత ఆకాశానికెత్తబడ్డ నరేంద్ర మోడీ ప్రభుత్వ తొలి బడ్జెట్ (2014-15) ను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ జూలై 10న పార్లమెంటులో ప్రవేశపెట్టాడు. జైట్లీ ప్రవేశ పెట్టిన బడ్జెట్ సారంలో యుపిఎ బడ్జెట్‌కు భిన్నంగా లేదు. స్థూలంగా చూస్తే మార్కెట్ అనుకూల సంస్కరణల కొనసాగింపుకు ప్రాధాన్యత నిచ్చింది. అన్ని రంగాల్లో విదేశీ ప్రైవేట్ ప్రత్యక్ష పెట్టుబడులకు ఎర్ర తివాచీ పరిచింది. ప్రభుత్వ రంగ సంస్థల పరపతిని దెబ్బతీయడానికి, వీటి వాటాలను మార్కెట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రణాళికలు ప్రకటించింది. మరోవైపు మధ్యతరగతిని అలరించడానికి, గ్రామీణ ఆర్థిక రంగానికి ఊరట నిస్తున్నట్లు కన్పించడానికి ప్రయత్నించింది. అత్యధిక శాతం మంది ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని ఉద్ధరించే ప్రయత్న పూర్వక చర్యలు లేవు. మొత్తంగా ఈ బడ్జెట్ మోడీ సర్కారు స్వభావానికి అద్దం పట్టింది. మధ్య తరగతి ప్రజలను ప్రీతి పాత్రం చేసుకుంటూనే, విదేశీ పెట్టుబడులకు తలుపులు మరింతగా తెరిచింది. సంస్కరణలను అమలు చేయడం ద్వారా పారిశ్రామిక వర్గాలపై ఒత్తిడి తగ్గించి కింది వర్గాలను పన్నుల వలలోకి తేవడానికి రంగం సిద్ధం చేస్తున్నది. మధ్యతరగతికి పన్ను మినహాయింపు పరిమితిని రెండు నుంచి రెండున్నర లక్షలకు పెంచారు. దీనివల్ల ఐదు వేల రూపాయల మేర ఊరట లభిస్తుంది. దీనివల్ల రెండు కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని అంచనా. సీనియర్ సిటిజన్స్‌కు ఏడాదికి మూడు లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చారు. తన బడ్జెట్‌లోని ప్రత్యక్ష పన్నుల ప్రతిపాదనల వల్ల రు. 22,200 కోట్లు ఆదాయం కోల్పోతున్నట్లు, పరోక్ష పన్నుల ప్రతిపాదనల వల్ల రు. 7,725 కోట్ల ఆదాయం సమకూరుతుందని ఆర్థికమంత్రి చెప్పారు. మధ్యతరగతిని ప్రసన్నం చేసుకునే కొన్ని ప్రతిపాదనలను మినహాయిస్తే తాజా బడ్జెట్ సంస్కరణల వాదానికి, కార్పొరేట్లకు సాగిలపడిన బడ్జెట్‌గా పేర్కొనవచ్చు.

కేంద్ర బడ్జెట్ ఆదాయ వ్యయాలు

ఆదాయం		వ్యయం	
అప్పుల ద్వారా	24	కేంద్ర ప్రణాళికకు	11
కార్పొరేట్ పన్ను	21	వడ్డీలకు	20
ఆదాయపు పన్ను	13	రక్షణకు	10
కస్టమ్స్ సుంకాలు	09	సబ్సిడీలకు	12
ఎక్సైజ్ సుంకాలు	10	ప్రణాళికేతర వ్యయం	11
సేవ, తదితర పన్నులు	10	పన్నుల్లో రాష్ట్రాల వాటా	18
పన్నేతర ఆదాయం	10	ప్రణాళికేతర సహాయం	03
మూలధన వసూళ్లు	03	ప్రణాళికా సహాయం	15
మొత్తం	100		100

ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల్లో మరింతగా ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరవడం, సబ్సిడీల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు వ్యయ యజమాన్య కమిషన్ ఏర్పాటు, 'నమామి గంగ' పేరుతో గంగానది శుద్ధి - అభివృద్ధి ప్రాజెక్టులు, యుద్ధ, పోలీసు స్మారక స్థూపాల ఏర్పాటు ప్రతిపాదనలు ఆర్థికమంత్రి బడ్జెట్‌లో చేశారు. వృద్ధి రేటును పునరు జ్జీవింపజేసే పేరుతో పెట్టుబడిదారులకు పలు రాయితీలు ప్రకటించారు. ద్రవ్య పటిష్టత (ఫిస్కల్ కన్‌సాలిడేషన్), ద్రవ్య యుక్తాయుక్త వినియోగం (ఫిస్కల్ ప్రూడెన్స్) పేరుతో పేదలకిచ్చే సబ్సిడీల్లో కోతను తలపెట్టారు. ఆర్థిక సర్వే సూచించినట్లు, 'నగదు బదిలీ' ప్రస్తావన బడ్జెట్ ప్రసంగంలో లేకపోయినా, వ్యయ యజమాన్య కమిషన్ సిఫారసుపై అది ఆధారపడి ఉంటుంది. యుపిఎ ప్రభుత్వ ఆధార్ కార్డుల వ్యవస్థను, నగదు బదిలీని గతంలో బిజెపి వ్యతిరేకించిన దృష్ట్యా, ఇప్పుడే దాన్ని ఆలింగనం చేసుకోవడానికి ప్రభుత్వం వెనుకాడి ఉండవచ్చు. యు.పి.ఎ. ప్రభుత్వ ద్రవ్య సంస్కరణలను కొనసాగిస్తూ, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రభుత్వ మూలధనాన్ని రు. 2 లక్షల 48 వేల కోట్లు తగ్గించుకునే విధంగా డిజిన్వెస్ట్‌మెంట్ చేపట్టాలని, బీమా రంగంలో ఎఫ్‌డిఐని 26 శాతం నుండి 49 శాతానికి పెంచాలని, స్వదేశీకరణ పేరుతో రక్షణ ఉత్పత్తుల రంగంలో కూడా ఎఫ్‌డిఐని 49 శాతానికి పెంచాలని ఆర్థికమంత్రి ప్రతిపాదించారు. పిపిపికి సర్వం కట్టిపెట్టే ప్రాజెక్టులు ఉండనే ఉన్నాయి. మోడీ ప్రభుత్వ మొదటి బడ్జెట్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ), ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) మోత మోగించింది. అన్ని రంగాలలోకి ఎఫ్‌డిఐ వెల్లువ తారకమంత్రమన్నట్లు ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో పదేపదే ప్రకటించడం సిగ్గు చేటు. జాతీయత, స్వదేశీ నినాదాలతో ఊదరగొట్టే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ బూటకత్వానికి బడ్జెట్ ప్రబల నిదర్శనం.

2013-14 సవరించిన వార్షిక బడ్జెట్ అంచనా రు. 15,90,434 కోట్లు కాగా రు. 17,94,892 కోట్ల వ్యయంతో జైట్లీ 2014-15 బడ్జెట్ ప్రతిపాదించాడు. ప్రణాళిక వ్యయం రు. 5,75,000 కోట్లు కాగా ప్రణాళికేతర వ్యయం రు. 12,19,892 కోట్లు. రెవెన్యూ లోటు రు. 3,78,384 కోట్లు కాగా ద్రవ్యలోటు రు. 5,31,177 కోట్లు (జిడిపిలో 4.1శాతం), ప్రాథమిక లోటు రు. 1,04,166 కోట్లు, రుణాల సేకరణ లక్ష్యం రు. 5,31,177 కోట్లు. ఈ బడ్జెట్‌లో కొత్త రాయితీలు ప్రకటించక పోగా ఇప్పుడున్న సబ్సిడీలను కుదించే పరోక్ష సంకేతాలు ఇచ్చాడు. కీలకమైన రక్షణరంగం మొదలు సామాన్యుల గృహ వసతి వరకు అన్నిటికీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులే శరణ్యమన్నట్లు ఆర్థిక మంత్రి తలకెక్కించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గోదాముల నుండి నగర అభివృద్ధి పథకాల వరకు ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం అనివార్యం అని తేల్చివేశాడు.

బడ్జెట్ సమగ్ర స్వరూపం

వివరాలు	2012-13 (స.అం)	2013-14 (బ.అం)	2013-14 (స.అం)	2014-15 (బ.అం)
1) రెవెన్యూ వసూళ్లు	8,79,232	10,56,331	10,29,252	11,89,763
ఎ) పన్ను ఆదాయం	7,41,877	8,84,078	8,36,026	9,77,258
బి) పన్నేతర ఆదాయం	1,37,355	1,72,253	1,93,226	2,12,505
2) మూలధన వసూళ్లు	5,31,140	6,08,967	5,61,182	6,05,129
ఎ) రుణ వసూళ్లు	15,060	10,654	10,802	10,527
బి) ఇతర వసూళ్లు	25,890	55,814	25,841	63,425
సి) రుణాలు	4,90,190	5,42,499	5,24,539	5,31,177
3) మొత్తం వసూళ్లు	14,10,372	16,65,297	15,90,434	17,94,892
4) ప్రణాళికేతర వ్యయం	9,96,747	11,09,975	11,14,902	12,19,892
5) ప్రణాళికా వ్యయం	4,13,625	5,55,322	4,75,532	5,75,000
6) మొత్తం వ్యయం	14,10,372	16,65,297	15,90,434	17,94,892
7) రెవెన్యూ లోటు	3,64,282	3,79,838	3,70,288	3,78,348
8) ద్రవ్య లోటు	4,90,190	5,42,499	5,24,539	5,31,177
9) ప్రాథమిక లోటు	1,77,020	1,71,814	1,44,473	1,04,166

ప్రస్తుతం 4.7 శాతంగా ఉన్న స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటును (జిడిపి) 7 నుంచి 8 శాతానికి చేర్చడానికి మూడు నాలుగేళ్లు పడుతుందని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. వృద్ధి రేటు పుంజుకునే వరకు ఉపాధి కల్పన వృద్ధి నత్తనడకన సాగక తప్పదన్న సత్యాన్ని అంగీకరించక తప్పలేదు. కానీ ఆయన బడ్జెట్‌లోని ప్రాధాన్యాలను జాగ్రత్తగా గమనిస్తే పేదల పొట్టగొట్టి పెద్దల జేబులు నింపడమే అసలు సారాంశమని వెల్లడవుతుంది. ఖజానాకు రాబడిని విశేషంగా పెంచగలదని భావిస్తున్న వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) అమలుకు ఉన్న అవరోధాలను వచ్చే మార్చి లోపల పరిష్కరిస్తామని జైట్లీ ప్రకటించారు. డీజిల్, వంటగ్యాస్ సబ్సిడీలను క్రమంగా 'వదిలించుకునే' దిశగా సర్కారు ఆలోచిస్తున్నది. ఆ రకంగా ఏటా రు. లక్షా 40 వేల కోట్ల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని ప్రభుత్వం చూస్తున్నది. అందుకే 'పరిమిత సిలెండర్ల' ఆలోచన చేస్తున్నది. ఆదాయపు పన్నుకు ఆదాయ పరిమితి పెంచడంలాంటి అనేక ప్రతిపాదనలు చూసి ఆనంద పరవశులవుతున్న మధ్యతరగతి జనానికి ఇదో టైంబాంబు వంటిది.

కార్పొరేట్ సంస్థల ప్రశంసలు

స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు, ధనిక వర్గాలకు, ఉన్నత మధ్య తరగతి వర్గాలకు తమతమ స్థాయిల్లో తృప్తినిచ్చిన బడ్జెట్, రైతులను, కార్మికులను వ్యవసాయ కూలీలను విస్మరించింది. వాళ్లసలు ఆర్థికమంత్రి దృష్టిలోనే లేరు. ఈ బడ్జెట్ ప్రధానంగా స్వదేశీ, విదేశీ ప్రైవేట్ కంపెనీలను ఓదార్చింది తప్ప ప్రజలను కాదు. అందువల్లనే పేదలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు బడ్జెట్ పట్ల నిరాశ వ్యక్తం చేస్తుంటే, కార్పొరేట్లు ప్రశంసల జడివాన కురుపిస్తున్నాయి. విదేశీ బ్రోకరేజ్ సంస్థలకు చెందిన విశ్లేషకులు బడ్జెట్ అభివృద్ధిని ప్రోత్సహించేదిగా ఉందని కొనియాడగా, పరిశ్రమలకు మంచిరోజులు వచ్చే ప్రతిపాదనలను బడ్జెట్‌లో పొందుపరిచారని సిఐఐ శ్లాఘించింది. అయితే బడ్జెట్ బాగున్నప్పటికీ, విత్తలోటు అంచనా అందుకోవడం కష్టం కావచ్చని రేటింగ్ ఏజెన్సీలు సందేహం వ్యక్తం చేశాయి. అధికవృద్ధి రేటు సాధన లక్ష్యం, ఆర్థిక పరమైన ఒత్తిడిలకు మధ్య సమతూకంగా బడ్జెట్ ప్రతిపాదనలున్నాయని, ప్రైవేట్‌రంగం పెట్టుబడులను ప్రోత్సహించేందుకు బడ్జెట్ ఉపయోగ పడుతుందని నొమురా సిఇఒ వికాస్ శర్మ పేర్కొన్నారు. బ్రిటిష్ బ్రోకరేజ్ సంస్థ బార్‌క్లేస్ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. రాబడులు తగ్గడం, సబ్సిడీలపై కోత లేకపోవడం కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం విత్తలోటును జిడిపిలో 4.1 శాతానికి కట్టడి చేయాలన్న ప్రభుత్వ అంచనా ఆచరణలో కష్టసాధ్యం కావచ్చని రేటింగ్ ఏజన్సీలు అభిప్రాయపడ్డాయి. సబ్సిడీలపై కోత విధించే అంశంలో పురోగతి లేకపోవడం, వ్యయ నియంత్రణకు కచ్చితమైన చర్యలు ప్రకటించక పోవడం వల్ల విత్తలోటు లక్ష్య సాధనలో విఫలం అయ్యే అవకాశాలున్నాయని రేటింగ్ సంస్థ మూడీస్ పేర్కొనడం గమనార్హం.

క్యాపిటల్ మార్కెట్‌కు ఊతం

బడ్జెట్లో క్యాపిటల్ మార్కెట్‌ను సంస్కరించేందుకు జైట్లీ పలు చర్యలు చేపట్టారు. పలు అంశాల్లో పన్ను ప్రోత్సాహకాలివ్వడంతోపాటు విదేశీ పెట్టుబడిదారుల బాండ్లు, ఫండ్లకు సంబంధించిన నిబంధనలను మరింత సరళీకరించే ప్రయత్నం చేశారు. పెట్టుబడుల వాతావరణాన్ని పెంపొందించేందుకు ఫైనాన్షియల్ మార్కెట్ సంస్కరణలు చాలా ముఖ్యమని పేర్కొన్నారు. నియమావళిని సరళతరం చేయడం ద్వారా బాండ్ కరెన్సీ మార్కెట్లను మరింత ఉత్తేజితం చేయాలని ఆర్థిక రంగ నియంత్రణ మండళ్లను కోరారు. ఆర్థిక రంగంలోని పలు రెగ్యులేటరీ నిబంధనలను గాడిలో పెట్టేందుకు కొత్త కోడ్ (ఇండియన్ ఫైనాన్షియల్ కోడ్ - ఐఎఫ్‌సి)ను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. దేశీయ స్థిరాస్తి, మౌలిక వసతుల రంగంలోకి మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా రియల్‌ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌ఇటిఎస్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లకు పన్ను ప్రోత్సాహకాలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఈ రెండు ట్రస్ట్‌లు స్టాక్ మార్కెట్ల కంపెనీల ఈక్విటీ షేర్లలాగే లిస్ట్ కావడంతోపాటు రిటైల్, సంస్థాగత ఇన్వెస్టర్లు వీటిని కొనుగోలు చేసేందుకు వీలుంటుంది.

ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం 16 జాతీయ పెట్టుబడుల, తయారీ జోన్ల (ఎన్ఐఎంజడ్) ను ప్రకటించింది. జాతీయ తయారీ విధానం కింద ఈ ఎన్ఐఎంజడ్‌ల ఏర్పాటును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ విధానం ద్వారా దశాబ్ద కాలంలో జిడిపిలో తయారీ వాటాను 25 శాతానికి చేర్చడంతో పాటు 10 కోట్ల మందికి ఉద్యోగాలను సృష్టించాలన్నది లక్ష్యంగా ప్రకటించింది. ఇవి ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్‌ల) లాగానే ప్రభుత్వ రాయితీలు పొంది, కార్మికుల శ్రమను దోచుకుంటాయి. 16 ఎన్ఐఎంజడ్‌లలో ఎనిమిది ఢిల్లీ-ముంబయి పారిశ్రామిక కారిడార్ సమీపంలో రానుండగా, మరో ఎనిమిది నాగ్‌పూర్, చిత్తూరు, మెదక్, తుమ్కూర్, కోలార్, బీదర్, గుల్బర్గాలలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు. ఎన్ఐఎంజడ్‌లనేవి కనీసం 50 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉండే ఏకీకృత పారిశ్రామిక టౌన్‌షిప్‌లు.

దేశీయ ఫైనాన్షియల్ రంగంలో అన్ని విభాగాలకు వర్తించేలా ఉమ్మడి కెవైసి (నీ ఖాతాదారుడి గురించి తెలుసుకో) నియమావళిని ప్రవేశ పెట్టాలని బడ్జెట్లో ప్రతిపాదించారు. తద్వారా ఆర్థిక సేవలను మరింత విస్తరించేందుకు, ఈక్విటీలతోపాటు ఫైనాన్షియల్ రంగ ఆస్తుల లావాదేవీలకు ఉపయోగపడేలా మదుపర్లకు ఒకే డీమ్యాట్ ఖాతాను అందించే ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. తద్వారా పెట్టుబడుల ప్రక్రియను మరింత సరళీకరించేందుకు వీలవుతుందని మార్కెట్ వర్గాలంటున్నాయి. ఇండియన్ డిపాజిటరీ రిసీట్స్ (ఐడీఆర్) స్థానంలో మరింత సరళ నియమావళితో భారత్ డిపాజిటరీ రిసీట్స్ (బిఎచ్‌డిఆర్)ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. దేశీయ కంపెనీలు డిపాజిటరీ రిసీట్స్ జారీ చేయడం ద్వారా విదేశీ మార్కెట్ల నుంచి నిధులు సేకరిస్తుంటాయి.

ఇండియన్ కార్పొరేట్ కంపెనీలు విదేశాల్లో జారీ చేసే బాండ్లపై వర్తించే విత్‌హోల్డింగ్ ట్యాక్స్‌ను 30 జూన్ 2017 వరకు కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై అన్ని రంగాల కంపెనీలకు 5 శాతం విత్‌హోల్డింగ్ ట్యాక్స్ వర్తిస్తుందని తెలిపారు. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వారికి వర్తించే పన్నుల్లో మరింత వెసులుబాటు కల్పించనున్నట్లు జైట్లీ పేర్కొన్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పిఐ) భారత్‌ను కేంద్ర స్థానంగా చేసుకుని కార్యకలాపాలు కొనసాగించగలిగితే పన్నులు తగ్గించనున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. ఎఫ్‌పిఐ లావాదేవీలపై ఆర్జించిన లాభాలను క్యాపిటల్ గెయిన్‌గా పరిగణిస్తూ పన్నులు విధించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం వ్యాపార ఆదాయం కేటగిరీలో ఎఫ్‌పిఐలు క్యాపిటల్ గెయిన్ విభాగానికంటే అధిక పన్నులు చెల్లిస్తున్నారు.

గార్ చట్టం నీరుగారినట్లే

వివాదాస్పద పన్ను ఎగవేతల చట్టం (గార్) అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఈ చట్టాన్ని 2015 ఏప్రిల్ నుండి అమలు చేయాల్సి ఉంది. కంపెనీల విలీనం, స్వాధీనం సందర్భంగా ఆయా కంపెనీలకు పెట్టుబడి లాభాలు సమకూరుతాయి. ఈ లాభాలు పెద్ద మొత్తంలో (లక్షల కోట్లలో) ఉంటాయి. వీటిపైన ఏ దేశమైనా క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ విధిస్తుంది. ఈ పన్నును తప్పించుకోవడానికి బహుళజాతి కంపెనీలు పేపర్ కంపెనీలను సృష్టించి వాటిని పన్నులు ఉండని చిన్న చిన్న దేశాల్లో నెలకొల్పే ఎత్తుగడను అనుసరిస్తున్నాయి. తద్వారా పదుల వేల కోట్ల క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను ఎగవేస్తున్నాయి. ఈ చట్టాన్ని రద్దు చేయాలని అమెరికా, యూరప్ దేశాలు తీవ్ర ఒత్తిడి తెస్తూనే ఉన్నాయి. బిజెపి అధికారంలోకి రావడంతో గార్ రద్దవుతుందని బహుళజాతి కంపెనీలు నమ్మకం పెట్టుకున్నాయి. అరుణ్ జైట్లీ ఆ చట్టాన్ని రద్దు అయితే చేయలేదు గాని ఆ చట్టాన్ని అమలు చేసే ఉద్దేశం తమకు లేదని పరోక్షంగా చెప్పారు. తాము పరిశ్రమలకు స్నేహపూర్వకమైన పన్నుల విధానం అనుసరించడానికి కట్టుబడి ఉన్నామని, ఊహాశక్యమైన (ప్రిడిక్టబుల్) పన్నుల విధానం పాటిస్తామని, రిట్రాస్పెక్టివ్ చట్టాల విషయంలోనూ ఈ విధానాన్ని అనుసరిస్తామని జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా హామీ ఇచ్చారు. ఆ విధంగా గార్ చట్టాన్ని అమలు చేయబోవడం లేదని విదేశీ కంపెనీలకు పరోక్షంగా హామీ ఇచ్చారు. బడ్జెట్ ముగిసిన వెంటనే 'అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోసం మేము ప్రయత్నాలు కొనసాగిస్తాం' అని వొడాఫోన్ ప్రకటించడాన్ని బట్టి ఆ కంపెనీకి సానుకూలమైన సంకేతాలను ప్రభుత్వం అందజేసిందని గ్రహించవచ్చు.

వ్యవసాయ, సామాజిక రంగాలకు కోత

వ్యవసాయానికి గత బడ్జెట్‌లో రు. 18781 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో రు. 11531 కోట్లు మాత్రమే కేటాయించారు. గ్రామీణాభివృద్ధి బడ్జెట్‌ను నమ్మడానికి వీలులేనంతగా రు. 56438 కోట్ల రూపాయల నుండి కేవలం రు. 3082 కోట్లకు కుదించారు. సామాజిక రంగాలకు కేటాయింపులను రు. 193043 కోట్ల నుండి రు. 113633 కోట్లకు తగ్గించారు. మొత్తంగా కీలక సామాజిక రంగాలకు 2 లక్షల కోట్ల రూపాయల మేర కోత విధించారు. ఈ స్థాయిలో కోతలు విధిస్తున్న నేపథ్యంలోనే వచ్చే రెండేళ్లలో ద్రవ్యలోటును 2 శాతానికి తీసుకు వస్తామని జైట్లీ చెపుతున్నారు. 2 లక్షల కోట్ల రూపాయల మేర ప్రభుత్వ నిధులు తగ్గితే ఆ మేరకు దేశంలో ఉపాధి తగ్గుతుంది. ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గి దేశీయ డిమాండ్ క్షీణిస్తుంది. ఈ పరిస్థితుల్లో కేంద్రం ఎఫ్‌డిఐలు, పిపిపిలను ఎంతగా ప్రోత్సహించినా కొత్తగా పరిశ్రమలు వచ్చే అవకాశం ఉండదు. ఇటువంటి పరిస్థితుల్లో స్పెక్యులేటివ్ వ్యాపారాలు మాత్రమే పెరుగుతాయి. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి పేదలపై మరింత భారాలు పడతాయి.

మోడీ మార్కు హరిత విప్లవం

తీవ్ర సంక్షోభంలో పడ్డ వ్యవసాయరంగంపై సబ్సిడీల కోతలు పడనున్నాయి. ఈ బడ్జెట్ ప్రకటించిన నూతన యూరియా విధానం ప్రకారం యూరియా సబ్సిడీలకు చరమ గీతం పాడనున్నారు. సాగు బరువై రోజురోజుకూ అప్పులతో కుంగిపోతున్న చిన్న, సన్న, సాధారణ రైతాంగానికి ఇది మరో పెద్ద దెబ్బ. నాలుగుశాతం వ్యవసాయ వృద్ధి సాధన నేపథ్యంలో మోడీ ప్రభుత్వం మరో హరిత విప్లవాన్ని ప్రకటించింది. ఇది మొత్తంగా రైతాంగాన్ని దివాలా తీయించి, ఆహార ధరలను స్పెక్యులేటర్ల చేతుల్లో పెట్టే కార్పొరేట్ వ్యవసాయమేనని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఎంత దీనావస్థలో ఉన్నా నేటికీ 60 శాతం మందికి వ్యవసాయం ప్రధాన ఉపాధిగా ఉన్నది. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు 2013-2014లో రు. 17,557 కోట్లు కేటాయించగా 2014-15 బడ్జెట్‌లో రు. 11,531 కోట్లు కేటాయించారు. వ్యవసాయంలో పోటీ పెంచడానికి, లాభదాయకంగా మార్చడానికి పబ్లిక్‌రంగంతో పాటు ప్రైవేటు రంగం పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాల్సి ఉందని జైట్లీ అన్నారు. వ్యవసాయ సాంకేతిక రంగంలోనూ, ప్రస్తుత వ్యవసాయ వ్యాపార కార్యకలాపాల్లోనూ యాంత్రీకరణ పెంచడానికి పెట్టుబడులు అవసరమన్నారు. అయితే కార్పొరేట్ వ్యవసాయ విస్తరణతో పాటే గ్రామీణ ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం అనివార్యం. మరో హరిత విప్లవం కోసం 'వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల సృష్టి అంటే వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, ట్రాక్టర్ల రంగ ప్రవేశమే. దీంతో వ్యవసాయ కార్మికుల అవసరం తగ్గిపోతుంది. మరోవైపు వ్యవసాయ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపలేదు. వ్యవసాయ సాంకేతిక వృద్ధిలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచాల్సిన తక్షణ అవసరం, వ్యవసాయ వాణిజ్య రంగంలోని మౌలిక వసతులను ఆధునీకరించాల్సిన అవసరం ఉందంటూనే, ప్రభుత్వ వ్యయాల్లో కోతలు విధిస్తూ వ్యవసాయ రంగంలోని ప్రభుత్వ పెట్టుబడుల పెంపుదల గురించి మాట్లాడడం విచిత్రం. అసలు సంగతి ప్రైవేటు పెట్టుబడులకు, కార్పొరేట్ వ్యవసాయానికి గేట్లు బార్లా తెరువడానికే వ్యవసాయ సబ్సిడీల ఉపసంహరణ, ఉపాధి హామీకి తూట్లు వంటి చర్యలు చేపడుతూ 4 శాతం వ్యవసాయ వృద్ధి లక్ష్యంగా ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంటే కార్పొరేట్ వ్యవసాయం ద్వారా ఉపాధి రహిత వృద్ధిని గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేయడమే మోడీ మార్క్ అభివృద్ధి లక్ష్యంగా గోచరిస్తుంది.

ప్రభుత్వ విద్యారంగం విస్మరణ

ఎన్‌డిఎ ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించింది. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో విద్యాసంస్థలను, నిధులను కేటాయించలేదు. ఎన్నికల ప్రణాళికలో విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తాను, ప్రతి రాష్ట్రంలో ఐఐటి, ఐఐఎంలు, జాతీయస్థాయి ఈ లైబ్రరీలను ఏర్పాటు చేస్తానని చెప్పిన దానికి, ఆచరణకు పొంతన లేదు. యుపిఎ ప్రభుత్వం 2013-14

సంవత్సరానికి రు. 74621 కోట్లు (4.48 శాతం) కేటాయించి ప్రాథమిక విద్యకు రు. 50,136 కోట్లు ఖర్చు చేసింది. ఉన్నత విద్యకు రు. 24,485 కోట్లు ఖర్చు చేసింది. 2014-15 సంవత్సరానికి మోడీ ప్రభుత్వం ప్రాథమిక విద్యకు రు. 55,115 కోట్లు, ఉన్నత విద్యకు రు. 25,456 కోట్లు, మొత్తం విద్యకు కేటాయించింది రు. 80,571 కోట్లు. ఇందులో సర్వశిక్ష అభియాన్‌కు రు. 28,635 కోట్లు, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్‌కు రు. 4,996 కోట్లు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రు. 28 వేల కోట్లు, మధ్యాహ్న భోజన పథకానికి రు. 13,215 కోట్లు, రాష్ట్రీయ ఉచ్ఛ శిక్షా అభియాన్‌కు రు. 2200 కోట్లు, ఉపాధ్యాయులకు నూతన బోధన విధానాల అభివృద్ధికి పండిట్ మదన్ మోహన్ మాలవీయ పేరిట ప్రత్యేక కార్యక్రమానికి రు. 500 కోట్లు, మదరసాల అభివృద్ధికి రు. 100 కోట్లు. మొత్తంగా పాఠశాల విద్యా రంగానికి రు. 68,728 కోట్లు కేటాయించారు. అందరికి విద్యాహక్కు కల్పిస్తామని చట్టం చేసి ఐదు సంవత్సరాలు కావస్తున్నా విద్యా హక్కును సమగ్రంగా అమలు చేయడానికి కేటాయింపులు ఏ మాత్రం సరిపోవడం లేదు.

ప్రాధాన్యం కోల్పోయిన ఉపాధి

భారత్ ఉపాధి రహిత వృద్ధి సమస్యను ఎదుర్కొంటోందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థిక మందగమనం వలన 2011లో 3.5 శాతంగా ఉన్న దేశ నిరుద్యోగిత వృద్ధి రేటు 2012లో 3.6 శాతానికి, 2013లో 3.7 శాతానికి పెరిగింది. 2014లో 3.8 శాతానికి పెరుగుతుందని అంచనా. 18-59 వయో బృందంలోని యువత నైపుణ్యతలున్నా నిరుద్యోగానికి ఎక్కువగా గురవుతున్నారని ఐఎల్ఓ ఆందోళన వెలిబుచ్చింది. 18-59 వయస్సులైన ఉద్యోగులలో 21.2 శాతానికి (2011-12) మాత్రమే క్రమబద్ధమైన వేతన ఉపాధిని కలిగినవారని ఆ సంస్థ తెలిపింది. దేశంలోని మొత్తం కార్మిక జనాభాలో 94 శాతం అసంఘటిత రంగంలోనే ఉన్నారనేది మరింత ఆందోళనకరమైన వాస్తవం. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకానికి మరింత ప్రాధాన్యం ఇవ్వడం సముచితం. కానీ 'మంచి రోజులు' తెస్తానన్న కొత్త ప్రభుత్వం తాత్కాలిక ఉపాధితో ఊరట కల్పించే ఆ పథకానికి సైతం గండి కొట్టింది. యుపిఎ ప్రభుత్వం 2012-13, 13-14 బడ్జెట్లలో ఎలాంటి మార్పు లేకుండా రు. 33,000 కోట్ల రూపాయలను కేటాయించింది. జైట్లీ అతి ఉదారంగా దాన్ని రు. 34,000 కోట్లకు పెంచామంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలను, ద్రవ్యోల్బణాన్ని, జనాభాను దృష్టిలో ఉంచుకుంటే 2012తో పోలిస్తే జైట్లీ వాస్తవంగా ఉపాధి హామీ కేటాయింపులకు భారీ కోత విధించినట్టే అర్థమవుతుంది. అరకొర నిధులతో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తున్నామని అనిపించుకోడానికి ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారు. సామాజిక సేవల రంగానికి గత సంవత్సరం రు. 1,64,393 కోట్లు కేటాయిస్తే ఈ ఆర్థిక సంవత్సరానికి రు. 79,411 కోట్లు మాత్రమే కేటాయించారు.

'నమామి గంగే' పేరుతో రు. 2,037 కోట్ల కేటాయింపుతో సమగ్రమైన గంగానదీ పరిరక్షణ కార్యక్రమాన్ని అరుణ్‌జైట్లీ ఒక క్రతువుగా ప్రకటించారు. ప్రత్యేక ప్రాజెక్టులకు ఎన్ఆర్ఐ ఫండ్ ఏర్పాటు చేశారు. వారసత్వ సంపద పరిరక్షణ కింద కేదార్‌నాథ్, వారణాసి, హరిద్వార్, కాన్పూర్, అలహాబాద్, పాట్నా, ఢిల్లీల్లో ఘాట్‌ల అభివృద్ధి, సుందరీకరణకు రు. 100 కోట్లు కేటాయించారు. హరిద్వార్ నుండి హల్దియా వరకు 1620 కిలోమీటర్ల గంగానదీ జలమార్గం అభివృద్ధిని ఆరేళ్లలో పూర్తిచేసే లక్ష్యంతో రు. 4,200 కోట్లు కేటాయించారు. జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ పేరుతో ఒక ఉపాధి కార్యక్రమాన్ని, దీనదయాళ్ ఉపాధ్యాయ పేరుతో గ్రామాలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేసే 'గ్రామజ్యోతి' కార్యక్రమాన్ని ప్రకటించారు. గుజరాత్‌లో ప్రధాని నరేంద్రమోడీ ప్రతిపాదించిన సర్దార్ వల్లభాయి పటేల్ బృహత్ విగ్రహ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రు. 200 కోట్లు కేటాయించారు. వంద స్మార్ట్ సిటీల కోసం రు. 7,060 కోట్లు వెచ్చించారు. 2 లక్షల 29 వేల కోట్ల రూపాయలు రక్షణ రంగానికి. హోంశాఖకు కూడా నిధులు పెరిగాయి. మితవాద ఆర్థిక విధానాలను, హిందుత్వ ఆలోచనాధారను రంగరించి బడ్జెట్‌ను రూపొందించినట్లు విదితమవుతోంది.

ముగింపు

సార్వత్రిక ఎన్నికల్లో కార్పొరేట్ సంస్థలు చేసిన సహకారానికి బడ్జెట్ రూపంలో ప్రధాని మోడీ రుణం తీర్చుకున్నారు. బ్యాంకింగ్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం సుమారు మూడు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఉపసంహరించడం దీనికి నిదర్శనం. ప్రస్తుత బడ్జెట్‌లో సంపన్నులపై వేసే ప్రత్యక్ష పన్నులను 22 వేల కోట్ల రూపాయల మేర తగ్గించి, పేదలపై భారాలు మోపే పరోక్ష పన్నులను ఏడున్నర వేల కోట్ల రూపాయల మేర పెంచారు. సిగరెట్లు, పొగాకు, పాన్-మసాలా, గుట్కా, కూల్‌డ్రింక్స్‌పై ఎక్సైజ్ సుంకాలు పెంచిన ఆర్థికమంత్రి ధనికులు వాడే కార్లు, కంప్యూటర్స్, ఎల్‌సిడి, ఎల్ఇడి (19 అంగుళాల లోపు) టివి ప్యానల్స్‌పై సుంకం తగ్గించారు. సుంకాలు తగ్గిన ఇతర వస్తువుల్లో వజ్రాలు, బ్రాండెడ్ దుస్తులు, పాదరక్షలు వగైరా ఉన్నాయి. కార్పొరేట్ పన్నుగాని, ఆదాయపు పన్ను రేటుగాని పెంచలేదు. ఇది పూర్తిగా ధనికుల అనుకూల బడ్జెట్ అని అర్థమవుతోంది.

సబ్సిడీల కోత, యూజర్ చార్జీల పెంపు, పెట్టుబడుల ఉపసంహరణ, స్వదేశీ, విదేశీ మదుపు దార్లకు ప్రోత్సాహకాలు, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కుదింపు, ప్రైవేటీకరణను ముందుకు తీసుకువెళ్లడం తప్ప రైతుల, కార్మికుల బతుకులు మెరుగుపరిచే చర్యలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదు. యుపిఎ ప్రభుత్వం తరహాలోనే బిజెపి ప్రభుత్వం కూడా సంపన్నులకు రాయితీలిచ్చి, పేదలపై భారాలకు సిద్ధపడుతోందనడానికి బడ్జెట్ తార్కాణం. పెట్రో ఉత్పత్తులు, ఎరువులు, ఆహార ధాన్యాల సబ్సిడీలను క్రమబద్ధీకరించే పేరుతో భారీగా సబ్సిడీల కోతకు ప్రభుత్వం సిద్ధపడుతుంది. అందరికీ ఆహారం, అందరికీ వైద్యం అన్న నినాదాల స్థానంలో కొందరికే ఆహారం, కొందరికే వైద్యం అన్న రీతిలో బిజెపి ప్రభుత్వం సబ్సిడీలపై దాడిని ప్రారంభించింది. బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్థిక విధానాల వల్ల దేశంలో అటు వృద్ధి, ఇటు పేదల సంక్షేమం రెండూ సాధ్యం కావు. ఆర్థిక రంగంలో వృద్ధికి స్టాక్ మార్కెట్ సూచీలే కొలమానంగా మారిన తరువాత 1990 దశకం నుండి వస్తున్న బడ్జెట్‌ల ఒరవడినే జైట్లీ అనుసరించాడని పేర్కొనక తప్పదు. మొత్తంగా జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ సంస్కరణలు వేగవంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. స్వదేశీ విదేశీ కార్పొరేట్లకు అనుకూలం. సాధారణ శ్రామిక ప్రజలకు, రైతులకు వ్యతిరేకం. దేశ ప్రజలకు కొసరేసి, కంపెనీలకు అసలు యిచ్చిన బడ్జెట్. అందుకే దీన్ని ప్రజాస్వామిక వాదులు, ప్రజాపక్షవాదులు తిరస్కరించాలి. వీ

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి)

పాశ్చాత్య దేశాల కపటత్వం

ముగ్గురు ఇజ్రాయిల్ యువకులను కిడ్నాప్ చేశారనే ఆరోపణతో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణకాండను పాశ్చాత్య దేశాలు సమర్థిస్తున్న తీరు తీవ్ర భయాందోళనకు గురిచేస్తుందని అంటున్నారు సుసాన్ అబుల్ హవా

ఇప్పటికే తన పద ఘట్టనల కింద జీవిస్తున్న 40 లక్షల మంది పాలస్తీనా వాసుల్ని జూన్ 12 నుండి ఇజ్రాయిల్ చుట్టుముటింది. వాళ్ల పట్టణాలు ధ్వంసం చేస్తూ, ఇళ్లను, పౌర వ్యవస్థలను నేలమట్టం చేస్తూ, కుటుంబాలపై రాత్రిపూట దాడి చేస్తూ, ఆస్తుల్ని దొంగిలిస్తూ, వాళ్లను కిడ్నాప్ చేస్తూ, గాయపరుస్తూ, చంపుతూ - పాలస్తీనాపై తన ఉక్కుపాదాన్ని మరింత కర్కశంగా మోపుతూ ఉంది. పదే పదే గాజా నగరంపై నిరంతరం బాంబుదాడులు చేస్తూ ఇళ్లనూ, సంస్థలనూ ధ్వంసం చేస్తూ అక్రమ హత్యలను కొనసాగిస్తుంది. ఇప్పటికే 560 మందికి పైగా పాలస్తీనీయులను కిడ్నాప్ చేసింది. జైళ్లలో పెట్టింది. ఇంత క్రితం తనను అన్యాయంగా నిర్బంధించినందుకు నిరసనగా 266 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సమీర్ ఇస్సావీ అలాంటి వారిలో ఒకరు. ముగ్గురు చిన్న పిల్లలు, ఒక గర్భవతి అయిన మహిళ, మానసిక రోగి అయిన ఒక పురుషునితో సహా కనీసం తొమ్మిది మంది పాలస్తీనీయుల్ని హత్య చేసింది. చిన్న పిల్లలు, పత్రికా విలేఖరులతో సహా వందలాది మందిని గాయపరిచింది. యూనివర్సిటీలనూ, సమాజ సంక్షేమ సంస్థలనూ ధ్వంసం చేసి, మూసివేసి, అక్కడ ఉండే కంప్యూటర్లు తదితర వస్తు సామాగ్రిని కూడా ధ్వంసం చేసింది. పౌర సంస్థల నుండి ప్రైవేట్, పబ్లిక్ డాక్యుమెంట్లను బలవంతంగా హస్తగతం చేసుకుంది. ఇదంతా ఇజ్రాయిల్ సైనికులు అమలు పరిచిన ప్రభుత్వ అధికారిక విధానంలో భాగంగా జరిగింది. ఈ బందిపోటు దొంగతనం ఇలా ఉంచితే ఇజ్రాయిల్ పారామిలటరీ బలగాలు, ఆక్రమిత పాలస్తీనాలో అక్రమంగా నివసిస్తున్న ఇజ్రాయిల్ ప్రజలు పదేపదే పాలస్తీనా పౌరుల మీద చేస్తున్న దాడులు గత కొద్ది వారాలుగా తీవ్రతరమయ్యాయి. ఈ దాడుల్లో చాలా మంది హింసకు గురయ్యారు. ఆస్తులు ధ్వంసమయ్యాయి.

ఇజ్రాయిల్‌పై అనుమానం

జూన్ 12 నుండి కనపడకుండా పోయిన ముగ్గురు ఇజ్రాయిల్‌ల కోసం జరుగుతున్న వెతుకులాటలో భాగంగా ఈ దాడులు జరుగు తున్నాయనే సాకును ఇజ్రాయిల్ చూపుతుంది. వెస్ట్‌బ్యాంక్ ప్రాంతం లోని అక్రమ యూదుల కాలనీ అయిన గష్ ఇజియాన్ అనే ప్రాంతం నుండి పై ముగ్గురు కిడ్నాప్ అయ్యారని ఇజ్రాయిల్ భావిస్తోంది. అయితే ఇప్పటివరకు పాలస్తీనా సంస్థ వాళ్లను కిడ్నాప్ చేశామని ప్రకటించలేదు. కాని బెంజమిన్ నెతన్యాహుకు మాత్రం హమాస్ సంస్థ దీనికి కారణమని ప్రకటిస్తున్నాడు. ఈ ఆరోపణకు సంబంధించిన సాక్ష్యాన్ని చూపించమని ఐక్యరాజ్యసమితి ఇజ్రాయిల్‌ను కోరింది. కాని ఇప్పటి వరకు ఇజ్రాయిల్ ఏ సాక్ష్యాన్ని చూపించలేదు. దీన్ని బట్టి నెతన్యాహు ప్రకటనను అనుమానించవలసి వస్తుంది. ఎందుకంటే పాలస్తీనాలోని గ్రూపులన్నీ ఈ మధ్యకాలంలో ఒకటికావడం, ఈ కొత్త ఐక్యతను అమెరికా అధ్యక్షుడు ఒబామా అంగీకరించడంతో ఇజ్రాయిల్ తన విద్వేషాన్ని బహిరంగంగానే వెల్లడి చేస్తున్న నేపథ్యంలో దాన్ని అనుమానించాల్సి వస్తుంది.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమలు చేస్తున్న బీభత్సాన్నంతటినీ పాశ్చాత్య దేశాల పత్రికలు ముగ్గురు ఇజ్రాయిలీ యువకుల కోసం 'వెతుకులాట'గా 'సైనిక సంబంధమైన' చర్యగా వర్ణిస్తున్నాయి. అమాయకులైన ఆ ముగ్గురు ఇజ్రాయిలీ యువకుల ఫొటోలను వాళ్ల తల్లిదండ్రుల ఉద్వేగభరితమైన ప్రకటనలను, అక్కడ మీడియా పదేపదే ప్రసారం చేస్తోంది. అమెరికా, యూరపియన్ యూనియన్, ఐక్యరాజ్య సమితి, కెనడా అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీలు కిడ్నాప్‌ను ఖండిస్తూ ఆ ముగ్గురి తక్షణ బేషరతు విడుదలను కోరుతున్నాయి.

గాజా ముట్టడి

వందలాది మంది పాలస్తీనా పిల్లలు ఇజ్రాయిల్ చేత కిడ్నాపులకు గురైనా, పాశవికంగా గాయపరచబడినా, చంపబడ్డా ఎన్నడో అరుదుగా తప్ప, ప్రపంచ దేశాలు ఇలా స్పందించలేదు. ఇజ్రాయిలీ యువకులు అదృశ్యం కావడానికి కొద్దిముందుగా ఇద్దరు పాలస్తీనా యువకుల హత్యను స్థానిక గూఢచారి కెమెరా రికార్డు చేసింది. వాళ్లను హత్య చేయడానికి ఉపయోగించిన బుల్లెట్లు దొరికాయి. వాళ్లలో ఒకతన్ని హత్య చేయడం కోసం ఇజ్రాయిల్ సైనికుడు ట్రిగ్గర్ నొక్కుతున్న దృశ్యాన్ని సిఎన్ఎన్ వీడియో కెమెరా రికార్డు చేసింది. ఇవన్నీ ఆ యువకుల్ని ఇజ్రాయిలీ సైనికులు హత్య చేశారనడానికి నిదర్శనాలు. అయినప్పటికీ దీనిపైన ఖండనమండనలు రాలేదు. ప్రపంచ నాయకులు, అంతర్జాతీయ సంస్థలు ఆ యువకులకు న్యాయం చేయమని పిలుపునివ్వలేదు. అంతేకాదు, నిద్రపోతున్న మంచాల నుండి, కళాశాలలకు వెళ్తున్న మార్గాల నుండి కిడ్నాప్ చేయబడి, ఎటువంటి ఆరోపణలు లేకుండా, విచారణలు జరగకుండా ఇజ్రాయెలీ జైళ్లలో మగ్గిపోతూ శారీరక, మానసిక చిత్రహింసలకు గురవుతూ ఉన్న 250 మందికి పైగా పాలస్తీనా బాలుర గురించిన ప్రకటనలు కూడా వీళ్లెపుడూ చేయలేదు. ఇంతేకాదు గాజా ప్రాంతాన్ని పరమ అనాగరికంగా ముట్టడించి దశాబ్దాలుగా ఆ ప్రాంతాన్ని లూటీ చేస్తూ, స్థానిక ప్రజల్ని వాళ్ల ఆవాసాల నుండి బలవంతంగా వెళ్లగొడుతూ, వాళ్ల భూముల్ని స్వాధీనం చేసుకుంటూ, ఇళ్లను కూల్చి వేస్తూ, విద్యా వ్యవస్థను నాశనం చేస్తూ, నిర్విచక్షణగా జైళ్లలో తోసివేస్తూ వాళ్ల కదలికల మీద పరిమితులు విధిస్తూ, పర్మిట్ల నెపంతో వారి ఉపాధిని దెబ్బతీస్తూ చట్ట విరుద్ధంగా హత్యలు చేస్తూ, మొత్తంగా పాలస్తీనానంతటినీ ప్రపంచం నుండి వేరుచేసి ఒంటరితనంతో కూడిన మురికివాడగా మారుస్తున్న ఇజ్రాయిల్ కుతంత్రాన్ని ఆ నాయకులెన్నడూ ప్రశ్నించనూలేదు, ఖండించనూ లేదు.

ఇవేవి పట్టించుకోవాల్సిన విషయాలుగా వారికి అనిపించలేదు. కిడ్నాప్‌కు గురయిన ఇజ్రాయిలీ యువకులు పాలస్తీనీయులకు చెందిన భూమిని ఇజ్రాయిల్ దొంగిలించి అక్కడ అక్రమంగా కట్టిన, యూదులు మాత్రమే నివసించే అవకాశమున్న కాలనీలకు చెందినవారన్న వాస్తవంతో కూడా వారికి నిమిత్తం లేదు.

గష్ ఇజియాన్‌లోని ఒక పెద్ద ప్రాంతం యల్‌ఖదీర్ అనే గ్రామానికి చెందిన పాలస్తీనీయుల్ని తరిమేసి అక్కడ ఇప్పుడు అక్రమంగా నివసిస్తోన్న ప్రజలలో చాలా మంది అమెరికన్లు. అందులోనూ ముఖ్యంగా న్యూయార్క్ నగరం నుండి వచ్చిన వాళ్లు. కిడ్నాప్‌కు గురైన ముగ్గురిలో ఒకతను కూడా అలాంటి వాడే. యూదు ప్రభుత్వం వాళ్లకు ద్వంద్వ పౌరసత్వపు ప్రత్యేక సౌకర్యం కల్పించింది. ప్రపంచంలో ఏదేశానికి చెందిన వాళ్లైనా వాళ్లు యూదులైతే ఈ అక్రమ సెటిల్‌మెంట్లలోకి వచ్చి నివసిస్తూ ఉంటే వాళ్లు తమ మాతృదేశపు పౌరసత్వాన్ని, ఇజ్రాయిల్ పౌరసత్వాన్నీ పొందవచ్చు. అదే సమయంలో స్వతహాగా స్థానికులైన పాలస్తీనీయులు మాత్రం శరణార్థి శిబిరాలలో, మురికివాడల్లో దుర్భర జీవితాన్ని గడుపుతుంటారు.

ఇజ్రాయిల్ తమ బిడ్డల్ని చంపుతూ ఉందని పాలస్తీనా తల్లులు నిందించిన ప్రతి సందర్భంలోనూ, పిల్లల్ని ఇంట్లో, ఇజ్రాయిలీ సైనికులకు దూరంగా ఉంచకుండా, వాళ్లు చనిపోవడానికి మీరే కారకులంటూ ఆ తల్లుల్ని నిందిస్తూ ఉంటారు. కిడ్నాప్‌కు గురైన తన కొడుకు యూదు ద్వేషులైన టెర్రరిస్టుల చేతుల్లో బందీగా సురక్షితంగానే ఉన్నాడని విశ్వాసాన్ని ప్రకటిస్తోన్న రాచెల్ ఫ్రాంకెల్‌ను మాత్రం ఎవరూ ప్రశ్నించరు. తప్పిపోయిన ఆ ముగ్గురిలో ఒకరు తన ఇరుగుపొరుగు వాళ్లైన పాలస్తీనీయులను అణచివేస్తున్న సైనికుడు అనే వాస్తవాన్ని గురించి వ్యాఖ్యానించమని కూడా ఎవరూ అడగరు.

స్థానికులైన యూదేతర యజమానుల నుండి బలవంతంగా స్వాధీనం చేసుకున్న భూమిపై ఏర్పాటు చేసిన, జాతి వివక్ష అమలవుతున్న, జాతీయ దురహంకారానికి నిలయమైన ఇలాంటి కాలనీలో నివసించడంకోసం ఆమె తన కుటుంబంతో సహా అమెరికా నుండి ఎందుకు తరలివచ్చిందో కూడా ఎవరూ అడగరు.

యూదు జాత్యంహకారం, అన్ని జీవిత రంగాలలో యూదుల ఆధిక్యత, ఇజ్రాయిల్ రాజ్యపు చట్టాలలో, నిబంధనలలో ఈ సూత్రం పరివ్యాప్తమై ఉంటుంది. పాలస్తీనా జీవితాల పట్ల అగౌరవం, ద్వేషం కూడా అంతే స్థాయిలో ఉంటాయి. విద్యా ఉద్యోగ అవకాశాలలో యూదులకు అనుకూలంగా ఉండే చట్టాలు, యూదుల మధ్యలో యూదేతరులు నివసించడాన్ని నిషేధించే చట్టాలు, పాలస్తీనీయుల కదలికలను, నీటి సౌకర్యాన్ని, ఆహార పదార్థాలను, విద్యా సౌకర్యాలను వివాహ అవకాశాలను, ఆర్థిక స్వయం ప్రతిపత్తిని పరిమితం చేసే అంతులేని సైనిక ఆదేశాలు – వీటన్నింటిలోనూ పాలస్తీనీయుల పట్ల వివక్ష కనపడుతుంది. 'వెయ్యి మంది యూదేతరుల ప్రాణాలు కూడా ఒక యూదు జాతీయుడి వేలి గోరుకు సమానం కాదు' అనే ఒక యూదు మత ప్రవక్త అభిప్రాయానికి అనుగుణంగానే అక్కడి యూదేతర ప్రజల జీవితాలన్నీ కట్టుబడి ఉన్నాయి.

హింసకు అంగీకారం

ఇజ్రాయిల్ హింసాకాండకు అందరి ఆమోదం ఉంది. అందరూ దాన్ని ఊహిస్తున్నారు కూడా. అది సర్వ సాధారణమే అయిపోయింది. సైనిక యూనిఫాంలు, సాంకేతిక నైపుణ్యంతో కూడిన యుద్ధ సాధనాలు ఆ హింసకు చట్టబద్ధత ముసుగును తొడిగాయి. అది ఒక వీరోచితమైన కార్యంగా కొనియాడ బడుతుంది. ఆ హింసనంతటినీ పాశ్చాత్య మీడియా ప్రతిచర్యగా చిత్రీకరిస్తుంది. ఇజ్రాయిల్ అణిచివేతకు ప్రతిస్పందనగా మాత్రం పాలస్తీనా ప్రతిఘటనను వాళ్లు అంగీకరించరు. అంతర్జాతీయ మానవతా చట్టాలకు విరుద్ధంగా ఇజ్రాయిలీ జైళ్లలో మగ్గుతున్న వందలాది మంది పిల్లల్ని తక్షణమే బేషరతుగా విడుదల చేయమని పిలుపునివ్వమని అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీని కోరినప్పుడు అది అందుకు నిరాకరించింది. ఎప్పుడూ సర్వసాధారణంగా జరుగుతూ ఉన్న పాలస్తీనా పిల్లల కిడ్నాప్‌లు, చిత్రహింసలు, ఏకాంత జైలు శిక్షలకు గురి చేయడం కంటే, ఎప్పుడో అరుదుగా జరిగే ఇజ్రాయిలీ యువకుల కిడ్నాప్ భిన్నమైనదని ఆ సంస్థ సూచిస్తోంది.

మా వీధుల్లో తిరుగుతూ ఉండే ఇజ్రాయిలీ సాయుధ శకటాలపైన, జీపులపైన మా పిల్లలు రాళ్లు వేస్తే అందుకు తల్లిదండ్రులుగా మేము నిందార్హులం. మా పిల్లల్ని ఇజ్రాయిల్ సైనికులుగాని, అక్రమ వలస దారులుగాని కాల్చి చంపితే అందుకు మేమే బాధ్యులం. మేం పాదాక్రాంతం కావడానికి నిరాకరిస్తే మేం శాంతిలో భాగస్వాములం కాం. అందుకుగాను మానుంచి మరింతగా భూముల్ని స్వాధీనం చేసుకొని కేవలం యూదులు మాత్రమే అనుభవించడానికి కేటాయించవచ్చు. మేం సాయుధులమై తిరగబడితే, ఒక సైనికుడిని కిడ్నాప్ చేస్తే మేం అత్యంత ప్రమాదకరమైన టెర్రరిస్టులం. అందుకు మమ్మల్ని మేమే నిందించుకోవాలి. ఒకచోట జరిగిన ఒక చర్యకు బదులుగా ఇజ్రాయిల్ యావత్తు పాలస్తీనీయుల్ని సామూహిక శిక్షకు గురిచేస్తోంది. మేం శాంతియుత నిరసన తెలుపుతూ ఉంటే మేం అల్లరిమూక. మమ్మల్ని చెదరగొట్టడానికి వాళ్లు కాల్పులు జరపవచ్చు. మేం చర్చిస్తే, రాస్తూ ఉంటే, వాళ్లను బాయ్‌కట్ చేస్తే, మేం యూదు వ్యతిరేకులం. అందుకు గాను మా గొంతులు నొక్కివేయవచ్చు. మమ్మల్ని మా ఆవాసాల నుండి గెంటివేయవచ్చు. మమ్మల్ని పట్టించుకోకపోవచ్చు. మమ్మల్ని శిక్షించవచ్చు.

అలాంటప్పుడు మేమింకేమి చేయాలి? యూదు ఆధిక్యతా భావజాలాన్ని బహిరంగంగా ప్రోత్సహిస్తున్న రాజ్యం ప్రపంచ పటం నుండి పాలస్తీనా భూభాగాన్ని తుడిచి పెట్టడానికి ప్రయత్నిస్తూ ఉంది. మా ప్రజలు కొంపా గోడు పోగొట్టుకుంటున్నారు. విలువైన వారసత్వ మంతా నాశనం చేయబడుతూ ఉంది. మానవత్వపు అంచులకు నెట్టి వేయబడుతున్నారు. మా దౌర్భాగ్యానికి మమ్మల్నే నిందిస్తున్నారు. మాది ప్రధానంగా నిరాయుధమైన సమాజం. మేం తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురైన వాళ్లం. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన ఒక సైన్యం మమ్మల్ని నాశనం చేయడానికి, తుడిచి పెట్టడానికి ప్రయత్నిస్తూ ఉంది. ఐక్యరాజ్య సమితి మద్దతు కూడగట్టుకోవడానికి రాచెల్ ఫ్రాంకెల్ అక్కడకు వెళ్లి ఇలా అంటుంది : 'అమాయకులైన అబ్బాయిల్నీ, అమ్మాయిల్నీ, పిల్లల్నీ తీసుకవెళ్లి ఏ పోరాటంలోనైనా సాధనాలుగా వాళ్లను వాడడం తప్పు. ఇది దుర్మార్గం. నేనొక ప్రశ్న అడగాలను కుంటున్నా. పాఠశాల నుండి సురక్షితంగా ఇంటికి చేరే హక్కు ప్రతి పిల్లవాడికి ఉందా లేదా'?

ఇజ్రాయిలీ సైనికులు ప్రతి రోజూ పాలస్తీనా పిల్లలపై అమలు చేస్తున్న హింసాకాండ నేపథ్యంలో చూసినపుడు, ఫ్రాంకెల్ తన ప్రకటన నుండి మా పాలస్తీనా పిల్లల్ని మినహాయించిందేమో అని నాకనిపిస్తూ ఉంది.

(జూలై 1, 2014న ది హిందూ పత్రికలో అచ్చయిన వ్యాసానికి స్వేచ్ఛానువాదం)

(రచయిత మార్నింగ్స్ ఇన్ జెనిన్ అనే గ్రంథం రాశారు) వీ

అబద్ధాల పుట్ట మీడియా

***పెట్టుబడిదారీ దేశాలు ఎంత సంక్షోభంలోకి వెళుతుంటే అంతగా అబద్ధాలను ప్రచారం చేస్తున్న పాశ్చాత్య పెట్టుబడిదారీ మీడియా, వారి దళారీలైన భారత మీడియా గురించి తాజా ఉదాహరణలతో వివరిస్తున్నారు* నర్సింహ**

మెదడులోని ప్రతి కణం హిందూ మతోన్మాదంతో నిండిన ఒక తెలిసినతను, 'ఇరాక్‌లో భారత నర్సులను టెర్రరిస్టులు కిడ్నాప్ చేశారు' అని భారతదేశ మీడియా చేసిన ప్రచారాన్ని చూసి నాతో ఏమన్నాడంటే, 'ఆ ముస్లిం టెర్రరిస్టులు ముస్లిం నర్సులను మినహాయించి మిగితా మతాల నర్సులపై లైంగిక అత్యాచారం చేస్తారు. ఎవరైనా ఎదిరిస్తే వారిని చంపుతారు కూడా' అని అన్నాడు. తన దేశ పౌరులు వేరే దేశంలో ఒక ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటున్నందున అతను ఆందోళన పడుతున్నాడేమోనని నేను అనుకొని, 'అలాంటి దుర్మార్గ చర్యలకు వారు పాల్పడరు. వారి దేశాన్ని సామ్రాజ్యవాదుల, వారి ఇరాకీ దళారీల నుండి విముక్తి చేయడానికి వారు పోరాడుతున్నారు తప్పించి ఇలాంటి పనులు చేయడానికి కాదు' అని ధైర్యం చెప్ప చూశాను. కొద్ది సమయం తర్వాత నాకు అర్థమైందేమంటే, కిడ్నాపర్లు ఆ భారత నర్సులపై లైంగిక అత్యాచారం చేస్తేనే బాగుంటుంది. తద్వారా, ముస్లింలు క్రూరులని, ఇస్లాం మతమే అలాంటిదని హిందూ మతోన్మాదులు చేస్తున్న దుష్ప్రచారానికి ఒక మంచి ఆయుధం దొరుకుతుందన్న భావనతో ఆయన అలా వాదిస్తున్నట్టు నాకు అర్థమై అతన్ని వదిలించుకొని వెళ్లిపోయాను.

నర్సులు సురక్షితంగా భారతదేశం చేరుకున్న తర్వాత, ఒక రోజు ఈ వ్యక్తి అనుకోకుండా తారసపడ్డాడు. హిందూ మతోన్మాదం ఎంత ప్రమాదకరమైందో, ఆ వైరస్ ఎక్కిన వారి మనసు, మెదడు ఎంత అమానవీయంగా తయారై, చివరికి తన మతం వారిని కూడా అనుమానించే, అవమానించే స్థాయిలో వారి ఆలోచనా దృక్పథం ఉంటుందో అర్థమైంది. ఆయన ఏమన్నాడంటే, 'భారత నర్సులపై ఆ టెర్రరిస్టులు కచ్చితంగా లైంగిక అత్యాచారం చేశారు. అయితే ఆ నర్సులే తమకు పెళ్లిళ్లు జరుగవేమోనని బయటకు చెప్పడం లేదు' అని అన్నాడు.

ప్రపంచం మొత్తంలో అత్యంత అమానవీయమైన, అసహ్యకరమైన భావజాలమైన హిందూ మతోన్మాదం ఆ వ్యక్తి మెదడుకు చేసిన వినాశనానికి బాధపడాలా, కోపగించుకోవాలా అర్థం కాలేదు. హిందూ మతోన్మాదులు కనీసం తమ మతం వారిని కూడా గౌరవించరని, ప్రేమించరని వారితో సంభాషిస్తే అర్థమవుతుంది.

ఇంకోవైపు, భారతదేశం చేరుకున్నాక మీడియాతో ఆ నర్సులు ఏమన్నారంటే, 'మమ్మల్ని వారు ఎలాంటి ఇబ్బందులకు గురిచేయలేదు. వారు పస్తులుండి మాకు ఆహారం ఇచ్చారు. వారు మా ముఖాన్ని కూడా సూటిగా చూసేవారు కాదు' అని.

ఒకవైపు పాశ్చాత్య పెట్టుబడిదారుల మీడియా, ఇంకోవైపు వారి వార్తలను తమ భాషల్లోకి తర్జుమా చేసుకొని వేసుకునే సామ్రాజ్యవాదుల భారత దళారీ మీడియా (క్రిస్టియన్ పాశ్చాత్య పెట్టుబడిదారులకు, హిందూ దళారీ పెట్టుబడిదారులకు మధ్య నడుస్తున్న అక్రమ సంబంధం చూడండి) తమ వ్యాపార, అధికార ప్రయోజనాలకు ఎవరి వల్ల ప్రమాదం ఉందంటే వారి పట్ల తమ మీడియా ద్వారా ఎంత నీచంగా అసత్యాలను వ్యాప్తి చేస్తారో వారి మీడియా చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుంది. భాషను కూడా వారు ఏ స్థాయిలో దుర్వినియోగం చేస్తారో కూడా మీడియా భాష చరిత్ర చదివితే అర్థమవుతుంది. ఉదాహరణకు, ఈ నర్సుల సంఘటననే తీసుకుంటే, అటు పాశ్చాత్య మీడియా, ఇటు దళారీ భారత మీడియా ఈ సంఘటనను 'కిడ్నాప్'గా చిత్రీకరించాయి. అసలు కిడ్నాప్ అంటే 'ఎవరైనా బలవంతంగా బందీగా ఉంచుకొని, వారికి సంబంధించిన వారిని తమ డిమాండ్‌లను తీర్చమని బెదిరించడం'. నర్సులను కిడ్నాప్ చేసినవారు ఏ డిమాండ్ పెట్టలేదు. ప్రతిఫలంగా ఏమీ అడగలేదు. అంటే, అది కిడ్నాప్ కాదు. ఇంకోరకంగా చూసినా దాన్ని కిడ్నాప్ అనరు. నర్సులు సురక్షితంగా భారతదేశం వెళ్లడానికి వీలుగా వారిని ఎవరికైనా అప్పచెప్పాలనే ప్రణాళికలో భాగంగా ఆ తిరుగుబాటుదారులు నర్సులను తాము పనిచేస్తున్న ఆసుపత్రి భవంతిని వదిలిరమ్మంటే, నర్సులే తాము ఇరాక్ విడిచి వెళ్లమని పట్టుపట్టారు. వారిని అలా వదిలి వెళ్లితే, సామ్రాజ్యవాదుల దళారీ ఇరాక్ ప్రభుత్వం వారిని చంపించి, ఆ చర్యను తమపై ఎక్కడ మోపుతారోనని వారిని అంటిపెట్టుకొని, వారికి రక్షణగా ఉన్నారు. వారి మానవీయ చర్యకు కృతజ్ఞతలు చెప్పాల్సింది పోయి, హిందూ మతోన్మాద భారత మీడియా తమ యజమాని అయిన సామ్రాజ్యవాద మీడియా ఆజ్ఞల ప్రకారం దానిని కిడ్నాప్‌గా కోట్ల సార్లు ప్రచారం చేసి, గోబెల్స్ కూడా తన సమాధిలో సిగ్గుతో తలవంచుకునే రీతిలో ప్రవర్తించి, తమ నిజ స్వరూపాన్ని బయట పెట్టుకున్నారు. అభ్యుదయ భావజాలం ఉన్న వ్యక్తులు ఎడిటర్లుగా ఉన్నారని చెపుతున్న తెలుగు పత్రికా రంగం కూడా ఈ అమానవీయ, అనైతిక చర్యలకే పాల్పడింది.

ఇరాకీ తిరుగుబాటుదారులు ఇరాక్ మొత్తాన్ని తమ అధీనంలోకి తీసుకుంటే అది తమ ప్రయోజనాలకు నష్టం కలుగచేస్తుందని భావించిన సామ్రాజ్యవాదులు, తిరుగుబాటుదారులను టెర్రరిస్టులని, వారు అత్యంత కిరాతకులని, ఒక్కొక్క అబద్ధాన్ని కోట్ల కొలది సార్లు టివి ఛానళ్ల ద్వారా, పత్రికల ద్వారా, ఇంటర్నెట్, ఇంకా ప్రతి మాధ్యమం ద్వారా ప్రచారం చేస్తున్నారు. చివరికి అభ్యుదయ భావాలున్న వారు కూడా ఈ ప్రచారంలో ఎంతో కొంత నిజం ఉండవచ్చేమో అని నమ్మే స్థాయిలో వారి ప్రచారం ఉంది.

ఈ మధ్య సామ్రాజ్యవాద మీడియా ఒక ఫొటోను ప్రచురించింది. ఆ ఫొటోలో కొందరు సాయుధులు నిరాయుధులపై కాల్పులు జరుపుతున్నట్టుగా ఉంది. తెలుగు పత్రికలతో సహా ప్రపంచమంతా ఈ ఫొటోను చూపుతూ ఇరాకీ తిరుగుబాటుదారులు ఎంతో క్రూరులని

ప్రచారం చేశారు. కొంచెం మెదడు పెట్టి ఆలోచిస్తే దాంట్లో ఎన్నో లోపాలున్నాయి. అది వీడియో కాదు. కేవలం ఫొటో. ఫొటోషాప్ సాఫ్ట్‌వేర్‌తో ఎలాంటి జిమ్మిక్కులైనా చేయవచ్చు. ఆ మాటకొస్తే వీడియోలను కూడా మనకు అనుకూలంగా ఎడిట్ చేయగలిగే సాఫ్ట్‌వేర్‌లు కూడా ఉన్నాయి. పైగా ఆ ఫొటోలో ఎవరి ముఖం సరిగ్గా కనిపించడం లేదు. బహుశా ఈ విషయంలో అమెరికా తన 9/11 అనుభవం నుండి నేర్చుకుని ముఖాలు ఏర్పడకుండా ఫొటో ఎడిటింగ్ చేసినట్టుంది. 2001 సెప్టెంబర్ 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్ బిల్డింగ్‌ను అమెరికా ప్రభుత్వమే కూల్చి వేయించి, దానిని ముస్లిం తీవ్రవాదులు కూల్చారని, వారంతా ఆ విమానంలో ప్రయాణికుల వలె ప్రయాణించారని చెప్పి, ఒక డజను మంది ఫొటోలను విడుదల చేసింది. మానసిక సమస్యలతో ఉన్మాదులుగా మారిన వారికంటే హీనంగా ఆ ఫొటోలను కోట్లాది సార్లు ప్రపంచం లోని టివి, పత్రిక రంగం చూపించింది. అసలు జీవితంలో ఎన్నడూ అమెరికాలో అడుగుపెట్టని తమ ఫొటోలు చూపుతున్నారంటూ ఈజిప్ట్, పాకిస్థాన్, సుడాన్ లాంటి దేశాల నుండి ఆ ఫొటోల్లోని వ్యక్తులు గగ్గోలు పెట్టారు. దాంతో 9/11 ఘటన అమెరికా ప్రభుత్వ చర్యగా బయట పడింది.

ప్రభుత్వాలే ఇలాంటి టెర్రరిస్టు చర్యలు చేస్తూ, వాటిని బూచిగా చూపి ప్రజల హక్కులను దారుణంగా అణిచివేసే నల్ల చట్టాలను తెస్తున్నాయి. ప్రజలు దశాబ్దాల కొలది పోరాడి సంపాదించుకున్న వివిధ రకాల హక్కులను ఆయా పాలకవర్గాలు టెర్రరిస్టు చర్యలు చేసి, నల్ల చట్టాలు తెచ్చి, వాటి ద్వారా మళ్లీ ప్రజలను కొన్ని దశాబ్దాల వెనుకకు నెడుతున్నారు. ప్రపంచమంతా, ఏ దేశాల్లో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ జరుగుతున్నదో, ఆ దేశాల్లో పాలక వర్గాలే వివిధ పట్టణాలలో టెర్రరిస్టు దాడులు చేయించి, ఏవో అనామక సంస్థలపై (అవి వారి ఆధ్వర్యంలో నడిచేవే) నిందమోపి, వీటిని బూచిగా చూపి క్రూర చట్టాలను తెచ్చి, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణలను, వనరుల దోపిడీని వ్యతిరేకిస్తున్న వారిపై ఆ క్రూర చట్టాలను ప్రయోగిస్తున్నారు.

సోవియట్ యూనియన్ ఉన్నంత వరకు రష్యాలో టెర్రరిస్టు దాడులు లేవు. రష్యా ప్రపంచీకరణ మొదలు పెట్టగానే టెర్రరిస్టు దాడుల పేరు మీద నల్ల చట్టాలు తెచ్చి అణచివేత మొదలుపెట్టింది. 1990 వరకు భారతదేశంలో టెర్రరిస్టు దాడులు లేవు. ప్రపంచీకరణ మొదలు కాగానే టెర్రరిస్టులంటూ, నల్ల చట్టాలంటూ అణచివేత మొదలైంది. లిబియాలో గడాఫీ బతికి ఉన్నంత వరకు టెర్రరిస్టు దాడులు లేవు. పాశ్చాత్య దేశాలు 2012లో లిబియాను ఆక్రమించి, గడాఫీని చంపించి, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ మొదలు పెట్టగానే టెర్రరిస్టు దాడులని చెప్పి, నల్ల చట్టాలు తెచ్చారు. సద్దాం ఉన్నన్ని రోజులు ఇరాక్‌లో టెర్రరిస్టు దాడులు లేవు. 2004లో అమెరికా ఇరాక్‌ను ఆక్రమించి ప్రైవేటీకరణ మొదలు పెట్టి, టెర్రరిస్టు దాడుల పేరు మీద నల్ల చట్టాలు తెచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల్లో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా వస్తున్న ప్రజా ఉద్యమాలను అణచడానికి టెర్రరిస్టు చర్యలు చేయిస్తూ, నల్ల చట్టాలు తెచ్చి ప్రజలను మధ్యయుగపు చీకటి రోజుల్లోకి నెడుతున్నారు.

ఇరాక్‌లోనైతే సద్దాం కాలంలో పెట్రోలియం, గ్యాస్ పరిశ్రమలతో సహా అన్ని కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచేవి. ఇరాక్‌ను అమెరికా ఆక్రమించిన తర్వాత 'మ్యాసివ్ ప్రైవేటైజేషన్ ఆఫ్ ఇరాక్' అనే అతి పెద్ద ప్రోగ్రాం తయారు చేసి అమెరికా సామ్రాజ్యవాదులు, వారి దళారీలు ప్రైవేటీకరణతో ఇరాక్‌ను కొల్లగొట్టడం మొదలుపెట్టారు. దీన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలను అణచడానికి, ఇరాక్ ప్రభుత్వమే సున్నీల ప్రాంతంలో బాంబులు పేల్చి షియాలపై నెట్టడం, షియాల ప్రాంతంలో బాంబులు పేల్చి సున్నీలపై నెట్టడం చేసింది. గత 200 సంవత్సరాలుగా ఏ ఒక్కసారి కూడా ఇరాక్‌లో సున్నీ, షియాల మధ్య ఘర్షణలు జరిగిన చరిత్ర లేదు. అంతెందుకు, ముస్లింలకు, క్రిష్టియన్‌లకు మధ్య కూడా జరగలేదు. అంత స్నేహ భావంతో ఉన్న చరిత్ర కలిగిన దేశంలో ప్రపంచీకరణ మొదలవగానే టెర్రరిస్టు మారణహోమం అకస్మాత్తుగా ఎక్కడి నుండి వచ్చింది?

ఈ కుట్రల వెనుక పాలకవర్గాల పన్నాగం ఉన్నది. ప్రజలు ఒకరిని ఒకరు అసహ్యించుకుంటూ, ఘర్షణపడుతూ ఉంటే, పాలక వర్గాలకు ప్రజలను మూకుమ్మడిగా అణచివేసే శ్రమ తగ్గుతుంది. అంతే కాదు. పైకి ఎంతగా ఘర్షణ వాతావరణం మీడియా చూపిస్తున్నదంటే, లోపల అంత పెద్దఎత్తున పాలక వర్గాలు ప్రజా సంపదను కొల్లగొట్టుకు పోతున్నారని అర్థం. లోపల జరిగేది అర్థం కాకూడదంటే బయట ప్రజలను అంతగా ఇతర విషయాల వైపు మళ్లిస్తారు. దాంట్లో భాగంగానే టెర్రరిస్టు చర్యలు చేయిస్తారు. తమ హక్కుల గురించి, తమ ప్రజల గురించి పోరాడే, తమకు ప్రజల మద్దతు కావాలనుకునే ఏ సంస్థ కూడా అమాయక ప్రజలను చంపే టెర్రరిస్టు చర్యలు చేయదు. అలా చేస్తున్నారంటే ఆ సంస్థలు కచ్చితంగా పాలక వర్గాల ఆధ్వర్యంలో నడుస్తున్నవే ఉంటాయి. ఇరాక్‌లో కూడా సామ్రాజ్యవాదులు ఇలాంటి సంస్థలను స్థాపించి, టెర్రరిస్టు చర్యలు చేయించి, అక్కడి ప్రజలను విడదీయాలని, తిరుగుబాటుదారుల పట్ల అసహ్యాన్ని కలిగించాలని చూశారు. కాని, సామ్రాజ్యవాదుల కుట్ర అర్థమైన ప్రజలు ఏకమై తిరుగుబాటు ఉద్యమానికి మద్దతుగా నిలబడుతున్నారు. అందుకే ఆ ఉద్యమం విజయాలు సాధిస్తున్నది.

పాశ్చాత్య మీడియా తమ దేశ ప్రజల్లో కూడా విశ్వసనీయతను కోల్పోయింది. రెండు దశాబ్దాలుగా ఇస్లాం మీద ఎడతెరిపి లేకుండా విషం చిమ్ముతున్న పాశ్చాత్య మీడియాకు ఈ మధ్య షాక్ తగిలింది. బ్రిటన్‌లో స్త్రీలు కొందరు క్రిష్టియానిటీని వదిలి ఇస్లాంలోకి మారారు. మీడియా చేస్తున్న ప్రచారం ప్రకారం ఇస్లాం ఎందుకు అంత దుర్మార్గమైన మతం అనే పరిశోధన చేసిన ఆ మహిళలకు మీడియా చేసిన ప్రచారం బూటకమని అర్థమై వారు ఇస్లాం మతంలోకి మారారట. పచ్చి అబద్ధాలను నిజాలుగా చెపుతున్న పాశ్చాత్య మీడియా తన విశ్వసనీయతను కోల్పోయింది. వారి వార్తలను యథాతథంగా తర్జుమా చేసి వేస్తున్న భారత ప్రాంతీయ భాషల మీడియా అలాగే భారత ఆంగ్ల మీడియాను కూడా అమాయకులు తప్పించి ఎవరైనా నమ్ముతున్నారనేది అనుమానమే. శ్రీశ్రీ అన్నట్టు 'పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన విష పుత్రికలు' మన దేశ పత్రికలు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ జరుగుతున్న వ్యవస్థలో, పాలక వర్గాల మీడియా వాస్తవాలు చెపుతుందనుకోవడం అమాయకత్వమే. నిజాలు తెలువాలంటే శ్రమతో పరిశోధించక తప్పదు. అబద్ధాల పుట్టలుగా మారిన పాలక వర్గాల మీడియా చెపుతున్న విషయాలను గుడ్డిగా నమ్మి, వాటి ఆధారంగా వాదిస్తే మన విశ్వసనీయత కూడా పోతుంది. అందుకే పెట్టుబడి పట్ల జాగ్రత్త అవసరం.

(ఈ వ్యాసం రాయడానికి ఉపయోగపడిన వీడియోల లింక్‌లు వీక్షణం పత్రిక వెబ్‌సైట్‌లోని ఆగస్టు సంచిక కింద ఉండే కామెంట్స్ పేజీలో పెట్టడం జరిగింది. ఆసక్తి ఉన్నవారు వాటిని చూడవచ్చు) వీ

(రచయిత పరిశోధకుడు)

హైదరాబాద్‌పై గవర్నర్ గిరీ

తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో ఉమ్మడి రాజధాని పేరుతో కేంద్రం గవర్నర్ పాలనను విధించడం వెనక కోస్తాంధ్ర, రాయలసీమ ఆస్తిపర వర్గాల ప్రయోజనాలు ఉన్నాయని అంటున్నారు బి. రామకృష్ణ

తెలంగాణ ప్రభుత్వం చట్టపరంగా, గతంలో కోర్టు వివరణల ఆధారంగా గురుకుల ట్రస్టులో అక్రమ నిర్మాణాలను కూల్చే కార్యక్రమం తీసుకుంది. ఇక్కడి భూములను అనుభవిస్తున్న సీమాంధ్ర పెత్తందారీ శక్తులకు ఇది సహజంగానే గిట్టని విషయంగా మారింది. తెలంగాణలో హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న నిజాం అధికారంలోని సర్ఫేఖాస్ భూములు, వక్ఫ్ భూములు లక్షలాది ఎకరాల ప్రభుత్వ (ప్రజల) భూమి ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర ఆధిపత్య శక్తుల చేతుల్లోకి పోయింది. హైదరాబాద్ చుట్టుపక్కల హైటెక్ సిటీ, ఔటర్ రింగ్‌రోడ్ పేరు మీద స్థానిక ప్రజల భూములు లాక్కోబడ్డాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లు బడాబాబుల చిరునామాలుగా మారాయి. బడాబాబుల అక్రమ ఆధీనంలో ఉన్న భూముల్లో కొన్నింటిపై తెలంగాణ ప్రభుత్వం చట్టపరమైన చర్యలు మొదలుపెట్టిందో లేదో ఆంధ్ర లాబీయింగ్ మొదలైపోయింది. చంద్రబాబునాయుడికి ఆధిపత్యశక్తుల అక్రమ ఆస్తుల రక్షణ తక్షణ అవసరంగా మారింది. సీమాంధ్రులపై ఏదో నేరం, ఘోరం జరిగిపోయి నట్లుగా విలవిల్లాడి పోయాడు. గుండెలు లబోదిబో బాదుకుంటున్నాడు. వెంటనే మోడీ ప్రభుత్వానికి లేఖ రాసేశాడు. గవర్నర్‌కే హైదరాబాద్ (జిఎచ్ఎంసి) పై పూర్తి అధికారాలు ఇవ్వాలని సూచనలు, నిర్దేశాలు చేశాడు. వెనువెంటనే రెండు రోజుల్లో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఉమ్మడి రాజధాని అయిన హైదరాబాద్‌పై గవర్నర్ అధికారాల గురించి ప్రతిపాదనల పేరుతో 2014 జూలై 4న ఒక సర్క్యులర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జారీ చేయడం జరిగిపోయింది.

హైదరాబాద్, దాని చుట్టుపక్కల అక్రమంగా కబ్జాచేసిన లేదా గత ప్రభుత్వాల నుండి పొందిన భూములు, ఆస్తులతో లబ్ధి పొందుతున్న సీమాంధ్ర లేదా తెలంగాణ పెట్టుబడిదారీ, ఆధిపత్య శక్తులు లేదా బహుళజాతి సంస్థల నుండి తిరిగి చేజిక్కించుకోవాల్సిన కర్తవ్యం తెలంగాణ ప్రభుత్వం ముందున్నది. ఆ పనిని టిఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తుందా లేదా అనేది వేచి చూడాల్సిందే. పరిశ్రమలను ఆహ్వానించే పేరుతో పాత ప్రభుత్వాల దోపిడీ విధానాలనే కొనసాగిస్తుందా అనేది త్వరలోనే తేలిపోయే విషయం. ఒకవేళ నిబద్ధతతో నిజంగానే టిఆర్ఎస్ ప్రభుత్వం ఆపని చేయబూనుకుంటే కేంద్ర ప్రభుత్వం, పెట్టుబడిదారీ శక్తులు ఈ ప్రభుత్వాన్ని నడవనిస్తాయా అనేది ప్రశ్నార్థకమే. దీనికి ఉదాహరణగా కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు లేఖ, ఆ వెంటనే మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి జారీ చేసిన సర్క్యులర్‌ను అర్థం చేసుకోవచ్చు.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం – 2014లోని 8వ సెక్షన్‌ను ప్రస్తావిస్తూ ఉమ్మడి రాజధానిపై గవర్నర్ అధికారాల గురించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను పరిశీలిద్దాం. ఉమ్మడి రాజధాని ప్రాంతం (జిఎచ్ఎంసి) నికి సంబంధించిన రికార్డులు, సమాచారం, మంత్రి మండలి లేదా 8వ సెక్షన్ తెలిపిన మరే ఇతర అధికార యంత్రాంగ నిర్ణయాల గురించి అడిగే అధికారాన్ని గవర్నర్ కలిగి ఉంటాడు. హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌లు, రంగారెడ్డి జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్‌లు నిర్ణీత సమయాంతరాలలో.... శాంతి భద్రతల రిపోర్టులను, అలాగే ఉమ్మడి రాజధానిలోని తీవ్రమైన, ప్రత్యేకంగా తీవ్రమైన నేరాల గురించి ప్రత్యేక రిపోర్టులను గవర్నర్‌కు సమర్పించాలి. శాంతి భద్రతలు, అంతర్గత భద్రత, కీలక ప్రాంతాలు, సంస్థల భద్రతలకు సంబంధించి ఉమ్మడి రాజధానిలోని హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్లు, రంగారెడ్డి జిల్లాకు చెందిన వాటిని తెలంగాణ రాష్ట్ర హోం సెక్రటరీ గవర్నర్‌కు వివరించాలి. వాటిపై గవర్నర్ అభిప్రాయాలనూ, సలహాలనూ సంబంధిత యంత్రాంగానికి తెలిపే, ఆదేశాలు ఇచ్చే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. గవర్నర్ ఆదేశాలు అమలు చేయబడాలి.

విద్వేషపూరిత నేరాలు (హేట్ క్రైమ్స్) అనే కొత్త పదం వాడారు. విద్వేషపూరిత నేరాలతో పాటు బెదిరింపు, బలప్రయోగ నేరాలు లేదా ఇతర నిర్దేశించబడిన నేరాలను పరిశీలించడం, వాటిని వేగంగా పరిష్కరించడం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్‌లలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజి) స్థాయి వ్యక్తి రంగారెడ్డి జిల్లా ఎస్‌పి కార్యాలయంలో సీనియర్ అధికారి ఈ సెల్‌కు ముఖ్యాధికారిగా వ్యవహరిస్తాడు.

అంతర్గత భద్రత, కీలక ప్రాంతాల, సంస్థల భద్రతకు సంబంధించి మరొక ప్రత్యేక సెల్ ఉంటుంది. దీనికొరకు హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్‌లలో, అలాగే రంగారెడ్డి ఎస్‌పి ఆఫీస్‌లో ఒక ఇన్‌ఛార్జి సీనియర్ అధికారి నియమించబడతాడు. ఈ ప్రత్యేక సెల్ సున్నితమైన సంస్థలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ద్వారా గవర్నర్‌కు రిపోర్ట్ చేయాలి. ప్రస్తుతం వీటి భద్రతను చూస్తున్న ఎస్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్ మొదలగు వాటిపై సమీక్షించి అదనంగా తీసుకోవాల్సిన చర్యలను సూచించాలి. గవర్నర్ వీటిపై తీసుకోవాల్సిన చర్యలను తెలుపుతాడు. అవి తప్పనిసరిగా పాటించాలి. గుర్తించిన కీలక సంస్థల భద్రతకు సంబంధించి సీనియర్ మేనేజ్‌మెంట్ క్యాడర్ నుండి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తారు. ఈ అధికారి నిరంతర నివేదికలు ఇస్తూ, ప్రత్యేక సెల్ సూచనలను ఎప్పటికప్పుడు అమలు చేయాలి.

ఉమ్మడి రాజధానిలో శాంతి భద్రతలను చూసే పాలనా విభాగం కోసం ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి తెలంగాణ డిజిపి,

హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లతో ఒక పోలీస్ సర్వీస్ బోర్డు ఏర్పాటు చేయబడుతుంది. డిసిపి, ఎసిపి, ఎస్ఎచ్ఓల బదిలీలను, పోస్టింగ్‌లను ఈ బోర్డు చేపడుతుంది. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లలో పోలీసులు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి ఫెయిర్ షేర్ ప్రాతిపదికన తీసుకోబడి జాయింట్ ఫోర్స్‌గా ఉంటారు. ఈ బోర్డులోని వారు గవర్నర్‌చే నియంత్రించబడతారు. గవర్నర్ నిర్ణయం మేరకు అదనపు బలగాలను నియమించడం కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని పరిశీలించమని, దాని గురించి తనకు సమాచారం ఇవ్వమని కోరవచ్చు. దీనిపై గవర్నర్ సమీక్ష చేసి తన నిర్ణయాలు చెపుతాడు. గవర్నర్ నిర్ణయమే అంతిమం అవుతుంది. తెలంగాణ ప్రభుత్వ ఏ అధికారి అయినా తీసుకునే ఏ చర్యలపై అయినా నివేదికలను, అంచనాలను తెలంగాణ ప్రభుత్వం నుండి గవర్నర్ అడగవచ్చు. అలాగే వాటిపై విచారణ చేయించి, తగు చర్యలు తీసుకొమ్మని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది.

ఉమ్మడి రాజధాని ఆస్తుల రక్షణ కోసం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిఎచ్ఎంసి కమిషనర్లు గ్రీవెన్స్ సెల్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఎవరి ఆస్తులకైనా నష్టం వాటిల్లితే వారు ఈ సెల్‌ను సంప్రదించే హక్కును కలిగి ఉంటారు. నష్టపోయిన వారి ఆస్తి హక్కును పరిరక్షించడం కోసం గవర్నర్ తెలంగాణ ప్రభుత్వాధికారులకు ఆదేశాలను జారీచేస్తాడు.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీచేసిన సర్క్యులర్‌లోని అంశాలను పరిశీలిస్తే గవర్నర్‌కు జిఎచ్ఎంసి, రంగారెడ్డి జిల్లాపై ఎంత విస్తృత అధికారాలు ఇవ్వబడుతున్నాయో తెలుస్తున్నది. ఎన్నో ఏండ్లుగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలో సర్క్యులర్‌లో సూచించబడిన శాంతి భద్రతలు, అంతర్గత భద్రతలు, ఇతర రక్షణలు ఎలా నిర్వహించబడ్డాయి? ఇన్నేళ్లుగా తలెత్తని సమస్యలు నేడేమైనా ప్రత్యేకంగా, తక్షణావసరంగా ముందుకొచ్చాయా? చట్ట సభలు, ప్రజా ప్రతినిధుల వ్యవస్థ తీర్చలేని పరిస్థితులేమైనా వచ్చాయా? అలా అయినప్పుడు ఎన్నికల తంతును ఎందుకు నిర్వహించినట్లు? హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను ఎన్నికల నుండి మినహాయించి మొత్తంగా గవర్నర్‌చే పాలన చేయించవచ్చు కదా! సీమాంధ్ర పెట్టుబడిదారులు, భూ ఆక్రమణదారులు, ఆధిపత్య శక్తులు కోరిన యుటి ప్రతిపాదన ఇదేకదా! ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం – 2014లోని సెక్షన్ 5 సూచిస్తున్న ఉమ్మడి రాజధాని అనేది, సెక్షన్ 8 సూచిస్తున్న ఉమ్మడి రాజధానిపై గవర్నర్‌కు అధికారాలు, అలాగే తాజాగా 2014 జూలై 4న జారీ అయిన సర్క్యులర్‌ల సారాంశం సూచిస్తున్నది పరోక్షంగా లేదా మరో రూపంలో ఉమ్మడి రాజధానిని యూనియన్ టెరిటరీ చేయడమే.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం (ఎపిఆర్ఓఎ-14) - 2014 సెక్షన్ 8లో ఉమ్మడి రాజధాని ప్రాంతం (జిఎచ్ఎంసి) పై మాత్రమే గవర్నర్ అధికారాలు చెప్పబడ్డాయి. కాని మొన్నటి సర్క్యులర్‌లో అదనంగా రంగారెడ్డి జిల్లాను కూడా చేర్చారు. గవర్నర్ పరిధిలోకి రంగారెడ్డి జిల్లాను చేర్చడం అంటే ఎపిఆర్ఓఎ-14ను ఉల్లంఘించడమే అవుతుంది. సర్క్యులర్‌లోనివి ప్రతిపాదనలుగానే చెప్పబడ్డాయి కాని అవి చట్టబద్ధ నియమాలు అవుతాయా? లేదా? అనేది వేచిచూడాల్సిందే. అయితే ఎపిఆర్ఓఎ-14లోని 8వ సెక్షన్ అమల్లో ఉన్నట్లేనన్నది మరిచిపోరాదు. ఈ 8వ సెక్షన్‌లో ఏమున్నదో చూద్దాం.

8. గవర్నర్‌కు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిలో నివసించే ప్రజల రక్షణ బాధ్యత;

8. (1) నియమిత తేదీ నుండి ఉమ్మడి రాజధాని ప్రాంతంలో నివసించే ప్రజలందరి ప్రాణ, ఆస్తి, స్వేచ్ఛ, భద్రతలను కాపాడే ప్రత్యేక బాధ్యత గవర్నర్ వహిస్తారు.

(2) ప్రత్యేకించి ఉమ్మడి రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతలు, అంతర్గత భద్రత, కీలక ప్రాంతాలు, సంస్థల భద్రత, ప్రభుత్వ భవనాల కేటాయింపు నిర్వాహణలకు గవర్నర్ బాధ్యత వహిస్తారు.

3 (1) ఈ విధుల నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలిని సంప్రదించిన పిదప గవర్నర్ తనకు న్యాయమని తోచిన నిర్ణయాన్ని తీసుకుని తగిన చర్యలు తీసుకుంటారు.

(2) ఐతే ఏ అంశానికి సంబంధించి గవర్నర్ వ్యక్తిగతంగా తనకు న్యాయమని అనిపించిన విధంగా చర్యలు తీసుకోవాలి అనే అంశం ఆయన విచక్షణపై ఉంటుంది. వాటిని ప్రశ్నించుటకు వీలులేదు.

4. కేంద్ర ప్రభుత్వం నియమించే ఇద్దరు సలహాదారులు గవర్నర్‌కు సలహాదారులుగా ఉంటారు.

అసలు ఉమ్మడి రాజధాని అనేదే అర్థరహితం. అది 10 ఏళ్ల వరకు అనేది ఇంకా అర్థరహితం. పోని సరే అనుకున్నా దానిపై గవర్నర్‌కు అధికారాలివ్వడం అనేది మరీ అర్థ రహితం. ఉమ్మడి రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతలు తదితరాల నిర్వహణకు తెలంగాణ మంత్రి మండలిని సంప్రదించాలని (8వ సెక్షన్ 3(1))లో అన్నప్పటికి అదే సెక్షన్ 3 (2)లో వ్యక్తిగతంగా గవర్నర్‌కు న్యాయమనిపించిందే చేస్తాడు. దీన్ని ప్రశ్నించడానికి వీలుండదు అని అనడం ద్వారా గవర్నర్‌కు 'నియంత' అధికారాలను కట్టబెట్టినట్లే అవుతుంది. ఈ విధమైన అధికారాలు పొందిన గవర్నర్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌పై కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష, పరోక్ష నియంత్రణ, పాలనాధికారాలు సంక్రమించాయి. ఇది రాష్ట్రాల అధికారాలను, స్వయం పాలనను, మొత్తంగా ఫెడరల్ విధానాన్ని అపహాస్యం చేయడమే. ఇలా చట్టసభలు, ప్రజా ప్రతినిధుల వ్యవస్థకు అర్థమే లేకుండా పోతున్నది. అయితే చట్టసభలు, ప్రజా ప్రతినిధుల వ్యవస్థ ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేస్తుందా? లేదా? అనేది వేరే అంశం అనుకోండి.

ఉమ్మడి రాజధాని ప్రాంతంలో ప్రజల ఆస్తుల రక్షణ అంటే సీమాంధ్ర పెత్తందారీ, పెట్టుబడిదారీ, భూ ఆక్రమణదారుల ఆస్తుల రక్షణే అని చంద్రబాబునాయుడు కేంద్రానికి లేఖ రాయడం ద్వారా చెప్పకనే చెప్పినట్లయింది. దానికి స్పందిస్తూ వెంటనే కేంద్ర ప్రభుత్వం కూడా తానా అంటే తందాన రీతిలో చంద్రబాబు వాదనకు అనుకూలమైన, పరోక్షంగా పెట్టుబడిదారుల, భూ కబ్జాదారుల, అక్రమ ఆస్తిపరుల ప్రయోజనాలను నెరవేర్చేందుకు గవర్నర్‌కు అధికారాలు కట్టబెట్టే ప్రతి పాదనలు చేయడం దారుణమైన విషయం. పోలవరం విషయంలో ఖమ్మం జిల్లా భద్రాచలం ప్రాంతంలో మూడు లక్షల మంది గిరిజనులు తమ సర్వస్వం కోల్పోతున్నప్పుడు వారి గురించి ఆలోచించకుండా, కనీస మానవత్వంతో స్పందించకుండా వారికి వ్యతిరేకంగా ఏకంగా పార్లమెంట్‌లో చట్టమే చేశారు. కాని గుప్పెడు మంది సీమాంధ్ర అక్రమార్జనల రక్షణ కొరకు, గవర్నర్‌కు అధికారాల కొరకు నడుం బిగించడం ద్వారా చంద్రబాబునాయుడు, నరేంద్రమోడీలు ఎవరి పక్షమో తేటతెల్లం అయింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం–2014లోని 8వ సెక్షన్‌ను చదివిన వారికెవరికైనా, తెలంగాణ ప్రభుత్వాన్ని దద్దమ్మను చేసి లేదా దద్దమ్మగా భావించి చట్ట సభలను కించపరిచేలా ఉమ్మడి రాజధాని (జిహెచ్ఎంసి) పై అధికారాలను గవర్నర్‌కు అప్పగించిన విషయం అర్థమవుతుంది. అసలు ఉమ్మడి రాజధాని ప్రాంత ప్రజల ఆస్తి, ప్రాణ, స్వేచ్ఛ, భద్రత అంటున్నప్పటికీ అంతర్గతంగా ఈ సెక్షన్‌లో సీమాంధ్ర బడాబాబుల ఆస్తుల పరిరక్షణ అనేది ఇమిడి ఉన్నది. తెలంగాణ ఉద్యమ సందర్భంలో హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయాలనే డిమాండ్ ఎందుకు వచ్చిందో ఈ సందర్భంలో తేలిపోతున్నది.

విద్వేషపూరిత నేరాలు (హేట్ క్రైమ్స్) అనే కొత్త పదాన్ని సర్క్యులర్‌లో వాడారు. అసలు తెలంగాణలో ఎక్కడ విద్వేషపూరిత నేరాలు జరిగాయో, సీమాంధ్రులపై ఎక్కడైనా దాడులు జరిగాయో ఎవరికీ తెలియదు. కాని సర్క్యులర్‌లో ఈ పదం వాడి వాటిని నియంత్రించడం కొరకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, ఆ సెల్ గవర్నర్ అదుపాజ్ఞలో ఉంటుందని పేర్కొన్నారు. పోలీస్ సర్వీస్ బోర్డును ఏర్పాటు చేసి అందులోని అధికారుల బదిలీలు, నియామకాలు చేపట్టే అధికారం గవర్నర్‌కు ఇచ్చారు. అంటే గవర్నర్ మరో ప్రభుత్వాన్ని నడుపుతున్నాడన్నమాట. ప్రజల చేత ఎన్నుకోబడని వ్యక్తి రాజ్యాధికారి అయి ప్రభుత్వ పాలన చేస్తాడన్నమాట. అతని నిర్ణయాలే అంతిమం అయి, వాటిని ఎవరూ ప్రశ్నించ వీలులేని విధంగా 8వ సెక్షన్ రాయబడింది.

ఉమ్మడి రాష్ట్రంలో శాంతి భద్రతల నియంత్రణ, దాని పరిపాలనా వ్యవస్థ యావత్తూ గవర్నర్ చేతుల్లోకి పోతుంది. ఉమ్మడి రాజధానిలో పోలీసులను జాయింట్ ఫోర్స్‌గా అంటే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి ఫెయిర్ షేర్ ప్రాతిపదికన నియమిస్తారు. ఈ విధంగా ఉమ్మడి రాజధాని ప్రాంతంలో సీమాంధ్రుల రక్షణను తెలంగాణ పోలీసులు సరిగ్గా చేపట్టరని కాబోలు ఆంధ్ర పోలీసులను కలుపుకోవాలనుకుంటున్నారు.

ఆస్తుల రక్షణ కొరకు హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్‌లు, జిహెచ్ఎంసి కమిషనర్‌లు గ్రీవెన్స్ సెల్స్‌ను ఏర్పాటు చేసి వాటి ద్వారా నష్టదారుల ఆస్తి హక్కును కాపాడాలి. దీనికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర అధికార వ్యవహారాల్లో ప్రత్యక్ష జోక్యం చేసుకునే నిరంకుశ అధికారం గవర్నర్‌కు ఉంటుంది. తద్వారా హైదరాబాద్, దాని చుట్టు పక్కల అక్రమంగా సంపాదించి అనుభవిస్తున్న ఆధిపత్యశక్తుల ప్రయోజనాలకై చంద్రబాబునాయుడు, నరేంద్రమోడీ ఎంతగా తపించిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో అప్పటి వరకు గత ప్రభుత్వాలు చేసిన నిర్ణయాలపై, భూ ఒప్పందాలపై, ఆస్తిపర వ్యవహారాలపై తెలంగాణ ప్రభుత్వం సమీక్షలు గాని, తిరగదోడే ప్రయత్నాలు గాని చేయవద్దనే డిమాండ్ రావడం కొందరికైనా గుర్తుండే ఉంటుంది. ఆ డిమాండ్ ఎందుకొచ్చిందో ఇప్పుడు తెలిసిపోతున్నది. ఆ డిమాండ్‌ను నెరవేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం–2014లోని 8వ సెక్షన్, అలాగే మొన్న కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్‌ల రూపంలో మందుకు వచ్చిందని సులభంగానే తెలుసుకోవచ్చు.

రెండు రాష్ట్రాలు ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా తగు సంఖ్యలో ఉన్నతాధికారులను సమకూర్చడంలో చూపని శ్రద్ధ ఆఘమేఘాల మీద పోలవరంపై ఆర్డినెన్స్, ఆ వెంటనే పార్లమెంట్‌లో చట్టం, అలాగే ఉమ్మడి రాజధానిపై గవర్నర్ అధికారాలను తెలిపే సర్క్యులర్‌లు వెంట వెంటనే వచ్చేస్తాయి. దీని ద్వారా నరేంద్రమోడీ, చంద్రబాబుల మధ్య మైత్రి ఎంత బాగా కుదిరి కొనసాగుతున్నదో తేలిపోతుంది.

పన్నెండు వందలకుపైగా ఆత్మబలిదానాలు, వందల కొద్ది కేసులతో విద్యార్థి ఉద్యమాలు, ఉద్యోగుల సమ్మెలు, ప్రజలు చేసిన ధర్నాలు, ఉద్యమాలు, నిరాహారదీక్షలు, పోరాటాలు చేసింది హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేయడానికా? హైదరాబాద్‌పై గవర్నర్‌కు అధికారాలు కట్టబెట్టి కేంద్ర పరోక్ష, ప్రత్యక్ష పాలనను కొని తెచ్చుకోవడానికా? ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను అవహేళన చేస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం–2014లో 5వ సెక్షన్ (ఉమ్మడి రాజధాని), 8వ సెక్షన్‌లు చేర్చబడ్డాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఆ మాటకొస్తే ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా, కేంద్ర ప్రభుత్వమైనా రాజ్యాంగానికి, చట్టాలకు కట్టుబడి పని చేయాల్సిందే. అలా కానప్పుడు చట్టపర, రాజ్యాంగపర చర్యలు ఉండనే ఉంటాయి. అంతేకాని ప్రత్యేకించి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రజల భద్రత అంటున్నప్పటికీ, ప్రత్యేకించి సీమాంధ్ర ఆధిపత్య శక్తుల అక్రమ ఆస్తుల రక్షణ కోసం గవర్నర్‌కు అధికారాలివ్వడం, సమాంతరంగా మరొక పాలన కొనసాగించే అవకాశం ఇవ్వడం అన్యాయం. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం–2014లో హైదరాబాద్ (జిహెచ్ఎంసి)ను ఉమ్మడి రాజధానిగా పేర్కొంటున్న 5వ సెక్షన్, అలాగే ఉమ్మడి రాజధాని ప్రాంతంపై గవర్నర్ అధికారాలను తెలిపే 8వ సెక్షన్‌ల రద్దు కొరకు ప్రజాఉద్యమం రావల్సి ఉంది. పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లోని 5వ సెక్షన్‌ను రద్దుచేస్తే 8వ సెక్షన్ దానంతట అదే రద్దయిపోతుంది.

(రచయిత ఉపాధ్యాయులు, డిటిఎఫ్ సభ్యులు) వీ

రాబోయే సంచికలలో...

- **పోరాటాలే తెలంగాణ నిర్మాణానికి నాంది - గడ్డం వెంకటరాజం**
- **అస్తిత్వ నిర్మూలనకు పరిహారమేమిస్తారు? - మైపతి అరుణ్‌కుమార్**
- **చేతి వృత్తుల్లో మార్పులు - వి. వెంకట్రావు**
- **తెలంగాణ రాష్ట్రం - పాఠశాల విద్యారంగం - సవాళ్లు - దామెర రాజయ్య**
- **అడవుల ప్రైవేటీకరణ - సహజ వనరుల దోపిడీ - పోతరాజు కట్టయ్య**

తెలంగాణ ప్రభుత్వ విధానాల దిశ ఎటు?

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆరు వారాలుగా ప్రకటిస్తున్న, అమలు చేస్తున్న విధానాల మంచి చెడులను, తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల నేపథ్యంలో విశ్లేషిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

ఏ ఆకాంక్షలతో తెలంగాణ సమాజమంతా ఒక్కతాటిమీదికి వచ్చి పోరాడి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుందో, ఆ ఆకాంక్షలను నెరవేర్చడం తెలంగాణ ప్రభుత్వపు ప్రథమ, పరమ లక్ష్యం కావాలి. ఏ రూపాలలో, ఏ నినాదాలతో వ్యక్తమైనా ఆ ఆకాంక్షలన్నీ స్వయంపాలన, స్వయంనిర్ణయాధికారం, స్వావలంబన, ఆత్మగౌరవం వంటి ఆకాంక్షల వ్యక్తీకరణలేనని మరొకసారి చెప్పుకోవలసి ఉంది. ఆ ఆకాంక్షలన్నిటినీ సాధించడం మంత్రదండం లాగ రాత్రికిరాత్రి సాధ్యం కాకపోవచ్చు. అది దశల వారీగా తక్షణ, మధ్యంతర, దీర్ఘకాలిక స్థాయిలలో, క్రమబద్ధమైన ప్రణాళికారచనతో, కచ్చితమైన అమలుతో జరగవలసి ఉండవచ్చు. కాని ఆ ఉద్యమ ఫలితంగా ఏర్పడిన ప్రభుత్వం చేసే ప్రతిపాదనలు, చేపట్టే చర్యలు కనీసం ఆ దిశలో మొదటి అడుగులుగానైనా ఉండవలసి ఉంటుంది. అలా ఉండాలని ఆశపడిన వారికి, ఉంటాయని ఊహించినవారికి గత ఆరువారాల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు మిశ్రమ స్పందనలు కలిగించేట్టుగా ఉంది.

ఆరు వారాల సమయం తక్కువే కావచ్చు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం విధించిన ఆంక్షలు, రాజ్యాంగ పరిధిలోపల రాష్ట్రప్రభుత్వానికి ఉన్న అవకాశాలు, ఆరు దశాబ్దాలుగా అలవాటయిన పాలనా విధానాలు, పాలనా వ్యవస్థలో నిండిపోయిన అలసత్వం, నిర్లక్ష్యం, అవినీతి, ప్రజల పట్ల చిన్నచూపు, ఉద్యమ క్రమంలో విపరీతంగా పెరిగిన ఆకాంక్షలు, నీళ్లు, నిధులు, నియామకాలతో సహా ప్రతి రంగంలోనూ ప్రజాప్రభుత్వమేదో ఏర్పడబోతున్నట్టు కలిగిన భ్రమలు, సంపూర్ణ అర్థంలో ప్రజానుకూలంగా ఉండలేని పాలకుల వర్గస్వభావం వంటి ఎన్నో పరిమితులు ఉండవచ్చు. అయినా ఉన్న పరిమితుల లోపల కూడ ప్రజాస్వామిక, ప్రజానుకూల పాలన సాగించే అవకాశాన్ని తెలంగాణ రాష్ట్ర సమితి ఉపయోగించుకుంటున్నదా లేదా, ఇన్ని సంవత్సరాల ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడానికి పూనుకుంటున్నదా లేదా అనే ప్రశ్నలు వేయవచ్చు. ఈ ఆరువారాల ప్రకటనలు, ప్రతిపాదనలు, విధానాలు, ఆచరణ రానున్న ఐదు సంవత్సరాల ప్రయాణ దిశను సూచిస్తాయి గనుక వాటిని చర్చించవచ్చు.

దళితులు, ఆదివాసులు, వెనుకబడిన కులాలు, మహిళలు, మైనారిటీలు, వృద్ధులు వంటి అనేక వర్గాలు తెలంగాణ ఏర్పడితే తమ జీవితాలు మెరుగుపడతాయని ఆశపెట్టుకున్నాయి. 'సుఖశాంతుల తెలంగాణ, సుభిక్షమైన తెలంగాణ' అనేది కవితాస్వప్నం మాత్రమే కాదు, 'బంగారు తెలంగాణ' అనీ, 'తెలంగాణ పునర్నిర్మాణం' అనీ, 'నవ తెలంగాణ' అనీ రాజకీయ నాయకత్వం కూడ ఇన్నాళ్లుగా మాట్లాడుతూ వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉండిన ప్రతి అవ్యవస్థనూ తెలంగాణ మార్చివేస్తుందని ఒక అభిప్రాయం బలపడింది. తెలంగాణకు న్యాయమైన వాటాగా రావలసిన సాగునీరు, బడ్జెట్ కేటాయింపులు, ఉద్యోగాలు రాలేదనీ, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అవి వస్తాయనీ ఒక ఆశ విస్తరించింది. ఆ మూడూ జరిగితే వాటితో విద్యావకాశాలు, ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలు, ప్రజారవాణా, విద్యుత్తు, సమాచార సంబంధాలు, రహదారులు వంటి మౌలిక సౌకర్యాల కల్పన జరిగి, గ్రామీణాభివృద్ధికీ, వ్యవసాయాభివృద్ధికీ, పారిశ్రామికాభివృద్ధికీ అవకాశం ఏర్పడి తెలంగాణ సమాజం వికసిస్తుందని ఒక విశ్వాసం ఉద్యమకారుల లోనూ, ప్రజల లోనూ వ్యాపించింది.

కాని ఆ మౌలికమైన మూడు అంశాలలో నీళ్లు, నియామకాలు రెండిటినీ తెలంగాణ ఏర్పాటు ప్రక్రియే కొంతవరకు భగ్నం చేసింది. నీళ్లలో తెలంగాణ కోల్పోయిన వాటా తిరిగి పొందడానికి అదనపు అవకాశాలు ఇవ్వడం జరగలేదు సరిగదా, ఇన్నాళ్లూ జరిగిన నీటి దోపిడీ యథావిధిగా కొనసాగేట్టూ, ఇకముందు కూడ అదే స్థితి ఉండేట్టూ పునర్వ్యవస్థీకరణ చట్ట నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. అలాగే ఆరు దశాబ్దాలలో కోల్పోయిన ఉద్యోగాలను తెలంగాణ తిరిగి సాధించుకోలేని స్థితిని కూడ ఆ చట్టం కల్పించింది. అందువల్ల తెలంగాణ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఈ పరిమితుల లోపల తెలంగాణకు నీటి సౌకర్యం పెంచడం మీద, కొత్త ఉద్యోగ కల్పన మీద ఉండవలసి ఉండింది. ఇక నిధుల విషయంలో, గతంలో కోల్పోయినవి రాబట్టుకోలేకపోయినా, ఇకముందైనా తెలంగాణ నిధులు తెలంగాణలోనే ఖర్చుపెట్టుకునే అవకాశం ఉంది గనుక నిధులనూ, వనరులనూ పెంచుకోవడం, సద్వినియోగం చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకోవాలి.

ఈ ఆరు వారాలలో తెలంగాణ ప్రభుత్వం తరఫున వెలువడుతున్న ప్రకటనలు, స్వయంగా మొదటి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు చాల అంశాలలో ప్రశంసనీయంగా ఉన్నప్పటికీ ఈ మూడు రంగాలలో మాత్రం తగినంత శ్రద్ధ కనబడడం లేదు. ముఖ్యమంత్రితో సహా మంత్రులూ అధికారులూ ఆకర్షణీయమైన, ప్రజానుకూలమైన ప్రకటనలు చేస్తున్నారు గాని గతంలో ఎన్నో ప్రభుత్వాలు, ఎందరో నాయకులు ఇంతే ఆకర్షణీయమైన, ప్రజానుకూలమైన ప్రకటనలు చేసి, వాటిని ఆచరణలోకి తీసుకురాని అనుభవం ఉన్నందువల్ల, ప్రస్తుతం ప్రశంసనీయంగా కనబడుతున్న ప్రతిపాదనలు కూడ ఆచరణ రూపం ధరిస్తాయా అని అనుమానించడానికి ఆస్కారం ఉంది.

ఏ మౌలిక వర్గాల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఆకాంక్ష బలపడిందో, ఆ వర్గాలలో ప్రధానమైన ఆదివాసుల మీద పోలవరం ప్రాజెక్టు రూపంలో అత్యంత దారుణమైన అన్యాయానికి గురిచేసి తెలంగాణ ఏర్పడడం ఒక విషాదం. ముసాయిదా బిల్లులోనే ఈ అంశం ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర సమితి బలంగా వ్యతిరేకించకపోవడం, ఆ బిల్లు చర్చకు వచ్చినప్పుడు పార్లమెంటులో నిరసన తెలపకపోవడం, బిల్లు ఆమోదం పొందాక యుపిఎ ప్రభుత్వమే ఆర్డినెన్సు రూపంలో ఆదివాసుల మీద విస్థాపన దాడి చేసినా తెరాస స్పందించవలసినంతగా స్పందించకపోవడం, అదే ఆర్డినెన్సును ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు నామమాత్రపు బంద్ పిలుపు ఇచ్చి, తానూ ఉన్నానని చూపుకోవడం, చివరికి ఆ ఆర్డినెన్సు

చట్టరూపం ధరించినాక, 'ఇప్పుడేం చేయగలం' అని వైరాగ్యాన్ని ప్రకటించడం ఆదివాసుల పట్ల, తెలంగాణ అభ్యున్నతి పట్ల తెలంగాణ రాష్ట్ర సమితి ద్వంద్వ వైఖరికి అద్దం పడుతున్నాయి.

పోలవరం విషయంలో ఈ క్షమార్హం కాని అలసత్వం ఉన్నప్పటికీ, ఇతర రంగాలలోనైనా తెలంగాణ ఆకాంక్షలను ఎత్తిపట్టడానికి, సాకారం చేయడానికి తెరాస ప్రభుత్వం పూనుకుంటుందని ఆశించినవారు ఎందరో ఉన్నారు. జూన్ 2న ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచీ ముఖ్యమంత్రి స్థాయిలోను, మంత్రుల స్థాయిలోను, అధికారుల స్థాయిలోను కొన్ని పనులు జరుగుతూ వచ్చినా, జూలై 16న రాష్ట్ర మంత్రివర్గం తొలిసారిగా పూర్తి స్థాయి సమావేశం జరిపి 43 నిర్ణయాలు ప్రకటించింది. ఈ నిర్ణయాలలో రైతుల రుణ మాఫీ, తెలంగాణ అమరుల కుటుంబాలకు నగదు సహాయం, ఉద్యోగాలు, ఇళ్లు, వృద్ధులకు, వితంతువులకు పెన్షన్, దళిత, ఆదివాసి యువతులకు వివాహ ఖర్చు సహాయం, ఆదివాసి తండాలకు గ్రామ పంచాయతీల స్థాయి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర స్కేళ్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ఇంక్రిమెంట్, మైనారిటీల సంక్షేమానికి అధ్యయనం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక ట్రిబ్యునల్, గల్ఫ్ ఎన్ఆర్ఐలకు సంక్షేమ నిధి వంటి సంక్షేమ చర్యలు ఉన్నాయి. కల్లు దుకాణాల పునరుద్ధరణ వంటి వృత్తి కులాల సంక్షేమ చర్యలు ఉన్నాయి, రాష్ట్ర పండుగలు, రాష్ట్ర లోగో, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జయశంకర్ పేరు, పివి నరసింహారావు పేరుతో పశువైద్య విశ్వవిద్యాలయం, స్టేట్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు, ఆదివాసుల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు వంటి పాలనాపరమైన ప్రతిపాదనలు ఉన్నాయి. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఫైనాన్షియల్ అసిస్టెన్స్ టు స్టూడెంట్స్ ఆఫ్ తెలంగాణ పథకం వంటి వివాదానికి దారితీసిన ప్రతిపాదనలున్నాయి. 2001 నుంచి తెలంగాణ ఉద్యమ కేసుల ఎత్తివేత అనే ప్రతిపాదన ఉంది గాని నిర్దిష్టంగా జి.వో. వెలువడినప్పుడు గాని వాటిలో మినహాయింపులు ఏమైనా ఉంటాయో లేదో, రాజకీయ నాయకత్వాన్ని కూడ శాసించగల శక్తిని సంతరించుకున్న రాష్ట్ర పోలీసు వ్యవస్థ ఈ ప్రతిపాదనకు అంగీకరిస్తుందో లేదో తెలియదు. భూమిలేని దళిత మహిళలకు మూడెకరాల భూమి అనే ఎన్నికల ప్రణాళిక అంశం మంత్రివర్గ నిర్ణయంలో ఉంది గాని, ఇలా పంపిణీ చేయనున్న భూమి ఎక్కడ ఉందో స్పష్టత లేదు. భూ గరిష్ఠ పరిమితి చట్టాన్ని సక్రమంగా అమలు చేసి రాష్ట్రంలో తోటలు, ప్లాంటేషన్లు, ఫార్మ్ హౌజులు, వ్యవసాయేతర వినియోగం, వగైరా పేర్లతో సీలింగ్ కు మించి భూస్వాముల దగ్గర ఉన్న భూమిని స్వాధీనం చేసుకుంటారా, భూస్వాముల, వ్యవసాయేతర ఆదాయం ఉన్న అనుపస్థిత భూస్వాముల అధీనంలో ఉన్న ఇనాం, వక్ఫ్, దేవుని మాన్యం, బంజరు, పోరంబోకు, అగ్రహారం, చెరువు శికం వంటి భూములు స్వాధీనం చేసుకుంటారా స్పష్టత లేదు, గతంలో కొన్ని ప్రభుత్వాలు మాట్లాడినట్టుగానే భూస్వాముల దగ్గర కొని దళితులకు పంపిణీ చేయడం గురించి తెలంగాణ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టున్నది. సింగిల్ విండో అనుమతులతో ఒక పారిశ్రామిక విధానాన్ని రూపొందించాలనీ, హైదరాబాదును విశ్వనగరంగా తీర్చిదిద్దాలనీ కూడ మంత్రివర్గం నిర్ణయించింది.

తెలంగాణ భౌగోళిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితి వల్ల ఇక్కడ మొట్టమొదటి ప్రాధాన్యత ఇవ్వవలసిన పనులు భూమితో సహా అన్ని ఉత్పత్తి సాధనాల యాజమాన్యంలో అసమానతను, సామాజిక అంతరాలను తొలగించడం. అవి వ్యవస్థ మార్పుతో తప్ప, సుదీర్ఘకాలంలో తప్ప జరగని పనులు అనుకున్నా, ప్రస్తుత పరిధిలోనే చేయగలిగిన నీటిపారుదల సౌకర్యాల కల్పన, గ్రామీణాభివృద్ధి, ప్రాథమిక విద్య, ప్రాథమిక ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం వంటి పనులున్నాయి. ఇవి సక్రమంగా ప్రారంభమైతేనే, వాటి పునాది మీదనే పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగకల్పన, సేవారంగ అభివృద్ధి వైపు చూడవలసి ఉంటుంది. కాని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఈ ప్రాధాన్యతల వరుసను చివరినుంచి ప్రారంభిస్తున్నట్టు కనబడుతున్నది. సేవారంగ ప్రాధాన్యత, ప్రచార ఆర్భాటం ఇబ్బడి ముబ్బడిగా, కటువుగా చెప్పాలంటే చంద్రబాబు నాయుడు పాలనాకాలంలో జరిగినంత వికృతంగానే, సాగుతున్నది. అత్యవసరమైన తొలి ప్రాధాన్యతల విషయంలో పనులు మందకొడిగా సాగుతుండగా, అసలు ప్రారంభం కాకుండా ఉండగా, వాయిదా వేయగలిగిన చివరి ప్రాధాన్యతల పనులు మాత్రం ఆఘమేఘాల మీద జరిగిపోతున్నాయి.

చిన్ననీటి వనరులను, గొలుసు చెరువులను పునరుద్ధరించాలనీ, తెలంగాణ గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి అదే మంచి మార్గమనీ ఉద్యమ క్రమంలో ఎన్నో విశ్లేషణలు, వివరణలు వచ్చి ఉండగా, తెలంగాణ ప్రభుత్వం ఆ విషయమే ఎత్తడం లేదు. కనీసం తొలి మంత్రివర్గ నిర్ణయాలలో అది లేదు. ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు కూడ విఫలమై నీటిపారుదల విషయంలో ఏ పనీ చేయడానికి వీలు లేని స్థితి ఏర్పడింది. ఈ కరవు పరిస్థితి వల్ల గ్రామీణ నిరుద్యోగం మరింత దారుణంగా మారే సూచనలు కనబడుతున్నాయి. కాని గ్రామీణ ప్రాంతాల ఉద్యోగకల్పన గురించి ఎటువంటి ప్రతిపాదనలూ కనబడడం లేదు. పారిశ్రామిక విధాన రూపకల్పన పనులు మాత్రం వేగంగా సాగుతున్నాయి. పారిశ్రామికాభివృద్ధి పట్టణ ప్రాంతాల నిరుద్యోగాన్ని తొలగించడానికి ఉపయోగపడవచ్చు గాని, ఏ నైపుణ్యాలను ఉపయోగించుకునే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాము, ఆ పరిశ్రమలు శ్రమ ఆధారిత పరిశ్రమలా, పెట్టుబడి ఆధారిత పరిశ్రమలా, అవి ఏ స్థాయిలో ఉద్యోగకల్పన చేస్తాయి, ఒకవేళ ఉద్యోగకల్పన చేసినా ఉద్యమ క్రమంలో ఆశలు పెంచుకున్న తెలంగాణ సమాజంలోని నిరుద్యోగ లోకానికి ఉద్యోగాలు కల్పించగలవేనా, లేక మళ్లీ ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగాలు కల్పించేవా, ఆ పరిశ్రమలకు, వ్యాపారాలకు ఇస్తున్న రాయితీల వల్ల వారి ఇబ్బడి ముబ్బడి లాభాలకు మాత్రమే హామీ దొరుకుతుందా, తెలంగాణ సమాజానికి ప్రయోజనం ఉంటుందా వంటి ఎన్నో ప్రశ్నలు వేసుకోవలసి ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకూ మాట్లాడుతున్న పారిశ్రామిక, వ్యాపారాభివృద్ధి ప్రతిపాదనలన్నీ తెలంగాణ సమాజానికి తక్కువ ఉపయోగకరంగానూ, ఆయా పెట్టుబడిదారులకు ఎక్కువ ఉపయోగకరంగానూ ఉన్నాయని చెప్పక తప్పదు.

నూతన పారిశ్రామిక విధానం రూపకల్పనలో రతన్ టాటా, ముఖేశ్ అంబానీ, అనిల్ అంబానీ, అజీమ్ ప్రేమ్‌జీ, ఎన్.ఆర్. నారాయణమూర్తి వంటి దేశీయ బడా, దళారీ పెట్టుబడిదారులు తెలంగాణ ప్రభుత్వానికి మార్గదర్శకత్వం వహిస్తారని జూలై 7న ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఒక ప్రకటన చేశారు. ఈ క్రమంలోనే టాటాలకు చెందిన ఒక విమాన పరికరాల కార్ఖానాకు శంకుస్థాపన చేస్తూ ఆయన టాటాలే తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్ గా పనిచేస్తారని కూడ అన్నారు. తర్వాత అనిల్ అంబానీ, అశోక్ హిందుజా, సికె బిర్లా, ఆనంద్ మహీంద్ర వంటి భారత బడా దళారీ పెట్టుబడిదారీ ప్రతినిధులు ఆయనను కలిశారు.

మరొకవైపు బహుళజాతి సంస్థలకు కూడ అదే రకమైన ఆదరణ దొరుకుతున్నది. స్వీడిష్ ఫర్నిచర్ సంస్థ ఐకియా రు. 600 కోట్ల పెట్టుబడితో దేశంలో తన మొదటి దుకాణాన్ని హైదరాబాదులో ప్రారంభిస్తానని ప్రకటించింది. ఐటిసి రు. 3,500 కోట్ల పెట్టుబడితో తెలంగాణలో కాగితపు పరిశ్రమను ఏర్పాటు చేస్తానని ప్రకటించింది. వేవ్‌రాక్ టెక్‌పార్క్ అనే అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సంస్థ హైదరాబాదులో తన కార్యకలాపాల విస్తరణను, అంటే రెండో భవనం నిర్మిస్తానని ప్రకటించింది.

పారిశ్రామిక, వ్యాపార వర్గాలతో సంబంధాలు ఇలా ఉండగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం ప్రాధాన్యత గత ప్రభుత్వాల కాలంలోలాగనే యథావిధిగా సాగుతున్నది. మైక్రోసాఫ్ట్ ఇండియా చైర్మన్ భాస్కర్ ప్రామాణిక్ ముఖ్యమంత్రిని కలిశారు. అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, కాగ్నిజెంట్, టిసిఎస్ వంటి బహుళజాతి ఐటి సంస్థలన్నీ హైదరాబాదులో తమ కార్యకలాపాలను విస్తరిస్తామని, ఆ విస్తరణతో 40,000 ఉద్యోగాలు వస్తాయని ప్రకటించాయి. రాష్ట్ర విభజనకన్న ముందే కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ లో ప్రకటించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటిఐఆర్) తో ఐదు సంవత్సరాలలో 15 లక్షల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 35 లక్షల మందికి పరోక్ష ఉద్యోగాలు వస్తాయని అంటున్నారు. ఇందులో ఆలోచించవలసిన అంశాలు మూడు ఉన్నాయి. ఒకటి, హైదరాబాద్ ఐటి పరిశ్రమ ఇరవై ఐదు సంవత్సరాలలో ఇప్పటికి మూడు లక్షల ఉద్యోగాలు మాత్రమే సృష్టించగలిగినప్పుడు, ఈ భారీ అంకెలలో విశ్వసనీయత ఎంత? రెండు, ఒకవేళ వాగ్దానం చేస్తున్న ఉద్యోగాలు వస్తాయని అనుకున్నా అవి తెలంగాణ సమాజంలోని నిరుద్యోగాన్ని పోగొట్టగలవా, లేక మళ్లీ ఇతరేతర ప్రాంతాల వారికే ఉద్యోగాలు ఇచ్చి, తెలంగాణ సమాజ ఆర్థిక స్థితిని యథాతథంగానే ఉంచుతాయా? మూడు, ఇన్ని సంస్థలు, ఇన్ని పెట్టుబడులు, ఇన్ని ఎగుమతులు, ఇన్ని లాభాలు వచ్చినప్పటికీ, ఆయా సంస్థలకు ఇవ్వజూపుతున్న పన్నురాయితీల వల్ల, వారికి కల్పించవలసిన మౌలిక సౌకర్యాల వల్ల రాష్ట్ర ఖజానాకు రాబడి ఉంటుందా, ఖర్చే మిగులుతుందా?

ఈ విధానాల కొనసాగింపుగానే ముఖ్యమంత్రి 200 మంది పారిశ్రామిక వేత్తలతో, సిఐఐ, ఫిక్కి, డిక్కి, ఫాప్సి వంటి వ్యాపారవేత్తల సమాఖ్యలతో సమావేశం జరిపి వరాలు ప్రకటించారు. ఆ సమావేశంలో పారిశ్రామిక, వ్యాపారవేత్తలు పన్నులు తగ్గించాలనీ, రాయితీలు ఇవ్వాలనీ, పొరుగు రాష్ట్రాలతో పోటీపడే పన్నుల విధానం ఉండాలనీ, భూమి ధరలు తక్కువగా ఉండేలా చూడాలనీ, విద్యుత్తు సరఫరా మెరుగుపరుస్తామని హామీ ఇవ్వాలనీ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు సులభంగా ఇప్పించాలనీ కోరారు. ఈ కోరికలన్నీ నెరవేరుస్తామని ముఖ్యమంత్రి అంగీకరించారు. సింగపూర్ తరహా పారిశ్రామిక విధానం ఉంటుందనీ, మూడు లక్షల ఎకరాల భూమి పరిశ్రమలకు ఇవ్వడానికి సిద్ధంగా ఉందనీ, త్వరలో భాగస్వామ్య సదస్సు ఏర్పాటు చేసి జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలను, వ్యాపారాలను ఆహ్వానిస్తామనీ అన్నారు. ఈ ప్రకటనలన్నీ గత ప్రభుత్వాల ప్రకటనలనే గుర్తుకు తెస్తున్నాయి గాని తెలంగాణ ఉద్యమ క్రమంలో వెల్లువెత్తిన పారిశ్రామికీకరణ ఆలోచనలను ప్రతిఫలించడం లేదు.

ఎప్పుడైనా పారిశ్రామిక విధానానికి మూడు కీలక ప్రయోజనాలు ఉండాలి. అది స్థానిక వనరులను, స్థానిక ప్రజల ప్రయోజనాల కొరకు వినియోగించగలిగేలా ఉండాలి. అది స్థానిక ఆర్థిక వ్యవస్థ లోకి అదనపు వనరులను ప్రవేశపెట్టి, మొత్తంగా ఆర్థిక వ్యవస్థ బహుముఖ విస్తరణకు అవకాశం ఇవ్వాలి. అది స్థానిక ఉద్యోగకల్పనకు సహకరించి నిరుద్యోగాన్ని పోగొట్టగలగాలి. కాని ఈ దేశంలో వలసవాదంతో మొదలైన, 1947 తర్వాత కొనసాగుతున్న, 1991 తర్వాత వెర్రితలలు వేస్తున్న పారిశ్రామిక విధానం స్థానిక వనరులను కొల్లగొట్టి బహుళజాతి సంస్థలకో, పరాయి ప్రాంతాల సంపన్నులకో అప్పగించడానికి ఉపయోగపడుతున్నది. స్థానిక ఆర్థికవ్యవస్థలోకి అదనపు వనరులను ప్రవేశపెట్టే బదులు, ఈ ఆర్థిక వ్యవస్థ నుంచి ఫలాలను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నది. ఉద్యోగకల్పనకు గోరంత సహకరిస్తూ, కొండంత నిరుద్యోగానికి దారితీస్తున్నది. ఇవాళ తెలంగాణ పారిశ్రామిక విధానపు సూచనలు కూడ తెలంగాణ వనరులను తెలంగాణ ప్రజల అవసరాలు తీర్చే, తెలంగాణలో స్థానిక మార్కెట్ ను పెంపొందించే దిశగా లేవు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలోకి కొద్దిపాటి పెట్టుబడులు ప్రవేశపెడుతున్నట్టు కనబడుతున్నా, అడుగుతున్న రాయితీలు, రానున్న లాభాల దృష్ట్యా చూసినప్పుడు ఇది సంపద తరలించుకుపోవడానికే తప్ప స్థానిక సంపదను పెంచడానికి ఉపయోగ పడదు. ఇక తెలంగాణ నిరుద్యోగ యువకులకు ఉద్యోగం కల్పించాలనే ఉద్దేశం ఎంతగా ఉన్నా, వస్తున్న ఉద్యోగాలకు అవసరమైన అర్హతల, నైపుణ్యాల దృష్ట్యా అవి స్వల్పమాత్రంగానే తెలంగాణ సమాజానికి ఉపయోగపడగలవు.

మరొకవైపు నుంచి చూస్తే, ఇంతకాలమూ నిర్లక్ష్యానికి, వివక్షకు గురైన తెలంగాణ ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపార వర్గాలను ప్రోత్సహించడానికైనా తెలంగాణ పారిశ్రామిక విధానం ఉపయోగపడాలి. మరి ఇప్పటివరకు వెలువడిన ప్రకటనలలో తెలంగాణేతర పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఎర్రతివాచీ పరవడం ఉంది గాని తెలంగాణలో ఔత్సాహిక పారిశ్రామిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం లేదు. నిజానికి ఆరు దశాబ్దాల విధ్వంసం తర్వాత, పారిశ్రామికీకరణ వ్యతిరేక చర్యల తర్వాత ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం తెలంగాణలో ఉన్న ఖనిజ, జల, అటవీ, భూ, మానవ వనరుల మీద ఆధార పడి వికేంద్రీకరణ దృక్పథంతో ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వరంగంలో పరిశ్రమలు స్థాపించడానికి ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది. తెలంగాణ నిరుద్యోగాన్ని తొలగించడానికి, కనీసం తగ్గించడానికి పారిశ్రామిక విధానాన్ని ఒక సాధనంగా వినియోగించవలసి ఉంటుంది. ఇప్పటికే ప్రకటించిన సింగరేణి బొగ్గు ఆధారంగా రామగుండంలో ఎన్‌టిపిసి యాజమాన్యంలో 4000 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రం స్థాపన, సింగరేణిలో కేంద్రం వాటాను కొనుగోలు చేసి, దాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ సంస్థగా మార్చడం, నిజాం షుగర్స్, అజంజాహి మిల్స్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల పునరుద్ధరణ వంటి చర్యలు నిజంగా ఆహ్వానించదగినవి. అదే విధంగా గత రెండు దశాబ్దాలలో ప్రభుత్వాలు మూసివేసిన రిపబ్లిక్ ఫోర్జ్, స్పాంజ్ ఐరన్, ఎపి స్కూటర్స్, ఆల్విన్, ఎచ్ఎంటి, ప్రాగాటూల్స్ వంటి సంస్థలను పునరుద్ధరించడం, ప్రతి జిల్లాకూ కనీసం ఒకటైనా ప్రభుత్వ రంగ ఉత్పాదక పరిశ్రమను ఏర్పాటు చేయడం, జిల్లా పారిశ్రామిక కేంద్రాలను బలోపేతం చేయడం, స్వయం ఉపాధి పరిశ్రమలను, స్థానికులను ప్రోత్సహించే రుణ, పరపతి విధానాలను ప్రకటించడం ఎక్కువగా జరగవలసి ఉంటుంది.

తెలంగాణ ఉద్యమ క్రమం అంతటిలోనూ అంతర్లీనంగా ఉన్న ఆలోచన వికేంద్రీకరణ జరగాలనేది. ఆర్థిక, రాజకీయ, సామాజిక అధికారాలలో కేంద్రీకరణ, గుత్తాధిపత్యం తప్పనిసరిగా ప్రమాదకర ఫలితాలకు దారితీస్తాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆర్థికాధికారాన్ని, పరిశ్రమలను, వ్యాపారాలను హైదరాబాద్ లో కేంద్రీకరించినందువల్ల జరిగిన దుష్పరిణామాలు మన కళ్లముందే ఉన్నాయి. అందువల్లనే తెలంగాణ ఉద్యమం ప్రత్యేక రాష్ట్రంలో వికేంద్రీకృత అభివృద్ధి నమూనాను ఆశించింది. కాని ఈ ఆరు వారాలుగా బ్రాండ్ హైదరాబాద్, హైదరాబాద్ వ్యాపార వైభవం పునరుద్ధరణ, హైదరాబాద్ లో ఐటిఐఆర్, హైదరాబాద్ లో మరి రెండు విమానాశ్రయాలు, హైదరాబాద్ చుట్టూ మరింత విస్తృతమైన రింగ్ రోడ్, విశ్వనగరంగా హైదరాబాద్ వంటి మాటలెన్నో వినబడుతున్నాయి. ఇవన్నీ తెలంగాణ ఉద్యమ ఆశయాలకు వ్యతిరేకమైనవి. కేంద్రీకృత అభివృద్ధి నమూనాకు, అంటే బహుళజాతి సంస్థల అనుకూల, సంపన్న అనుకూల విధానాలకు చిహ్నాలు. ఆ అభివృద్ధి నమూనా వల్ల జరగనున్న పర్యావరణ, సామాజిక, సాంస్కృతిక ప్రమాదాల గురించి ప్రపంచమంతా గగ్గోలు ఎత్తుతున్నది. మళ్లీ తెలంగాణ ఆ మార్గాన్నే చేపట్టడం అనుచితం.

నిజానికి ఈ హైదరాబాద్ ప్రచార ఆర్భాటంలో కొన్ని సాంకేతిక పొరపాట్లు కూడ ఉన్నాయి. జనాభా, పౌరసౌకర్యాలు, మంచినీటి లభ్యత, పారిశుధ్యం, ప్రజారవాణా వంటి ఏ ప్రమాణం ప్రకారం చూసినా హైదరాబాద్ విస్తరణ గురించి పునరాలోచించవలసి ఉంది. అలాగే, హైదరాబాద్‌లో మరో రెండు విమానాశ్రయాలు నిర్మిస్తాం అనే వాగ్దానం మధ్యతరగతికి ఆకర్షణీయంగా వినబడవచ్చు గాని, అది సాధ్యం కాదు. శంషాబాద్ విమానాశ్రయ నిర్మాణ సమయంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జిఎంఆర్) తో అప్పటి కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆ విమానాశ్రయం తెరిచినరోజు నుంచి ఇరవై ఐదు సంవత్సరాల వరకు, 150 కిమీ పరిధిలో మరొక అంతర్జాతీయ, దేశీయ విమానాశ్రయాన్ని అనుమతించడానికి వీలులేదు. ఈ ఒప్పందం మీద సంతకాలు 2004లోనే అయినప్పటికీ, ఆ విమానాశ్రయం 2008లో ప్రారంభమైంది గనుక 2033 వరకు తెలంగాణలో బహుశా ఖమ్మం, ఆదిలాబాద్ లలో తప్ప మరెక్కడా మరొక విమానాశ్రయం నిర్మించడానికి వీలులేదు. నిజానికి పాత ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఇటువంటి అన్యాయమైన ఒప్పందాలన్నిటినీ సమీక్షించి, వాటిలో తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకమైన వాటన్నిటినీ రద్దు చేయడానికి, సవరించడానికి ప్రయత్నించాలని కొంతమందిమి చాలకాలంగా వాదిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం ఈ గత ప్రభుత్వ నిర్ణయాల సమీక్షను ఎన్నికల ప్రణాళికలోనూ చేర్చలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పని ప్రారంభించనూ లేదు.

అలా పాత ప్రభుత్వ నిర్ణయాలు అనవసరమైనవీ, ప్రజావ్యతిరేక మైనవీ, ఆశ్రితులకు దోచిపెట్టడానికే తీసుకున్నవీ అయినప్పుడు వాటిని రద్దు చేయడానికి, సవరించడానికి కొత్త ప్రభుత్వాలకు అధికారం ఉండాలి, ఉంటుంది. విద్యారంగంలో వ్యాపారీకరణకు, అక్రమాలకు రాజమార్గం వేసిన ఫీజుల రియింబర్స్‌మెంట్ విధానాన్ని రద్దు చేయడానికి ఆ అధికారాన్ని వాడుకోవచ్చు. లేదా సమీక్షిస్తున్నానని ప్రకటించి, తాత్కాలికంగా ఆపి ఉండవచ్చు. కాని దానితో సుదూర సంబంధం మాత్రమే ఉన్న స్థానికతను ముందుకు తేవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానో, అనాలోచితంగానో అనవసరమైన వివాదానికి తెర లేపింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అక్రమాలలో అతి ప్రధానమైనవి అక్రమ భూఆక్రమణలు. ప్రత్యేకంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలోను, మొత్తంగా తెలంగాణ జిల్లాలన్నిటా కొన్ని వేల, లక్షల ఎకరాల భూమి అన్యాక్రాంతమై పోయింది. ఈ అన్యాక్రాంతమైన భూములలో ఏదో ఒక ధర చెల్లించి చట్టబద్ధంగా కొనుక్కున్న భూములు కొన్ని ఉండవచ్చు గాని కారుచౌకగా ప్రభుత్వం నుంచి సంపాదించుకున్నవీ, అధికారంతో, దౌర్జన్యంతో కబ్జా చేసినవీ చాల ఎక్కువ. అందువల్ల గత ఆరు దశాబ్దాలలో జరిగిన ప్రతి భూమి రిజిస్ట్రేషన్ నూ సమీక్షించవలసి ఉంది. వాస్తవంగా భూమి ఎవరి స్వాధీనంలో ఉన్నదో, వారి అధీనంలోకి ఎలా వచ్చిందో పరిశీలించవలసి ఉంది. నిజానికి ఆ పని ఒక భారీ కందిరీగల తుట్టెను కదపడమే. ఆ పని ప్రారంభించవలసింది హైదరాబాద్‌లో అతి ప్రధానమైన భూఆక్రమణ అయిన రామోజీ ఫిలిం సిటీ దగ్గర. అంతపని చేయడానికి ఇవాళ్టి పాలకుల వర్గ స్వభావం అనుమతించకపోవచ్చు గాని కనీసం ప్రతీకాత్మకంగా గురుకుల్ ట్రస్ట్, ఎన్ కన్వెన్షన్ భూమి అక్రమ ఆక్రమణ మీద చర్యలు ప్రారంభించారు. వీటిలో ఎన్ కన్వెన్షన్ చర్యలు తీసుకోవలసిన బడా ఆక్రమణదారుల వ్యవహారమే గాని, గురుకుల్ ట్రస్ట్ వాస్తవంగా ఆక్రమించినవారి నుంచి చేతులు మారింది. అసలు దుండగులు ఎప్పుడో మధ్యతరగతి గృహస్తులకు అమ్మేసి పోయారు. ఇప్పుడు ఆ ఇళ్లు కూలగొట్టడం కన్న ముందు ఆ మొదటి ఆక్రమణదారులెవరో, వారికి సహకరించిన రెవెన్యూ అధికారులు, శాసనసభ్యులు, మంత్రులు ఎవరో, వారికి అవకాశం ఇచ్చిన ప్రభుత్వ విధాన నిర్ణయాలు ఏవో తవ్వితీసి వారు ఎంత పెద్దవారైనా తగిన చర్యలు తీసుకోవలసి ఉంది.

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలలో మరొక ప్రధాన అంశం ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణ. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాజ్యాంగబద్ధ హక్కులను అనుభవించలేదు. వాక్ సభా, సంఘనిర్మాణ, భావప్రకటనా స్వాతంత్ర్యాలు తెలంగాణ ప్రజలకు ఎన్నడూ చేరలేదు. ఉద్యమక్రమంలో తెలంగాణ ప్రజలు తెలంగాణ ఏర్పడితే ఈ హక్కుల పునరుద్ధరణ జరుగుతుందని ఆశించారు. కాని పోలీసు రాజ్యం యథావిధిగా అమలు జరుగుతున్నది. ఇన్నాళ్లూ తమ మీద పడిన లాఠీ, తమను చంపిన తుపాకి, తమ గొంతు నొక్కిన చెయ్యి ఆంధ్ర వలసవాదులవని విమర్శించిన తెలంగాణ ప్రజలు ఇకనుంచి ఆ లాఠీ, ఆ తుపాకీ, ఆ చెయ్యి తెలంగాణ వారివేనని సంతోషించడం కన్న గత్యంతరం ఉన్నట్టు కనిపించడం లేదు. ఒక్క కలం పోటుతో రద్దయి ఉండవలసిన తెలంగాణ ఉద్యమ కేసుల ఎత్తివేతకు మీనమేషాలు లెక్కిస్తూ ఇప్పటికి రెండు నెలలయినా వాస్తవ ఎత్తివేత జరగలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఉద్యమ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వద్దని నిరసించిన విద్యార్థి యువకుల అరెస్టులు, అక్రమ నిర్బంధాలు, చిత్రహింసలు కొనసాగాయి. ఆదివాసులను, విప్లవోద్యమ కార్యకర్తలను జైలు నుంచి విడుదల కాగానే గేటు బైట అరెస్టు చేసి, మరొక తప్పుడు కేసు బనాయించే సంప్రదాయం మారలేదు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విధానాన్ని నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థుల మీద పాత రోజులలో లాగనే లాఠీ చార్జిలు జరిగాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), రాడికల్ విద్యార్థి సంఘం, రాడికల్ యువజన సంఘం, రైతుకూలీ సంఘం, సింగరేణి కార్మిక సమాఖ్య, ఆల్ ఇండియా రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్, విప్లవ కార్మిక సమాఖ్యల మీద ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 1992 మేలో మొదటిసారి విధించి, 1995లో ఆరునెలల పాటు, 2004లో ఆరు నెలల పాటు సడలించిన నిషేధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. వీటిలో పార్టీ మీద నిషేధాజ్ఞలను కేంద్ర ప్రభుత్వం కూడ చేసిందనే సాంకేతిక కారణం ఉన్నప్పటికీ మిగిలిన సంస్థల మీదనైతే నిషేధాజ్ఞలు రాష్ట్రపరిధిలోనివే. అలాగే రెవల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ మీద గత సంవత్సరం నిషేధం విధించినది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే. అలాగే జైలుశిక్షలు అనుభవిస్తున్న, ముఖ్యంగా జీవితఖైదు అనుభవిస్తున్న ఖైదీలు తెలంగాణ ప్రభుత్వం తమ పట్ల సానుభూతితో కూడిన వైఖరి అనుసరిస్తుందని ఎదురుచూస్తున్నారు. సాధారణంగా జనవరి 26న, ఆగస్ట్ 15న, అక్టోబర్ 2న ప్రభుత్వం తమను క్షమాభిక్షతో విడుదల చేస్తుందని పాలకుల దయ కోసం పడిగాపులు పడే జీవిత ఖైదీలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడ అటువంటి చరిత్రాత్మక పరిణామం అని, తప్పనిసరిగా కొత్త ప్రభుత్వం క్షమాభిక్ష ఇచ్చి తమను విడుదల చేస్తుందని ఆశించారు. కాని ఇంతవరకు అటువంటి సూచన కూడ కనబడడం లేదు.

మొత్తం మీద తెలంగాణ ఉద్యమ క్రమంలో ప్రజలు కోరుకున్న విశాలమైన ఆకాంక్షలన్నిటినీ నెరవేర్చడానికి ప్రస్తుత ప్రభుత్వానికి ఎటువంటి అవరోధాలు ఉన్నప్పటికీ, రాజ్యాంగ, ప్రజాస్వామిక, తెలంగాణ ప్రజా ఆకాంక్షల పరిధి లోపలే తక్షణమే చేపట్టవలసిన కర్తవ్యాలు ఉన్నాయి. వాటిలో కొన్నిటినైనా ప్రారంభించడం తెలంగాణ ప్రభుత్వ బాధ్యత. ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో అలసత్వం వహించడమే ప్రభుత్వాల ఆనవాయితీ గనుక నిరంతర జాగరూకతతో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం, తమ ఉద్యమ స్ఫూర్తిని ఏ ఒక్క క్షణమూ, ఏ ఒక్క ఆకర్షణీయ, ప్రజారంజక రాజకీయ నాయకుడి కోసమూ వదులుకోకపోవడం ప్రజల బాధ్యత.

(రచయిత వీక్షణం సంపాదకులు)

ప్రత్యేక తెలంగాణలో ప్రజాతంత్ర విద్య

ప్రాథమిక హక్కు అయిన విద్యను కార్పొరేట్ శక్తుల నుంచి విముక్తి చేసి, కొఠారీ కమిషన్ సూచించిన కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని అంటున్నారు బి. రఘుపతి

ఒకదేశం సుభిక్షంగా ఉన్నదని చెప్పాలంటే ఆ దేశ ప్రజలకు సప్రమాణతతో కూడిన సమానమైన విద్య, వైద్యం అందించాలి.

విద్య, ఉద్యోగం, ఉపాధి, నీరు, నిధులలో సమాన అవకాశాలు లేకనే ఆరు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు అనేక పోరాటాలు చేసి చట్టబద్ధమైన భౌగోళిక తెలంగాణను సాధించుకున్నారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా రాబోయే కాలంలో తెలంగాణలో విద్యావకాశాలు ఏ విధంగా ఉండాలి, ఎలాంటి విద్య ప్రజలందరికి అందుబాటులో ఉండాలి అనే దానిపై ఒక కీలక చర్చ తెలంగాణ యావత్ సమాజం చేస్తున్నటువంటి ఈ సందర్భంలో విద్య విధానం గురించి లోతైన చర్చ జరగవలసిన అనివార్యమైన సందర్భం నేడు ఆవిష్కృతమై ఉంది.

సంక్షిప్తంగా విద్య దాని అర్థం, పరిధిని పరిశీలించినట్లయితే ప్రాచీన భారతదేశంలోని రుగ్వేద కాలంలోనే విద్యను ఈ విధంగా నిర్వచించారు. 'మనిషిని స్వావలంబకునిగా, సమోన్నతుడిగా, నిస్వార్థపరుడిగా తయారు చేసేదే విద్య' అని నిర్వచించారు. దీని పరిధిని 'సంపూర్ణ మూర్తిమత్వం కలిగిన వ్యక్తిగా మనిషిని తయారు చేయడం' అని పేర్కొన్నారు. స్వీయ స్వావలంబకుడైన మానవున్ని, పరిపూర్ణతమైన మూర్తిమత్వం గల మానవున్ని తయారు చేయడంలో ప్రస్తుత విద్యా విధానం పూర్తిగా విఫలమైందని చెప్పాలి.

తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సందర్భంలో కెసిఆర్ అనేక సందర్భాల్లో నక్సలైట్ల ఏజెండాయే మా ఏజెండా అని ప్రకటించారు. సమసమాజం ఇరుసుగా గల సోషలిస్టు సమాజంలో విద్యా వ్యవస్థ ఎలా ఉంటుందనే దానిపై మనకు స్పష్టమైన అవగాహన లేదని చెప్పాలి. రష్యా, చైనా వంటి సోషలిస్టు సమాజాలు కొద్ది కాలంలోనే కుప్ప కూలడం వల్ల సోషలిస్టు సమాజంలో విద్యా వ్యవస్థ పరిపూర్ణత ప్రశ్నార్థకంగా మారింది. కానీ ప్రస్తుతం కూడా మనుగడలో ఉన్న క్యూబా లాంటి అతి చిన్న సోషలిస్టు దేశంలో గల విద్యా వ్యవస్థ గురించి బయట సమాజానికి అంతగా సమాచారం లేనప్పటికీ కెజి నుండి పిజి వరకు, అన్ని రకాల సాంకేతిక విద్యలు పూర్తిగా ప్రభుత్వ అధీనంలో ఉండి ఉచితంగా అందిస్తున్నట్లు వివిధ వార్తా పత్రికల కథనాలను బట్టి తెలుస్తుంది. దీనికి నిదర్శనం అత్యల్ప నిష్పత్తిలో 50 మంది పౌరులకు ఒక డాక్టర్ చొప్పున క్యూబా దేశంలో ఉంటే అత్యధిక నిష్పత్తిలో 3,500 మందికి పైగా పౌరులకు ఒక డాక్టర్ చొప్పున భారతదేశం ఉండడం గమనించదగ్గ విషయం. మన దేశంలో మెడిసిన్‌లో పేమెంట్ సీట్లను 25 లక్షల నుండి 50 లక్షల వరకు చెల్లించి విద్యను అభ్యసించిన డాక్టర్లు సంపాదనే ధ్యేయంగా పని చేస్తుంటే, పూర్తిగా ఉచిత విద్యను అందుకున్న క్యూబా డాక్టర్లు ప్రపంచ నలుమూలల్లో ఎలాంటి ప్రకృతి విపత్తు జరిగినా ఉచితంగా సేవలు అందిస్తున్నారు. సోషలిస్టు సమాజంలోని విద్యా విధానం ద్వారా అలవడిన సేవా దృక్పథానికి వ్యక్తిగత సంపాదనే ధ్యేయంగా పనిచేసే డాక్టర్లను తీర్చిదిద్దిన మన విద్యా విధానానికి గల సారుప్యతను అర్థం చేసుకోవచ్చు.

కెసిఆర్ టిఆర్ఎస్ ఎన్నికల మేనిఫేస్టోలో భాగంగా కెజి నుండి పిజి వరకు ఉచిత విద్యను తెలంగాణలో అందిస్తామని ప్రకటించారు. ఇదే సమయంలో కొన్ని ప్రగతిశీల ప్రజా సంఘాలు తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యావకాశాలు – విద్యా విధానం గురించి సదస్సులూ, సమావేశాలూ కూడా నిర్వహిస్తున్నాయి. అందువల్ల 'ప్రత్యేక తెలంగాణలో ప్రజాతంత్ర విద్య' అనే అంశం అనివార్యంగా చర్చనీయాంశం అయింది.

ప్రపంచాన్ని శాసించే పెద్దన్నలాంటి అమెరికా దేశంలో కూడా ప్రైవేట్ విద్య 10 శాతానికి మించి లేదు. అదే క్రమంలో లాటిన్ అమెరికా దేశాల్లో, బ్రిటన్ లాంటి దేశాల్లో విద్య పూర్తిగా ప్రభుత్వ అధీనంలోనే ఉంది. కానీ తెలంగాణలో పాఠశాలలు, కళాశాలల సంఖ్య పరంగా చూసినప్పుడు 65 శాతం ప్రైవేట్ విద్య అమలులో ఉంది.

బిజెపి, కాంగ్రెస్, టిడిపి, టిఆర్ఎస్ నాయకులలో చాలా మందికి ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, సాంకేతిక కళాశాలలు ఉన్నాయి. ఇదే విధంగా మొదటి నుండి తెలంగాణ ఉద్యమంలో భాగమై నిధులు అందిస్తున్న బడా పెట్టుబడిదారులకు కూడా ఈ ప్రైవేట్ విద్యా సంస్థలలో వాటాలున్నాయి. అందువల్ల కెజి నుండి పిజి వరకు ఉచిత విద్యను అందిస్తామంటున్న టిఆర్ఎస్‌తో సహా ఇతర పార్టీ నాయకులందరిని ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రైవేట్ విద్యా వ్యవస్థను ఎలా రద్దు చేస్తారు? ఎలా నిర్దిష్ట కాలపరిమితితో ఈ వ్యవస్థను ప్రభుత్వపరం చేస్తారు? అని నిలదీసి స్పష్టమైన హామీని పొందవలసిన బాధ్యత తెలంగాణ పౌర సమాజం మీద తక్షణ కింకర్తవ్యంగా ఉంది.

భారతదేశంలో మొత్తంగా తెలంగాణ సమాజంలో కూడా నిచ్చెనమెట్ల వంటి అనేక వ్యత్యాసాలతో కూడిన, దొంతరలతో కూడిన వివిధ రకాల విద్యా వ్యవస్థలు అమలులో ఉన్నాయి. కేవలం ప్రభుత్వం నడుపుతున్న పాఠశాలల్లోని వివిధ రకాల విద్యా వ్యవస్థలను గమనించినట్లయితే నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ పాఠశాలలు, బిసి వెల్ఫేర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, సైనిక పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జిల్లా, మండల పరిషత్ పాఠశాలలు ఇవేకాక కస్తూరిబా విద్యాలయాలు, బ్రిడ్జి స్కూల్స్, ఎయిడెడ్ స్కూల్స్, ఈ మధ్యనే ప్రభుత్వం హంగు ఆర్భాటాలతో స్థాపించిన మోడల్ స్కూల్స్

ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో గమనించినట్లయితే కాన్సెప్ట్ స్కూల్స్, ఐఐటి, జెఇఇ, ఫౌండేషన్ స్కూల్స్, ఇ-టెక్నో స్కూల్స్, డిజిటల్ స్కూల్స్, గ్లోబల్ స్కూల్స్, ఇంటర్నేషనల్ స్కూల్స్, సెంట్రల్ పబ్లిక్ స్కూల్ల వంటి అనేక రకాల పాఠశాలలతో కూడిన విద్యా వ్యవస్థ అమలులో ఉంది. వీటిలో విద్యార్థులకు అందించే పుస్తకాలు, యూనిఫామ్‌లు, స్కాలర్‌షిప్‌లు, కాస్మోటిక్ ఛార్జీలు, మెస్ ఛార్జీలు, ట్యూషన్ ఫీజులలో అనేక వ్యత్యాసాలు ఉన్నాయి.

ప్రైవేట్ విద్యా వ్యవస్థలో అయితే మండల స్థాయి పాఠశాలల్లో 1వ తరగతి విద్యార్థికి తల్లితండ్రులు చెల్లించే ఫీజు రు. 10,000 కాగా హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటన్ నగరాల్లో ఎయిర్ కండీషన్డ్ క్యాంపస్ గల పాఠశాలలకు అదే 1వ తరగతికి చెల్లించే ఫీజు లక్షల్లో ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు అందించే మెస్ ఛార్జీల విషయాన్ని పరిశీలించినట్లయితే నవోదయ గురుకులాల్లో మధ్యాహ్న భోజనానికి ఒక్కో విద్యార్థికి రు. 18 చొప్పున, వివిధ సంక్షేమ శాఖ గురుకులాల్లో రు. 12 చొప్పున, అదే జిల్లా పరిషత్ పాఠశాలల్లో రు. 6 చొప్పున అందించబడుతుంది. ఈ విషయం విద్యా వ్యవస్థలో అనేక అంతరాలు ఉన్నాయని రుజువు చేస్తుంది. ఒక దేశం లేదా ఒక రాష్ట్రం తన భావి భారత పౌరులందరికి సమాన అవకాశాలతో కూడిన విద్యను అందించడానికి బదులు ఆంగ్లేయులు వదిలేసిన 'విభజించి పాలించు' అనే పాలసీలోనే ఒక్కోవర్గ విద్యార్థులకు ఒక్కోరకమైన ఖర్చుపెట్టి అసమానతలతో కూడిన విద్యను అందిస్తుంది. ఇది నేటి విద్యా వ్యవస్థ దుస్థితి. ఇక ఆయా పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాల్లో వ్యత్యాసాలను పరిశీలించినట్లయితే ఒక్కోరకమైన యజమాన్యం కలిగిన పాఠశాల వ్యవస్థలో ఒక్కోరకమైన వేతన స్థిరీకరణలు అమలులో ఉన్నవి. ఇవేకాక ప్రైవేట్ సెక్టారులో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాల్లోని వ్యత్యాసాల గురించి, శ్రమ దోపిడి గురించి చెప్పనలవికానిదిగా ఉన్నది.

అవకాశాలలో సమానత్వం లేకనే 60 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమం అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ చివరికి విజయం సాధించింది. చెట్ల కింద లేదా వర్షాలకు కురుస్తున్న పాత భవనాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు ఒకవైపు, బాత్‌రూం నుండి మొదలుకుని డార్మెట్రి, క్లాస్‌రూం వరకు ఎయిర్ కండీషన్డ్ వాతావరణంలో విద్యను అర్జించే విద్యార్థిలోకం మరోవైపు ఉన్న నేటి తెలంగాణ సమాజంలో ఈ అంతరాలను పూరించవలసిన బాధ్యత కూడా తెలంగాణ పునర్నిర్మాణంలో అంతర్భాగమై ఉండాలి.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 ప్రకారం దేశంలోని సంపద ఏ కొద్దిమంది చేతుల్లో పోగుపడకూడదని చాలా స్పష్టంగా తెలియజేస్తుంది. ప్రపంచ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న 'ఆక్స్‌ఫాం' అనే సంస్థ వర్కింగ్ ఫర్ ది ఫ్యూ (కొద్ది మంది కొరకు పనిచేయడం) పేరిట ప్రపంచంలోనే సగం జనాభాకు సమానమైన సంపద కేవలం 85 మంది ట్రిలియనీయర్ల వద్దే పోగుబడి ఉందని తెలియజేసింది. ఇది ఇంకా అనేక లోతైన అంశాలను చర్చిస్తూ భారతదేశంలో అనేక అసమానతలతో కూడిన విద్యా విధానం అమలులో ఉందని చదువు 'కొన' గలిగే వారికి కొనగలిగిన స్థాయిలో విద్య వివిధ ధరలలో అమ్మబడుతుందని విచారాన్ని వ్యక్తం చేసింది. ఇది అంతిమంగా అంతరాలను వ్యతిరేకించే అంతర్గత ఉద్యమాలకు దారి తీస్తుందని హెచ్చరించింది. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో ప్రభుత్వపరమైన విద్య ఉండాలే తప్ప ప్రైవేట్ విద్యా విధానానికి ఆస్కారం లేదు. కానీ 1985 నుండి మొదలుకోని 1990 నుండి వేగవంతంగా అమలవుతున్న ప్రపంచ సరళీకృత ఆర్థిక విధానాలలో భాగంగానే భారతదేశంలో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) ప్రైవేట్ విద్యా విధానం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతుంది. మొదటి దశలో అంగీకారం తెలిపి అమలువుతున్న ఒప్పందాల్లో భాగంగానే ప్రైవేట్ విద్యా విధానం తెరమీదకు వచ్చింది. దీనికి తోడు పాలకుల స్వార్థం, ప్రభుత్వ అధికారుల ఉదాసీనత, అవినీతితో అనేక నిబంధనలకు నీళ్లొదిలి ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ప్రత్యేకించి తెలంగాణలో పుట్టగొడుల్లా పుట్టుకొచ్చాయి. ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న రహస్య ఒప్పందంలో భాగంగానే ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీనం చేసి (ప్రభుత్వం తన వ్యయాన్ని తగ్గించుకోవాలి అనే నిబంధన) ప్రైవేట్ విద్యా వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. 19 (1) జి అధికరణ భారతదేశంలో పౌరులు ఏ వృత్తినైనా ఆచరించవచ్చు అని తెలియజేస్తున్నప్పటికి ప్రాణాధారమైన నీరు, మూర్తిమత్వాన్ని అందించే విద్యను ప్రైవేట్ వృత్తిగా ఆచరించడం ప్రశ్నించదగ్గ విషయం.

కానీ భారత ప్రభుత్వం 'విద్యా హక్కు చట్టం-2009'ని తీసుకువచ్చి విద్యను ఒక హక్కుగా గుర్తించారు కదా అని పాలకలు ప్రశ్నించవచ్చు. ఈ చట్టం 2010 ఏప్రిల్ 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది. అంటే భారతదేశానికి స్వతంత్రం వచ్చిన 67 సంవత్సరాలకు గాని విద్యను భారత పాలకులు ఒక హక్కుగా మలచలేక పోయారు.

కానీ ఈ విద్యా హక్కు చట్టంలో కూడా వివాదస్పదమైన కొన్ని లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-45, 14 సంవత్సరాల లోపు పిల్లలందరికి కుల, మత, వర్గ, లింగ రహితంగా ఉచిత నిర్బంధ విద్యను అందించాలని తెలియజేస్తుంది. కానీ మన పాలకులు 86వ రాజ్యాంగ సవరణ ద్వారా, విద్యా హక్కు చట్టంలోని 21 (ఎ) సెక్షన్ ప్రకారం 6-14 సంవత్సరాల బాలబాలికల కొరకు మాత్రమే విద్యా విషయంలో హామీనిస్తుందని పేర్కొన్నారు. అనగా ప్రభుత్వం 3-6 సంవత్సరాల వయసు గల పిల్లలకు సంబంధించిన పూర్వ ప్రాథమిక విద్య నుండి పూర్తిగా వైదొలిగింది. కేవలం ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం ద్వారా సెకండరీ, ఉన్నత, సాంకేతిక కళాశాలలకు అవసరమైన ముడి సరుకులను అందించే ప్రధానమైన వ్యాపార సూత్రంగా ఇది ఇమిడి ఉంది. విద్యాహక్కు చట్టం-2009లోని కొన్ని ముఖ్యంశాలను పొందుపరిచారు. అందులో ఉపాధ్యాయుల అర్హతలు, పాఠశాలల కనీస నిబంధనలు, డొనేషన్, క్యాపిటేషన్ ఫీజుల రద్దు, ప్రవేశపరీక్షలు, ఇంటర్వ్యూల రద్దు వీటితో పాటు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదపిల్లలకు కేటాయించేటట్లు, దీనికి అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 65, 35 నిష్పత్తిలో (విద్యా హక్కు ఉమ్మడి జాబితాలో ఉన్నందున) ఫీజులను చెల్లించేటట్లు పొందుపరిచారు. అంటే ప్రభుత్వ పాఠశాలలను బలహీనం చేయడంతో పాటు ప్రభుత్వమే ప్రైవేట్ విద్యా రంగానికి మద్దతునిస్తూ ప్రోత్సహించే విధంగా ఉంది. అందువల్ల విద్యా హక్కు చట్టం మరింత అంతరాలను పెంచే లోపభూయిష్ఠమైనదిగా ఉంది.

అయితే మరి పరిష్కారం ఏమిటి? ప్రత్యేక తెలంగాణలో

అసమానతలు లేని సర్వజనీన విద్యా విధానం అమలుకు ప్రాతిపాదిక మార్గదర్శకం ఏమిటి? దీనికి పరిష్కారం 1963-64 సంవత్సరంలో డా. సి.ఎస్. కొటారీ సూచించిన 'కామన్ స్కూల్' విద్యా విధానమే ప్రామాణికంగా గల ఏకైక పరిష్కారం. ఒక ఆవాస ప్రాంతం లేదా గ్రామంలోని బడీడు వయసు గల పిల్లలు ఆ ఆవాస ప్రాంతంలో గల ఏకైక పాఠశాలలో కుల, మత, వర్గ, లింగ రహితంగా ఏ వివక్షత లేని సప్రమాణతతో కూడిన సమానమైన పూర్తి ఉచిత విద్యను అభ్యసించాలని కామన్ స్కూల్ విద్యా విధానం తెలియజేస్తుంది. తద్వారా ఆ గ్రామంలో గల పేద, ధనిక వర్గాల పిల్లలు, నిమ్న, అగ్రజాతి వర్ణాల పిల్లలు ఒకే రకమైన విద్యను అభ్యసించడం వల్ల వారిలో క్రమంగా వివక్షత, ఆధిపత్య భావజాలం తగ్గిపోయి సమానత్వ భావన ప్రోది చేసుకుంటుంది. దీనికోసం ఇప్పటికే 13 ప్రజా సంఘాలకు పైగా ప్రగతిశీల శక్తులు 18 రాష్ట్రాలలో అనుసంధానమై 'సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ' పేరుతో రాష్ట్ర, కేంద్రస్థాయిలో ఉద్యమిస్తున్నాయి. ఇవి ఇప్పటికే కొంత ప్రగతిని సాధించి 'చెన్నై ప్రకటన' (జూన్ 30-31, 2012) చేసి ఉంది. ఈ ప్రయత్నంలో తమిళనాడు రాష్ట్రం కొంత ముందంజలో ఉందని చెప్పవచ్చు.

గత సంవత్సరం అనగా 2013 అక్టోబర్ 21న ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో అఖిల భారత విద్యా పరిరక్షణ ఫోరం (సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ) ఆధ్వర్యంలో 18 రాష్ట్రాల నుండి వచ్చిన కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజాస్వామిక వాదులు, దళిత బహుజన సంఘాలు, విద్యాభిమానులు పాల్గొని రామ్‌లీలా మైదానం నుండి పార్లమెంట్ స్ట్రీట్ వరకు 3000 పైగా జనం ఒక మార్చ్ నిర్వహించారు.

2011 జనాభా లెక్కల ప్రకారం మన రాష్ట్ర అక్షరాస్యత 65 శాతానికి మించి లేదు. స్వతంత్రం వచ్చి 60 సంవత్సరాలు అయిన ఇంకా 100 శాతం అక్షరాస్యత సాధించలేకపోయాం. స్వతంత్రం వచ్చిన 5 సంవత్సరాలలోనే 100 శాతం అక్షరాస్యత సాధించిన సింగపూర్ లాంటి దేశాలెన్నో మనకు నిదర్శనంగా ఉన్నాయి. అందువల్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఒక స్వతంత్ర స్వావలంబనగా మనం భావిస్తున్నాం కాబట్టి వచ్చే 5 సంవత్సరాలలోనే ఎలాంటి డ్రాపౌట్స్ లేని 100 శాతం నిలుపుదల కలిగిన అక్షరాస్యత సాధించడం, ప్రైవేట్ విద్యా రంగాన్ని పూర్తిస్థాయి ప్రభుత్వ విద్యా రంగంగా మార్చి వేయుడానికి రాబోయే పాలకులు ఈ కింది చర్యలు చేపడతామని నిర్దిష్ట కాలపరిమితితో కూడిన స్పష్టమైన హామీలు ఇవ్వాలి.

1) కొఠారీ కమిషన్ సూచించిన 'కామన్ స్కూల్' విద్యా విధానాన్ని తక్షణమే పటిష్ఠంగా అమలు చేయాలి. దీనికోసం సేవ్ ఎడ్యుకేషన్ కమిటీలోని నిపుణులతో ఒక కార్యచరణ కమిటీని వేయాలి.

2) లాటిన్ అమెరికా దేశాల్లోలాగా విద్య 100 శాతం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి. అనగా ఎలాంటి ఫీజులు లేని బడులను ఏర్పాటు చేయాలి.

3) వివిధ యజమన్యాల కింద వివిధ పేర్లతో పిలుస్తున్న పాఠశాలలన్నింటిని ఒకే గొడుగు కిందికి తెచ్చి ప్రభుత్వాధీనంలో కొనసాగించాలి.

4) విద్యను ఉమ్మడి జాబితా నుండి తప్పించి రాష్ట్ర జాబితాలో చేర్చి రాజ్యాంగం సూచించినట్లు 6 శాతం నిధులను కేటాయించాలి. (ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా 6 శాతం నిధులను కేటాయించలేదు. గరిష్ఠంగా జనతా సర్కార్ 2.8 శాతం నిధులను మాత్రమే కేటాయించింది)

5) ఇప్పటికే తెలంగాణలో ఇంటర్‌మీడియట్ విద్యను శాసిస్తున్న బడా కార్పొరేట్ కళాశాలలను, పాఠశాలలను శాసనసభలో చట్టం చేసి వాటన్నింటిని వెంటనే ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలి.

6) ఇప్పటికే యజమానులుగా ఉన్న వారికి వాటి ఆస్తుల నిజ విలువ ప్రకారం భరణాలు చెల్లించి వారినే ప్రభుత్వ పర్యవేక్షకులుగా నియమించాలి.

7) తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, మంచినీటి వసతి, గ్రంథాలయం, కంప్యూటర్, సైన్స్‌ల్యాబ్‌లు, ఆట స్థలాలను అన్ని పాఠశాలలకు కల్పించాలి.

8) స్టాఫ్ ప్యాటర్న్ ప్రకారం అన్ని రకాల పోస్టులను మంజూరు చేయాలి.

9) పని చేస్తున్న ఉపాధ్యాయులందరికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన వేతనాలు చెల్లించాలి.

10) ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలలో, కళాశాలలో పని చేస్తున్న సిబ్బంది అర్హతలను బట్టి ప్రత్యేకమైన ఉద్యోగ నియామక పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

11) సర్వీసు నిబంధనలను ఏర్పర్చి పని చేయని ఉపాధ్యాయులపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేసి పని చేసేలా చేయాలి.

12) ఆయా పాఠశాలల, కళాశాలల నుంచి జాతీయ, అంతర్జాతీయ పరీక్షల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ ఆధారంగా పాఠశాలలకు గుర్తింపు స్టార్లను, ప్రోత్సహకాలను అందించాలి.

13) విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు స్నాక్స్, పౌష్టికాహారాన్ని అందించాలి. గిరిజనుల అవసరాలకు అనుగుణంగా రెసిడెన్సియల్ విద్యను అందించాలి.

14) మత సంస్థలు నడుపుతున్న పాఠశాలలను లౌకిక విద్యనందించే పాఠశాలలుగా తీర్చిదిద్ది మత బేధాలను తొలగించాలి.

15) మార్కెట్ అవసరాలు తీర్చే ఆంగ్ల విద్యనే కాకుండా మాతృ భాషలో విద్యా విధానం ఉండి స్థాయి కనుగుణంగా ఆంగ్ల, ఇతర మాధ్యమాలు నేర్చుకునే విధంగా విద్యా విధానం ఉండాలి.

ఎలాంటి ఫీజులు లేని విద్యా వ్యవస్థను నెలకొల్పడం ద్వారా నిజమైన ప్రజాస్వామ్యయుతమైన భావితరపు బంగారు తెలంగాణను రూపొందించుకోవాలి.

మన కళ్లముందున్న తెలంగాణ పోరాట చరిత్ర మనకు అనేక గుణపాఠాలను నేర్పింది. ఎలాంటి ఫీజులు లేని 100 శాతం ప్రభుత్వ అధీనంలో గల సమానమైన విద్యా వ్యవస్థను రాబోయే పాలకులు బంగారం పళ్లెంలో పెట్టి ఇస్తారనుకోవడం పగటి కళ. కేవలం సంఘటిత సుదీర్ఘ, అవిశ్రాంత, ఐక్యత, త్యాగాలతో కూడిన ప్రజా పోరాటాల ఫలితంగానే ఇది సాధ్యమవుతుంది. కాబట్టి తెలంగాణలోని విద్యార్థులు, ఉద్యోగులు, దళిత బహుజన సంఘాలు, ప్రగతిశీల శక్తులు, దేశభక్తయుత పౌరులు, విద్యాభిమానులందరు ప్రస్తుతం ఉన్న విద్యా విధానాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించి వేసి ప్రత్యేక తెలంగాణలో ప్రజాతంత్ర విద్యకై పోరాటం చేయాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. వీ

(రచయిత ఉపాధ్యాయుడు, డిటిఎఫ్ నాయకులు)

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు నిల్

ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన ఫీజ్ రియింబర్స్‌మెంట్ పథకం నేడు ప్రభుత్వ కళాశాలల మూసివేతకు కారణమవుతోందనీ, అది ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలకు కాసుల వర్షం కురిపిస్తోందనీ అంటున్నారు **రావుల రాజేశం**

'కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందట' అనే విధంగా ఉంది ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిస్థితి. పి.ఎచ్‌డి, నెట్, సెట్ వంటి యోగ్యతా పరీక్షలలో ఉత్తీర్ణులై 20 నుండి 30 సంవత్సరాల విశేష బోధన అనుభవం గల సర్కారు డిగ్రీ లెక్చరర్లు ఉన్న కళాశాలలు 2014-15 విద్యా సంవత్సరంలో విద్యార్థులు రాక అడ్మిషన్లు లేక బోసిపోతున్నాయి.

ప్రతీ సంవత్సరం తెలంగాణలోని పది జిల్లాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలు పరీక్షల ఫలితాలలో ఉత్తమస్థానం సాధిస్తూ, గ్రామీణస్థాయి విద్యార్థులకు చుక్కాని వలె, మార్గదర్శి వలె ఉంటున్నాయి. ప్రతి జిల్లాలోనూ సుమారు 10 నుండి 12 వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. న్యాక్ గ్రేడ్‌తో పాటు నిరుద్యోగుల పాలిట కల్పతరువైన జవహార్ నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ప్రతి ఏటా వేలాది మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ద్వారా పొందుతున్నారు. వ్యాయామ విద్యకు సంబంధించి లక్షలాది రూపాయలతో నిర్మించిన ఫిజికల్ ఎడుకేషన్ ల్యాబ్‌లు, విద్యార్థుల జీవితాలకు వెలుగురేఖలు ప్రసరిస్తున్నాయి.

అలాగే లక్షలాది పుస్తకాలతో గ్రంథాలయాలు సర్కారు డిగ్రీ కళాశాలల్లో జ్ఞానజ్యోతులను వెలిగిస్తున్నాయి. సువిశాలమైన సైన్స్ ప్రయోగశాలలు విద్యార్థుల జీవితాలతో చక్కని శాస్త్రీయ జ్ఞానాన్ని అందిస్తున్నాయి. అలాగే భాషా నైపుణ్యాలను ఇనుమడింపచేసి గ్రామీణ పేద విద్యార్థుల జీవితాలలో కంప్యూటర్ వెలుగులను ప్రసరింప చేయడానికి లాంగ్వేజ్ ల్యాబ్‌లు ఒక్క సర్కారు డిగ్రీ కళాశాలలో మాత్రమే ఉన్నాయి. లాంగ్వేజ్ ల్యాబ్ ద్వారా సర్కారు డిగ్రీ కళాశాల విద్యార్థులు, తమ భాషా, ఉచ్చారణ నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. మహిళల జీవితాలలో వెలుగు రేఖలు ప్రసరింపచేసే ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కూడా సర్కారు డిగ్రీ కళాశాలలో చక్కగా పనిచేస్తున్నాయి. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని, కళలను బయటకు తీయడానికి శ్రవణ, పఠన, లేఖన, భాషన నైపుణ్యాలను కూడా సర్కారు కళాశాలలు అందిస్తున్నాయి. గ్రూపు-1 తో సహా బ్యాంక్, రైల్వే, పోలీస్ తదితర ఉద్యోగాలు జవహార్ నాలెడ్జ్ కేంద్రాల ద్వారా కోచింగ్ పొంది నిరుద్యోగులు ఉద్యోగాలను పొందుతూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నారు. అయితే ఇన్ని గొప్పతనాలు ఉన్న తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు లేక మూతపడే పరిస్థితులు ఉన్నాయి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కొంప ముంచిన ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం

2006 వరకు మెరిట్ విద్యార్థులకు మాత్రమే సీట్లు కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల వెంట చెప్పులు అరిగేలా తిరిగే విద్యార్థులు 2014-15 విద్యా సంవత్సరంలో రమ్మని బతిమిలాడితే కూడా రానురాను అంటూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు పారిపోతున్నారు. సర్కారు డిగ్రీ కళాశాలల కన్నా ఎక్కువ ఎలాంటి అర్హతలు లేకపోయిన 2006 సంవత్సరంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పుణ్యామా అని ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం ప్రైవేట్ కళాశాలలను బతికించింది, సర్కారు డిగ్రీ కళాశాలలను చంపేసింది.

గతంలో మెరిట్ గల విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం స్కాలర్‌షిప్ ఇచ్చేది. కాని ఇప్పుడు విద్యార్థికి స్కాలర్‌షిప్‌ను ఇవ్వడంతో పాటు ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలకు ఒక్కొక్క విద్యార్థికి 10 వేల నుండి 20 వేల రూపాయల వరకు ఫీజు రియంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందించడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దు ప్రైవేట్ డిగ్రీ కళాశాల చదువు ముద్దు అనే చందంగా విద్యార్థులు తయారయ్యారు. యూనివర్సిటీ అధికారులు కూడా అవసరం లేకపోయినా తగినంత మంది విద్యార్థులు లేకపోయినా లంచాలు తీసుకొని అడ్డగోలుగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు అనుమతులిస్తూ విద్యా ప్రైవేటీకరణకు బాటలు వేస్తున్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాల యజమాన్యాలకు ఏటా 30 లక్షల నుంచి ఒక కోటి రూపాయల వరకు ఫీజు రియంబర్స్‌మెంట్ జమవుతుండడంతో ప్రైవేట్ విద్యా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. మెరిట్ విద్యార్థులకు లిమిటెడ్ సీట్లకు విద్యా ప్రోత్సాహకాలిస్తే ఎవరికి నష్టం ఏమి లేదు. ఉచిత విద్యను అందిస్తామని చెపుతూ నైపుణ్యం లేని బోధకులతో అరకొర వసతులతో రాజకీయ నాయకుల అండదండలతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను అడ్డగోలుగా తెచ్చుకుంటున్నారు.

ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం రాక ముందు కార్పొరేట్ బిల్డింగులను తలదన్నే విధంగా ఏ యజమాని కూడా బహుళ అంతస్తుల భవనాలను నిర్మించలేదు. ఇప్పుడు నిర్మిస్తున్నారంటే అది ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం వల్లనే అని ఏ ప్రైవేట్ డిగ్రీ కళాశాల యజమానిని అడిగినా చెపుతారు. ఈ ఫీజు రియంబర్స్‌మెంట్ వల్ల విద్యార్థికి వచ్చే లాభం ఏమి లేదు, కానీ ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌కు కాసుల పంట పండుతుంది. ఫ్యాకల్టీకి కూడా పెద్దగా ఒరిగిందేమి లేదు. రాజకీయ నాయకులు, యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్స్, విద్యారంగ మేధావులు అవసరాన్ని మించి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను మంజూరు చేసి విద్యారంగాన్ని భ్రష్టుపట్టించడంతో పాటు విద్యార్థులను క్యాన్‌వాసింగ్ పేరిట ప్రలోభాలకు గురిచేస్తున్నారు.

ఇంటర్ పాసైన విద్యార్థి ఇంటికి డిగ్రీ కళాశాల యజమాన్యాలు చీమలదండు వలె లైను కడుతున్నారు. మరికొన్ని యజమాన్యాలైతే పిల్లవాని తండ్రికి మందు కోసం రెండు వేల రూపాయల నగదు బహుమతి, పిల్లావాని తల్లికి పట్టు చీర కోసం నగదు బహుమతి విద్యార్థికి ఉచిత బస్‌పాస్‌తో పాటు సంవత్సరానికి 5 వేల నగదు రూపాయలు చెల్లిస్తామంటూ రాజకీయ నాయకుల ఎన్నికల ప్రచారం వలె వాగ్దానాలు

న్యాయమూర్తుల నియామకాలపై మోడీ ప్రభావం

భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల విషయంలో మోడీ అవలంబిస్తున్న తీరు న్యాయవ్యవస్థకే చేటు తెస్తుందనీ, అది న్యాయవ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందనీ అంటున్నారు **చిమ్మె జాన్ బర్నబస్**

భారతదేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోనే న్యాయ మూర్తుల నియామక ప్రక్రియ వివాదాంశమైంది. నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెల రోజులు కూడా కాకముందే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తలదూర్చి, 'తమ'కు వ్యతిరేక మైన వారిని చేర్చుకోవడం లేదనే విషయాన్ని బహిరంగ పరిచారు (కేంద్ర ప్రభుత్వం).

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 నుంచి 147 వరకూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకు సంబంధించిన విషయాలన్నీ వివరించబడ్డాయి. అందులో ఆర్టికల్ 127 సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించినది. భారత రాష్ట్రపతి దృష్టిలో న్యాయ కోవిదుడైనా లేదా ఏదేని హైకోర్టులో గానీ లేదా సుప్రీంకోర్టులో గానీ 10 సంవత్సరాల న్యాయవాద వృత్తి చేపట్టిన వారైనప్పటికి ఆ పదవికి అర్హులుగా పేర్కొనబడింది. అనగా వారు న్యాయమూర్తులుగా ఉండవలసిన అవసరం లేదు.

2014 జూన్ 25న భారత రాష్ట్రపతి ముగ్గురిని భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాడు. వారు కలకత్తా ప్రధాన న్యాయమూర్తి అరుణ్ మిశ్రా, ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎకె. గోయల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రోహింటన్ నారీమన్ (ముంబాయికి చెందినవారు). సీనియర్ న్యాయవాది అనగా 15 సంవత్సరాలు న్యాయవాద వృత్తిలో ఏదేని హైకోర్టులో గానీ, సుప్రీంకోర్టు లో గానీ బాగా రాణించినవారని అర్థం. అంతేగానీ వయసుతో నిమిత్తం లేదు. అయితే భారత సుప్రీంకోర్టు మాజీ సొలిసిటర్ జనరల్ గోపాల్ సుబ్రమణ్యంను సుప్రీంకోర్టు 'కొలీజియం' సూచించినప్పటికీ ఆయన పేరు కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ తిరస్కరించడంతో గోపాల్ సుబ్రమణ్యం పేరును రాష్ట్రపతి ఆమోదించలేదు. గోపాల్ సుబ్రమణ్యం పేరును కేంద్ర ప్రభుత్వం తిరస్కరించడానికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా, సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులోనూ, ఇష్రాత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసులోనూ గుజరాత్ ప్రభుత్వాన్ని దోషిగా చేసి, అక్కడి హోంమంత్రి అమిత్‌షాను ప్రధాన నిందితునిగా చేయడంలో అప్పటి కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా గోపాల్ సుబ్రమణ్యం తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాడు. అవి బూటకపు ఎన్‌కౌంటర్లని నిరూపించడంలో కుటుంబ సభ్యులకు పూర్తిగా సహకరించాడు. ఇప్పుడు కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నది కాబట్టి, వారిని గతంలో ఇబ్బందులు పెట్టినవారిని, ఏ విధంగా కక్ష తీర్చుకోవాలనే ప్రయత్నంలో భాగంగానే గోపాల్ సుబ్రమణ్యంని న్యాయమూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు.

మనకు అర్థమవుతున్నదేమంటే, కేంద్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారికి అనుకూలమైన వారిని, అనగా వారు వివిధ రాష్ట్రాల ప్రధాన న్యాయమూర్తులైనప్పటికినీ లేదా కేంద్రంలోని ప్రభుత్వ న్యాయవాదులైనప్పటికినీ 'న్యాయమూర్తులు'గా సుప్రీంకోర్టుకు నియమించడానికి అర్హులు కారనేది నిర్వివాదాంశం. ఇది పూర్తిగా భారత రాజ్యాంగ ప్రమాణాలకూ, విలువలకూ విరుద్ధమైన ప్పటికీ, రాజ్యాంగ నియమావళి ప్రకారం, రాష్ట్రపతి ఆమోదం పొందవలసి ఉంటుంది. కాబట్టి, ఏ నియామకమైనా కేంద్ర ప్రభుత్వ సిఫారసు అవసరం కనుక కేంద్రంలో ఎవరు అధికారంలో ఉంటే వారి తాత్వికత (ఫిలాసఫీ)ని ఆమోదించేవారే దాదాపుగా నియమించబడతారు అనేది సుస్పష్టం.

అయితే గతంలో ఈ విధంగా జరగలేదా? అంటే ఆ పరిస్థితులలో అప్పటి ప్రభుత్వ అనుకూలురు నియమించబడినారు కానీ, బూటకపు ఎన్‌కౌంటర్లను నిరూపించిన న్యాయవాదులు, ఎంత నిష్ణాతులైనప్పటికీ, ఈ విధంగా మొదట సుప్రీంకోర్టు కొలీజియం (నియామకపు అత్యున్నత సంఘం – ఇందులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటుగా నలుగురు సీనియర్ న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు) చేత రెకమెండ్ చేయబడిన తరువాత తిరస్కరణకు గురైన సందర్భాలు చాలా అరుదు. దీనిని ప్రస్తుత కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వశాఖను నిర్వహిస్తున్న

చేస్తున్నారు. ఇంత పెద్దస్థాయిలో అడ్మిషన్ల ప్రచారం గ్రామాలలో హోరెత్తి పోవడంతో అన్ని వసతులు ఉన్న సర్కారు డిగ్రీ కళాశాలలకు అడ్మిషన్లు రావడంలేదు.

తెలంగాణలోని డిగ్రీ కళాశాలల అధ్యాపకులు కళాశాలలను కాపాడుకోవడానికి ఫ్లెక్సీల ప్రచారంతో పాటు, కరపత్రాలతో గ్రామాలలో ప్రచారాలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రైవేట్‌వారు చూపిస్తున్న ఎరలు, ప్రలోభాల ఎదుట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు చిత్తయి పోతున్నారు. కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని చెతుపున్న ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను బతికించడానికి సరికొత్త వ్యూహాన్ని అనుసరించాల్సింది. ప్రభుత్వం స్పందిచకపోతే ఒకటి రెండు సంవత్సరాలలో ప్రభుత్వ కళాశాలలు పాడుబడ్డ బంగ్లాలుగా మారి నామరూపాల్లేకుండా పోయే అవకాశాలున్నాయి.

తెలంగాణ ప్రజల నుండి వసూలైన నిధులను తెలంగాణ ప్రజల అభివృద్ధికి కెటాయించాల్సి ఉండగా కొన్ని కళాశాలల యజమానులకు కల్పతరువుగా మారిన డిగ్రీ ఫీజు రియంబర్స్‌మెంట్ పథకంపై తెలంగాణ ప్రభుత్వం పున:సమీక్ష నిర్వహించాలని పలువురు మేధావులూ, అధ్యాపకులూ, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ కోరుతున్నారు.

(రచయిత ఉపాధ్యాయులు)

వీ

సుప్రీంకోర్టు మరో సీనియర్ న్యాయవాది అయిన రవిశంకర్ ప్రసాద్ ఖండించకపోవడం ఆ విషయం వెనుక ఆయన ప్రమేయమున్నదనేది సుస్పష్టం. మరో విషయం ఏమంటే అమిత్‌షా తరపున, అతనికి సహకరించిన గుజరాత్ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల తరపున కూడా సుప్రీంకోర్టులో వాదించినది ఈ రవిశంకర్ ప్రసాద్ గారే. అనగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నన్నాళ్లు న్యాయం, ధర్మం, సమన్యాయం, సుపరిపాలన, రాజ్యాంగ విలువల – రాజ్యాంగ ప్రమాణాల ఆధారంగా ఉండవనేది స్పష్టం అవుతోంది. ఒక్క గోపాల్ సుబ్రమణ్యం విషయంలోనే కాదు – రాబోయే కాలంలో ఇలాంటి పనులు ఎన్ని చూడవలసి వస్తుందోమరి. వారి ఆలోచనంతా భారతీయ జనతా పార్టీ అనుకూల వర్గాల వారిని ప్రధానమైన, కీలకమైన స్థానాలతో నియమించుకోవడం.

సుప్రీంకోర్టు కొలేజియం ప్రాధాన్యత – సాధికారత

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలు ఈ విధంగా వివిధ రాజకీయ పక్షాల, రాజకీయ ప్రోద్బలంతో జరుగుతున్నవనే ఉద్దేశంతో సుప్రీంకోర్టు కొలేజియంను ఏర్పాటు చేశారు. ఈ కొలేజియం ఏర్పాటుకు ఒక చారిత్రక నేపథ్యమున్నది. 1981 డిసెంబర్ 30న ఎస్.పి. గుప్తా కేసులో సుప్రీంకోర్టు కొన్ని వ్యాఖ్యానాలు చేసింది. అది ఏమనగా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన రెకమెండేషన్స్‌నూ, ప్రైమసీ (మూలం) ని న్యాయమూర్తుల నియామకాలలో గానీ లేదా ట్రాన్స్‌ఫర్స్‌లో గానీ కార్యనిర్వాహక శాఖ అనగా కేంద్ర ప్రభుత్వం చేసే సహేతుక కారణాలను దృష్టిలో పెట్టుకోవలసి ఉంటుంది. అంతేకాకుండా వచ్చే 12 సంవత్సరాల వరకూ (1993 వరకూ) ఈ విధానం వర్తిస్తుంది అంటూ సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

అంతేకాకుండా, 1993లో 'సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ అసోసియేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' (అక్టోబర్ 6, 1993) భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, అదే సుప్రీంకోర్టులోని ఇరువురు సీనియర్ న్యాయమూర్తులను సంప్రదించి, వారి అభిప్రాయాన్ని గౌరవిస్తూ నిర్ణయం తీసుకుంటారు. 'ఇది న్యాయ వ్యవస్థ కుటుంబంలోని సమస్య. కార్యనిర్వాహక శాఖ ఏ విధంగాను ఇందులో తల దూర్చడానికి వీలు లేదంటూ' వ్యాఖ్యానించింది.

1998 అక్టోబర్ 28న కె.ఆర్. నారాయణన్ భారత రాష్ట్రపతిగా ఉన్నప్పుడు సుప్రీంకోర్టు జడ్జిల నియామకంలో ఆయన జోక్యం చేసుకుంటూ సంతకం చేయకుండా తిప్పి పంపుతూ 'మరోసారి విచారించండి' అంటూ ఒక నోట్‌ను రాసి పంపారు. అప్పుడు సుప్రీంకోర్టు ఒక నిర్ణయానికి వస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి కనీసం నలుగురితో కూడిన సీనియర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సంప్రదించి వారి అభిప్రాయాలను కూడా స్వీకరించి న్యాయమూర్తుల నియామకాలను చేపట్టవలెనని తీర్పు నిచ్చుకున్నది. అప్పుడే 'సుప్రీంకోర్టు కొలేజియం' ఏర్పాటును ప్రకటిస్తూ తన నిర్ణయాన్ని కె.ఆర్. నారాయణన్‌కు నలుగురితో సంప్రదించిన భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రిపోర్ట్‌ను పంపింది. ఆ తర్వాత ఆమోదించబడింది. అయితే 'కొలేజియం' అనేది, ఆయా ప్రధాన న్యాయమూర్తుల కాలంలో అప్పటికప్పుడు పరిస్థితుల రీత్యా ఏర్పాటవుతుంది తప్ప, ఎప్పుడూ పనిచేస్తూ ఉండదు. అది వారి 'పరిపాలనా' సౌలభ్యానికి అనుగుణంగా ఉంటుంది, అవసరాన్ని బట్టి కూడా ఏర్పాటవుతూ ఉంటుంది.

వాస్తవానికి గోపాల సుబ్రమణ్యం పేరు రోహింటన్ నారీమన్ కన్నా ముందు ఉన్నప్పటికీ, ఆయన పేరు తొలగించబడుతున్నదనే విషయాన్ని తెలుసుకొని గోపాల సుబ్రమణ్యం తన పేరును విరమించుకున్నట్లు ఒక లేఖను భారత సుప్రీంకోర్టుకూ, రాష్ట్రపతికీ, కేంద్ర ప్రభుత్వానికీ అందజేశాడు. అయినప్పటికీ అది పరిగణించబడ లేదు. కేంద్ర ప్రభుత్వం తనకు తానుగా ఈ నిర్ణయం తీసుకోవడాన్ని భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, మానవ హక్కుల కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలయ్య కూడా తప్పు పట్టారు. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కొలేజియం నిర్ణయాన్ని గౌరవించాలి. ఒకవేళ ఏవైనా బలమైన కారణాలున్నచో, మళ్లీ తిప్పి కొలేజియంకు పంపాలి గానీ, డైరెక్ట్‌గా రాష్ట్రపతికి పంపడం సరికాదంటూ వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్. చౌహాన్ పదవీ విరమణ సభలో 2014 జూలై 1న ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎం. లోధా కూడా వ్యాఖ్యానించారు. ఈ విధంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం వలన భవిష్యత్తులో న్యాయవ్యవస్థ పరిస్థితి కొంత దయనీయంగా ఉండే ప్రమాదం ఉండబోతుందనే వాస్తవాన్ని బహిరంగంగా వేలాది మంది న్యాయవాదుల సమూహం మధ్య వ్యాఖ్యానించారు.

భారత ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, న్యాయ వ్యవస్థలో ఆయన జోక్యం ఎక్కువగానే ఉందనడానికి ఉదాహరణ – అమిత్‌షా సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు జరుగుతున్న ముంబాయి సిబిఐ స్పెషల్ కోర్టు జడ్జి జె.టి. ఉత్పల్‌ను 2014 జూన్ 26న బదిలీ చేయించారు. వాస్తవానికి ఆ న్యాయమూర్తి ఎదుట అతను హాజరును మినహాయిస్తూ అతని బదులుగా అతని న్యాయవాది కోర్టులో ఉంటాడని కోరుతూ పిటిషన్ దాఖలు చేయగా ఆ పిటిషన్‌ను న్యాయమూర్తి తిరస్కరించాడు. దానిపై కూడా అమిత్‌షా ముంబాయి హైకోర్టును ఆశ్రయించాడు. ఇలాంటి అమిత్‌షా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు. ఈయన నరేంద్రమోడీకి ఎంత సన్నిహితుడనే విషయం ఆయన ఎదుర్కొంటున్న కేసులను బట్టి అర్థం చేసుకోవచ్చు.

భారతదేశ న్యాయ వ్యవస్థను ఏదో ఒక విధంగా కాషాయీకరణ చేయాలనే దృష్టితో నరేంద్రమోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చూస్తున్నది. ఇది అప్రజాస్వామికం. రాజ్యాంగ హక్కులను, విలువలనూ, ప్రమాణాలను కొన్ని వర్గాల వారికే పరిమితం చేయాలనే దురాలోచనతో కేంద్ర ప్రభుత్వం సంకల్పింస్తోంది.

భారత రాజ్యాంగం ప్రజలకు ఇస్తున్న ప్రాథమిక హక్కులనూ భవిష్యత్తులో నరేంద్రమోడీ నాయకత్వంలోని ప్రభుత్వం కాలరాసే ప్రమాదమున్నది. దీనిని ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయమై ప్రజాస్వామిక వాదులూ, విజ్ఞులూ అప్రమత్తమవ్వాలసిన అవసరం ఉంది. పౌర, ప్రజాస్వామిక హక్కుల పోరాటాలను మరింత ఉధృతం చేయడం ద్వారానే రాజ్యం అంచనాలను తలకిందులు చేయవచ్చు. ఇప్పటికే నడుస్తున్న పోలీస్ పాలన అవినీతి, సామ్రాజ్యవాద విష ప్రపంచీకరణను వ్యతిరేకించే శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉంది. లేకుంటే భవిష్యత్తు మరింత ప్రమాదకరంగా మారే ప్రమాదం ఉంది. కావున పోరాటాలను మరింత త్యాగంతో ముందుకు తీసుకొని పోవలసి ఉంది.

(రచయిత ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

రైతుల్ని దగా చేస్తున్న రుణమాఫీ పథకం

రుణమాఫీ పథకం హామీతో అధికారం దక్కించుకున్న చంద్రబాబు ఆ తరువాత తన అసలు రంగు బయటపెట్టాడనీ, రుణమాఫీ వల్ల లబ్ధి పొందేదీ భూస్వామ్య, ధనిక రైతులేననీ, చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకంతో ఏ లాభం చేకూరదనీ అంటున్నారు **ముప్పాళ్ల భార్గవశ్రీ**

రుణమాఫీపై చంద్రబాబు ప్రభుత్వం ఇంత కాలంగా కొనసాగుతున్న అయోమయ స్థితికి జూలై 21న జరిగిన మంత్రివర్గ సమావేశాల నిర్ణయాల ద్వారా తెరదించారు. అసలే లోటులో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నుంచి ఎలా రుణాలు మాఫీ చేయాలి, లోటును పూడ్చడానికి ప్రత్యామ్నాయ మార్గాలేమిటి, రుణాల రీషెడ్యూల్‌కు, మారటోరియంలకు ఆర్‌బిఐ నుంచి స్పందన కోసం ఎదురు చూస్తున్నామనే పేరుతో కాలయాపన చేయడానికి ప్రయత్నించినా, రైతుల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకతను గమనించి రుణమాఫీ గురించి చంద్రబాబు ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించక తప్పలేదు.

చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన అన్నిరకాల రుణాల మాఫీలను కలుపుకుంటే రు. 95,99,130 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటి నిర్ణయం ప్రకారం కుటుంబం చేసిన రుణాల్లో ఒక్క రుణాన్నే రు. 1.50 లక్షలు రద్దు చేస్తానని ప్రకటించడం ద్వారా, వ్యవసాయ, డ్వాక్రా రుణాల మాఫీ కోసం రు. 37,900 కోట్లు అవసరం అవుతాయని ప్రకటించి రుణమాఫీ పట్ల అసలు రూపాన్ని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించుకొంది. ఈ రుణ మొత్తాన్ని కూడా ఒక్కసారిగా మాఫీ చేయడం కాకుండా ఇసుక, గనులు, ఎర్రచందనం, సారాయి వనరులను తాకట్టు పెట్టడం ద్వారా వచ్చే నిధులతో అంచలంచలుగా రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. ఇంతకంటే విడ్డూరమైనది రుణమాఫీకి కౌలురైతుకి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని చెప్పడం!

నేటి వ్యవసాయం దాదాపు 80 శాతం కౌలురైతులే సాగుచేస్తూ ఉండగా, కౌలురైతులకు గుర్తింపు కార్డు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేస్తామని కూడా ప్రకటించింది. అయితే ఆచరణలో కౌలు రైతుల గుర్తింపు కార్డులను రైతులు గుర్తించకపోవడమే గాక బ్యాంకులు కూడా గుర్తించనపుడు కౌలు రైతులకు రుణమాఫీ ఏవిధంగా చేస్తారు! ఇది రైతాంగాన్ని మోసం చేయడం కాదా!

రైతుల రుణమాఫీ పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కౌలు రైతులను అడంగు రికార్డుల్లో నమోదుచేసే విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. కావున అసలు రైతాంగం నేడు ఎటువంటి దుస్థితిలో ఉన్నదో కూడా, రుణమాఫీ వలన ఎంతవరకు ప్రయోజనమో పరిశీలించడం అవసరం. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభం అయింది. రైతన్నలు ఆశ, నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. సాగునీటి కష్టాలు, విత్తనాలు, ఎరువులు, రుణాల సమస్యలు రైతుల గుండెల్లో అలజడి రేపుతున్నాయి. వ్యవసాయం చేయడంలో నిరంతరం ఎదుర్కొంటున్న కడగండ్లను పరిష్కరించడంలో పాలకులు పదే పదే నిర్లక్ష్యం చేస్తున్నా, ఏటికి ఎదురీదినట్టుగా, మొండి ధైర్యంతో భవిష్యత్ పట్ల ఆశలు నిలుపుకుంటూ రైతులు సేద్యానికి పూనుకొంటున్నారు.

గత ఎన్నికల సందర్భంగా 'రైతుల అప్పులను, బంగారం తాకట్టుతో సహా రద్దు చేస్తామని, మళ్లీ కొత్తగా రుణాలు ఇస్తామని, కాబట్టి రైతులు బ్యాంకు రుణాలు కట్టొద్దని' తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు కాలికి బలపం కట్టుకొని ఊరూరా ప్రచారం చేశారు. ఈ వాగ్దానాన్ని ఎక్కడ రైతులు నమ్మకుండా తమకు ఓట్లు వెయ్యరేమోనన్న భయంతో ఎన్నికల జాతర ముగిసేవరకు 'రైతుల రుణాలమాఫీ చేసి తీరుతాం' అని టిడిపి అధినేత ప్రకటనలు ఇస్తూనే ఉన్నారు. ఈ రుణమాఫీ వాగ్దానంతో ఆశల పందిళ్లు వేసి రైతన్నలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. ఫలితంగా సీమాంధ్రలో తెలుగుదేశం అత్యధిక స్థానాలు గెల్చుకొని, విభజన ప్రక్రియ పూర్తికాగానే ఆంధ్రప్రదేశ్ అధికార పీఠాన్ని గుంటూరులో అట్టహాసంగా అధిరోహించింది. 'పడవ ఎక్కేదాకా ఓ పడవ మల్లయ్యా! పడవ దిగగానే పోరా బోడి మల్లయ్యా!' అని గేలిచేసిన చందంగా, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజునే రైతుల రుణమాఫీపై తొలి సంతకం చేయడానికి, రుణమాఫీపై నిర్ణయం తీసుకోవడానికి 45 రోజుల గడువు, ఈ సమస్యను పరిష్కరించడానికి ఒక కమిటీని వేయాలన్న నిర్ణయాల ఫైలుపై చంద్రబాబు సంతకం పెట్టారు.

నైతిక విలువల గురించి ఎక్కువగా మాట్లాడే చంద్రబాబుకి ఈ విధంగా వాగ్దాన భంగం చేయడం నైతిక విలువలకు నిలువుపాతర వేయడం కాదా! రుణమాఫీపై విధానపరమైన నిర్ణయం తీసుకోకుండా, రుణాల రద్దుపై నాబార్డు మాజీ ఛైర్మన్ పమిడి కోటయ్య నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా కాలయాపనకు శ్రీకారం చుట్టింది.

రుణమాఫీ పథకాన్ని నీరుగార్చేందుకు తూట్లు పొడుస్తున్న పాలకులు

ఆంధ్రప్రదేశ్‌లో 2014 మార్చ్ నాటికి రు. 87,612 కోట్ల వ్యవసాయ రుణాలు ఉన్నాయని బ్యాంకుల యాజమాన్య కమిటి తేల్చింది. రైతులకు సంబంధించి కేవలం పంట రుణాలేనని పేర్కొనడం ద్వారా రు. 59,106 కోట్లకు తగ్గించారు. ఇందులో దీర్ఘకాలిక, అనుబంధ రుణాలు రు. 28,507 కోట్ల రద్దుపై చేతులెత్తేశారు. పక్కాగా పంట రుణాలుగా నిర్ధారించిన రు. 25,000 కోట్లలో రద్దు లక్ష వరకు చేయాలా? లేక లక్షన్నర వరకు చేయాలా? అన్న మీమాంసలో పడి ఇంతవరకు ఏమీ తేల్చలేదు. బంగారం తాకట్టుపెట్టి తీసుకొన్న రు. 5,599 కోట్ల పంట రుణాలలో మహిళల పేరున ఉన్న వాటినే పరిగణలోకి తీసుకొంటారట! వాటిక్కూడా పరిమితి పెడతారట! ఒక రైతు కుటుంబానికి 2-3 పంట రుణాలుంటే అందులో ఒకదాన్ని మాత్రమే మాఫీ చేస్తారట! డ్వాక్రా మహిళా రుణాల విషయంలో 50 వేలు రద్దు చేయాలా? లేక ఒక మొత్తంగా గ్రాంట్ ఇవ్వాలా? ఏదీ తేల్చలేదు. చేనేత రుణాల విషయం లోను ఇదే తంతు. రుణమాఫీ క్రింద రద్దుచేసిన రుణాల మొత్తానికి నగదు బాండ్లు జారీచేస్తే కుదరదని, మొత్తం నగదు రూపంలో చెల్లించాల్సిందేనని రిజర్వు బ్యాంకు స్పష్టం చేసింది.

పంట రుణాలను రీషెడ్యూల్ చేసి కొత్తగా రుణాలు ఇవ్వాలని, ఆ తర్వాత రుణమాఫీకి ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందని చంద్రబాబు ప్రభుత్వం రిజర్వు బ్యాంకును కోరినా అందుకు అంగీకరించలేదు. రుణమాఫీ అంశం, రుణాల రీషెడ్యూల్ విషయం రిజర్వు బ్యాంకు పరిధిలోనిది కాదన్న స్పష్టత చంద్రబాబు ప్రభుత్వానికి ఉన్నా, రిజర్వు బ్యాంకుకు వివరాలు పంపాము, సమాధానం కోసం ఎదురు చూస్తున్నామన్న పేరుతో కాలయాపన చేసే తంతును ఎంచుకుంది. ఒకవేళ పంట రుణాలను రీషెడ్యూల్ చేస్తే ఏమవుతుంది? స్వల్పకాలిక రుణంగా ఉన్న పంట రుణాలు దీర్ఘకాలిక రుణాలుగా మారి 7 శాతం వడ్డీకి బదులు 11-14 శాతం వడ్డీ వసూలు చేస్తారు. రీ షెడ్యూల్ అయిన రుణాలకు 'సకాలంలో చెల్లించే' అనే నిబంధన ఉండదు. కాబట్టి కేంద్రం నుండి వచ్చే వడ్డీ 3 శాతం రాయితీ వర్తించదు. ఈ స్థితిలో రీ షెడ్యూల్ చేస్తే పడే అదనపు భారం ఎవరు మోస్తారు? ప్రభుత్వమా? లేక రైతులా? ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న రీషెడ్యూల్ కేవలం 2013 ఖరీఫ్‌లో పంట రుణాలకే పరిమితం. అది కూడా కరవు, ప్రకృతి వైపరీత్యాలకు గురైన మండలాల వరకే అమలు చేస్తారు. రబీలో తీసుకొన్న పంట రుణాలను (రు. 16,528 కోట్లు) రైతాంగం తక్షణమే చెల్లించాలి. ఏదేమైనా రీ షెడ్యూల్ చేస్తే రైతు తీసుకొన్న రుణం అదనపు వడ్డీలతో తడిసి మోపెడై అప్పు మొత్తం తీర్చాల్సిందే!

రుణమాఫీ పథకం వల్ల ప్రయోజనం పొందేదెవరు?

రుణమాఫీ పథకం కేవలం సహకార పరపతి సంఘాలు, వాణిజ్య బ్యాంకులు ఇచ్చే పంట రుణాలకు మాత్రమే వర్తిస్తుంది. వాస్తవం చెప్పాలంటే, బ్యాంకులిచ్చే రుణాలు 20 శాతానికి మించి రైతులకు అందడం లేదు. ప్రపంచబ్యాంకు నివేదిక 87 శాతం చిన్నకారు, పేదరైతులు, 70 శాతం సన్నకారు రైతులు బ్యాంకు రుణాలకు నోచుకోడం లేదని తేల్చి చెప్పింది. మొత్తం రైతాంగంలో 80 శాతం వరకు కౌలురైతులే ఉన్నారు. వీరికి బ్యాంకు రుణాలు ఆమడ దూరంలో ఉన్నాయి. దీంతో కౌలురైతులు, పేద, చిన్నకారు, సన్నకారు రైతులు వ్యవసాయం నిమిత్తం పెట్టుబడి కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల బారినపడి దోపిడీకి గురవుతున్నారు. ఈ లెక్కన వ్యవసాయ రంగంలో మెజారిటీగా ఉన్న వీరంతా బ్యాంకు రుణాలకు దూరంగా ఉన్నప్పుడు రుణమాఫీ పథకం వల్ల వీరికి కలిగే ప్రయోజనం ఏముంది?

ఇంతకీ రుణమాఫీవల్ల ఎవరు ప్రయోజనం పొందుతారు? భూస్వామ్య, ధనిక, పెత్తందారీ రైతులే బ్యాంకు రుణాల్లో సింహభాగం దక్కించుకొంటున్నారు. కాబట్టి వీరే రుణమాఫీవల్ల లాభ పడతారనడంలో సందేహమేముంది? ఇందుకు నిదర్శనంగా 13 సంవత్సరాల కాలంలో లక్ష కోట్లకు పైగా రుణమాఫీ కింద విడుదల చేస్తే, పెద్ద రైతులే 95 శాతం మేర లబ్ధిపొందారని రిజర్వ్‌బ్యాంకు డిప్యూటీ గవర్నరు కె.సి. చక్రవర్తి అంగీకరించడం చూస్తుంటే, సంపన్న రైతాంగమే ప్రయోజనం పొందుతుందని వేరే చెప్పనవసరంలేదు కదా!

రుణమాఫీ పథకం అమలులో అక్రమాలు

గత యుపిఎ ప్రభుత్వం 2009లో తిరిగి అధికారంలో కొచ్చేందుకు 2008లో రు. 50వేల లోపు అప్పులను రద్దుచేసింది. బడ్జెట్ నుండి రు. 52,225 కోట్లు విడుదల చేశారు. ఈ రుణమాఫీ పథకాన్ని అమలు చేయడంలో అనేక అక్రమాలు జరిగాయి. కాగ్ (కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) 2011 నుండి 2012 మార్చ్ వరకు 25 రాష్ట్రాలలో క్షేత్రస్థాయిలో సర్వే జరిపి 90578 మంది రైతుల ఖాతాల్లో అక్రమాలు జరిగాయని వెల్లడించింది. రైతుల అర్హతను నిర్ధారించడంలో అనేక అక్రమాలు జరిగాయని, 20 లక్షల మంది తప్పుడు ధృవీకరణ పత్రాలు చూపించి రుణమాఫీ పొందారని, అర్హులైన 13.46 శాతం రైతులు రుణమాఫీ పొందలేదని, అనేక సూక్ష్మరుణ సంస్థలు (మైక్రోఫైనాన్స్) ప్రయోజనం పొందాయని, 55శాతం మంది భూస్వాములే రుణమాఫీ పొందారని కాగ్ రుణమాఫీ పథకం బండారాన్ని బట్టబయలు చేసింది.

నిజానికి రుణమాఫీని సక్రమంగా అమలు చేయలేరా? అంటే చేయగలరు. కాని చేయరు. ఎందుకంటే ప్రభుత్వరంగంలో చాలా బ్యాంకులు బడా పరిశ్రమాధిపతుల, కార్పొరేట్ కంపెనీల అప్పులను రద్దుచేయడమో, పునర్ వ్యవస్థీకరించడమో చేశాయి. 2013 నాటికి 40 బ్యాంకుల మొండి బకాయిలు రు. 2.22 లక్షల కోట్లకు చేరాయి. ఇదంతా పెద్దస్థాయి రుణ ఎగవేతదారుల నుండి జరిగాయని చెప్పిన ఆనాటి ఆర్థికమంత్రి చిదంబరం వారిపేర్లు మాత్రం వెల్లడించలేదు సరికదా ఆ అప్పులను రద్దుచేసేందుకు బ్యాంకులకు అవకాశమిచ్చారు. బడా పరిశ్రమల వారికి, బడా వ్యాపారుల ఆర్థిక ప్రయోజనాలు నెరవేర్చే ఈ బ్యాంకులే దేశానికి అన్నంపెట్టే రైతన్నలకు ఉపయోగపడే రుణమాఫీకి మాత్రం అంగీకరించకుండా మోకాలడ్డం పెడుతున్నాయి.

పాలకులు ఏ చట్టం చేసినా, ఏ సంక్షేమ పథకం అమలు చేసినా, ఆర్థిక పరమైన నిర్ణయాలు చేసినా దేశంలో బడా భూస్వామ్య, బడా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాదుల దోపిడి ప్రయోజనాలను నెరవేర్చేందుకే చేస్తున్నారు. బడా పరిశ్రమదారులకు, బడా వ్యాపారులకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను నిరర్ధక ఆస్తులుగా ప్రకటించి మాఫీ చేయడం దీనిలో భాగమే. దీన్ని కప్పిపెడ్తూ రైతులు తీసుకొన్న పంట రుణాలను రద్దు చేయడం వల్ల బ్యాంకుల మనుగడకు, దేశాభివృద్ధికి ఆటంకం అంటూ ప్రచారం చేస్తున్నారు.

రుణమాఫీ పథకాన్ని సమగ్రంగా రూపొందించి అమలు చేయాలి

వ్యవసాయరంగంలో కీలకమైన పాత్ర పోషిస్తున్న బ్యాంకు రుణాలకు దూరంగా ఉన్న పేద, చిన్నకారు, సన్నకారు రైతులు, కౌలురైతులకు కూడా మరింత ప్రయోజనం చేకూరేలా రుణమాఫీ పథకాన్ని విస్తృతపర్చి సమగ్రంగా రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామాల్లోని పేద, మధ్యతరగతి రైతులతో పాటు అధిక శాతంగా ఉన్న కౌలు రైతులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు పెట్టే అర్థంలేని ఆంక్షలకు తట్టుకోలేక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల విషపు కౌగిలిలోకి వెళ్లక తప్పడంలేదు. కాబట్టి పేద, చిన్నకారు, సన్నకారు, కౌలురైతులు వ్యవసాయం పెట్టుబడికోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద, ప్రైవేటు వడ్డీవ్యాపారుల వద్ద చేసిన అప్పులను కూడా రుణమాఫీ పథకం పరిధిలోకి తీసుకొని రావాలి. అప్పుడు మాత్రమే పేద, చిన్నకారు, సన్నకారు రైతులు, కౌలు రైతులకు మేలు కలుగుతుంది. కౌలురైతులు రుణమాఫీ పథకంవల్ల లబ్ది పొందాలంటే 'ప్రభుత్వం చేసిన కౌలుదారీ చట్టాలను సక్రమంగా అమలు జరిపి, కౌలుదార్లను గుర్తించి, వారి పేర్లను 10 శాతం అడంగుల్లో నమోదుచేసి, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించినప్పుడు మాత్రమే కౌలుదార్లు ఎదుర్కొంటున్న బ్యాంకు రుణాలు, నష్టపరిహారం పొందడం వగైరా సమస్యలు పరిష్కారం దొరుకుతుంది.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

సబ్సిడీలను పెంచి, ఉత్పత్తి ఖర్చులు తగ్గించి, సాగునీటి సౌకర్యాన్ని మెరుగుపర్చి, డ్రైనేజ్ సిస్టమ్ మెరుగుపర్చి, ప్రకృతి వైపరీత్యాలవల్ల కలిగే

ఆంధ్ర చంద్రుడు మారలేదంటున్న ప్రజలు

ప్రపంచ బ్యాంక్ ఏజెంట్ చంద్రబాబు నాయుడి గత పాలనా అనుభవాలను ప్రజలు మరచిపోవద్దనీ, ఆయన హామీలు పెట్టుబడిదారులకు ఉపయోగపడుతూ ప్రజలను మభ్యపెట్టడానికేననీ అంటున్నారు భూసారం శివన్న

తెలుగు ప్రజల ఉమ్మడి రాష్ట్రం విడివడి, రెండు రాష్ట్రాలుగా ఏర్పడ్డ సందర్భంలో 'ఇద్దరు చంద్రుల పట్టాభిషేకం' అని ఓ ప్రముఖ తెలుగు దినపత్రిక తన మనసులోని ఫ్యూడల్ గబ్బును బయటపెట్టుకుంది. తాటికాయలంత అక్షరాలతో, శీర్షికలతో ఆ పట్టాభిషేకాలను తన దినపత్రిక ద్వారా ప్రచారంలో పెట్టింది. ఈ దినపత్రిక నిత్యం వ్యక్తిత్వ వికాసాన్ని, వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, భారతదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఔన్నత్యాన్నీ, విలువలనూ చాటి చెపుతూ ఉంటుంది.

ఇంతగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఆకాశానికెత్తే ఈ పత్రికాధిపతికి ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారాలు పట్టాభిషేకంగా కనపడ్డాయంటే అర్థం ఏమిటి? ఈ పత్రిక, పట్టాభిషేకం అని ప్రచారం చేసిన దానికి మిన్నగా, దానిని తలదన్ని, ఇరు చంద్రులు పట్టాభిషేకాలు జరిపించుకున్నారు. ప్రమాణ స్వీకార ఆడంబర మహోత్సవాలు, వాటిని జరుపుకున్న తీరు గత పాత రాజుల బూజు చరిత్రలోని పట్టభిషేకాల తంతు తమ ముందు దిగదుడుపే అని నిరూపించాయి. అంటే పైన ఉదహరించిన పత్రిక 'చంద్రుల పట్టాభిషేకం' అని అనడంలో ఆశ్చర్య పడాల్సినదేమీ లేదు. ఇరు పక్షాలకు అంటే పట్టాభిషిక్తులకూ, వారి వందిమాగధ దళానికి ఉన్న ఆలోచనా ధార ఒకటే, తాత్వికత ఒకటే – అదే అర్ధవలస, అర్ధ భూస్వామ్య తత్వం. వీరందరూ కలగలసి ఏలుతున్నవి ప్రజాస్వామ్యం ముసుగు కప్పుకున్న కరుడుకట్టిన పట్టాభిషేక రాజ్యాలే కదా!

ఇంకా పాలనా ప్రాంగణం లోనికి అడుగిడక ముందే, నిన్నటి వరకు తాము ఊదరగొట్టి, ప్రజల ఓట్లు కొల్లగొట్టిన కిక్కులోనే రాబోయే రెండు మూడు దశాబ్దాల వరకు తమ రాజ్యానికి, తమ రాజ్య పాలనకు తిరుగు లేదని, తామెప్పుడూ వెన్నెల చంద్రులవలె ప్రకాశిస్తూ ఉంటామనీ ప్రగల్భాలు పలకడానికి వారు ఏమాత్రం సిగ్గుపడరు. ప్రజాస్వామ్యం, చట్టసభలు, న్యాయబద్ధ పాలన అని నీతులు వల్లెవేసే నోటితోనే వారు ప్రజలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చే క్రమం ఇంకా మొదలు పెట్టకుండానే తమ రాజ్య సుస్థిరత గురించి ప్రగల్భాలు పలకడమంటే ప్రజలకు కాక 'వేరెవరికో' వారు ఆ భరోసాను ఇస్తున్నారు.

'వేరెవరో' అంటే వారెవరై ఉంటారు? ఊహించడం పెద్ద బ్రహ్మ విద్యేమీ కాదు. 'వేరెవరో' అంటే ఎన్నికల్లో వీరికి ధనరాసుల నందించిన కార్పొరేట్ దిగ్గజాలు, సారా, భూదందా, కట్టడ – నిర్మాణ రంగపు కాంట్రాక్టర్లు, కోట్ల డబ్బు గుప్పి గెలిచిన, గెలవలేక ఓడిన తమ తమ అభ్యర్థులూ, తమ వందిమాగధ మీడియా, తోక పుచ్చుకు తిరిగిన నక్కల దళాలు, ఇత్యాది మూకలే. వీరికే చంద్రులు భరోసా ఇస్తారు. కంగారు పడకండని, తోడుకు తినడానికి కావలసినంత సమయముందని. ఈ వ్యవహారమంతా దేనికి ప్రతీక? ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇదంతా అర్ధ వలస – అర్ధ భూస్వామ్య వ్యవస్థకు ప్రతీక.

ఆంధ్రప్రదేశ్ సామంత రాజ్యానికి పట్టాభిషిక్తుడైన నారా చంద్రబాబు నాయుడుగానీ, తెలంగాణ సామంత రాజ్యానికి పట్టాభిషిక్తుడైన కల్వకుంట్ల చంద్రశేఖరరావు గానీ, ఢిల్లీ సుల్తాన్ నరేంద్రమోడీ గానీ, నయా వలసవాద, సామ్రాజ్యవాద, కార్పొరేట్ పెట్టుబడి చక్రవర్తిత్వానికి ఊడిగం చేసే బానిస వ్యవస్థ ప్రతినిధులే అనే విషయం మట్టుకు ముమ్మాటికి నిజం. తెలంగాణ ముఖ్యమంత్రి కొత్తగా మొదటిసారి పట్టాభిషిక్తుడైనాడుగానీ, మిగతా ఇద్దరికీ, అందునా చంద్రబాబుకు ఈ ఘనత టన్నుల కొద్దీ ఉంటే, బాబును తలదన్ని కార్పొరేట్లతో ప్రేమ పండించుకున్న నీలికళ్ల మోడీకి ఢిల్లీ పీఠం దక్కడం తెలియని, తెలుసుకోలేని రాజకీయ మర్మమేమీ కాదు.

కొత్తగా పట్టాభిషిక్తులైన, తమకు తమను పున్నమి చంద్రులుగా శ్లాఘించుకుంటున్న వీరంతా కడు వాగాడంబరులు. అరచేతిలో స్వర్గం

నష్టాలను కనీసస్థాయికి తగ్గించి, పండించిన పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధరలను కల్పిస్తే ఏ రైతూ అప్పుల పాలు కాడు. ఏ రైతూ ఆత్మహత్య చేసుకోవాలనుకోడు. ఏ రైతూ గుండె చెదిరి హఠాన్మరణానికి గురికాడు. అప్పుడు రుణమాఫీ పథకాల ఆవశ్యకతే ఉండదు. వ్యవసాయానికి ప్రాథమికంగా కావాల్సిన విత్తనాలు, ఎరువులను పాలకులు సస్య విప్లవం పేరుతో మాన్‌శాంటో లాంటి విదేశీ విత్తన సంస్థల చేతుల్లో పెట్టిన ఫలితంగా ధరలు విపరీతంగా పెరిగిపోయి రైతుకు వ్యవసాయం భారంగా మారిపోయింది. వ్యవసాయం దండగ అనే పరిస్థితిని కల్పించిన పాలకులు కాంట్రాక్టు, కార్పొరేట్ వ్యవసాయానికి ఇప్పటికే పథకాలు రచించుకుంటూ, సెంటు ఉన్న రైతాంగాన్ని భూముల నుండి గెంటివేసే చర్యలకు సిద్ధమవుతున్నారు. కడప జిల్లా, కుప్పం లాంటి చోట చేసిన ప్రయోగాలు ఇందులో భాగమే.

రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు రైతులకు కొంతవరకు ఉపశమనం కల్గించేవే తప్ప రైతాంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారానికి దోహదపడవు. రైతన్నలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారం గురించి ఏ ప్రభుత్వమూ మాట్లాడదు. ఏ పరిష్కారానికి పూనుకోదు. సమగ్ర విప్లవ భూసంస్కరణలు జరిపి దున్నేవానికే భూమి చెందేలా చేసి రైతులు స్వతంత్ర్య జీవితం గడిపేలా వెన్నెముకను నిలబెడితే పాలకులు విదిలించే 'పథకాల' కోసం ఎదురుచూసే పరిస్థితి రాదు. అదే సందర్భంలో రైతులు రుణాల ఊబిలో కూరుకుపోవడానికి ప్రధాన కారణం పాలకుల విధానాలే కాబట్టి రుణమాఫీ పథకాల అమలు కోసం పోరాటం చేయాల్సిందే. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర పాలకులు అమలుచేస్తున్న వ్యవసాయ వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలపై, పూర్తిస్థాయిలో రుణమాఫీ కోసం రైతాంగంతో పాటు డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికులు సమైక్యంగా ఉద్యమించాలి.

(రచయిత సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్రకమిటీ సభ్యులు) వీ

చూపించగల నేర్పరులు. ఆంధ్రా చంద్రబాబు వద్ద తర్ఫీదైన తెలంగాణ చంద్రశేఖరునికి ఇటువంటి విద్య, గుణగణాలు అబ్బలేదని అనలేం. అందుకే వారి వాగ్దానాలు ఒకేలా ఉంటాయ్. ఆకాశ తారలను తుంచి ప్రజల తలలకు కిరీటాలుగా పెడతామని చెపుతుంటారు. నేలతో పనిలేదు, నింగివైపే చూస్తూ ఉండమంటారు. ఒకరు స్వర్ణాంధ్ర అంటారు. ఇంకొకరు బంగారు తెలంగాణా అంటారు. సింగపూర్లంటారు, మలేషియాలంటారు, సిలికాన్ వేలీలంటారు, నేలవిడిచి సాముగారడీలు చేస్తుంటారు. ఇన్ని ప్రగల్భాలు పలికే వీరికి ప్రజలు అప్పచెప్పిన సింహాసనం మీద కూర్చోడానికి సవాలక్ష భయాలు. ముహూర్తాలు, గ్రహ శాంతులు, గృహశాంతులు, పీఠశాంతులు, హోమాలు, వాస్తు దోష నివారణా పూజలు– ఇలా కాలం చెల్లిన మూఢనమ్మకాలకు పట్టం కడతారు. అశాస్త్రీయతను నెత్తికెత్తుకుంటారు. ఆపై, చుక్కల్లో చంద్రులవలె విర్రవీగుతుంటారు.

వీరికి ఒక విషయం ప్రజలు విడమర్చి చెప్పాలి. అయ్యా! మీరు వెన్నెల చిందే చంద్రులు కారనీ, కారు మబ్బులు మింగేసిన చంద్రుళ్లని. ఇంతకీ అసలు చంద్రులెవరూ స్వయంప్రకాశకులు కారు కదా! ఇలా రాస్తూపోతే చాలానే ఉంటుందిగాని, ఆంధ్రా చంద్రునికి నేను కొన్ని ప్రశ్నలు వేయదలచుకున్నాను. తెలంగాణా చంద్రున్ని ఇప్పటికే తెలంగాణ ప్రజలు నిలదీస్తున్న దృశ్యాలు కన్పిస్తున్నాయ్. కానీ ఆంధ్రా ప్రజలు చంద్రబాబు బూటకపు అభివృద్ధి మాయాజాలం మత్తులో జోగుతున్నట్లుంది. అందుకే వారి తరఫున ఈ ప్రశ్నలు వేస్తున్నాను. అతడు ఈ ప్రశ్నలను చదివి జవాబివ్వాలని కోరుకొంటున్నాను. ఇది నా పేరాశే కావచ్చు. అయినా ప్రశ్నించక తప్పదు.

- బాబూ! 'స్వర్ణాంధ్ర' అంటే ఏమిటో కొంచం వివరంగా చెబుతావా? ఆంధ్రా ప్రజలకు బుట్టల కొద్దీ బంగారం పంచిపెట్టే కార్యక్రమమే స్వర్ణాంధ్ర అంటావా? లేక ఉప్పరితట్టల సైజు బిచ్చపు చిప్పలు, బూడిద కుప్పలు పంచడమే స్వర్ణాంధ్రనా? తెలవక చస్తున్నాం కొంచెం చెప్పు బాబూ!
- రైతుల రుణాలను మాఫీ చేసే ఫైల్ మీదే మొదటి సంతకమన్నావ్! ఇంతవరకు పత్తాలేదది– బ్యాంకోళ్లు పెదవి విరిచారు, చేతులు దులిపేరు – నాకు తెలియక అడుగుతాను, మీరంతా ఎక్కడెక్కడో మడదొక్కిన ధన రాసులేమైనా వెలికితీసి రుణమాఫీ చేస్తారా? నువ్వెక్కడ నుంచి తెచ్చి ఎక్కడ పెడతావ్? నువ్వు చేయగల సమర్థుడవని మాకు తెలుసు, కాని చిన్న డౌటు, నీకు డౌట్లంటే నచ్చదుకదా, అందుకే కొంచెం వివరం గురూ!
- ఇదివరలో కూడా రుణ మాఫీల తంతు జరిగింది కదా! అయితే రైతులు మళ్లా మళ్లా అప్పుల ఊబిలో ఎందుకు కూరుకు పోతున్నారు? ఆత్మహత్యల వైపుకు ఎందుకు మళ్లుతున్నారు? దయచేసి చెప్పవా బాబూ!
- రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలను కలుపుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న భూమి మొత్తంలో గిరిజనులకూ, దళితులకూ, ఇంకా వెనుకబడిన వర్గాలకు ఎంత భాగం చెంది ఉందో? ఎంత విస్తీర్ణం వ్యవసాయ భూమిలో కౌలుదార్లు వ్యవసాయం చేస్తున్నారో? వ్యవసాయం చేయకుండా, ఏ ఇతర కష్టం చేయకుండా, ఏ ఇతర ఉత్పత్తిలో భాగస్వాములు కాకుండా భూస్వాములుగా, ధనిక రైతులుగా, వడ్డీ వ్యాపారులుగా, సారా కాంట్రాక్టర్లుగా, అద్దె వసూల్ జమీన్‌దార్లుగా, పలురకాల వ్యాపార దళారీ కార్యక్రమాల్లో కోట్లు పోగేసుకుంటున్న వారెంత మందో లెక్కలు చెప్పాలి బాబూ, ఆ లెక్కలు మాకు కావాలి బాబూ.
- పోలవరం ఎవరిని ముంచి, ఎవరిని తేల్చి పైకెత్తడానికో అసత్య మాడనని చెప్పుకునే నువ్వు మాకు ఉన్నదున్నట్లు చెపుతావా బాబూ?
- ఏమి పరిశ్రమలు ఎక్కడ పెట్టిస్తావ్? కొత్త ఆంధ్ర రాజధానిని ఎక్కడ కట్టిస్తావ్? ఈ కొత్త రాజధాని నిర్మాణంలో ఎవరిని కోట్లకు పడగలు ఎత్తిస్తావ్ ? ఎంతమందికి కొత్త పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పిస్తావ్? పరిశ్రమాధిపతులను ఏయే రాయితీలతో ముంచెత్తుతావ్? ఎవరి భూములు లాక్కొని ఎవరికి ఇప్పిస్తావ్? తీర ప్రాంత మత్స్యకారులకు ఏమిస్తావ్? వారిని ఎక్కడికి తరుముతావ్? పోలవరం నిర్వాసితులను ఏమి చేయదల్చుకున్నావ్? నీతో కలవమనే ముంపు మండలాల ప్రజలనేమి చేస్తావ్?
- సింగపూర్ పసిపిల్లల చిటికెనేలు గోరంత. ఆంధ్రా ఈ మూల నుండి ఆ మూలదాకా ఉందాయె! మరి ఆంధ్రాలో ప్రతి ఊరూ సింగపూరు చేసేస్తావా ? భలేభలే చేసీ మరి – ఎనుదిరక్కు – అయ్య బాబోయ్! భలే కళ్లు తిరిగి పడిపోయే ప్లేనయ్యా నీది! అందుకే కదేంటి నీకంత పేరొచ్చింది, చుక్కలలో చంద్రుడవని – మరి నిన్నెట్లా మరువగలం? అయినా ఓ చిన్ని విన్నపం – ఆ స్కీమేంటో కొంచెం మాక్కూడా చెప్పు బాబూ, మానాయన! చంద్రబాబూ!
- ఓడరేవుల వెల్లువంట! పరిశ్రమల పుంతలట! పెట్రో కారిడార్లట! హైటెక్ సాఫ్టువేర్, హార్డువేర్ స్మార్ట్ సిటీ నగరాలట! మెగా అణు విద్యుత్ మెరుపులంట! మెగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలట! ఆంధ్ర ప్రజల దశా దిశా దేవతల తలదన్నునట! భూతల స్వర్గమట! అసలు తంటాలే ఉండవట! మరదెలా సాధ్యమో వివరిస్తావా బాబూ? వేచి చూడమంటావా? బతికుంటే తప్పక చూస్తాం, అది సరేగాని – నువ్వు మారాజువు కదా! నువ్వు వివరించి చెప్పందే నీ ప్లాను మా మట్టిబుర్రలకు ఎక్కదు. మా మసక కళ్లకు సరిగా కనిపించదు. అందుకు మాకర్థం అయ్యేట్లు కొంచెం చెప్పవే చంద్రన్నా!
- ముందు నీ చేత, ఆ తరవాత నీ ప్రత్యర్థి – కొండెక్కిన వైఎస్ఆర్ చేత ఖూనీలు చేయగా, మిగిలిన విప్లవ రాజకీయ కార్యకర్తలు రాష్ట్రం వదిలి తలదాచుకోను దూరపు కోనల్లోనికి తరలిపోతే, మరి నీ చేత చంపించుకోడానికి ఎవరు మిగిలేరు? ఇప్పుడెవరిని ఎంచుకున్నావు బాబూ చంపడానికి? మరి మందిని చంపించే, మాయం చేసే ఘనచరిత్ర గల నీకత్తి అంచుకున్న రక్త దాహాన్ని ఎలా తీరుస్తావు బాబూ?

నువ్వు పరమ చీకటి అమావాస్య చంద్రుడివని నీ గత చరిత్ర మాకు చెప్పింది, మాకు చూపింది. అందుకే అప్పుడు నిన్ను మేం చిత్తుగా ఓడించాం. ఇప్పుడు మారిన చారిత్రక వేర్పాటు సందర్భంలో నువ్వు మాకు తెగ చెప్పావు – ఏమని? నేను గత చంద్రుణ్ణి కాదని, మబ్బు వీడిన చంద్రుణ్ని, పేదప్రజల కోసం పనిచేసే కూలీనని – అయితే, నమ్మక తప్పని సందర్భంలో ఆంధ్రా ప్రజలు చాలామందే నిన్ను నమ్మారు. తిరిగి పట్టం కట్టేరు. ఐతే నువ్వు రక్త పిపాసివని తిరిగి అనుమాన పడాల్సి వస్తోంది. ఎప్పుడో అస్త్ర సన్యాసం చేసి, ఎక్కడో మారుమూల చిన్నపాటి కష్టం చేసుకు బతుకుతున్న సన్న జీవాలపై పంజా విసిరావ్. చట్టాల పట్ల నీ అసహనాన్ని, అసహ్యాన్ని, అగౌరవాన్ని, అహంకారాన్ని, రక్తదాహాన్ని ప్రదర్శించావ్ – మరి నిన్నెట్లా మేం నమ్మాలో కొంచెం చెపుతావా బాబూ? మరి నువ్వు శ్రామిక ప్రజల మనిషివి కాదని, కార్పొరేట్ల పాదదాసుడవేనని, నువ్వేమీ మారలేదని మేమనుకోవడం తప్పంటావా?

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

మూర్ఖత్వమే పాండిత్యంగా కనబడే వేళ

***కులవ్యవస్థను సమర్థించే మూఢవిశ్వాసాల హిందూత్వ చరిత్రకారుడిని భారత చరిత్ర పరిశోధక మండలి అధ్యక్షులుగా నియమించడం చరిత్రను కాషాయీకరించే పన్నాగంలో భాగమే అంటున్నారు* సుభాష్ గాతాడే**

ఈ రచయిత ఇంకా పాఠశాల విద్యార్థిగా ఉన్నరోజులలో, బహుశా అరవైల చివరిలోనో, డెబ్బైల మొదట్లోనో, అమృత్ అనే మరాఠీ పత్రికలో పి.ఎన్. ఓక్ అనే పెద్దమనిషి రాసిన వ్యాసం ఒకటి అచ్చయింది. ఆ వ్యాసం తాజ్‌మహల్‌ను తేజోమహాలయం అని లేదా హిందూ దేవుడైన శివుడి ఆలయం అని వాదించింది. తాజ్‌మహల్‌ను నిర్మించడానికి ఒక శివాలయాన్ని ధ్వంసం చేశారనీ, అక్కడ తవ్వకాలు జరిపితే అంతకు ముందరి నిర్మాణపు 'అవశేషాలు' దొరుకుతాయనీ ఎన్నో 'వివరణల' ద్వారా నిర్ధారించడానికి ఆ వ్యాసం ప్రయత్నించింది.

సైనికుడిగా పనిచేసి ఆ తర్వాత రచయితగా మారిన ఓక్ రాసిన ఆ వ్యాసంలో ఎటువంటి అబద్ధాన్ని అందిస్తున్నాడో అప్పుడు గ్రహించడం కష్టం. ఎందుకంటే అప్పుడు అమాయకమైన పిల్లలకు 'ద్వేషించవలసిన పరాయివాళ్ల' గురించి చెప్పడానికి ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోని ఉపాధ్యాయులు ఉండేవారు. తమ ప్రార్థనాస్థలాలు మసీదుల కింద భూమిలో ఉన్నాయనే సాకుతో ఆ మసీదులను ధ్వంసం చేయవచ్చుననే ఇటువంటి అబద్ధాలే హిందూత్వ రాజకీయాలలో ప్రతిరోజూ జరిగే నిత్యకృత్యాలుగా మారిపోతాయని కూడ అప్పుడు ఎవరూ ఊహించలేదు.

ఆ పేరు చూడడం నాకదే మొదటిసారి కావచ్చు గాని చివరిసారి మాత్రం కాదు. 'దురాక్రమణదారులు, వలసవాదులు తయారు చేసిన భారత చరిత్రలోని దురభిప్రాయాలను, వక్రీకరణలను' సవరించడమే తన లక్ష్యం అని చెప్పుకుంటూ ఓక్ తయారుచేసిన అటువంటి వ్యాసాలు, పుస్తకాలు అక్కడా ఇక్కడా వెలువడుతూనే వచ్చాయి. మరాఠీ బ్రాహ్మణ శిష్టవర్గం లోని ఒక బృందం హిందూ రాష్ట్ర భావనకు మద్దతు తెలుపుతూ ఇటువంటి అభిప్రాయాలకు సాధికారత కల్పిస్తూవచ్చింది. ఆధునిక, మార్క్సిస్టు చరిత్రకారులు భారతదేశపు గతం గురించి 'ఊహాత్మక కథనాలను' కల్పించారని, దాని 'వైదిక నేపథ్యాన్ని, సారాంశాన్ని' పోగొట్టారని ఓక్ వాదించేవాడు. ఈ భావాలను ప్రచారం చేయడానికి ఆయన వ్యాసాలు రాస్తూ, పుస్తకాలు ప్రచురిస్తూ వచ్చాడు. భారత ఇతిహాస సంకలన్ సమితి అనే సంస్థను స్థాపించి 'స్థానిక చరిత్రల సేకరణ' కార్యక్రమం ప్రారంభించాడు. ఆ సంస్థ 1980లలో ఒక పత్రికను కూడ నడుపుతుండేది. ఆయన ఇంగ్లిష్ లో తొమ్మిది, మరాఠీలో పదమూడు, హిందీలో ఎనిమిది పుస్తకాలు రాశాడని ఒక అంచనా. ఆయన జీవిత కృషి అంతటికీ సారభూతమైనదని చెప్పే పుస్తకం శీర్షిక 'ప్రపంచ వైదిక వారసత్వం: చరిత్రల చరిత్ర'. అది 'ఆదిమ కాలం నుంచీ ప్రపంచం వైదిక ఆచారాలను ఆచరించిందనీ, సంస్కృతం మాట్లాడిందనీ చెప్పే ఏకైక, సమీకృత చరిత్ర క్షేత్ర సిద్ధాంతాన్ని వివరించే పుస్తకం'.

ఆ పేరు ఇప్పటివరకూ వినని సాధారణ పాఠకుల కోసం ఇంగ్లిషులో వెలువడిన ఆయన పుస్తకాల జాబితా ఇస్తే ఆయన ప్రధాన వాదన ఏమిటో అర్థమవుతుంది. ఆ శీర్షికలు: క్రిస్టియానిటీ ఈజ్ కృష్ణ నీతి, ఇస్లామిక్ హావక్ ఇన్ ఇండియా, ది తాజ్‌మహల్ ఈజ్ ఎ టెంపుల్ ప్లేస్ (లేదా ది తాజ్‌మహల్ ఈజ్ ఎ హిందూ ప్లేస్), హు సేస్ అక్బర్ వాజ్ గ్రేట్? ఆగ్రా రెడ్‌ఫోర్ట్ ఈజ్ ఎ హిందూ బిల్డింగ్, సమ్ బ్లండర్స్ ఆఫ్ ఇండియన్ హిస్టారికల్ రిసర్చ్, సమ్ మిస్సింగ్ చాప్టర్స్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ, వరల్డ్ వేదిక్ హెరిటేజ్ – ఎ హిస్టరీ ఆఫ్ హిస్టరీస్, తాజ్ మహల్ – ది ట్రూ స్టోరీ, వాజ్ కాబా ఎ హిందూ టెంపుల్?, లర్నింగ్ వేదిక్ ఆస్ట్రాలజీ, వగైరా.

సంస్కృత పదాలతో పోలి ఉండే సంస్కృతేతర మత పదాల మీద ఆధారపడి ఓక్ తన సిద్ధాంతాలను సృష్టించారని ఓక్ రచనలను విశ్లేషించిన శ్రీనివాస్ అరవముదన్ అన్నారు. ఉదాహరణకు వాటికన్ అనే మాటతో వాటిక (ఆశ్రమం), క్రిస్టియానిటీ తో కృష్ణ నీతి, ఇస్లాంతో ఈశాలయం వంటి పదాలు. అబ్రహాం బ్రహ్మకు వికృతి అని, జార్జ్ అనేది గార్గ్ కు వికృతి అని ఆయన సిద్ధాంతం. ఈ మాటల గారడీ ఆధారంగా ఓక్ క్రైస్తవం, ఇస్లాం రెండూ కూడ 'వైదిక' విశ్వాసాల నుంచే పుట్టి, వక్రీకరణకు గురయ్యాయని వాదిస్తాడు. ఈ పదాల పోలిక సహాయంతో ఓక్ 'ఈ మోసకారి పద వివరణలను పెంచి పోషించడంలో చాల సృజనాత్మకంగా' ఉన్నాడని శ్రీనివాస్ అరవముదన్ వ్యాఖ్యానించారు. (గురు ఇంగ్లిష్: సౌత్ ఏషియన్ రిలీజియన్ ఇన్ ఎ కాస్మోపాలిటన్ లాంగ్వేజ్ , ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ప్రెస్, 2005).

'క్రైస్తవం, ఇస్లాం రెండూ హిందూయిజం నుంచే పుట్టుకువచ్చాయి', లేదా 'తాజ్‌మహల్, కాథలిక్ వాటికన్, కాబా, వెస్ట్ మినిస్టర్ అబ్బె వంటివన్నీ ఒకప్పుడు హిందువులకు చెందిన శివాలయాలు', లేదా 'వాటికన్ అసలు వాటిక అనే వైదిక సృష్టి, పోప్ మతాధిపత్యం కూడ అసలు వేదిక పౌరోహిత్యమే' వంటి విచిత్రమైన సిద్ధాంతాలు గాని, భారతదేశంలో ఇస్లామిక్ వాస్తు నిర్మాణాలు లేనేలేవని అడ్డగోలుగా వాదించడం గాని ప్రధానస్రవంతిలో ఎవరినీ ఆకర్షించలేకపోయాయి. విశ్వవిద్యాలయాల విద్యాసంబంధమైన రంగంలో ఆ సిద్ధాంతాలు తిరస్కరణకు కూడ గురయ్యాయి. కాని హిందూత్వ అభివృద్ధి నిరోధక వర్గాలలో వాటికి ఆదరణ దొరికింది. ఆ హిందూత్వ తన కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోయే మహా సిద్ధాంతం కోసం ఇంకా వెతుకుతూనే ఉంది. కేంద్ర ప్రభుత్వాధికారాన్ని మొదటిసారి ఎన్‌డిఎ చేపట్టిన సందర్భంగా, తాజ్ మహల్ ఒక హిందూ రాజు నిర్మించాడనే చరిత్రను రాయడానికి తనను అనుమతించమని ఓక్ సుప్రీంకోర్టుకు ఒక దరఖాస్తు పెట్టుకున్నాడు. అప్పటి రాజకీయంగా అనుకూలమైన వాతావరణం తన అభిప్రాయాలకు మరింత సాధికారత ఇస్తుందని ఆయన అనుకున్నట్టున్నాడు. కాని ఆయన పొరపడ్డాడు. సుప్రీంకోర్టులో ఇద్దరు

న్యాయమూర్తుల బెంచ్ ఆయన దరఖాస్తును తిరస్కరించింది. ఆ దరఖాస్తు 'దురభిప్రాయాలతో' ఉన్నదని, 'మెదడులో పురుగు తొలుస్తున్న కారణంగా ఈ దరఖాస్తు తయారయినట్టున్నది' అని అభిప్రాయపడింది. (2000).

పి.ఎన్. ఓక్ 2007లో చనిపోయాడు కాని ఆయన అభిప్రాయాలు ఇంకా బతికే ఉన్నట్టున్నాయి.

'ఓక్ రాసిన చరిత్రను ఆదర్శంగా పెట్టుకుని అన్ని జిల్లాల చరిత్ర రాయాలనే' కార్యక్రమానికి హిందూత్వ దళం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదనే విషయం చాల మందికి తెలిసి ఉండకపోవచ్చు.

'గతం గురించి మతతత్వ దృక్పథాన్ని ప్రవేశపెట్టడానికీ, హిందువుల విజయాలను, కానుకలను ఎత్తిపడుతూ, ఇతరుల పాత్రను తక్కువచేయడానికీ, వక్రీకరించడానికీ' ప్రయత్నిస్తూ పాఠ్యపుస్తకాలను తిరగరాసి చరిత్రపట్ల మతతత్వ అవగాహనను పెంచడానికి భారతీయ జనతా పార్టీ చేస్తున్న ప్రయత్నాలను చర్చిస్తూ ప్రముఖ చరిత్రకారుడు కె.ఎన్. పణిక్కర్ 'ఔట్‌సైడర్ యాజ్ ఎనెమీ' అనే ప్రసంగంలో ఆ కార్యక్రమం గురించి ప్రస్తావించారు. 'పరిశోధనా సంస్థలను కాషాయీకరించడం ద్వారా' ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నారని ఆయన అన్నారు.

'విస్తృత ప్రజానీకంలో ఉన్న చారిత్రక అవగాహనలను మతతత్వం దిశగా మళ్లించేందుకు ఏకకాలంలో అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాటిలో ప్రత్యేకంగా చెప్పుకోవలసినది దేశవ్యాప్తంగా నాలుగు వందల శాఖలతో భారతీయ ఇతిహాస సంకలన సమితిని స్థాపించడం. పి.ఎన్. ఓక్ రాసిన చరిత్రను ఆదర్శంగా, నమూనాగా పెట్టుకుని అన్ని జిల్లాల చరిత్రలు తయారు చేయాలనేది ఈ సంస్థ కార్యక్రమం. ఓక్ చేసిన ప్రధానమైన పని ఏమంటే మధ్యయుగాల నిర్మాణాలలో ప్రతి ఒక్కటీ ఒక హిందూ నిర్మాణమే అని చెప్పడం.

కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొ. వై సుదర్శన రావును ప్రతిష్ఠాత్మకమైన భారత చరిత్ర పరిశోధన మండలి (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసర్చ్ – ఐసిఎచ్ఆర్) అధ్యక్షునిగా నియమించడం పట్ల విద్యా ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న సమయంలో, ఈ 'పి.ఎన్. ఓక్ గాథ' ను చర్చించడం అవసరం ఏమిటని ప్రశ్న తలెత్తవచ్చు. ఆ సంగతే మాట్లాడబోతున్నాను.

భారత ప్రాచీన చరిత్ర నిపుణురాలు రొమిలా థాపర్ ప్రముఖ వార పత్రిక ఇండియా టుడేలో రాసిన వ్యాసంలో ప్రొఫెసర్ సుదర్శనరావు దృక్పథం గురించీ, చరిత్ర అధ్యయనం పట్ల ఆయన సామర్థ్యం గురించీ కొన్ని సమంజసమైన ప్రశ్నలను లేవనెత్తారు. భారతదేశంలో చరిత్ర రచన 'జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ గుర్తింపు పొందిన అత్యుత్తమమైన చరిత్రకారులను సృష్టించింద'నే వాస్తవాన్ని చెపుతూ, ఆమె సుదర్శన రావును అధ్యక్షుడిగా నియమించడం పట్ల తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఆయన కృషి 'చాలమంది చరిత్రకారులకు తెలియనిది, ఆయన చేసి ఉండిన పరిశోధన ఏమైనా ఉంటే అది ఎవరికీ కనిపించనిది' అని ఆమె రాశారు. ఆయన 'భారత మహాకావ్యాల చారిత్రకత గురించి కొన్ని సాధారణ పత్రికా వ్యాసాలు రాశారు గాని, సహపరిశోధకులు సమీక్షించే ప్రామాణిక పత్రికలలో రాయలేద'నే వాస్తవాన్ని ఆమె గుర్తు చేశారు. 'అటువంటి ప్రామాణిక పత్రికలలో వ్యాసాలు అచ్చు కావడం అనేది విద్యారంగంలో పరిగణించే ప్రాథమిక అవసరం' అని ఆమె అన్నారు. అలాగే ప్రధానంగా పురాణాలుగా గుర్తింపు పొందిన ముఖ్యమైన ఘటనలకు వాస్తవిక కాలనిర్ధారణ చేసే ప్రయత్నాలను కూడ ఆమె ప్రశ్నించారు.

మరొక ప్రముఖ చరిత్రకారుడు డి.ఎన్. ఝా ఔట్‌లుక్ వారపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామాయణ, మహాభారతాలలోని ఘటనలను గాథలుగా కాక వాస్తవిక ఘటనలుగా గుర్తించి వాటి కాలనిర్ధారణ చేస్తూ సుదర్శన రావు చేసిన ప్రయత్నం సమస్యలతో కూడుకుని ఉన్నదన్నారు. 'నమ్మకాన్నీ హేతువునూ కలగలపడం అసాధ్యం. కనబడే ఆధారాలను బట్టి సుదర్శన రావు మహాభారతపు చారిత్రకత మీద విశ్వాసం ఉన్నవాడిలా కనబడుతున్నారు... ఆధారాల గురించి విమర్శ నాత్మకంగా ఉండాలి... విమర్శ అంటే విశ్వాసాన్ని అవమానించడం కాదు. చరిత్రకారుడిగా నాకు ఏ విశ్వాసమూ లేదు. హేతుబద్ధతే నా ప్రమాణం. కాని మోడీ ప్రభుత్వం హేతుబద్ధంగా పని చేస్తుందని ఆశించలేం' అన్నారు.

కులవ్యవస్థను సమర్థిస్తూ ప్రొఫెసర్ సుదర్శన రావు వ్యక్తం చేసిన అభిప్రాయాలు కూడ ఈ సందర్భంలో పరిశీలనకు వచ్చాయి. 2007లో రాసిన ఒక బ్లాగ్‌లో ఆయన, 'భారతీయ సంస్కృతిలోని అనుకూల అంశాలు ఎంత లోతయినవంటే ప్రాచీన వ్యవస్థల సుగుణాలను పునరుద్ధరించవలసి ఉంది' అన్నారు. 'భారతీయ కుల వ్యవస్థ: ఒక పునస్సమీక్ష' అనే శీర్షికతో రాసిన బ్లాగ్ వ్యాసంలో, 'ప్రాచీన కాలంలో కుల వ్యవస్థ సరిగా పనిచేస్తుండేది. ఏ ఒక్క వర్గం నుంచీ దానికి వ్యతిరేకంగా ఫిర్యాదులు వచ్చినట్టు కనబడదు. చాల తరచుగా దాన్ని పాలకవర్గపు స్వార్థ ప్రయోజనాలనూ ఆర్థిక సామాజిక స్థితినీ కాపాడే దోపిడీ సామాజిక వ్యవస్థగా తప్పుడు వ్యాఖ్యానం ఇవ్వడం జరుగుతున్నది' అనీ, 'సంస్కృతి అభివృద్ధిలో తదనంతర దశలో నాగరికతా అవసరాలకు సమాధానంగా అభివృద్ధి చెందిన భారతీయ కులవ్యవస్థను ప్రాచీన స్మృతులలో, ధర్మశాస్త్రాలలో ప్రవచించిన వర్ణవ్యవస్థతో సమ్మిళితం చేయడం జరిగింది' అనీ ఆయన రాశారు.

ఐసిఎచ్ఆర్ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ సుదర్శనరావును నియమించడం చరిత్రను కాషాయీకరించే పెద్ద కార్యక్రమంలో ఒక భాగం. విద్యారంగంలో ఈ పని ఒకరకంగా అలవాటయినదిగా కనబడుతున్నది. ఎన్‌డిఎ మొదటి దఫా పాలనాకాలంలో, దాని తొలి అవతారంలో (1998–2004) అన్ని ప్రధాన విద్యారంగ సంస్థలలో హిందూత్వకు సన్నిహితంగా ఉండే వ్యక్తులను నియమించారని గుర్తు తెచ్చుకోవాలి. కె.ఎన్. పణిక్కర్ సంపాదకత్వంలో 'టువార్డ్స్ ఫ్రీడం ప్రాజెక్ట్' దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆర్ఎస్ఎస్, తదితర హిందూ సంస్థల వాస్తవ పాత్రను బహిర్గతం చేసినందువల్ల ఆ ప్రచురణను అడ్డుకున్నారు. అందువల్ల ఆ ఎన్‌డిఎ ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విమర్శలను ఎదుర్కొన్నది. భారతీయ జనతా పార్టీ సొంత మనిషి, ఆ పార్టీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ప్రొఫెసర్ ఎం ఎల్ సోంధి కూడ అప్పటి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసర్చ్ అధ్యక్షుడిగా, విద్య పట్ల తన సొంత ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించాడని ఎక్కువమందికి గుర్తు ఉండకపోవచ్చు. దేశంలోని అత్యున్నత పరిశోధనా సంస్థలు 'తమ దిశను మౌలికంగా మార్చుకునేలా' బలవంత పెడుతున్నారనీ, 'మేధో అభివృద్ధి నిరోధకత్వంలోకి వాటిని నడిపిస్తున్నారనీ' ఆయన విమర్శించారు.

ఈ సరైన విమర్శలన్నీ కూడ ప్రొఫెసర్ సుదర్శన రావు వృత్తి సరళిలోని ఒక చిన్న అంశాన్ని విస్మరించాయి. ఆయన తనకు రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ తో సంబంధం లేదని గట్టిగా ఖండించారు గాని తాను భారతీయ ఇతిహాస సంకలన సమితిలో భాగమని అంగీకరించారు.

తెలుగు మీడియాలో అంధ దశ

ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత రెండు రాష్ట్రాల్లోని ప్రజా సమస్యలు ఇరు ప్రాంతాల వారికి తెలియజేసే బాధ్యత విస్మరించి కార్పొరేట్ మీడియా పక్షపాత వైఖరిని వివరిస్తున్నారు టంకశాల అశోక్

ఉమ్మడి రాష్ట్ర విభజనతో తెలుగు మీడియాలో 'అంధ దశ' ప్రారంభమైనట్లు కనిపిస్తున్నది. ఈ మాటతో కొందరు మిత్రులు విభేదించవచ్చు. అంధ దశ ఉమ్మడి రాష్ట్రంలోనూ ఉన్నదనీ, పెట్టుబడులు భారీగా ప్రవహించి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం మీడియా విలువలను భంగపరచడం ఒక ధోరణిగా మొదలైన సుమారు రెండు దశాబ్దాల క్రితం నుంచే ఈ స్థితి ఉందనీ కొందరనవచ్చు. మరి కొందరు వారితోనూ విభేదించి అంతకన్న కొన్ని దశాబ్దాల ముందే ఇది తలెత్తిందని అంటూ 'పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన విషపుత్రిక' అని శ్రీశ్రీ రాసిన దానిని ఉదహరించవచ్చు.

ఈ రెండు అభిప్రాయాలలో దేనిని కూడ ఇక్కడ కాదనడం లేదు. సూత్రరీత్యా, లేదా మౌలిక దృష్టితో ఆ రెండింటికీ విలువున్నది. ఈ వ్యాసంలో చర్చిస్తున్నది ఒకానొక నిర్దిష్ట సందర్భం గురించి. అది ఉమ్మడి రాష్ట్ర విభజన. దానిని పురస్కరించుకుని మీడియాలో ఏమి జరుగుతున్నదనేది ప్రశ్న. కనుక, పైన 'అంధ దశ' అని అన్నమాటను ఆ పరిమిత దృష్టితో చూడడం అవసరం. కాదనుకుంటే, అంధ దశ-2 అనో, అంధ దశ-3 అనో అనవచ్చు. లేదా అంధ దశలో మరో దృశ్యం అని పిలువవచ్చు. దేనితోనూ పేచీలేదు.

ఇక విషయంలోకి వెళితే, వర్తమాన అంధ దశలో జరుగుతున్నదేమిటన్నది విచారించడం అసలు సంగతి. విభజన జరగడానికి కొన్ని సంవత్సరాల ముందే మొదలైన ఈ దశ, విభజనానంతరం కొత్త పుంతలు తొక్కుతున్నది. విభజనకు ముందు జరిగిందేమిటో స్థూలంగా తెలిసిందే గనుక, ముందుగా విభజనానంతర పరిణామాలను చూద్దాం. ఆ తర్వాత విభజనకన్న ముందు కాలానికి వెళ్లవచ్చు.

తెలుగు పత్రికలు, ఛానళ్లలో అత్యధికం సీమాంధ్ర పెట్టుబడి దారులు, పార్టీలు, నాయకులవన్నది తెలిసిందే. తెలంగాణ ఏర్పడకుండా శాయశక్తులా ప్రయత్నించిన ఈ మీడియా, ఆ ప్రయత్నాలు విఫలం కావడంతో ఇప్పుడు తదనంతర చర్యలు కొన్ని తీసుకుంటున్నది. రెండు తెలుగు రాష్ట్రాలకు రెండు వేర్వేరు ఎడిషన్లు తయారు చేస్తున్నారు. వేర్వేరు ఛానళ్లు పెట్టడమో ఉన్నవాటిని రెండుగా విభజించడమో చేస్తున్నారు. సిబ్బందిని ప్రాంతాల వారీగా వేరు చేస్తున్నారు. బయటి నుంచి రాసే రచయితలను ప్రాంతాల వారీగా ఎన్నుకుంటున్నారు.

జరిగేది ఇంత వరకే అయితే ఆక్షేపించవలసింది కనీసం ఒక మేరకు ఉండదు. ఏమిటా కనీసపు మేర? వేర్వేరు ఎడిషన్లు, వేర్వేరు ఛానళ్లు, లేదా ఛానళ్ల విభజన వరకు. ఎందుకంటే, 'తెలుగు వారంతా ఒకటే' అన్నది ఎంత నిజమైనప్పటికీ భౌగోళికంగా, పరిపాలనా పరంగా రెండు రాష్ట్రాలు ఏర్పడినప్పుడు ఎక్కడి వార్తలకక్కడ పూర్తి ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది. అక్కడి వార్తలో ఉమ్మడి రాష్ట్రంలో కన్నా ఇప్పుడు ఎక్కువ రాయవలసి ఉంటుంది. అందుకు పత్రికలో అదనపు చోటు కావాలి. అదనపు చోటు కోసం అదనంగా పేజీలివ్వడం ఆర్థిక కారణాల వల్ల వీలుపడదు. ఇదిగాక స్వరాష్ట్రంలో పత్రిక సర్క్యులేషన్, ఛానల్ వీక్షకుల సంఖ్య, వ్యాపార ప్రకటనల సేకరణ వంటి విషయాలుంటాయి. ఇవి ఆచరణకు సంబంధించిన సర్వసాధారణ విషయాలు. అందువల్ల, ఆ మేరకు ఇందులో అభ్యంతరకరం ఉండదు. కావాలంటే, కమ్యూనిస్టుల పత్రికలు కూడా ఇదే పని చేయడాన్ని, చేయనుండడాన్ని చెప్పుకోవచ్చు. (వారు మరీ అంత సుబుద్ధులని కాదు. కాని ఆ సంగతి తర్వాత చూద్దాం.)

పోతే, పైన పేర్కొన్న మార్పులలోనే ఆక్షేపణీయమైనవి ఏమిటి? ఒకటి, సిబ్బందిని ప్రాంతాల వారీగా విభజించడం. రెండు, రచయితలను కూడా ప్రాంతాల వారీగా ఎంపిక చేసుకోవడం.

ఇది ఎందువల్ల ఆక్షేపణీయమంటే, ఇది జర్నలిజపు రంగం అయినందున. రచనలు చేయడమన్నది ఉన్నత స్థాయి ప్రక్రియ అయినందుకు. ఈ రెండూ కూడా ఏ ప్రాంతపు, ఏ రంగపు, ఏ స్వార్థ ప్రయోజనాల బృందపు ఆలోచనలతో నిమిత్తం లేకుండా నిర్వికారంగా, నిష్పక్షపాతంగా, న్యాయబుద్ధితో, విచక్షణతో, విలువలతో సాగవలసిన వ్యాపకాలు. ఒకవేళ మీడియాకు చెందిన వారు గాని, రచయితలుగాని ఇందుకు భిన్నమైన లక్షణాలను ఏ కారణం వల్లనైనా, ఏ దశలోనైనా ప్రదర్శించినప్పటికీ అవి సరిదిద్ది పోగొట్టవలసిన, పోగొట్టుకోవలసిన లక్షణాలవుతాయి. అంతే తప్ప వాటిని ఆమోదించి, స్థిరీకరించి, వ్యవస్థీకృత రూపం ఇవ్వడం, అదే అవాంఛనీయ స్థితి శాశ్వతంగా కొనసాగేట్లు చేయడం ఎంత మాత్రం సరికాదు. జర్నలిస్టులను, రచయితలను ప్రాంతాల వారీగా వేరు చేయడం ఇటువంటి భవిష్య స్థితికి దారి తీస్తుంది. కనుక అది అభ్యంతరకరమవుతున్నది.

సుదర్శన రావు నియామకం మీద వివాదం మరికొంతకాలం సాగుతుంది. చరిత్రకారులలోని అత్యుత్తములు ఆయన తీసుకునే ప్రతి చర్యనూ జాగ్రత్తగా గమనిస్తారు, ప్రతిస్పందిస్తారు.

ఈలోగా, 'జాతీయ దృక్పథం నుంచి భారతీయ చరిత్రను' రచించడానికి విద్యాసంస్థలలో పి.ఎన్. ఓక్ స్మారక పీఠాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినా, లేదా, 'ఓక్ ఆదర్శాన్ని దృష్టిలో ఉంచుకుని సాగించే మౌలిక పరిశోధనను' ప్రోత్సహించే పేరు మీద ఒక అవార్డ్ నెలకొల్పినా ఆశ్చర్యపోకండి.

(రచయిత పాత్రికేయులు, మానవహక్కుల కార్యకర్త. గాడ్సేస్ చిల్డ్రన్ – హిందూత్వ టెర్రర్ ఇన్ ఇండియా, ది సాఫ్రన్ కండిషన్ – ది పొలిటిక్స్ ఆఫ్ రిప్రెషన్ అండ్ ఎక్స్‌క్లూజన్ ఇన్ నియోలిబరల్ ఇండియా పుస్తకాలు రాశారు. ఈ వ్యాసం http://kafila.org లో రాశారు.) వీ

ప్రస్తుతం జరుగుతున్న మార్పులలో కనిపిస్తున్నది మరొకటి ఉంది. అది వార్తల పేజీలను మార్చడం, వేరు చేయడం, ఎడిటోరియల్స్‌తో సహా ఎడిటోరియల్ పేజీలను మార్చడం, సాహిత్య పేజీలను మార్చడం. ఇందులోనూ ఒకమేరకు ఆక్షేపించనక్కర లేదు గాని, తక్కిన మేర తీవ్ర అభ్యంతరకరమవుతున్నది. ఏ విధంగానో చూద్దాం.

వార్తల పేజీలను మార్చడం, వేరు చేయడం అంతవరకే పరిమితమైతే పరవాలేదు. పైన చెప్పుకున్నట్లు రెండు భౌగోళిక రాష్ట్రాలు ఏర్పడినందున రెండింటికి వార్తల సంఖ్య, వాటి పరిమాణం, పద్ధతిలో కొన్ని మార్పు చేర్పులు అనివార్యం. ఇది పైన ఆక్షేపణీయం కాదని చెప్పుకున్న దానికి అనుగుణమైనదే. కాని అభ్యంతరకరం ఏమంటే ఇక్కడి వార్తలను అక్కడకు, అక్కడి వార్తలను ఇక్కడికి పంపడం చాలా చాలా తగ్గించి వేశారు. రెండు రాష్ట్రాల వారు తెలుసుకోవలసిన, తెలుసు కొనగోరే ముఖ్యమైన వాటికి సంబంధించి కూడా ఇది జరుగుతున్నది. ఇది పాఠకులకు, జర్నలిజం విలువలకు కూడా అన్యాయం చేయడమే.

గుడ్డిలో మెల్ల ఏమంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపు వార్తలు ఒక స్థాయిలో తెలంగాణ రాష్ట్రపు పాఠకులకు అందుతున్నాయి. అందుకు కారణం అందులో సదుద్దేశం ఉండడమన్నది అనుమానమే. ఆంధ్రప్రదేశ్‌కు కూడా హైదరాబాదే రాజధాని అయినందున వారి ప్రభుత్వ, రాజకీయ కార్యకలాపాలు ఆ నగరం నుంచి జరుగుతుండడం, పత్రికలూ - ఛానళ్లలో అత్యధికం ఆ రాష్ట్రవాసులవే కావడం అందుకు కారణం. ఇందుకు భిన్నంగా, తెలంగాణ వార్తలు ఆంధ్రప్రదేశ్ పాఠకులకు అతి కనిష్ఠ స్థాయిలో మాత్రమే వెళుతున్నాయి. రెండవ రాష్ట్ర పాఠకుల ఆసక్తిని బట్టి చూసినా, వారికి గల మీడియా హక్కులూ సమాచార హక్కులను బట్టి చూసినా, జర్నలిజం విలువల ప్రకారమైనా ఇది ఆమోదనీయమైన స్థితి కాబోదు.

వార్తల పేజీల విషయం ఇది కాగా, ఎడిటోరియల్ పేజీలు, సాహిత్య పేజీల మాట మరింత దారుణంగా మారుతున్నది. ఎడిటోరియల్ పేజీలలో ఎడిటోరియల్స్, వ్యాసాలు ప్రధానమైనవి. వీటిలో ఎడిటోరియల్ అన్నది వివిధాంశాలపై సదరు పత్రిక విధానాన్ని ప్రతిఫలిస్తుంది. అది ఏ రాష్ట్రం, ఏ దేశం అన్న దానితో నిమిత్తం లేకుండా ఒకే విధంగా ఉండాలి. ఎవరికి ప్రియమైనది, ఎవరికి అప్రియమైనది అనే ఆలోచన లేకుండా, ఒక ఫోర్త్ ఎస్టేట్‌గా, నిర్భయంగా, పరిస్థితులను మదింపు చేయాలి. మంచి చెడులు చెప్పి మార్గదర్శకత్వం చేయాలి.

ఈ సూత్రాలను, విలువలను పాటించదలచుకొనని వారు మాత్రమే ఎడిటోరియల్స్ విడివిడిగా రాస్తారు. రెండు రాష్ట్రాలకు అవసరాన్ని బట్టి హితవు చెప్పడానికి బదులు ఎక్కడికి అనుకూలమైనది అక్కడ రాయబూనుతారు. ప్రచురించే వ్యాసాల విషయంలోనూ వాటిని వేర్వేరు చేసినపుడు ఇదే జరుగుతుంది. ఇది ఆక్షేపణీయం కాదా? రెండు రాష్ట్రాల ఆలోచనాపరుల వ్యాఖ్యలు రెండు వైపులా స్వేచ్ఛగా తెలియాలి. వాటిని వివేచించే స్వేచ్ఛ పాఠకులకు ఉండాలి. సమాచారం, వ్యాఖ్యలు, సంపాదకీయాలు, వీటన్నింటితో కూడిన మీడియా అనే రంగపు ఉనికికి అంతిమమైన అర్థం, పరమార్థం ఇదే. లేని పక్షంలో ప్రజాస్వామిక వ్యవస్థల అర్థ పరమార్థాలకు మీడియా రంగపు అర్థ పరమార్థాలకు పరస్పరం పొసగదు. మీడియా ఒక ప్రహసనంగా మారి వికృత రూపం తీసుకుంటుంది.

ఇక సాహిత్య పేజీల విషయానికి వస్తే, జరిగిన, జరుగు తుందంటున్న మార్పులు ఇంతే ఆశ్చర్యకరంగా, అభ్యంతరకరంగా తోస్తున్నాయి. ఇవి ఒక రూపానికి వచ్చి స్థిరపడితే కనీసం దిన పత్రికల సాహిత్య పేజీలలో కాళీపట్నం రామారావు, శాంతి నారాయణలు తెలంగాణ సాహిత్య ప్రియులకూ, అల్లం రాజయ్య, పెద్దింటి అశోక్‌కుమార్‌లు ఆంధ్ర ప్రాంతం వారికి కనిపించకపోతే ఆశ్చర్య పడనక్కరలేదు. లేక మినహాయింపుల కేటగిరీ ఏదైనా తయారు చేసుకుంటారేమో తెలియదు. విభజనను సమర్థించినందున వరవరరావు, గద్దర్ వంటి వారు ఆంధ్ర ప్రాంత ఎడిషన్లలో, అంతగా మాట్లాడలేదు గనుక కె. శివారెడ్డి, దేవీప్రియ వంటి వారు (వీరంతా హైదరాబాద్ వాసులు) తెలంగాణ ఎడిషన్లలో అవాంఛనీయులు కాగలరేమో చెప్పలేం.

విభజన నేపథ్యంలో తెలుగు పత్రికలలో మరొక విచిత్రమైన పరిణామం సంభవించింది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆదివారం అనుబంధాలు ఎక్కడికి తగినట్టు అక్కడ ప్రచురించడం మొదలైంది. ఒక పత్రిక జూన్ 1 ఆదివారం అనుబంధం ముఖచిత్రం తెలంగాణలో కెసిఆర్ ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు ఉన్నాడు! మరొక పత్రిక రెండు వేరు వేరు పేర్లతో ఆదివారం అనుబంధాలు ప్రచురిస్తున్నది!

పైన చర్చించిన వివిధ ప్రశ్నలు చివరకు ఏ విధంగా రూపు తీసుకుంటాయో కొంతకాలం తర్వాత వేర్వేరు పత్రికల రెండు రాష్ట్రాల ఎడిషన్లను ఎవరైనా పరిశీలించితే గాని తెలియదు. ప్రస్తుతం ఎవరి వంటకాలు మాత్రం వారు చేస్తున్నారు. వాటి వాసనలు ఎంతమాత్రం ఇంపును కలిగించడం లేదు. నిర్మొహమాటంగా చెప్పాలంటే దుర్గంధపు సూచనలు కన్పిస్తున్నాయి.

కమ్యూనిస్టుల పత్రికలు సైతం ఇటువంటి మార్గంలోనే ఉన్నాయి. ముఖ్యంగా ఎడిటోరియల్ పేజీలు, సాహిత్య పేజీలలో అవి రెండు రాష్ట్రాల ఎడిషన్లలో ఏమి చేయనున్నాయన్నది పరిశీలించిన మీదట గాని వాటికి తక్కిన పత్రికలకు వ్యత్యాసం ఏమైనా ఉంటుందా, లేక వాటిలో వలెనే 'విలువల పాటింపు' ఉండగలదా అన్నది చెప్పలేం. కాని, తక్కిన వాటివలె ఎడిటోరియల్స్‌ను, ఎడిటోరియల్ పేజీలను మార్చడమన్నదే మౌలికంగా అభ్యంతరకరమైన విషయం. అయితే, ఏవైనా అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు ఏర్పడినప్పుడు రెండు రకాల ఎడిటోరియల్స్ రాస్తారా లేక పత్రికా ధర్మం ప్రకారం రాసే ఒకే ఎడిటోరియలా అన్నది అన్నింటికన్న కీలకమైన పరిశీలనాంశం అవుతుంది. ఆ పని ఇతర పత్రికలు, కమ్యూనిస్టు పత్రికలు ఎట్లా చేయగలవన్నది చూడవలసి ఉంది.

ఇక ఇక్కడ విభజనకు ముందటి మీడియా వైఖరిలోకి పోవడం లేదు. దానిపై చర్చ జరుగుతూనే వచ్చింది. అందుకు అదనంగా రాయవలసింది పెద్దగా లేదు.

కాని, భవిష్యత్తుకు సంబంధించి జరుగుతున్నది విచారకరంగా ఉంది. జరుగుతున్న దానిలో పైన అనుకున్నట్లు కొన్ని ఆచరణాత్మకంగా అనివార్యం. కాని అవాంఛనీయమైన వాటిని వేరు చేసి, వాటిని ఏ విధంగా నివారించగలరో మీడియా పెద్దలు కూర్చుని చర్చించుకోవడం మంచిది. లేని పక్షంలో కలిగే హాని అనేక రకాలుగా ఉంటుంది. ఆ హాని స్వయంగా మీడియాకు (మీడియా ధర్మానికి), రెండు రాష్ట్రాల సమాజాలకు కలుగుతుంది. అటువంటి చరిత్రాత్మకమైన తప్పిదాన్ని నివారించవలసిన అవసరం ఉంది. అందుకు స్వయంగా మీడియానే చొరవ తీసుకోవాలి. ఇంకా సన్నాహాల రూపంలో గల 'అంధదశ'ను ఆవిష్కారం కానివ్వవద్దు.

వీ

(రచయిత సీనియర్ జర్నలిస్టు)

ఎవరెస్టంత భావ కాలుష్యం!

***రాష్ట్రం ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నా పట్టించుకోని ప్రభుత్వాలు ఇద్దరు పిల్లలు ఎవరెస్టు పర్వతం ఎక్కడం గురించి ఎంతో ప్రచారం చేసుకుంటున్నాయనీ, ఈ సాహసం వల్ల సామాన్య ప్రజలకు ఒనగూరేది ఏమీ లేదనీ అంటున్నారు* రంగనాయకమ్మ**

పదమూడేళ్ల ఒక బాలికా, పదిహేడేళ్ల ఒక బాలుడూ, హిమాలయ పర్వతాల్లో ఎవరెస్టు కొండ ఎక్కారూ, దిగారూ! అలా చేసినందుకు వారిలో ఒక్కొక్కరికీ ప్రభుత్వం నుంచి దొరికిన లాభాలు, 25 లక్షల డబ్బూ, ఒక ఇల్లూ, 5 ఎకరాల భూమీ, దాని సాగుకి సహాయ వాగ్దానం, రేపు తెలిగ్గా ఉద్యోగాలూ – ఇవన్నీ! ఆ ఇద్దరికీ కొండలు ఎక్కడం నేర్పిన మాష్టారికి కూడా 25 లక్షల నజరానా! అంతే కాదు, ఆ ఇద్దరికీ ప్రభుత్వమే తన ఖర్చుతో రెండు నెలల పాటు కొండలెక్కే ట్రయినింగ్ ఇప్పించింది. దానికోసం ఎన్ని లక్షలో! ఇంకా అంతేకాదు. తర్వాత చూడండి.

ఏమిటిది? ఏమిటిదంతా? 'డబ్బు' అంటే, శ్రమ. ఆ మొత్తం లక్షలన్నీ ఎవరి శ్రమ? ఆ లక్షలన్నీ డబ్బేనా, మట్టా?

ఆ బాల బాలికలు కొండలెక్కితే సమాజానికి ఒరిగిందేమిటి? ఏం ఒరిగింది? ఏ పిల్లలైనా కొండ లెక్కితే, సముద్రాల్లో ఈదితే, ఆకాశంలోకి ఎగిరి కిందికి దూకితే, అవన్నీ వాళ్ల సరదాలు. వాళ్ల సరదాల కోసం వాళ్లు చేసుకుంటే, దానివల్ల ఇతరులకు వచ్చే ప్రయోజనం ఏమిటి?

ఆ కొండ మీద, మానవుల సమస్త రోగాల్నీ క్షణాల్లో మాయం చేసే సంజీవనీ మందు దొరికిందా? ఆ మందు అక్కడ ఎక్కడ ఉందో, ఎంతెంత గుట్టలుగా ఉందో చూసి, వాళ్లు రెండేసి గుప్పెళ్ల మందు కిందకి తీసుకు వచ్చారా? ఆ మందు ఉన్న స్థలం గుర్తులన్నీ చెప్పారా? అలాంటిదేమీ చేయలేదు వాళ్లు. మరి ఏమిటి వాళ్లు ఎక్కితే జనాలందరికీ ఉపయోగం?

భూమి మీద, కొండల మీద, ఎంత ఎత్తుకు పోయినా, అక్కడా ఆకాశమే ఉంటుంది. ఎండ ఉంటుంది. మంచు ఉంటుంది. ఎత్తుల్లో ఏం ఉంటుందో అదే ఉంటుంది అక్కడ కూడా. అక్కడికి పోయిన వాళ్లు అవే చూస్తారు. వాళ్లు చూస్తే, మనకేమిటి?

ఆ చూసిన వాళ్లు, రాయగలిగితే, ఏమేం చూశారో, ఎక్కడ పడ్డారో, ఎక్కడ పడలేదో, అవన్నీ రాసుకోండి! ఆసక్తి ఉన్న వాళ్లు ఆ పుస్తకం చదువుతారు. పుస్తకం పని కూడా చేయలేకపోతే పోనీ ఇరుగు పొరుగుల వాళ్లకి చెప్పుకుంటారు. ఎక్కారు, దిగారు. సరదా తీరింది.

ఆ సరదాతోనే కొండల మీదకి బయలుదేరిన ఇంకా కొందరు, కొండల మీద నుంచి జారి దొర్లుకుంటూ భూమి వైపు పడిపోతూ ఉంటే, ఈ పడని వాళ్లు, ఆ పడిపోతున్న దృశ్యాల్ని కళ్లారా చూడగలరే గానీ, ఆ పడిపోతున్న వాళ్లకి చెయ్యి అందించి రక్షించే స్థితిలో వీళ్లు ఉండలేరు.

కొండల మీద నుంచి దొర్లిపోయిన వాళ్లు కింద పడి, తలలు పగిలి, వెంటనే చచ్చిపోతే, బతికిపోయినట్టే లెక్క. కళ్లో కాళ్లో ఛిద్రమైపోయి, ఏ రాతి గుంటలోనో పడి ఇంకా ప్రాణాలతో బతికి ఉంటే, వాళ్ల గతి ఏమవ్వాలి? ఎత్తైన కొండలు ఎక్కడం దేశానికేదో గర్వకారణం అని భావిస్తే, ఆ ఎత్తుల నుంచి భూమి ఆకర్షణ వైపు రాలిపోవడం ఆ దేశానికే అగర్వకారణం అవదా? ఇది అగర్వం కాకపోతే, అది గర్వం అవుతుందా?

బయలుదేరిన మనుషులందరూ రకరకాల ప్రమాదాల్లో చచ్చిపోవడం గానీ, లేదా ఒకరో ఇద్దరో కిందకి దిగినా ఎక్కువ మంది పోవడం గానీ, జరిగే హింసాకార్యాల్ని ప్రభుత్వం ఆపివేయవద్దా?

ఎవరెస్టు ఎక్కడాన్ని గొప్ప సాహస కార్యంగా భావించే వాళ్లకి అసలు 'సాహసం' అంటే ఏమిటో ఏ మాత్రమూ తెలీదని అర్థం. కొన్ని సంవత్సరాల కిందట నేను ఒక వార్త చదివాను. అడవుల్లో బతికే ఒక గిరిజన ప్రాంతంలో జరిగిన విషయం అది. ఏడెనిమిదేళ్ల ఇద్దరు చిన్న వయసు ఆడపిల్లలు ఏవో ఆకు కూరల కోసం అడవిలోకి బయలుదేరారు. వాళ్లు ఇటూ అటూ చెట్ల కింద తిరుగుతూ ఉండగా వారిలో చిన్న పిల్లని ఒక కొండ చిలవ చుట్టేసింది! ఆ పిల్లకి భయంతో ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చేసింది. రెండో పిల్లకి ఒక విషయం తెలుసు. కొండ చిలవ కరవదనీ, అది మొత్తంగా మింగడమే చేస్తుందనీ, తెలుసు. ఆ పెద్ద పిల్ల ఏం చేసిందంటే, తన రెండు చేతులతో కొండ చిలవ నోటి దవడలు రెండూ విడదీసి పట్టుకుంది. అవి కలుసుకోకుండా, వాటిని అలాగే దూరంగా లాగి ఉంచింది. కాస్సేపటికి ఆ కొండ చిలవకి ఊపిరాడక, తన శరీరం చుట్టలు విప్పేసింది. ఆ చుట్టల్లో చిక్కుకున్న చిన్న పిల్ల బైట పడగానే, ఆ కొండ చిలవ దవడలు పట్టి ఉంచిన పిల్ల, వాటిని వదిలేసింది. వెంటనే ఆ ఇద్దరూ పరుగులతో ఇంటి దారి పట్టారు. ఒక సంవత్సరపు 'సాహస బాలల' వార్తల్లో ఇది చదివాను.

పెద్ద పిల్ల కూడా, ఎంతో పెద్దదేం కాదు. ఏడెనిమిదేళ్లదే. ఆ పిల్ల, తనకు ప్రమాదం ముంచుకు రావచ్చని కూడా లెక్క చేయకుండా తోటి పిల్లని రక్షించాలని, పాము నోట్లో రెండు చేతులూ పెట్టింది! అదీ 'సాహసం!'

ఇంకో వార్తలో, ఒక చిన్న పిల్ల నీటి వాగులో కొట్టుకుపోతూ ఉంటే, ఒక కుర్రవాడు ఆ వాగులోకి దూకి ఆ పిల్లని రక్షిస్తాడు. అదీ 'సాహసం!' సాహస కార్యం అంటే, దానివల్ల రెండో మనిషికి మేలు జరగాలి. లేదా సమాజానికి ఏదో ఒక సంస్కరణ వంటి మేలు జరగాలి. అవీ, సాహసాలు! నీటిలో పడ్డ పిల్లని కాపాడాలని ఆ వాగులోకి హఠాత్తుగా ఉరికిన కుర్రవాడికి గానీ, కొండ చిలవ నోట్లో రెండు చేతులూ పెట్టేసిన ఎనిమిదేళ్ల పిల్లకి గానీ, ఎవరైనా రెండేసి నెలలు ట్రయినింగ్‌లు ఇచ్చారా? వాళ్లకి పక్కన నిలబడి ఎవరైనా సహాయాలు చేశారా? ఇతరుల్ని రక్షించవలసిన అవసరాల్ని బట్టి, సహజంగా పుట్టుకొచ్చిన ఉద్రేకాలు అవి! అవీ సాహసాలు!

ఒక మనిషి, తన సరదా కోసం గానీ, లేదా తన లాభం కోసం గానీ, ఎంత ప్రమాదకరమైన కార్యంలోకి దిగినా, అవి సాహసాలు అవవు.

లంబాడీ బాలికా, ఇంకో చిన్న కులం బాలుడూ, ఎవరెస్టు ఎక్కడం సరదా కోసమూ కాదు, సాహసం కోసమూ కాదు. అది కేవలం 'డబ్బు' కోసం! డబ్బు వస్తే, 'కీర్తి' దానంతట అదే వస్తుంది. అది కేవలం తమ 'లాభం' కోసమే!

ఒక 'విద్య' నేర్చుకోవాలంటే, తప్పకుండా టీచరు ఉండాలి. ఆ టీచరు కోసం డబ్బు ఖర్చుపెట్టాలి. ఆ విద్య నేర్చిన వాడు దానితో ఒక బతుకు దెరువు ఏర్పర్చుకుంటాడు. కానీ, కొండలెక్కడం, 'విద్య' కాదు. దాన్ని టీచరు ద్వారా నేర్వడం బతుకు దెరువు కోసం కాదు. అది ప్రభుత్వం అందించే డబ్బు కోసం!

ఇటువంటి ఇంకా కొన్ని తప్పుడు కార్యాల కోసం ప్రభుత్వం, డబ్బుని కుప్పలు తెప్పలుగా ఎందుకు అందిస్తుందంటే, ప్రజల్ని తప్పుడు భావాల్లో ముంచి ఉంచడానికి!

'ప్రభుత్వం' అనేది, యజమాని వర్గం నడిపే ప్రభుత్వమే కాబట్టి, అది ప్రజల్ని ఎన్నిరకాల భ్రమల్లో ఉంచగలిగితే, దానికి అది అంత రక్షణ.

గతంలో కరణం మల్లీశ్వరి అనే మనిషి సంవత్సరాల తరబడీ టీచరు

ద్వారా నేర్చి నేర్చి చివరికి కాస్త బరువు ఎత్తింది. ఒక మనిషి, బరువు ఎత్తితే, సమాజానికి ఏమిటి ఉపయోగం? ఆ బరువుని ఎత్తే శక్తి, ఆ మనిషికి ఉన్న సహజ శక్తి కాదు. ఆ ఒక్క క్షణం కోసం తయారు చేసుకున్న శక్తి అది! ఆ శక్తి ఆ మర్నాడు అదే రకంగా ఉండదు. మర్నాడే అంతర్ధానమవుతుంది.

ఒక మనిషి పరుగు పందెంలో ఒక్క క్షణం ముందు నెగ్గితే, ఆ పరుగు వల్ల ఇతర మానవులకు ఏమిటి ఉపయోగం? రెండో మనిషికే కాదు, అది ఆ మనిషికే ఉపయోగం లేని తాత్కాలికావేశం! ఆ పరుగు మనిషి, తన ఊరు నుంచి ఇంకో ఊరు పోవాలంటే, తన పరుగు శక్తితో పరిగెత్తుకుంటూ వెళ్లడు. పరుగు పందెంలో ఓడిన మనిషిలాగే తను కూడా కారో, బస్సో, రైలో ఎక్కుతాడు. మరి సంవత్సరాల తరబడీ టీచర్లని పెట్టుకుని ప్రాక్టీసులు చేసి చేసి సంపాదించిన తాత్కాలిక శక్తితో ఏమిటి ఉపయోగం? నెగ్గితే ఎక్కువ డబ్బూ, ఓడితే కాస్త తక్కువ డబ్బూ! ప్రతీ తాత్కాలిక శక్తీ డబ్బు కోసమే!

పోటీలతో, డబ్బుతో ముడిపడిన ఆటలన్నీ సమాజానికి శుద్ధ దండగ. లేదా, ప్రజలకి శుద్ధ దండగ. అలాగే, కొండలెక్కే, ఎగిరే, దూకే సాహసాలన్నీ, సమాజానికి పనికి మాలిన కార్యాలు.

ఎవరెస్టు ఎత్తులు ఎక్కే కార్యాలు అన్నిటి కన్నా నిరుపయోగాలు. తోటి మనుషులు రాలిపోతూ ఉంటే, అది తనకు అనవసరం అనుకుంటూ తన పని తను చూసుకునే అమానుష కార్యం అది.

అసలు, 'పర్వతారోహణ' పేరుతో సాగేదంతా, లాభాల కోసం సాగే ఒక వ్యాపారం. ఒక బిజినెస్! పర్వతారోహణల చరిత్ర చదివితే, ఆగ్రహంతో, అసహ్యంతో, నిర్ఘాంతపోయే విషయాలు కనపడతాయి.

హిమాలయాల చుట్టూ సరిహద్దులుగా ఉన్న దేశాలు ఐదు. ఇండియా, నేపాల్, చైనా, టిబెట్, పాకిస్థాన్. ఆ కొండల్లోకి పోవాలంటే, అక్కడక్కడా పది, పదిహేను దారులు ఉన్నా, ఎవరెస్ట్ మీదకి పోవాలంటే, దాని కోసం వాడే దారులు నేపాల్ నుంచీ, టిబెట్ నుంచీ. ఈ దేశాల్లో, టూరిస్టుల్ని కొండలు ఎక్కించే వ్యాపారాల కంపెనీలకు టూరిస్టులు వేలకొద్దీ డబ్బు కట్టాలి. ఆ కంపెనీలు కుప్పలు తెప్పలుగా డబ్బు సంపాదిస్తాయి. ఆ కంపెనీల్లో షేర్పాలనే తెగకు చెందిన పేదలే కార్మికులు. ఆ కార్మికులు చేసే పనులేమిటంటే – టూరిస్టుల సామాన్లు మోయడం, (ఆ సామాన్లలో ఆక్సిజన్ సిలెండర్లు కూడా ఉంటాయి), టూరిస్టులకు కొండల మీదకి దారులు చూపించడం, కొన్ని చోట్ల కొండలకు కన్నాలు కొట్టి వాటికి తాళ్లు కట్టడం, అక్కడ వాడే నిచ్చెనల వంటివి పాడైతే వాటిని బాగు చేయడం, మధ్యలో ఆగే చోట్ల గుడారాలు విప్పి బిగించడం, అవసరమైతే టూరిస్టులకు వండి పెట్టడం, ఏ టూరిస్టన్నా గాయపడితే అతనికి సపర్యలూ, టూరిస్టు పూర్తిగా పోతే వీలైతే ఆ శవాన్ని కిందకి దింపడం, మంచులో కూరుకుపోయిన శవాల కోసం ఆ మంచు గుట్టలు తవ్వి వెతకడం – ఇలాంటి పనులెన్నో, కొండలెక్కే ఉత్సాహవంతుల కోసం, ఆ కార్మికులు చేయాలి, చేస్తారు.

ఆ పనులు జరిగేటప్పుడు, ఆ టూరిస్టులే కాదు, ఆ కార్మికులు కూడా కొండల మీద నుంచి రాలి దొర్లిపోతూ ఉంటారు. కొండలెక్కే టూరిస్టులకు కొండల పొడుగునా శవాలు రకరకాల భంగిమల్లో వేళ్లాడుతూ కనపడుతూనే ఉంటాయి.

సాధారణ టూరిస్టులైతే, కాస్త పైకి ఎక్కి, ఎక్కడ హడిలిపోతే అక్కడి నుంచి వెనక్కి తిరుగుతారు. కానీ, ఎవరెస్టు ఎక్కడానికి ప్రభుత్వం వారే శిక్షణలిప్పించి, ప్రభుత్వం వారే కంపెనీలకు వేలకొద్దీ డబ్బు కట్టి, పంపే వీరులు, అంత తొందరగా వెనక్కి తిరగరు. ఆ కార్యం సాధిస్తే వెంటనే అందే డబ్బు రాసులు వారి కళ్లల్లో మెదులుతూ ఉంటాయి. కాబట్టి దాని కోసం ఇంకా ఇంకా ఓపికలు ప్రదర్శిస్తారు.

ఆ ఇద్దరు వ్యక్తులూ ఒక్క సారి ఎవరెస్టు ఎక్కి వచ్చినందుకు వారికి నిధులూ కీర్తీ అందాయి. కానీ, టూరిస్టులకు గైడ్స్‌గా పని చేసే కార్మికుల్లో కొంత మంది, ఆ ఎవరెస్టుని పది సార్లు, ఇరవై సార్లు ఎక్కిన వాళ్లు ఉన్నారు. కార్మికుల సహాయాలతో, పనులన్నీ కార్మికులు చేస్తూ ఉండగా, ఒక్క సారి పైకి ఎక్కిన మన వాళ్లదే అంత సాహసం అయితే, సామాన్లు మోసుకుంటూ, చావుకి తెగించి ఎవరెస్టుని ఇరవై సార్లు ఎక్కిన వాళ్లని ఏమనాలి? ఒక్కసారి ఎక్కిన వాళ్లకి, అంత డబ్బూ, అంత భూమీ అందితే, ఇరవై సార్లు ఎక్కిన వాళ్లకి ఎంత అందాలి?

వాళ్లు వేరే ఉద్యోగాలు లేక, కటిక పేదతనాల వల్ల, కొండలెక్కే పనులకే తలలొగ్గి బతుకుతూంటారు. యుద్ధాలు చేసే సైనికులకు, 'చావడం' కూడా వాళ్ల ఉద్యోగంలో ఒక భాగం అయినట్టే, ఈ కొండల కార్మికులకు కూడా టూరిస్టుల వెంట తిరుగుతూ వారికి సపర్యలు చేసే క్రమంలో తీవ్ర గాయాల పాలవడం, చావడం, వారి ఉద్యోగంలో భాగం! ఇలా ఉంది, మానవ సమాజం!

పర్వతారోహణల బిజినెస్ వల్ల పుట్టుకొచ్చే ఇంకో దుష్టత్వం ఉంది. అది, హిమాలయ పర్వతాలు కలుషితమై పోవడం. టూరిస్టుల తిరుగుళ్ల వల్ల, ఆ పర్వతాల నిండా రకరకాల చెత్తల కుప్పలు చేరడం. ఖాళీ ఆక్సిజన్ సిలెండర్లూ, గుడారాలూ, తెగిపోయిన తాళ్లూ, విరిగిన నిచ్చెనలూ, బ్రెడ్డుల బిస్కట్ల ప్లాస్టిక్ సంచులూ, ఇంకా వెనక్కి తీసుకు రాలేని ప్రతీ తుక్కూ అక్కడ పేరుకుంటూ ఉంటుంది. శవాల మాట చెప్పనక్కర లేదు. పర్వత ప్రేమికులు, పర్వతాల్ని కలుషితం చేసే సాహసికులు!

ఎవరెస్టు ఎక్కిన ఆ ఇద్దరు సాహసవంతులూ అక్కడ ఏం చేశారంటే, ఆ ఎత్తు మీద అంబేద్కర్ చిత్రపటాన్నీ, శంకరన్ చిత్రపటాన్నీ, పెట్టి వచ్చారు.

సరే, పెట్టారు. వాటిని ఎవరైనా చూడాలి. ఆ ఎత్తులో ఉన్న చిత్రాన్ని చూసే వాళ్లెవరు? అక్కడ ఉన్న చిత్రాల్ని చూడాలంటే, భూమి మీద ఉన్న జనం అంతా ఎవరెస్టు ఎక్కితేనే అది సాధ్యం. ఆఖరికి అక్కడ కాకులు కూడా ఎగరవు. చిత్రాలు గానీ, విగ్రహాలు గానీ, నేల మీద నడిచే వాళ్లకి కనపడే ఎత్తులో ఉంటేనే వాటిని చూస్తారు. వాటిని చూసిన వాళ్లు, ఆ వ్యక్తుల్ని తల్చుకుంటారో, స్పందిస్తారో, ఏదో ఒకటి చేస్తారు.

మరి ఎవరెస్టు ఎత్తు మీద పెట్టిన చిత్రాల్ని ఎవరైనా చూడడానికా, ఊరికే 'పెట్టాం' అనడానికా? నారదుడు ఒక్కడే ఆకాశం నిండా తిరుగుతూ ఉంటాడు. నారదుడి తిరుగుడే నిజం అయితే, ఆయన ఒక్కడే చూడగలడు ఆ చిత్రాల్ని. నారదుడే నిజం కాకపోతే, ఇక ఆ చిత్రాల్ని చూసే వాళ్లెవరూ ఉండరు. వాటి మీద చీమలు కూడా పాకవు, పిచ్చుకలు కూడా వాలవు. చిత్రాలూ విగ్రహాలూ ఎంత ఎత్తులో ఉంటే అంత గొప్ప! ఆ ఎత్తులో ఏం ప్రయోజనం? – అనే ప్రశ్న లేదు. ఉపయోగాలూ, ప్రశ్నలూ అక్కర్లేదు. గొప్పలే కావాలి.

'ఎవరెస్టు ఎక్కిన వాళ్లు చిన్న కులాల వాళ్లు కాబట్టి, ఇలా అంటున్నారు. వాళ్లే పెద్ద కులాల పిల్లలు అయితే ఇలా మాట్లాడతారా?' అని బయలుదేరతారు చిన్న కులాల మేధావి పండితులు. కులాలతో ఏ మాత్రమూ సంబంధాల్లేని విషయాల్లో కూడా కులాల్ని రక్షణ మార్గంగా తీసుకుంటారు. పెద్ద కులాల పిల్లలకైనా ఎత్తులు ఎక్కారని కుప్పలు తెప్పలుగా డబ్బులూ భూములూ కట్టబెడితే, దాన్ని ఆ పిల్లల ఇళ్ల వాళ్లు తప్ప, ఇతర పెద్ద కులాల వాళ్లెవరూ సహించరు.

గిరిజన గ్రామాల్లోనే తిండిలేని, చదువుల్లేని పిల్లలు ప్రతీ కొంపలోనూ ఉన్నారు. గిరిజన స్కూళ్లల్లో ఉన్న ఐదారేళ్ల ఆడ పిల్లల్ని కూడా అక్కడి గిరిజన టీచర్లే ఛిద్రం ఛిద్రం చేసేస్తూ ఉంటే, ఏ మాత్రమూ చలించని ప్రభుత్వం, చిన్న కులాల పిల్లలు ఏదో సాహసం చేశారని ముచ్చట పడుతోందా? ప్రభుత్వానికి తెలిసేది ముచ్చట్లూ సరదాలూ కావు. చిన్న కులాల్ని బుట్టలో వేయడమే దానికి బాగా తెలుసు. 'ఈ ప్రభుత్వం చిన్న కులాల్ని ఎంత ప్రేమగా చూస్తోందో!' అని చిన్న కులాలన్నీ బుట్టలో పడాలని దాని ప్రయత్నం.

ఇక, మన తల్లిదండ్రులు ఎలాంటి వాళ్లంటే, ఇప్పటి నుంచీ, ఇంకా అనేక కుటుంబాల్లో, పిల్లలకి విద్యలూ, ఉద్యోగాలూ శుద్ధ దండగ అని గ్రహిస్తారు. పిల్లల్ని కొండలెక్కించే పనిలో పెడితే, వాళ్లు పైకి ఎక్కితే ఎక్కువ డబ్బు వస్తుంది. కిందకి రాలిపోయినా ఎంతో కొంత ఇన్సూరెన్స్ వస్తుంది. కుటుంబం అంతా కాలు మీద కాలేసుకుని గడపడానికి, పిల్లల్ని కొండ లెక్కించే ఉపాయం చాలు. పిల్లలు కిందకి దిగితే దిగుతారు, పోతే పోతారు! అదీ తల్లిదండ్రుల ప్రేమ!

జనాల్లో ఉన్న డబ్బు పిచ్చినీ, కీర్తి పిచ్చినీ, ఎప్పటికప్పుడు మేల్కొలుపుతూ ఉంటే, జనాల్ని ఎన్నెన్ని అడ్డదారులైనా పట్టించడం ప్రభుత్వానికి చాలా తేలిక!

(రచయిత బహు గ్రంథకర్త, మార్క్స్ 'పెట్టుబడి' పరిచయకర్త) వీ

పోటీని ఏర్పర్చడం ఎలా?

రాష్ట్రం రెండుగా విడిపోయి ఎవరికి వారు అభివృద్ధిలో ఎలా పోటీ పడాలో, ఆ పోటీని అభివృద్ధికి ఎలా ఉపయోగించాలో చెబుతూ, అక్టోబర్ విప్లవం రోజులలో లెనిన్ రాసిన వ్యాసాన్ని వివరిస్తున్నారు **ఎన్.వి.ఎస్. నాగభూషణ్**

ఈ వ్యాసాన్ని లెనిన్, అక్టోబర్ విప్లవం విజయవంతం అయిన కొద్ది రోజులకి, డిసెంబర్ 24 – 25 తేదీల మధ్య రాశాడు. ఇందులో ఆయన, బూర్జువా వ్యవస్థలోని పోటీకీ, సోషలిస్టు వ్యవస్థలోని పోటీకీ మధ్య గల వ్యత్యాసాలనూ, వాటి స్వరూప స్వభావాలనూ వివరించాడు. సోషలిజం గురించి అదివరకు కేవలం సిద్ధాంత పూర్వకంగానే మార్క్సిస్టులు వివరించి ఉన్నారు. దాన్ని ఆయన ఆచరణ సాధ్యం చేశాడు. కొత్తగా ఏర్పడ్డ ఆ సోషలిస్టు దేశంలో, పరిస్థితులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఒక పక్క ఇంకా ముగియని మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధం (1914–18) వల్ల జరిగిన అపార నష్టం, మరో పక్క విప్లవ ప్రతీఘాతకుల వల్ల ఎదురైన విధ్వంసం, సవాళ్లు – వీటి మధ్య దేశాన్ని పునర్నిర్మించుకోవడం, ప్రజల మౌలికావసరాలు తీర్చడం, సోషలిస్టు రాజ్య యంత్రాన్ని నిర్మించుకోవడం అనే కర్తవ్యాలు ఒత్తిళ్లలోని శిశు సోషలిస్టు దేశానికి ఎదురయ్యాయి. అలాంటి కర్తవ్యాల నిర్వహణలో, పోటీని ఎలా ఉపయోగించుకోవాలో ఆయన ఈ వ్యాసంలో వివరించాడు. ఏ మాత్రం తీరిక లేకుండా, దేశ మంత్రిమండలి అధ్యక్షునిగా రోజుకి 18 నుంచి 20 గంటలు పని చేస్తూనే, ఆయన ఈ వ్యాసాన్ని రాశాడు. మార్క్సిస్టు బోధకునిగా ఆయన ఈ కర్తవ్యాన్ని మరణించే తుది క్షణాల వరకూ కొనసాగించాడు.

ప్రస్తుతం మన తెలుగు రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోతున్న సందర్భంగా, ఈ రెండు రాష్ట్రాలనూ పాలకులు ఎలా అభివృద్ధి చేస్తారోనని అంతా ఎదురుచూస్తున్న ప్రస్తుత తరుణంలో, పోటీ విషయమైన ఈ మార్క్సిస్టు విశ్లేషణ ఎంతో ఆసక్తిని కలిగిస్తుంది. చూడండి ఈ లెనిన్ వ్యాసం క్లుప్తంగా:

పోటీ, వ్యక్తిగత చొరవా వగైరా సద్గుణాలు పెట్టుబడిదారుల్లోనూ, పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ ఉంటాయంటూ, ఆ సద్గుణాలను బూర్జువా రచయితలు అదే పనిగా పొగుడుతూ ఉంటారనీ, అంతటితో ఆగక, ఆ సద్గుణాల ప్రాముఖ్యాన్ని సోషలిస్టులు అర్థం చేసుకోవడానికి నిరాకరిస్తూ ఉంటారనీ, నిందిస్తూ ఉంటారనీ లెనిన్ వ్యాసారంభంలో చెప్పాడు. నిజానికి ఈ పోటీ వల్ల జనించే చొరవా, చురుకుదనమూ, సాహసిక యత్నం విస్తృతంగా అభివృద్ధి అయ్యేది చిన్న, స్వతంత్ర సరుకుల ఉత్పత్తిలోనేనని ఆయన అంటూ, అలాంటి ఉత్పత్తి స్థానంలో, ఫ్యాక్టరీ ఉత్పత్తినీ, సిండికేట్ల గుత్త సంస్థలూ వగైరాల్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రవేశ పెట్టిందని, ఆయన విమర్శించాడు. తద్వారా ప్రజల్లోనూ, శ్రామికుల్లోనూ గల అత్యధికుల్లో చొరవనూ, చురుకుదనాన్నీ పాశవికంగా అణిచి వేసి, పోటీని తొలగించిందనీ, అందువల్ల దాని స్థానంలో ఆర్థిక దగా, బంధుప్రీతి, దాస్యభావం వచ్చాయని ఆయన వివరించాడు.

దీనికి వ్యతిరేకంగా సోషలిజం, పోటీని అంతమొందించడానికి బదులు, దాన్ని సామూహిక ప్రమాణంలో విస్తృతంగా వినియోగించ డానికి – పెట్టుబడిదారీ వ్యవస్థ చేత అణిచి వేయబడ్డ మెజారిటీ శ్రామిక ప్రజల్ని ఆకర్షించడానికీ, వారిలో సమృద్ధిగా ఉన్న శక్తి సామర్థ్యాలనూ, ప్రజ్ఞలను ప్రదర్శించడానికీ – మొదటిసారి అవకాశాన్ని కల్పిస్తోందని ఆయన తెలియజేశాడు.

ఇప్పుడు సోషలిస్టు ప్రభుత్వం అధికారంలో ఉంది గనుక, పోటీని ఏర్పాటు చేయడం మన కర్తవ్యమని చెపుతూ ఆయన, బూర్జువాల తైనాతీలు, సోషలిజాన్ని నిరంకుశత్వపు, నిస్సారపు బారకాసుల వ్యవస్థ గా వర్ణించారని విమర్శించాడు. డబ్బు సంచుల గులాములూ, దోపిడీ దారుల ఎంగిలి మెతుకులు తినేవాళ్లు అయిన ఈ మేధావులు – పెట్టుబడిదారీ వ్యవస్థలో కఠిన శ్రమ చేసినా, దారిద్ర్యంతో బాధపడుతూ పస్తులుండే ప్రజల్ని నడిపించడానికి, సోషలిజాన్ని ఒక భూతంగా వాడుకున్నారని చెప్పాడు. ఈ కఠిన నరకం నుండి వారిని విముక్తి చేయడానికి తీసుకోవలసిన మొదటి చర్య ఏమంటే, భూ ఎస్టేట్లను స్వాధీనం చేసుకోవడమూ, కార్మికుల అజమాయిషీని ప్రవేశపెట్టడమూ, బ్యాంకుల్ని జాతీయం చేయడమూ అని వివరిస్తాడు. ఆ తర్వాతి చర్యలు ఫ్యాక్టరీల జాతీయకరణ, వినియోగదారుల సంఘాలలో, ఉత్పాదితాలు అమ్మే సంఘాలలో ప్రజలందర్నీ నిర్బంధంగా చేర్చడమూ, ధాన్యం తదితర నిత్యావసరాల వ్యాపారం మీద ప్రభుత్వ గుత్తాధిపత్యం అంటాడాయన.

కనుక ఇప్పుడు మాత్రమే పోటీనీ, సాహసిక ప్రయత్నాన్నీ సామూహికంగా విస్తృత స్థాయిలో ప్రదర్శించడానికి అవకాశం సృష్టించబడింది. పెట్టుబడిదారుల చేత వారి ఫ్యాక్టరీల నుండి వెళ్లగొట్టబడ్డ కార్మికుడు, ఇప్పుడు ఆ ఫ్యాక్టరీలను తామే స్వాధీనం చేసుకొని, భూస్వాముల చేత వారి భూముల నుండి తరిమేయబడ్డ రైతులు, ఇప్పుడు ఆ భూమిని తామే స్వాధీనం చేసుకుని; తమ ప్రజ్ఞను చూపించి, వంగిన నడుమును పైకెత్తి నిటారుగా నిలబడి, తామూ మనుషులమేనని అనుకోవడానికి అవకాశం కలిగింది. శతాబ్దాల తరబడి దోపిడిదారుల కోసం నిర్బంధంగా శ్రమించిన తర్వాత, మొదటి సారిగా తనకోసం తాను పని చేసుకోవడం, పైగా ఆ పనిలో ఆధునిక శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక విజయాల్ని వినియోగించుకోవడం సాధ్యమైంది. అయితే ఇంత గొప్పదైన ఈ మార్పు – వేళ్లు పాతుకుపోయిన పరాన్నభుక్కుల మీదా, వారి ఆశ్రితుల మీదా హింస లేకుండా జరగదనీ, ఈ విషయంలో కార్మికులెవరికీ ఎలాంటి భ్రమలూలేవనీ; దుర్భర దారిద్రం వల్లా, బానిస చాకిరీ వల్లా, అవమానాలకూ, హింసలకూ గురవ్వడం వల్లా రాటుదేలిన వారికి, దోపిడిదారులు చేసే ప్రతిఘటనను భగ్నం చేయడానికి ఎక్కువ

సమయమే పడుతుందని తెలుసునని లెనిన్ చెపుతాడు. అంతేగాక, మేధావుల భ్రమలు వీరికేమాత్రం లేవనీ, ఆ మేధావులు పెట్టుబడిదారుల చర్యల్ని ఖండిస్తూ గావుకేకలు మాత్రం వేస్తారనీ, కానీ చర్యలు తీసుకోవలసి వచ్చినప్పుడు మాత్రం కన్నీళ్లు కారుస్తూ, కొరడా దెబ్బలు తిన్న కుక్క పిల్లల్లా భయపడతారనీ ఆయన వివరిస్తాడు.

అయితే నిర్బంధంగా శ్రమించే పరిస్థితి నుండి, తన కొరకు తాను పని చేసే స్థితికి మారాలంటే, దోపిడిదారుల ప్రతిఘటన అణిచేందుకు మిలటరీ చర్యలతో పాటు, పేదజనం బ్రహ్మండమైన సంఘటిత కృషి జరపాల్సిన అవసరం ఉందని లెనిన్ స్పష్టం చేస్తాడు. ఆ కృషిలో బానిస యజమానులైన పెట్టుబడిదారులతో పాటు, వారి గులాములైన బూర్జువా మేధావుల్ని కూడా కలిసికట్టుగా అణిచి వేయాలని ఆయన హెచ్చరిస్తాడు. అయితే వారేమనుకుంటారంటే, తామే ఎల్లపుడూ ఆర్గనైజర్లుగా, అధికారులుగా ఉండి ఆజ్ఞాపించామని, దాన్ని కొనసాగి స్తామని, సామాన్య ప్రజలు, కార్మికులూ, రైతాంగం చేప్పేది తాము వినమని, డబ్బువల్ల కలిగే అధిక సౌకర్యాల్నీ, ప్రజల మీద పెట్టుబడి అధికారాన్నీ రక్షించేందుకు జ్ఞానాన్ని ఆయుధంగా మారుస్తామనీ! వారికే కాదు, భూస్వాముల తైనాతీలయిన మత గురువులకూ, బ్యూరాక్రాట్లకు కూడా ఫ్యూడల్ దాస్యాన్నీ పోగొట్టు కోవడం కష్టంగా ఉంటుందనీ లెనిన్ అంటాడు. ఏమైనా ఇప్పుడు కార్మికులూ, కర్షకులూ కూడా వారి ప్రతిఘటనను భగ్నం చేయడం మొదలెట్టారనీ, అయితే అది తగినంత దృఢంగా, నిర్దాక్షిణ్యంగా లేకపోయినప్పటికీ అని అంటాడాయన.

సోషలిస్టు విప్లవం తమ మీద మోపిన కర్తవ్యాన్ని సామాన్య ప్రజలూ, పేద రైతులూ నిర్వహించలేరనీ, అది తమవల్లనే సాధ్యమనీ, పెట్టుబడిదారులకూ, వారి రాజ్యానికీ సేవ చేయడానికి అలవాటుపడిన మేధావులు భావిస్తారు గానీ, అది నిజం కాదని లెనిన్ చెపుతాడు. ఎందుకంటే, విద్యావంతులు ఇప్పటికే శ్రామిక ప్రజల పక్షాన నిలబడుతూ, పెట్టుబడి సేవకుల ప్రతిఘటనను భగ్నం చేయడంలో తోడ్పడుతున్నారని ఆయన గుర్తు చేస్తాడు. అంతేగాక రైతుల్లోనూ, కార్మికుల్లోనూ ఎంతో మంది ఆర్గనైజర్లున్నారని చెపుతూ, వారు తమలోని శక్తి సామర్థ్యాన్ని గుర్తించడమూ, క్రియాశీలంగా, సృజనాత్మకంగా సాగే కృషి పట్ల మొగ్గు చూపించడమూ, సోషలిస్టు సమాజాన్ని నిర్మించే కర్తవ్యానికి స్వంతంగా పూనుకోవడమూ ఇప్పుడే మొదలైందని వివరిస్తాడు.

ఈనాటి ముఖ్య కర్తవ్యాలలో ఒకటి ఏమిటంటే, సృజనాత్మక సంఘటనకు సంబంధించిన కృషిలో యావత్తు శ్రామిక ప్రజల స్వతంత్ర చొరవను విస్తృతంగా అభివృద్ధి చేయడం! ధనికుల పాఠశాలల్లో చదువుకున్న పై వర్గాలు మాత్రమే రాజ్యపాలనకూ, సోషలిస్టు సమాజ నిర్మాణానికి దర్శకత్వం వహించడానికి సమర్థమనే పాత, అసంబద్ధ దురాభిప్రాయాన్ని పటాపంచలు చేయడం? ఈ దురభిప్రాయాన్ని, దోపిడి పాలన ఎవరి ప్రయోజనాలకు అనుకూలమో, ఆ పెట్టుబడిదారుల స్వార్థం పెంచి పోషిస్తోందని ఆయన చెపుతాడు. అయితే తమకు జ్ఞానశక్తి అవసరమనే విషయాన్ని శ్రామికులు విస్మరించరని అంటూ, చదవనూ రాయనూ వచ్చి, మనుషుల్ని అంచనా వేయగలిగిన ఆచరణాత్మక అనుభవం గల ప్రతి శ్రామికుడూ సంఘటనాత్మక కృషి చేయగలడనీ, సామాన్య ప్రజల్లో అలాంటి స్త్రీ పురుషులు కొల్లలుగా ఉన్నారనీ, వారిలోని ప్రజ్ఞ ఇంకా వినియోగింప బడకుండా ఉందనీ ఆయన వ్యాఖ్యానిస్తాడు.

నేటికీ ఇంకా కార్మికులూ, కర్షకులూ బెరుగ్గానే ఉన్నారనీ, తామే ఇప్పుడు పాలక వర్గమనే భావనకు ఇంకా వారు అలవాటు పడలేదని లెనిన్ చెపుతాడు. పేదరికం చేతా, ఆకలి చేతా తమ జీవితమంతా కక్రపెత్తనం కింద పని చేసేట్లు నిర్బంధించబడ్డ వీరిలో, ఇంకా ఈ భావాన్ని ఒక్కదెబ్బలో ఎక్కించలేక పోయిందనీ, అయితే 1917 అక్టోబర్ విప్లవం బలీయమైందీ, అజేయమైందీ గనుక, అది ఈ భావాన్ని వారిలో కొద్దికాలంలోనే మేల్కొలిపి, పాత ప్రతిబంధకాన్ని బద్ధలు చేసి, వారిని నూతన జీవిత మార్గంలోకి నడిపిస్తుందనీ ఆయన భరోసా ఇస్తాడు.

నేడు ప్రతి కార్మిక, సైనిక, రైతు ప్రతినిధుల సోవియట్కూ, వినిమయదారుల సంఘానికీ, సరఫరా సంఘానికీ, అలాగే ఫ్యాక్టరీ కమిటీ లేక సాధారణ కార్మికుల అజమాయిషీ సంస్థకూ ప్రధాన ఆర్థిక కర్తవ్యం ఏమిటంటే – లెక్కలు రాయడమూ, అజమాయిషీ చేయడమూ శ్రమ భారాన్ని తగ్గించడమూ అని చెపుతూ ఆయన, బూర్జువావర్గం నుండి కనీసం ముక్కను పొందడం లక్ష్యంగా గల పూర్వ బానిస దృక్పథానికి వ్యతిరేకంగా, పురోగామి దృక్పథం గల కార్మికులు ఇప్పటికే పోరాటాన్ని ప్రారంభించారనీ, ఇప్పుడు ప్రజల వశంలోకి వచ్చిన ఫ్యాక్టరీని, పాత పద్ధతిలో వీలైనంత ఎక్కువ గుంజుకుని దారి పట్టాలనుకునే వారిని ప్రతిఘటిస్తున్నారనీ, వీరి పక్కన వర్గ చైతన్యం గల ఇతర శ్రామికులూ, రైతులూ నిలబడుతున్నారనీ ఆయన చెపుతాడు.

కార్మిక వర్గపు రాజ్యాధికారం నెలకొల్పబడి, స్థిరపరచబడిన తర్వాత, సోషలిస్టు పరిణామం సారం ఏమంటే అత్యున్నత రాజ్యాధికారంగా వ్యవహరించే కార్మిక, సైనిక, రైతు ప్రతినిధుల సోవియట్ల చేత, లేక ఆ సోవియట్ల ఆదేశాల మేరకు నిర్వహించబడే – చేసిన శ్రమ మొత్తానికి, సరుకుల పంపకానికీ లెక్కలు రాయడమూ, అజమాయిషీ యేనంటాడు లెనిన్! సోషలిజానికి జరిగే పరివర్తనకు అత్యవసరమైన ఇవి, ప్రజల చేత మాత్రమే నిర్వహించబడగలవని ఆయన స్పష్టం చేస్తాడు. అలాగే ఈ పీడిత పెట్టుబడిదారీ సమాజ అవశేషాలుగా, మానవ సమాజపుమడ్డిగా, కృశించి చచ్చుబడ్డ అంగాలుగా ఉన్న, ధనికులూ, దొంగలూ, సోమరులూ, రౌడీలనూ జయించి, వారి శ్రమకు సంబంధించిన లెక్కలు రాయడమూ, అజమాయిషీ చేయడమూ సరిగ్గా జరగాలంటే, కార్మిక, కర్షకుల చైతన్య పూరిత, విప్లవోత్సాహంతో కూడిన సహకారంతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేస్తాడు. అందువల్ల ఇప్పుడు ప్రజల ఆస్తి అయిన భూమీ, బ్యాంకులూ, ఫ్యాక్టరీలూ – వీటికి సంబంధించిన ఉత్పత్తికీ, పంపకానికి లెక్కలు రాసి, అజమాయిషీ చేయడానికి పూనుకోవలసిందిగా ఆయన కార్మికుల్నీ, కర్షకుల్నీ, ఇతర సమస్త శ్రామికుల్నీ, పీడితుల్నీ అభ్యర్థిస్తాడు. అలా వారు చేయడమే సోషలిజం విజయానికీ, దారిద్ర్యం మీది విజయానికీ హామీ అని, ఎందుకంటే, ప్రతి ఒక్కరి అవసరాలూ తీర్చేందుకు సరిపడినన్ని సమస్త వనరులూ దేశంలో ఉన్నాయనీ, అయితే అందురూ శ్రమించి, దాని ద్వారా ఉత్పత్తి అయిన వాటిని సక్రమంగా పంపిణి చేయాలనీ, ఆ పంపిణి మీద ప్రజల ఆచరణయుత అజమాయిషీ నెలకొల్పితేనే; అలాగే ప్రజల శత్రువులైన ధనికులూ, వారి పరివారమూ, దొంగలూ, సోమరులూ, రౌడీలూ – వీరిని రాజకీయాల్లోనే గాక, ఆర్థిక జీవితంలోనూ ఓడించగలితేనే – ఇదంతా సాధ్యమని ఆయన వెల్లడిస్తాడు.

ప్రజలకూ, సోషలిజానికీ, అలాగే శ్రామిక వర్గానికి శత్రువులైన వారి పట్ల ఏమాత్రం కనికరం చూపకూడదంటాడు లెనిన్. ధనికుల మీదా వారి పరివారం మీదా, బూర్జువా మీదా, ఇంకా సోమరుల మీదా, రౌడీల మీదా వారి మరణం దాకా యుద్ధం చేయాలనీ, ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థ అగ్రవర్ణ బూర్జువా సమాజ సంతానమే వీరంతా అంటాడాయన. ఆ సమాజంలో కొద్దిమంది మనుషులు ప్రజల్ని దోచుకున్నారు. ఆ సమాజంలో పేదరికం వేల మందిని రౌడీ జీవితంలోకీ, నైతిక పతనంలోకీ, వంచనలోకీ తోసి, వాళ్ళ మానవత్వపు ఛాయలన్నింటినీ కోల్పోయేట్లు చేసింది. మోసం ద్వారానైనా సరే దోపిడి నుంచి తప్పించుకోవాలనే కోరికను, ఒక్క క్షణం సేపైనా సరే అసహ్యమైన శ్రమ నుంచి తప్పించుకోవాలనే కోరికను, పస్తులుండకుండా ఉండడం కోసం, తానూ, తన ఆత్మీయులూ అనుభవించే ఆకలి మంటల్ని చల్లార్చుకోవడానికి ఏ మార్గం చేతనైనా సరే, ఒక బ్రెడ్ ముక్కనైనా సరే గుంజుకోవాలనే కోరికను శ్రామికునిలో అనివార్యంగా కలిగించింది. ఈ సమాజం అంటూ ఆయన, పేదరికం మనుషుల్లో ఎలాంటి ఆలోచనలకు, చర్యలకూ ప్రేరేపించేదీ ఎంతో ఆగ్రహంతో విశ్లేషిస్తాడు.

ఆయన తన విశ్లేషణను కొనసాగిస్తూ, ధనికులూ, దొంగలూ ఒకే నాణానికి రెండు పార్శ్వాలని చెపుతాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ పోషించిన పరాన్నభుక్కులలో రెండు ప్రధాన రకాలైన వీళ్ళు, సోషలిజానికి ప్రధాన శత్రువులనీ, కనుక వీరందరినీ ప్రజలందరి తనిఖీలోనూ ఉంచి, సోషలిస్టు సమాజపు చట్టాల్నీ, నిబంధనల్నీ ఏ మాత్రం ఉల్లంఘించినా, నిర్దాక్షిణ్యంగా శిక్షించాలనీ, ఈ విషయంలో ఏమాత్రం బలహీనతా, తటపటాయింపూ, మెతక దనమూ ప్రదర్శించినా, అది సోషలిజం పట్ల గొప్ప నేరమే అవుతుందనీ హెచ్చరిస్తాడు. అంతటితో ఊరుకోకుండా, ఈ పరాన్నభుక్కుల్ని సోషలిస్టు సమాజానికి హానికరం కాకుండా చేసేందుకు, కార్మికులూ, రైతులూ, సమస్త ప్రజలూ ఐచ్ఛికంగా, చురుగ్గా విప్లవోత్సాహంతో పాల్గొంటూ, చేసిన మొత్తం పనికీ, సరుకుల ఉత్పత్తికి, పంపకాలకు లెక్కలు రాసి, అజమాయిషీ చేయాలనీ, ఈ పని చిత్తశుద్ధీ, తెలివీ, సమర్థుడైన ప్రతి కార్మికుడికీ, రైతుకూ చేతనైన దాన్ని ఏర్పాటు చేసేందుకు, వారిలో నిక్షిప్తమైన ప్రజ్ఞను రేకెత్తించాలనీ, అలాగే వారిలో పోటీని రేకెత్తించాలనే ఆయన బోధిస్తాడు. అయితే ఈ పోటీ జాతీయ ప్రమాణంలో ఉండాలని వక్కాణిస్తాడు. అయితే విద్యావంతుని అవసరమైన సలహాకూ, అలాగే విద్యావంతులలో అంత మామూలుగా ఉండే క్రమరాహిత్యం మీద సామాన్య కార్మికుల, రైతుల అవసరమైన అజమాయిషీకీ మధ్య గల భేదాన్ని వారు స్పష్టంగా గ్రహించేలా చూడాలని కూడా ఆయన హెచ్చరిస్తాడు.

విద్యావంతులలో సాధారణంగా ఉండే గుణాలు ఏవంటే, క్రమశిక్షణా రాహిత్యం, అజాగ్రత్త, తొందరపాటు, ఆచరణకు బదులు చర్చలు చేసే ధోరణి, పనికి బదులు మాట్లాడే ధోరణి, ప్రతిదానికీ పూనుకొని, దేనిని ముగించకుండా ఉండడం అని చెప్పిన ఆయన, వారలా ఉండడానికి కారణం, వారు సహజంగా చెడ్డవారు అయినందువల్లనో, దుర్బుద్ధి ఉండడం వగైరాల వల్లనో కాదనీ, వారి జీవితపు అలవాట్ల వల్ల, వాళ్ళ పని పరిస్థితుల వల్ల, అలసట వల్ల, శారీరక శ్రమ నుండి బౌద్ధిక శ్రమ విపరీతంగా వేరు పడడం వగైరా వల్లనేనని విశ్లేషిస్తాడు.

మన మధ్యన ఉన్న మేధావుల ఈ శోచనీయమైన గుణాల వల్ల, వారి సంఘటనాత్మక కృషి మీద కార్మికుల తనిఖీ తగినంత లేకపోవడం వల్ల కలిగే పొరపాట్లూ, లోపాలూ, తప్పుల వల్ల, కలిగే నష్టం తక్కువేమీ కాదని లెనిన్ చెపుతాడు. అంతమాత్రం చేత వారి సూచనలనూ, సలహాలనూ మనం పట్టించుకోకుండా ఉండలేమని కూడా ఆయన అంటాడు .తెలివైన కార్మికుడికీ కూడా ఈ సంగతి తెలుసుననీ, కనుకనే వారు తమపట్ల తగినంత గౌవరం చూపడం లేదని మనతో ఉన్న మేధావులు అనలేరని ఆయన గుర్తు చేస్తాడు. అయితే సలహాలూ, సూచనలూ వేరనీ, ఆచరణాత్మకంగా లెక్కలు రాయడం, అజమాయిషీ చేయడం వేరని ఆయన అంటూ, నిజానికి మేధావులు తరుచుగానే మంచి సూచనలూ, సలహాలూ ఇస్తారని, అయితే వాటిని అమలు చేసే విషయంలో మాత్రం వారు అసంబద్ధంగా, అసమర్థంగా ఉంటారని ఆయన వివరిస్తాడు. సరిగ్గా ఈ కారణం వల్లనే శ్రామిక వర్గం నుండి వచ్చే ఆర్గనైజర్ల నాయక పాత్రను విస్మరించడం కేవలం అసాధ్యం అంటారాయన. 'కుండలు చేసేది ఎవరో దేవుడు' కాదని వారు బాగా వంటపట్టించుకోవాలని ఆయన చెపుతాడు. ఇప్పుడు అంతా ఆచరణ మీదే ఆధారపడి ఉందనీ, సిద్ధాంతం ఆచరణలోకి మార్చబడుతూ, దాని చేతే జీవవంతం చేయబడుతూ, దాని చేతే పరీక్షించబడే చారిత్రక తరుణం ఆసన్నం అయ్యిందని వారు గ్రహించాలి అంటాడాయన.

కనుక ఇప్పుడు కార్మికుల నుండీ, రైతుల నుండీ వచ్చిన ఆచరణాత్మక ఆర్గనైజర్ల మధ్య పోటీ ఏర్పాటు చేయాలని లెనిన్ చెప్పాడు. మేధావులకి ఇష్టమైనట్లుగా అన్ని పనుల్నీ ఒకే విధంగా ఉండేట్లుగా, అలా ఉండేట్లు చేసేలా పై నుంచి విధించే ప్రతి ప్రయత్నాన్నీ ఎదిరించాలని, ఎందుకంటే ఇలా ఒకే విధమైన పనులకూ, పై నుండి విధించే ఏక రూపతకూ, సోషలిస్టు కేంద్రీకరణకూ ఏమీ సామ్యం లేదని ఆయన స్పష్టం చేస్తాడు.

పరాన్న భుక్కులైన ధనవంతుల్నీ, దొంగల్నీ, క్రమరహితంగా ప్రవర్తిస్తూ గావుకేకలు వేసే మేధావుల్నీ ముఖ్య, మౌలిక విషయాల్లో, సార, ఏకత్వ వివరాల్లో, ప్రత్యేక స్థానిక లక్షణాల్లో, దృక్పథం, అజమాయిషీ పద్ధతుల్లో – ఇలా వేర్వేరు మార్గాల్లో నిర్మూలించడం, ప్రమాదరహితుల్ని చేయడం ద్వారా, ఎంతో వైవిధ్యం ఏర్పడుతుందని ఆయన తెలిపాడు. కింది నుండి చొరవా, ఆచరణ స్వేచ్ఛా, చురుకుదనం అనే వాటిని వైవిధ్య రూపాలు గల ఐచ్ఛిక కేంద్రీకరణతో ఎలా మేళవించాలి అన్న దానికి పారిస్ కమ్యూన్ గొప్ప ఉదాహరణగా ఆయన పేర్కొంటాడు. సోవియట్లు ఇదే మార్గాన్ని అనుసరిస్తున్నా, అవి ఇంకా బెరుగ్గా ఉన్నాయనీ, పనిలో పూర్తిగా నిమగ్నం కాలేదనీ, సోషలిస్టు పద్ధతుల్లో నిర్మించే గొప్ప సృజనాత్మక కర్తవ్యానికి ఇంకా అలవాటు పడలేదని, అవిమరింత ధైర్యంతో, మరింత చొరవను ప్రదర్శించాలని ఆయన స్పష్టం చేస్తాడు.

పైన చెప్పిన విషయాన్ని వివరిస్తూ ఆయన, కమ్యూన్లూ, ఫ్యాక్టరీలూ, వినిమయదారుల, సరఫరాల కమిటీలూ అన్నీ – శ్రమకూ, సరుకుల పంపిణీకీ లెక్కలు రాయడం, అజమాయిషీ చేయడం ఏర్పాటు చేసే ఆచరణాత్మక ఆర్గనైజర్లుగా ఒకదానితో ఒకటి పోటీ పడాలనీ చెపుతూ ఆయన, ఆ కార్యక్రమం ఎంతో సరళమైందీ, స్పష్టమైందీ, అందరికీ అర్థమయ్యేదీ అని అంటాడు. ప్రతి ఒక్కరికీ అత్యవసరమైన సౌకర్యాలు కల్పించడం, ప్రతి ఒక్కరూ అంతరాత్మ సాక్షిగా పని చేయడం, ఒక్క దొంగని కూడా, అలాగే చట్టాల్నీ, నిబంధనల్నీ ఉల్లంఘించే ధనవంతున్నీ జైల్లోకీ లేదా నిర్బంధ శ్రమలోకి పంపించడం – ఇదే వ్యవహారాలు ఆచరణాత్మకంగా ఏర్పాటు చేసే పద్ధతి. పని చేయని వానికి తిండి ఉండరాదనేదీ సోషలిజం ఆచరణాత్మక సూత్రం. ఇవే మన కమ్యూన్లూ, కార్మిక, కర్షిక ఆర్గనైజర్లూ గర్వించాల్సిన ఆచరణాత్మక విజయాలు

మావోయిస్టు ఆత్మహత్య రాజ్యం చేసిన హత్య

- తుంపాల శ్రీరామమూర్తి

ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా గుమ్మ బ్లాక్ పుట్టమర్రి గ్రామానికి చెందిన ఆదివాసి యువకుడు పాంగి మంగరాజు రిమాండ్ ఖైదీగా విశాఖ కేంద్ర కారాగారంలో 2010 సెప్టెంబర్ 15 నుండి శిక్ష అనుభవిస్తున్నారు. జైలుకు రాకముందు ఆయన గతంలో మావోయిస్టు పార్టీలో కొనసాగుతూ చిత్రకొండ ఏరియా కమిటీ బాధ్యుడుగా పని చేస్తున్నట్లు తెలిసింది. ఆయనను 2010లో విశాఖ ఏజెన్సీ జికె వీధి మండలం ఏబులం గ్రామం వద్ద పోలీసులు అరెస్టు చేసి రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించి ఆ తదుపరి సెప్టెంబర్‌లో విశాఖ కేంద్ర కారాగారానికి తీసుకొని వచ్చారు. మొదట ఒక కేసులోనే అరెస్టు చూపించి, ఆ తదుపరి ఆయుధాలు కలిగి ఉండడం, కిడ్నాపులు, హత్యలు, బలిమెల ఘటన మొదలైన అనేక కేసులు బనాయించారు. జైల్లో ఉండగానే కేసులు 23కు చేరాయి. కొన్ని కేసులు కొట్టి వేశారు. కొన్నింటికి బెయిల్ లభించింది. ఇంకా ఎనిమిది కేసులలో బెయిల్ రావలసి ఉంది. సెషన్స్ కోర్టు కేసులో హైకోర్టును ఆశ్రయించినప్పటికి బెయిల్ పిటిషన్ డిస్మిస్ అయింది. ఉన్న కేసులలో పోలీసులు సకాలంలో ఛార్జిషీట్లు పెట్టకపోవడం, వాయిదాలకు సాక్షులను హాజరు పరచక పోవడం, న్యాయమూర్తులు వాయిదాల మీద వాయిదాలు వేయడం, అనారోగ్యంతో కోర్టులకు తిరగడం వలన ముద్దాయి మంగరాజు తీవ్ర మానసిక క్షోభకు గురయి, మానసిక స్థితి బాగులేనందున మానసిక చికిత్సాలయంలో మూడు నెలలు చికిత్స పొందారు. విశాఖ కేంద్ర కారాగారంలో మావోయిస్టు అగ్రనేతలు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీళ్లపై కూడా అనేక అక్రమ కేసులు ఉన్నాయి. వీరు జైలుకు వచ్చి మూడేళ్లు దాటింది. ఒక ఆదివాసి గిరిజన మహిళ మావోయిస్టు కార్యకలాపాలలో పాల్గొంటూ గత ఎనిమిది సంవత్సరాలుగా రిమాండ్ ఖైదీగా ఈ కారాగారంలో ఉన్నారు. ఈమె పేరు తాంబేలు కమల. ఈమెపై 30కి పైగా కేసులు ఉన్నాయి. అనారోగ్య పీడితురాలు. ఈమెది చింతపల్లి మండలం. ఈ జైల్లో సుమారు 400 మంది రిమాండ్ ఖైదీలే. చాలా మంది చిన్న కేసులలో వచ్చిన వారైనప్పటికీ బెయిల్ దొరక్క, దొరికినా సూరిటీలు తెచ్చుకో లేక జైల్లో మగ్గుతున్నారు. జైళ్లలో పరిస్థితులు వీరిని క్రుంగదీస్తున్నాయి. ఇటువంటి వాతావరణంలో ఖైదీలు రోగగ్రస్తులవుతున్నారు. పోలీసుల కుట్ర పూరిత వైఖరి, న్యాయ వ్యవస్థ నిర్లక్ష్యం, జైలు అధికారుల బాధ్యతారాహిత్యం వలన మానసిక ఆందోళనకు గురై మావోయిస్టు రిమాండ్ ఖైదీ పాంగి మంగరాజు (36) 2014 జూన్ 28న కారాగారం ప్రాణహిత బ్యారక్‌లో ఉరి వేసుకొని చనిపోయారు. ఆయన మృతి రాజ్యం చేసిన హత్యగా భావిస్తున్నాం. మావోయిస్టు రిమాండ్ ఖైదీ జైల్లో ఆత్మహత్యకు పాల్పడడం రాష్ట్రంలో మొదటి సంఘటన. న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం.

(మంగరాజు 2013 వీక్షణం ఆగస్టు సంచికలో 'ఒక ఆదివాసి రాజకీయ ఖైదీ కథ' పేరుతో వ్యాసం రాశారు.)

(రచయిత పౌరహక్కుల సంఘం కార్యకర్త) వీ

అంటూ వివరిస్తాడాయన.

ధనికుల, దొంగల, సోమరుల లెక్కలు, అజమాయిషీకి సంబంధించి వేలాది ఆచరణీయ పద్ధతుల్నీ, సాధనాలనూ, కమ్యూన్లూ, పట్టణాలూ, గ్రామాలలోని చిన్న సంస్థలు తామే రూపకల్పన చేసి ఆచరణలో పరీక్షకి పెట్టాలనీ, వాటిలో వైవిధ్యమే ప్రతిఫలానికి హామీ అనీ అంటాడు లెనిన్. రష్యాకి పురుగులూ, నల్లులూ వంటి దొంగలూ, ధనికులూ వగైరాల నుండి శుద్ధి చేయడం అనే ఏకైక సమిష్టి లక్ష్యాన్ని సాధించడమే విజయానికి హామీ అంటూ, దానికి కొన్ని ఉదాహరణ లిస్తాడు. ఒక చోట పదిమంది ధనికులూ, డజను మంది దొంగలూ జైలుకి పంపబడితే, మరో చోట పాయిఖానాలు ఊడ్చే పనికి నియమింపబడతారనీ, ఇంకో చోట శిక్షాకాలం పూర్తయ్యాక వారు మారిందాకా, వారి మీద ప్రతి ఒక్కరి కన్నూ ఉండేట్టుగా, వారికి 'పనికిరాని వ్యక్తి సర్టిఫికేట్లు' ఇవ్వబడతాయనీ, వేరొకచోట ఒక సోమరిని కాల్చి వేయవచ్చుననీ, మరోచోట కొన్ని పద్ధతుల్ని కలిపి ఉపయోగించ వచ్చునని, ఎలాగంటే, తప్పులు దిద్దుకోగల ధనికులనూ, బూర్జువా మేధావుల్నీ, దొంగల్నీ, రౌడీల్నీ ప్రొబేషన్ మీద విడుదల చేయడం ద్వారా వారు మారడానికి అవకాశం ఇవ్వబడుతుందనీ, ఇలా వైవిధ్యం ఎక్కువయ్యే కొద్దీ మన సాధారణ అనుభవం ఉపయోగకరంగా, మరింత సంపన్నంగా ఉంటుందనీ, అప్పుడు సోషలిస్టు విజయం నిశ్చలంగా, మరింత వేగంగా ఉంటుందనీ ఆయన ఉదాహరణ పూర్వకంగా వివరిస్తాడు.

అంతటితో సరిపుచ్చకుండా ఆయన, ప్రజ్ఞావంతులైన ఆర్గనైజర్లు ఆచరణలో ఏయే అంశాల్లో ముందుకు రావచ్చునో కూడా ఉదాహరిస్తాడు. ఏ కమ్యూన్‌లో, ఏ నగరంలో, ఏ పేటలో లేదా ఫ్యాక్టరీలో, గ్రామంలో పస్తులున్న వాళ్లు గానీ, నిరుద్యోగులుగానీ, సోమరులుగానీ, ధనికులుగానీ లేరు? ఇంకా ఏహ్యమైన బూర్జువా వర్గ గులాములు లేరు? మేధావులమని చెప్పుకునే విధ్వంసకారులు లేరు? అలాగే శ్రమ ఉత్పాదకత పెంచడానికి, బీదలకు కొత్త ఇళ్లు కట్టడానికి లేదా వారిని ధనికుల ఇళ్లల్లో ఉంచడానికి, ప్రతి పేద కుటుంబంలోని ప్రతి పసిబిడ్డకూ ఒక పాల సీసా తప్పకుండా ఇవ్వడంలో అన్ని చోట్ల కంటే ఎక్కడ ఎక్కువ కృషి జరిగింది? వగైరాలు. అలాంటి ఆర్గనైజర్లను, ప్రభుత్వ పరిపాలనలోకి ప్రమోట్ చేయాలని స్పష్టం చేసిన ఆయన, ప్రజల్లో ప్రజ్ఞ చాలా ఉందనీ, అది ఇంత వరకూ అణిచి వేయబడిందనీ ఆరోపిస్తాడు. ఇప్పుడు వారికి తమని తాము వ్యక్తం చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని చెపుతూ, వాళ్లు మాత్రమే ప్రజల అండదండలతో రష్యానీ, సోషలిజాన్నీ కూడా రక్షించగలరన్న ఆశా భావాన్ని వ్యక్తం చేస్తూ, సోషలిస్టు వ్యవస్థలో పోటీని ఏవిధంగా, ఎంత ఉపయోగకరంగా వినియోగించుకోవచ్చో, అత్యంత ప్రతిభావంతంగా వివరిస్తాడు లెనిన్.

(రచయిత రిటైర్డ్ లెక్చరర్) వీ

క్రికెట్ ఓ విష జ్వరం

***ప్రజలు తమ మౌలిక సమస్యల గురించి ఆలోచించకుండా ప్రభుత్వాలు, బహుళజాతి సంస్థలు కలిసి మత్తు మందుగా ప్రజలపై ప్రయోగిస్తున్న క్రికెట్‌ను వదిలి, విలువలను, సమస్యల పరిష్కారాలను చూపే సాహిత్యం చదవడం కోసం ఆ సమయాన్ని వెచ్చించాలని అంటున్నారు* జె.ఆర్. నాగభూషణం**

బానిస సమాజంలో బానిసల్ని, యజమానులు తమ ఆస్తిగా పరిగణించే వారు. వాళ్లని బహిరంగంగా వేలం వేసేవారు. బానిసలకు బానిసత్వం అవమానం అన్న చైతన్యం కలిగిన తరవాత, బానిసలు తమ విముక్తి కోసం పోరాటాలు జరిపారు. ఇటీవల పెట్టుబడిదార్లు క్రికెటర్లని వేలం పాట పాడారు. క్రికెటర్లు బానిసల్లాగ తిండి దొరికితే చాలు అనుకునే సమాజంలోనో, స్థితిలోనో ఉన్నవాళ్లు కారు. తమని వేలం వేయడమేమిటి అన్న స్పృహ కలిగినా, దానివల్ల బాగా డబ్బు లొస్తాయి కాబట్టి వాళ్లకది అవమానం అనిపించదు. పూర్వం మనుషులు తమ పని తాము చేసుకుంటూ, విశ్రాంతి సమయంలో తమలోని కళని అభివృద్ధి పరుచుకునేవారు. ఆ క్రమంలో శిల్పాలు చెక్కడమూ, చిత్రాలు గీయడమూ లాంటివి చేసేవాళ్లు. ఆటలు ఆడడం కూడా అలాంటిదే.

ఒక మనిషి ఒక ఆటని రోజూ ఆడితే అందులో ఎంతో కొంత నైపుణ్యం అలవడుతుంది. దానికి తోడు సహజంగానే కొందరిలో ఉండే నైపుణ్యం తోడైతే కావచ్చు. కానీ ఉత్త ఆటలాడడం వల్లే మనిషి పోషణకు కావలసిన రోజువారీ అవసరాలు తీరవు. అవసరాలు తీరిన తరవాత, విశ్రాంతి సమయాల్లో ఆటలాడడం మనిషికి అవసరం. కానీ తలకిందుల సమాజంలో చాలా విషయాలు తలకిందులుగానే ఉంటాయి. మనం చాలా వాటికి అలవాటు పడడం వల్ల మనకు కొన్ని విషయాలకు ఆశ్చర్యం, ఆలోచన కలగదు. ఉదాహరణకు, మీరేం చేస్తారని అడిగితే, నేను క్రికెట్ ఆడతాను అని చెపితే అది హాస్యాస్పదంగా ఉండాలి. కానీ ఉండదు. పిల్లలు ఎక్కడైనా క్రికెట్ ఆడుతుంటే, 'ఎప్పుడు చూసినా ఏమిటీ ఎదవ క్రికెట్' అని అనిపించదు. మారుగా, 'ఏమో ఎవరికి తెలుసు, పెద్దయిన తరవాత క్రికెటర్ అయినా అవుతాడేమో' అని మనసులో ఏ మూలో అనిపించవచ్చు కూడా. ఎందుకంటే ఈ ఆట ఇప్పుడు ఫలానా క్రికెటర్లకు డబ్బులు సంపాదించి పెడుతుంది.

ఒక ఆట మానసికోల్లాసం కోసం, శరీర వ్యాయామం కోసం ఆడాల్సింది, ఇప్పుడు డబ్బులు సంపాదించి పెట్టే ఒక 'ఉద్యోగం'! అది క్రికెట్టే కానక్కర్లేదు. ఫుట్‌బాల్ కావచ్చు. బ్యాడ్మింటన్ కావచ్చు. మనదేశంలో మిగతా ఆటల్ని వెనక్కి నెట్టి క్రికెట్టే ముందుంది. ఇంకో దేశంలో బ్యాడ్మింటన్, మరోదేశంలో ఫుట్‌బాల్ ఉండొచ్చు. ఏ ఆటకు అయితే టివిల ద్వారా, మిగతా మాధ్యమాల ద్వారా ఎక్కువ ప్రచారం జరిగితే ఆ ఆటే మిగతా ఆటలకన్నా 'ముందున్నట్టు' లెక్క.

ఇప్పుడు చాలా మంది పిల్లలు కూడా మునుపటి లాగా ఏ కోతి కొమ్మచ్చో, దాగుడుమూతలో, గోళీలో ఆడడం లేదు. రెండు, మూడు కర్రలూ, రెండు ఇటుకలూ, రాళ్లూ, ఒక బంతీ, కొంచెం చోటూ ఉంటే చాలు. అక్కడ పిల్ల క్రికెటర్లు తయారవుతారు. పెద్దవాళ్లు ఇంటర్నెట్‌లోనూ, టివిల ముందూ కూర్చుని క్రికెట్ చూస్తుంటే, పిల్లలు మాత్రం ఏం చేస్తారు? వాళ్లకీ అదే పిచ్చి అంటుకుంటుంది. ఎక్కడైనా ప్రమాదంలో కొంతమంది చనిపోయినట్టు పత్రికల్లో వార్తలు వచ్చినా ఆ వార్త అంతగా ఎవరికీ పట్టదు. పట్టినా దాని గురించి ఒకటో, రెండో మాటలు మాత్రమే. అయితే ఫలానా క్రికెటర్ బ్యాట్‌తో బంతిని కొట్టినా, బంతిని పట్టినా ఏం ఆశ్చర్యమో! గంటల తరబడి ఆ మ్యాచ్ గురించే మాట్లాడతారు. కొందరికైతే క్రికెటర్ల చరిత్రంతా కొట్టిన పిండి, వంటింట్లో ఏ డబ్బా ఎక్కడుందో తెలియక పోయినా, ఆ క్రికెటర్‌ది ఏ ఊరు, అతడి భార్య పేరు, పిల్లలెంత మంది, పెళ్లి కాకపోతే ఎవరితో ప్రేమలో పడ్డాడు, ఏ మ్యాచ్‌లో ఎన్ని పరుగులు తీశాడు అన్నీ తెలుస్తాయి.

క్రికెట్ గురించి తెలియకపోతే, తెలుసుకోకపోతే అవమానం అన్నంత పరిస్థితి ఇప్పుడు. అసలు ఈ ఆటలోకి దేశభక్తి కూడా చొరబడింది. ముఖ్యంగా ఇండియా, పాకిస్థాన్‌తో ఆడేటప్పుడు, అది కూడా వన్డే మ్యాచ్ అయితే దాని కథే వేరు. ఇండియా ఆ దేశం మీద గెలిస్తే, అది ఆటలో గెలుపులాగా ఉండదు. శత్రుదేశంపై సైన్యం గెలుపులాగా ఉంటుంది ఆ సంబరాలు. అభిమానులు టపాకాయలతో మొదలుపెట్టి, స్వీట్లు పంచడం వరకూ చేస్తారు. అంతే కాదు, జుట్టుని ఇండియా మ్యాప్‌లాగా కత్తిరించుకోవడం, మొహంపై, జెండాలో ఉన్న రంగుల్ని పెయింటింగ్‌లా పూసుకుని స్టేడియానికి వెళ్లడం లాంటివీ చేస్తారు. ఓడితే, క్రికెటర్లని నోటి కొచ్చినట్టు తిడుతూ ఉంటారు.

ఇంతకు ముందైతే సరిగా ఆడలేని వాళ్ల మీద నీళ్ల సీసాలు విసిరేవారు. అంతే కానీ ఆటలో గెలుపు, ఓటములు సహజం అన్న భావన ఉండదు. క్రికెటర్లు డబ్బులు పుచ్చుకుని కావాలని ఓడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. వేలంలో ఎవరెక్కువ పాడితే వాళ్లకే వస్తువులు సొంతంలాగా, ఎవరెక్కువ డబ్బిస్తే వాళ్లు చెప్పినట్టే చేయాలి. పురుగుల అవశేషాలు బయటపడ్డ శీతల పానీయాలు అని తెలిసినా (కోకోకోలా, పెప్సీ), సోడా ప్రచారం మరుగున విస్కీకే ప్రచారం (మెక్డోవెల్స్) అని తెలిసినా డబ్బులు వస్తే చాలు అని అడ్వర్టైజ్‌మెంటుల్లో నటిస్తున్నారు. అప్పుడు వాళ్లకు దేశభక్తి స్పృహ ఉండదు. కానీ అభిమానులకు మాత్రం తమ క్రికెటర్లు ఇంకో దేశం మీద గెలిస్తే దేశభక్తి పెల్లుబుకుతుంది.

తమ కార్మికులకు రూపాయి ఇవ్వడానికి ఏడ్చే కంపెనీ యజమాన్యాలు, తమ ఉత్పత్తుల ప్రచారాల కోసం క్రికెటర్లకు కోట్లు గుమ్మరిస్తాయి. ఆ కోట్ల రూపాయలన్నీ (వాస్తవానికి లాభం అన్న ప్రతిదీ) తమ అదనపు విలువ (అదనపు విలువ అంటే ఏమిటో తెలుసుకోవాలంటే మార్క్స్ కాపిటల్ చదవాలి) లోనిదే అని ఎక్కువ మంది కార్మికులకు ఇప్పటికీ తెలియదు. తెలిస్తే క్రికెట్ మ్యాచ్ చూడడానికి సెలవులు పెట్టి మరీ టివిల ముందు కూర్చోరు. ప్రజలు నిత్యం ఎన్నో సమస్యలతో

ప్రాథమిక విద్యలో దళితులపై వివక్ష

భారతదేశంలో ప్రాథమిక విద్యను పొందడంలో దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర బలహీన వర్గాలకు చెందిన బాలబాలికలు ఎదుర్కొంటున్న వివక్ష గురించీ, వ్యతిరేకత గురించీ వివరిస్తున్నారు ఎం. గంగాధర్

(గత సంచిక తరువాయి)

వివక్ష, వెలివేతలే అసలు సమస్య

భారతదేశంలో గత 60 ఏళ్లుగా ఎలిమెంటరీ విద్య సార్వజనీనం కాకపోవడంలో ఉన్న సమస్యలేమిటో తెలుసుకోవడానికి బయలుదేరిన 'హ్యూమన్ రైట్స్ వాచ్' పరిశోధకులకు మన పాఠశాలల్లో భయంకరంగా విస్తరించి ఉన్న వివక్షాపూరిత విధానాలు, వెలివేత ధోరణులు అత్యంత సహజంగానూ, స్పష్టంగానూ కనిపించాయి. అనేక రూపాల్లో, అనేక ముఖాల్లో తీవ్రమైన అసమానతలు నిండిఉన్న భారతదేశపు సమాజంలోని ఏ ఒక్క రంగాన్ని పరిశీలించినా వివక్షాపూరిత విధానాలు కనిపించడం మామూలు విషయం. అయితే ఈ వివక్షాపూరిత విధానాలకు, వెలివేత ధోరణులకు సామాజిక మూలాలు ఎక్కడున్నాయో తెలుసుకోవడం గాని, వాటికి అంతే మౌలికమైన పరిష్కారాలను సూచించడంలో గాని అవకాశాలైనా, పరిమితులైనా ఆ పని చేస్తున్న వారి దృక్పథాల్లో, అవసరాల్లో, ప్రయోజనాల్లో ఉంటాయి.

ఎలిమెంటరీ పాఠశాలల్లో తీవ్రమైన వివక్షకు, వెలివేతకు ప్రధానంగా గురవుతున్న ఐదు సామాజిక వర్గాలను ఈ నివేదిక గుర్తించింది. ఆ ఐదు సామాజిక వర్గాలు దళితులు, గిరిజనులు, మైనారిటీలు (ప్రధానంగా ముస్లిం మైనారిటీలు), బాలికలు, వలస బాల కార్మికులు. ఈ నివేదికను తయారు చేయడానికి పరిశోధకులు మాట్లాడిన 85 మంది బాలబాలికలు ఈ ఐదు సామాజిక వర్గాలకు చెందినవారే. ఉత్తర భారతదేశంలోని పరిశోధనా క్షేత్రాల్లో (ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, ఢిల్లీ) ఈ ఐదు సామాజిక వర్గాలకు చెందిన బాలబాలికల మీద అమలవుతున్న వివక్షా విధానాలకు, వెలివేత ధోరణులకు సంబంధించిన అనేక ఉదాహరణలు మనకు నివేదికలో కనిపిస్తాయి. దక్షిణ భారతదేశంలోని ఏకైక పరిశోధనా క్షేత్రమైన ఆంధ్రప్రదేశ్ (ఎక్కువగా మహబూబ్‌నగర్, కొద్దిగా కర్నూలు జిల్లాల)లో వివక్షకు, వెలివేతకు సంబంధించిన ఉదాహరణలు కాకుండా ఇతరేతర కారణాలతో బడిమానేసిన, మానేసేలా చేసిన ఉదాహరణలను ఈ నివేదిక రికార్డు చేసింది.

దాదాపు 100 శాతం వరకు చేరుకున్న ఎన్‌రోల్‌మెంట్ గురించి మనం చెప్పుకున్నాం. కాని ఆ తరువాత ఏం జరుగుతున్నదనే కథను మనం ఈ భాగంలో చూడవచ్చును. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన 'నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్' మదింపు చేసిన లెక్కల ప్రకారం 2010-2011లో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకున్న ప్రాథమిక స్థాయిలో ఎన్‌రోల్‌మెంట్ 99.89 శాతం. ఈ సంస్థ మదింపు చేసే లెక్కలకు ఆధారం డిఐఎస్ఇ (డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) ఫారాలు. దేశ వ్యాప్తంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వీటిని ప్రతి సంవత్సరం నింపి పంపుతున్నారు. ఎన్‌రోల్‌మెంట్ విషయంలో గాని, డ్రాపౌట్ల విషయంలో గాని, మధ్యాహ్న భోజనాన్ని పొందుతున్న వారి విషయంలో గాని ప్రధానోపాధ్యాయులు ఈ ఫారాలలో నింపే సమాచారం కూడా పూర్తి కచ్చితంగా ఉండదు. స్వచ్ఛంద సంస్థలు విడుదల చేసే సమాచారం కూడా పూర్తి కచ్చితంగా ఉంటుందని చెప్పజాలం. 2010-2011 సంవత్సరానికే స్వచ్ఛంద సంస్థలు విడుదల చేసిన సమాచారం ప్రకారం దేశంలో 6 నుండి 14 ఏళ్ల మధ్యనున్న బాలబాలికల్లో కేవలం 3.3 శాతం మంది మాత్రమే బడిలో లేరు. ఈ లెక్కలు ఒకటో తరగతిలో ఎంత మంది చేరవలసి ఉండి, ఎంతమంది చేరుతున్నారనే విషయానికి ప్రధానంగా సంబంధించినవి.

ఈ అంకెలను కూడా చూడండి. ఒకటో తరగతిలో చేరిన వారిలో 73 శాతం మంది మాత్రమే ఐదవ తరగతిని పూర్తి చేస్తున్నారు. ఈ 73 శాతం మందిలో అందరు కూడా 6వ తరగతి నుండి 8వ తరగతి వరకు ఉన్న ఎలిమెంటరీ పాఠశాలలో చేరడం లేదు. కేవలం 62 శాతం మంది మాత్రమే చేరుతున్నారు. ఇది 6వ తరగతిలో ప్రవేశించడానికి సంబంధించిన పరిస్థితి.

8వ తరగతికి వచ్చేసరికి 42 శాతం మంది డ్రాపౌట్లు అవుతున్నారు. అంటే ఒకటో తరగతిలో చేరిన 100 మందిలో 58 మంది మాత్రమే 8వ తరగతిని పూర్తి చేస్తున్నారు. 42 మంది మధ్యలో జారిపోతున్నారు. దేశంలో ఇలాంటి వారి సంఖ్య ఎనిమిది కోట్లు. ఈ ఎనిమిది కోట్ల మంది మనదేశంలో బాలకార్మికులే.

ఎందుకిట్లా జరుగుతున్నది? మనదేశ ఎలిమెంటరీ పాఠశాలల్లో భయంకరంగా అమలవుతున్న వివక్షాపూరిత విధానాలను, వెలివేత ధోరణులను, కొన్ని ఇతర అంశాలను ఇందుకు ప్రధానమైన కారణాలుగా

సతమతమైపోతూ ఉంటారు. వాళ్లకు సమస్యల మూలాలు తెలిస్తే, ఆ జ్ఞానం ప్రభుత్వాల మీద తిరగబడే ప్రమాదానికి దారి తియ్యవచ్చు. అలాంటి జ్ఞానానికి అవకాశం లేకుండా ప్రభుత్వాలు తమ వంతుగా ప్రజల్ని ఏదో ఒక మత్తులో ముంచాలి. అది ఆధ్యాత్మికతతో, టివి సీరియల్లో, సారాయో, చచ్చు సినిమాయో, అలాంటిది ఇంకోటో కావచ్చు. ఆ కోవలో ఈ క్రికెట్ కూడా ఒకటి అని ప్రజలు తెలుసుకోవాలి. తమ చుట్టూ ఉన్న సమస్యల గురించి నిజాలూ, పరిష్కారాలూ తెలుసుకునే సాహిత్యం వైపు మొగ్గు చూపాలి. అంతే కానీ దోపిడీ డబ్బు పంచుకునే వారి ఆటలకు ముగ్ధులైపోవడం లో ఏమాత్రం ప్రయోజనం ఉండదు.

(రచయిత సామాజిక పరిశీలకులు) వీ

ఈ నివేదిక రచయితలు ముందుకు తెస్తున్నారు. నిజానికి ఇవి కాదనలేని బలీయమైన కారణాలే.

తరగతి గదిలో దళితులను విడిగా కూర్చోవాలని ఉపాధ్యాయులే ఆదేశిస్తున్నారు. తోటి దళితేతర విద్యార్థులు కూడా దళిత విద్యార్థుల పట్ల ఈ వివక్షాపూరిత విధానాన్నే పాటిస్తున్నారు. ముస్లిం విద్యార్థులతో, గిరిజన విద్యార్థులతో వారి వేషభాషలను తీసుకుని అవమానకరంగా మాట్లాడుతున్నారు. దళిత, గిరిజన, ముస్లిం విద్యార్థులకు తరగతి నాయకుని పాత్రను, పాఠశాలలో ఇతర నాయకత్వ పాత్రలను ఇవ్వడం లేదు. ఆటపాటల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారిని కలుపుకోవడం లేదు. ఈ విద్యార్థులు చదువులో వెనకబడి ఉంటే వారికి తెలియని విషయాలను ఓపికగా చెప్పడం కాకుండా, వారిని అందరి ముందు ఉపాధ్యాయులే ఎగతాళి చేస్తున్నారు. పాఠశాలలో ఒకే టాయిలెట్ ఉంటే ఈ విద్యార్థులు ఆ టాయిలెట్‌ను ఉపయోగించుకోవడానికి అనుమతిని ఇవ్వడం లేదు. ఉపాధ్యాయుల టాయిలెట్‌నో, మరొక టాయిలెట్‌నో శుభ్రం చేయవలసివస్తే మాత్రం ఈ విద్యార్థులే చేయాలి. పాఠశాలలో తాగునీటి వసతి ఒకటే ఉంటే అక్కడ వీరిపట్ల అంటరాని తనమో, వివక్షనో అమలవుతున్నది. మధ్యాహ్న భోజనం దగ్గర కూడా వీరికి ఈసడింపు, వివక్ష ఎదురవుతున్నాయి.

పైన పేర్కొనబడిన వివక్షాపూరిత విధానాలన్నింటికి సంబంధించిన ఉదాహరణలను ఈ నివేదిక రికార్డు చేసింది. 'మేం మురికిగా ఉన్నాం అని వాళ్లు అంటారు' అనే శీర్షికను ఈ నివేదికకు పెట్టడానికి కారణమైన ఉదాహరణ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సోన్‌భద్ర జిల్లాలోని ఒక పాఠశాలకు చెందినది. ఈ పాఠశాలలో ఘూసియా అనే ఒక గిరిజన తెగకు చెందిన 58 మంది విద్యార్థులను వారి వయోభేదాలతో నిమిత్తం లేకుండా ఒకే తరగతి గదిలో, ఆ తరగతి గదిలో ఇతర విద్యార్థులకు ఎడంగా కూర్చుండబెట్టారు. ఒక ఘూసియా విద్యార్థి హ్యూమన్ రైట్స్ వాచ్‌తో మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు తమ వద్దకు రాదని, తాము మురికిగా ఉన్నామని అంటుందని చెప్పాడు. ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కూడా హ్యూమన్ రైట్స్ వాచ్‌తో మాట్లాడుతూ ఘూసియా పిల్లలు పాఠశాలకు సమయానికి రారని, వాళ్లకు ఇష్టం వచ్చినప్పుడు వస్తారని, వాళ్లు (మధ్యాహ్న భోజనాన్ని) తినడానికే గాని, చదువుకోవడానికి రారని, వాళ్లెంత మురికిగా ఉన్నారో చూడండని అన్నారు.

దళితులకు, గిరిజనులకు, ముస్లింలకు చెందిన బాలబాలికలు, బాలికలైనందు వలన అదనపు వివక్షను ఎదుర్కొంటున్నారు. తొలి యవ్వన దశలోకి ప్రవేశించిన బాలికలను బడికి పోకుండా తల్లిదండ్రులే ఆపివేస్తున్నారు. ఈ దశలోని బాలికలు 64 శాతం మేరకు డ్రాపౌట్స్‌గా మారిపోతున్నట్లుగా ప్రభుత్వ గణాంకాలు చెపుతున్నాయి. ఇట్లా డ్రాపౌట్స్‌గా మారిపోయిన బాలికలు ఇంటి పనుల్లో ఉంటున్నారు. బాల కార్మికులుగా మారుతున్నారు. బాల్య వివాహాలకు తలవంచుతున్నారు.

డ్రాపౌట్స్‌గా మారిన బాలికలకు సంబంధించి మూడు, నాలుగు ఆంధ్రప్రదేశ్ (మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాల) ఉదాహరణలను ఈ నివేదిక రికార్డు చేసింది. ఒక ఉదాహరణలో ఒక బాలిక మూడవ తరగతి తరువాత బడి మానివేసి గొర్లను కాస్తున్నది. ఆ బాలికకు చదువుకోవాలని ఉంది. కాని తల్లికి ఇష్టం లేదు. చాలా విచిత్రంగా ఆ తల్లి ఆ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తున్నది. మరొక ఉదాహరణలో తల్లి చనిపోవడంతో బాలిక డ్రాపౌట్ అయింది. బాలికను పాఠశాలకు రప్పించడం కొరకు ప్రిన్సిపాల్‌చేసిన ప్రయత్నానికి తండ్రి అడ్డుపడ్డాడు. ఆ బాలిక బడికిపోతే తనకు వంట ఎవరు చేసిపెడతారనేది ఆ తండ్రి ప్రశ్న. మహబూబ్‌నగర్ జిల్లాలో బడి బయట పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్నదని పేర్కొంటూనే ఆ జిల్లా కలెక్టర్ ఎం. గిరిజాశంకర్ తీసుకున్న చర్యల వలన పరిస్థితి కొంత మెరుగుపడిందని నివేదిక తెలియచేసింది.

బడిలో లేని పిల్లలు బాల కార్మికులేనన్నది అత్యంత సహజమైన నిర్ధారణ. ఐదు నుండి 14 ఏళ్ల మధ్యలోనున్న బాలబాలికలు భారత దేశంలో ఒక కోటి ముప్పై లక్షల మంది ఉన్నారని, ఇది ప్రపంచంలోనే అత్యధిక సంఖ్య అని, ఇందులో అత్యధికులు దళితులు, గిరిజనులు, మైనారిటీలేనని యునిసెఫ్ 2013 ఆగస్టులో ఒక నివేదికలో చెప్పింది. దేశంలో వలస కార్మికుల వెంట 60 లక్షల మంది బాలబాలికలు చదువుకు దూరంగా, పాఠశాలలు అందుబాటులో లేకుండా ఉంటున్నారు. వాళ్లను పాఠశాలల్లోకి రప్పించడానికి చేసే ప్రయత్నాలు అనేక రకాలుగా విఫలమవుతున్నాయి. వాళ్లకు బ్రిడ్జ్ కోర్సులను నిర్వహించకపోవడం ఒక సమస్య. వాళ్లు పాఠశాలలో స్థిరంగా ఉండరనే భావంతో వాళ్లను చేర్చుకోవడానికి ఉపాధ్యాయులు ఇష్టపడకపోవడం మరొక సమస్య.

కులం, వర్గం, లింగం, అంగవైకల్యం, తదితర కారణాలను బట్టి సమాజంలో తక్కువ స్థాయి గుర్తింపు ఉన్న ఆయా సామాజిక వర్గాలకు చెందిన బాలబాలికల విషయంలో పాఠశాలల్లో వివక్షాపూరిత విధానాలు అమలవుతున్నాయని, ఇదొక పెద్ద సమస్యగా ఉందని భారత ప్రభుత్వం తన అధికార పత్రాల్లో రాసుకున్నది. ఈ బాలబాలికలకు పాఠశాలను అందుబాటులో ఉంచడం మాత్రమే సరిపోదని, వాళ్లు ఆ పాఠశాలలను అందుకునే పరిస్థితులను కల్పించాలని కూడా రాసుకున్నది. ఆచరణలో ఇది ఎక్కడా కనిపించదు. ప్రభుత్వంలో కాని, విద్యాధికారుల్లో కాని, ఉపాధ్యాయుల్లో కాని అలాంటి దృక్పథం ఉన్నట్లు కనిపించదు. దళిత వాడల్లో ఉన్న పాఠశాలల్లో టాయిలెట్స్ ఉండవు. పరిశుభ్రమైన తాగునీటి వసతి ఉండదు. తగినంత మంది ఉపాధ్యాయులు ఉండరు. పాఠశాలల్లో ఈ బాలబాలికల పట్ల అనేక సందర్భాల్లో, అనేక రూపాల్లో ఈ వివక్షాపూరిత విధానాలు అమలవుతూనే ఉంటాయి. ఉపాధ్యాయులు ఈ విషయాలను పట్టించుకోరు. అనేక సందర్భాల్లో ఉపాధ్యాయులు కూడా ఈ వివక్ష విధానాలను అమలు చేస్తూ ఉన్నారు. పాఠశాలల్లో ఇలాంటి వివక్షా పూరిత విధానాలు ఉన్నాయని కూడా విద్యాధికారులు అంగీకరించరు. ఇలాంటి వివక్షా పూరిత విధానాలు ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా అమలవుతున్నట్లు ఈ నివేదిక పేర్కొన్నది. వివక్షకు గురవుతున్న బాలబాలికలు బడి మానివేయడంతో వాళ్లు పెద్ద సంఖ్యలో చదువుకు దూరమవుతున్నారు. ఎలిమెంటరీ స్థాయిలో దళితేతర, గిరిజనేతర విద్యార్థుల విషయంలో డ్రాపౌట్ రేట్ 37 శాతం ఉండగా, దళిత విద్యార్థుల విషయంలో 51 శాతం, గిరిజన విద్యార్థుల విషయంలో 58 శాతం ఉంది.

గిరిజనులు, దళితుల వలెనే ముస్లింలు కూడా మన సమాజంలో తీవ్రమైన వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ ధోరణి పాఠశాలల్లో కూడా కనిపిస్తున్నది. ఈ వివక్షకు ప్రాతిపదిక మతం. దేశ రాజధాని ఢిల్లీలోని పాఠశాలల్లో ముస్లిం పిల్లల పట్ల కొనసాగుతున్న వివక్షను ఈ నివేదిక రికార్డు చేసింది. ముస్లిం పిల్లలు పాఠశాలకు చదువుకోవడానికి రారని, (మధ్యాహ్న భోజనాన్ని) తినడానికి, స్కాలర్‌షిప్ డబ్బులు తీసుకోవడానికి మాత్రమే వస్తారని అనడం మాత్రమే కాకుండా, ముస్లిం పిల్లల తండ్రులకు ఉండే గడ్డాల మీద ఎగతాళితో కూడిన వ్యాఖ్యానాలను ఉపాధ్యాయులే చేస్తుంటారు. కొన్ని చోట్ల పాఠశాలల్లో ఉండే

టాయిలెట్స్‌ను వాడుకోవడానికి ఉపాధ్యాయులు హిందువుల పిల్లలను అనుమతిస్తారు. కాని ముస్లిం పిల్లలను అనుమతించరు.

6 నుండి 14 ఏళ్ల మధ్యనున్న ముస్లిం పిల్లల్లో 25 శాతం మంది అసలే బడికి వెళ్లకుండానో, బడి మానివేసో ఉన్నారని సచార్ కమిటీ నివేదిక చెప్పింది. 40 శాతం కంటే ఎక్కువ ముస్లిం జనాభా ఉన్న 5400 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేవని కూడా సచార్ కమిటీ చెప్పింది. కాబట్టి ఉపాధ్యాయులే కాదు, సమాజమే కాదు, అన్ని రకాల అసమానతలను తొలగించడానికి బాధ్యతాయుతమైన పాలనను అందించవలసిన ప్రభుత్వాలు కూడా ఏ విధంగా ముస్లిం పట్ల నిరాదరణను, వివక్షను పాటిస్తున్నాయో ఇలాంటి ఉదాహరణలు చెపుతాయి.

ఆంధ్రప్రదేశ్‌లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడానికి మంచి ప్రయత్నాలు జరిగాయని ఈ నివేదిక చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో అనేక దశాబ్దాలుగా, ఎన్నో రాజకీయ, సామాజిక ఉద్యమాలు జరిగాయి. ఆ ఉద్యమాలు ఆంధ్రప్రదేశ్ సమాజం మొత్తానికి ఒక చైతన్య స్థాయిని కల్పించాయి. ఆ చైతన్య స్థాయి ప్రతిఫలనాలు ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల్లో చూసి ఈ నివేదికా రచయితలు ఈ అభిప్రాయానికి వచ్చి ఉంటారు.

ఆంధ్రప్రదేశ్ పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని చెప్పినప్పటికి దేశం మొత్తం మీద విద్యాహక్కు చట్టం అమలవుతున్న తీరు బాగా లేదని నివేదిక చెప్పింది. విద్యాహక్కు చట్టం పాఠశాల యాజమాన్య కమిటీలకు, పాఠశాలలో ఉన్న అధికారులకు, స్థానిక సంస్థలకు, జిల్లా విద్యాధికారులకు, రాష్ట్ర విద్యాధికారులకు నిర్దిష్టమైన బాధ్యతలను, అధికారాలను ఇచ్చింది. కాని ఆ బాధ్యతలను నెరవేర్చడంలో గాని, ఆ అధికారాలను ఉపయోగించడంలోగాని వాళ్లు విఫలమవుతున్నారు. సమర్థవంతమైన పర్యవేక్షణ లేదు. జవాబుదారీ తనం లేదు. ఫిర్యాదులను పరిష్కరించే సవ్యమైన యంత్రాంగం లేదు. ఇవన్నీ కలిపి విద్యాహక్కును ఆచరణ లేని ఆదర్శంగా మార్చివేశాయి.

భారత ప్రభుత్వానికి సిఫారసులు

మనదేశంలోని మూడు రాష్ట్రాల్లో, రెండు నగర ప్రాంతాల్లో ఎలిమెంటరీ విద్యారంగం మీద క్షేత్రస్థాయి పరిశీలన జరిపిన తరువాత 'హ్యూమన్ రైట్స్ వాచ్' భారత ప్రభుత్వానికి కింది సిఫారసులను చేసింది.

1. ఎన్‌రోల్‌మెంట్ మీద శ్రద్ధ మాత్రమే కాకుండా, బడిలో చేరిన పిల్లలందరు 8వ తరగతి పూర్తయే వరకు బడి మానివేయకుండా చూడాలి. అందుకు అవసరమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఆ వ్యవస్థలు పని చేసే విధంగా చూడాలి.

2. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర అత్యంత బలహీన వర్గాలకు చెందిన పిల్లల మీద ప్రత్యేకంగా దృష్టిని పెట్టాలి. బడి మానేసిన వారిని తిరిగి బడికి రప్పించడానికి ప్రయత్నించాలి.

3. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర అత్యంత బలహీన వర్గాలకు చెందిన పిల్లలు బడిలో వివక్షను ఎదుర్కొనకుండా చూడాలి. వివక్ష ఉన్న చోట దాన్ని పరిష్కరించడానికి తగిన చర్యలను తీసుకోవాలి.

4. వివిధ సామాజిక వర్గాలకు, కులాలకు చెందిన విద్యార్థుల మధ్య సమ్మిళితతత్వాన్ని పెంపొందించడానికి అవసరమైన మార్గదర్శక సూత్రాలను విద్యాశాఖ తయారు చేయాలి.

5. ఉపాధ్యాయ శిక్షణలో సమానత్వ భావనను, సమ్మిళిత భావనను బోధించడానికి అవసరమైన చర్యలను 'నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్' తీసుకునే విధంగా విద్యాశాఖ చూడాలి.

6. విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు కావడం కొరకు అవసరమైన సంప్రదింపులను చేయడానికి వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయాన్ని సాధించాలి.

7. ఇంటర్నేషనల్ టీచర్స్ ఆర్గనైజేషన్ 131వ కన్వెన్షన్‌ను భారత ప్రభుత్వం ఆమోదించాలి. 15 ఏళ్లు నిండిన తరువాతనే బాలబాలికలు శ్రమ చేసే విధంగా చట్టాన్ని సవరించాలి.

రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫారసులు

1. విద్యాహక్కు చట్టం అమలు పరిధిని ఎన్‌రోల్‌మెంట్ వరకే కాకుండా, బడిలో చేరిన పిల్లలు 8వ తరగతి పూర్తి చేసేటంత వరకు నిలకడగా ఉంటున్నారా, లేదా అని పరిశీలించే వరకు విస్తరించాలి.

2. పాఠశాలల్లో అమలవుతున్న వివక్షా పూరిత విధానాలను, వెలివేత ధోరణులను గుర్తించడానికి, వాటిని పరిష్కరించడానికి, పాఠశాలలో బాలమిత్ర వాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన శిక్షణను ఉపాధ్యాయులకు, విద్యాశాఖాధికారులకు, స్థానిక సంస్థల అధికారులకు, పాఠశాల యాజమాన్య కమిటీల సభ్యులకు ఇవ్వాలి.

3. విభిన్న సామాజిక వర్గాలకు, కులాలకు చెందిన పిల్లల మధ్య పరస్పర సంబంధం నెలకొనే విధంగా వారికి పనులను అప్పగించే విధంగా, బోధనను చేసే విధంగా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలి.

4. విద్యాహక్కు గురించి ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలను తీసుకోవాలి.

5. వివక్షను ఎదుర్కోవడం కొరకు, విద్యాహక్కు అమలు కావడం కొరకు స్వతంత్రంగా బాలల హక్కుల సంఘాలు ఏర్పాటు అయ్యే విధంగా, అవి పని చేసే విధంగా చూడాలి.

6. పాఠశాల యాజమాన్య కమిటీలను పారదర్శకంగా, సమర్థవంతంగా పని చేయించాలి. ఆ కమిటీలలోని బలహీన వర్గాలకు చెందిన సభ్యులు సమావేశాలకు హాజరయ్యే విధంగా చూడాలి.

7. వివక్ష, వెలివేత, తదితర ధోరణులను తొలగించడం కొరకు విద్యార్థి కమిటీలను ఏర్పాటు చేయాలి.

8. బాల కార్మికులను పాఠశాలలో చేర్పించడం కొరకు సివిల్ సొసైటీ గ్రూపులను ఏర్పాటు చేయాలి.

9. విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు కావడం కొరకు వివిధ మంత్రిత్వశాఖల మధ్య సమన్వయాన్ని సాధించాలి.

విదేశీదాతలకు, సహాయక సంస్థలకు, సంబంధిత ప్రభుత్వాలకు సిఫారసులు

1. ఎలిమెంటరీ విద్యను సార్వజనీనం చేయడంలో ప్రభుత్వాలు చూపుతున్న చొరవకు మద్దతు నిచ్చి, సాంకేతిక సహాయాన్ని అందించాలి. విద్యా హక్కు చట్టం సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన మార్గదర్శక సూత్రాలను సూచించాలి.

2. ఎలిమెంటరీ విద్యలో వివక్షను తొలగించడం కొరకు ప్రభుత్వాలు చూపుతున్న చొరవకు సాంకేతిక సహాయాన్ని అందించాలి.

3. పాఠశాలల్లో సమ్మిళితతత్వం, సమానత్వాల మీద దృష్టి పెడుతూ బాలమిత్ర వాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన పాఠ్య ప్రణాళికను, బోధన పద్ధతులను అభివృద్ధి పరచడానికి కావలసిన సాంకేతిక సహాయాన్ని అందించాలి.

పౌర సమాజం రూపొందించిన మార్గదర్శక సూత్రాలు

హ్యూమన్ రైట్స్ వాచ్ మనదేశంలోని పౌర సమాజంతో సంప్రదింపులు జరిపిన తరువాత పాఠశాలల్లో కొనసాగుతున్న వివక్షను రూపుమాపడానికి కింది మార్గదర్శక సూత్రాలను సూచించింది.

1. కులం, మతం, లింగం, వర్ణం, ప్రాంతం, జాతి, కుటుంబం వృత్తి, భాష, అంగవైకల్యం అనే వాటితో నిమిత్తం లేకుండా విద్యార్థులందరిని సమానత్వ భావనతో, వ్యక్తి గౌరవంతో చూడాలి.

2. ఏదైనా ఒక ప్రత్యేక గుర్తింపు వలన గాని, మరొక కారణంతో గాని విద్యార్థుల మధ్య భేద భావాన్ని చూపకూడదు.

3. కులాన్ని, మతాన్ని, కుటుంబ వృత్తిని సూచించే విధంగా విద్యార్థులను పిలువకూడదు. ఏ విద్యార్థి దేశభక్తిని కూడా శంకించకూడదు. ఎవరిని కూడా హింసకు, టెర్రరిజానికి సంకేతంగా చూడకూడదు. ఎవరి పట్ల కూడా వారికున్న అంగవైకల్యం సూచింపబడే విధంగా వ్యవహరించకూడదు.

4. ఒకే తాగు నీటి సౌకర్యం నుండి విద్యార్థులందరు తాగునీటిని పొందే విధంగా చూడాలి. విద్యార్థులందరు టాయిలెట్ వసతిని సమానంగా వాడుకునే విధంగా చూడాలి.

5. ఒక విద్యార్థి పాఠశాలలో చేరినందువలన ఆ విద్యార్థికి రావలిసిన ప్రయోజనాన్ని అందించడంలో ఎలాంటి నిరాకరణ గాని, ఆలస్యం గాని, పరిమితి గాని ఉండకూడదు.

6. మధ్యాహ్నం భోజనాన్ని తినే సమయంలో ఎలాంటి వివక్ష గాని, వేరు చేయడం గాని ఉండకూడదు. విద్యార్థులందరికి తినడానికి ఒకే రకమైన పళ్లాలను ఇవ్వాలి. భోజనాన్ని వడ్డించే విషయంలో గాని, వడ్డించే వరుస విషయంలో గాని, ఎక్కడ కూర్చొని తినాలనే విషయంలో గాని ఎలాంటి వివక్ష ఉండకూడదు. మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసే వారిని నియమించే విషయంలో కూడా ఉండకూడదు.

7. ఏ విద్యార్థిని కూడా శారీరకంగా గాని, మానసికంగా గాని, భావోద్వేగ పరంగా గాని వేధించకూడదు. విద్యార్థుల మధ్య తగాదాలు వచ్చినపుడు ఉపాధ్యాయులు జోక్యం చేసుకోవాలి.

8. పాఠశాలల్లో అన్ని కార్యకలాపాల్లోనూ, నాయకత్వ పాత్రల్లోనూ విద్యార్థులందరికి సమాన అవకాశాలను ఇచ్చి, వారిని ప్రోత్సహించాలి.

9. పాఠశాలలో ఉన్న వనరులను, అభ్యసన సామాగ్రిని, ఆట వస్తువులను వాడుకోవడానికి విద్యార్థులందరికి అవకాశం ఉండాలి.

10. పాఠశాలలో ఏ భాగాన్ని అయినా సరే శుభ్రం చేయడానికి విద్యార్థులను వినియోగించరాదు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమకు కావలసిన వస్తువులను తెప్పించుకోవడానికి విద్యార్థులను ఉపయోగించుకోకూడదు.

11. విద్యార్థులు చదువులో ఉన్న స్థితిని వారిని ఎగతాళి చేయడం కొరకు వాడుకోకూడదు. చదువులో వారి స్థితిని ఏ సమయంలోనూ వారి కులం, మతం, లింగం, కుటుంబ వృత్తి, అంగవైకల్యం, వ్యక్తిగత నేపథ్యంలో కలిపి మాట్లాడకూడదు. విద్యార్థులకు సంబంధించిన కులం, లింగం, మతం, కుటుంబం వృత్తి, అంగవైకల్యం మొదలైన వాటిని ఉపాధ్యాయులు ఏ విధంగానూ ప్రస్తావించకూడదు. విద్యార్థులు ప్రస్తావిస్తే వద్దని చెప్పాలి.

12. తరగతి గదిలో విద్యార్థులు కూర్చుండే పద్ధతిలో వివక్ష ఉండకూడదు. ప్రతి నెలలో కొద్ది రోజులైనా మందువరుసలో ప్రతి విద్యార్థి కూర్చునే విధంగా చూడాలి.

13. విద్యార్థులందరు ప్రశ్నలు అడిగే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ఎవరైనా తప్పుడు జవాబులు చెపితే వారిని కోపించడం గాని, అవమానించడం గాని చేయకూడదు. ఉపాధ్యాయులు విద్యార్థులందరి నోట్ పుస్తకాలను దిద్దాలి.

ముగింపు

భారతదేశపు ఎలిమెంటరీ విద్యారంగంలో ఉన్న తీవ్రమైన సమస్యలను హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదిక సరిగానే గుర్తించింది. చట్టాల పరిధిలో వాటికి పరిష్కారాలు ఏమిటో చెప్పింది. భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉపాధ్యాయులు నిర్వర్తించవలసిన కర్తవ్యాలను సూచించింది. కాని చట్టాల కంటే ఒక సామాజికార్థిక వ్యవస్థ సమాజం మీద బలమైన ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ఆ సామాజికార్థిక వ్యవస్థలోకి వెళ్లి, సమస్యల కారణాలను తెలుసుకొని, ఆ వ్యవస్థలోనే వాటికి పరిష్కారాలను సూచిస్తే, మనం అభిలషిస్తున్న మార్పు దీర్ఘకాలికంగానూ, మౌలికంగానూ ఉంటుంది. అయితే హ్యూమన్ రైట్స్ వాచ్‌కు ఈ దృక్పథ పరిమితి ఉందని ఇంతకు ముందే చెప్పడం జరిగింది.

భారతదేశంలోని ఎలిమెంటరీ విద్యారంగంలో దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర అత్యంత బలహీన వర్గాలు భయంకరమైన వివక్షను, వెలివేతను ఎదుర్కొంటున్న స్థితిని చూసిన హ్యూమన్ రైట్స్ వాచ్ ఈ సామాజిక వర్గాలు ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే, మధ్య తరగతికి, సంపన్న వర్గాలకు చెందిన పిల్లలు ఉన్నత శ్రేణి ప్రభుత్వ పాఠశాలల్లోనో, ప్రైవేట్ పాఠశాలల్లోనో మాత్రమే ఎందుకు చదువుతున్నారనే ప్రశ్నను వేసుకోలేదు. ఒక ప్రభుత్వ పాఠశాలలో భిన్న వర్గాలకు చెందిన విద్యార్థుల మధ్య వివక్షను గుర్తించిన హ్యూమన్ రైట్స్ వాచ్ మొత్తంగా భారతదేశపు సమాజంలోని భిన్న సామాజిక వర్గాలకు వివక్షతో కూడుకున్న భిన్నమైన పాఠశాల వ్యవస్థలు ఎందుకున్నాయని గాని, విద్యాహక్కు చట్టం ఈ వివక్షను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని గాని ప్రశ్నను వేసుకోలేదు. భారతదేశంలో ఎలిమెంటరీ విద్య రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కు అయినపుడు, రాజ్యాంగ ప్రవేశికలోని సమానత్వం, న్యాయం అనే ఆదర్శాల మీద రాజ్యాంగం నిలబడినపుడు, ఎలిమెంటరీ విద్యా రంగంలో, సౌకర్యాల విషయంలో తీవ్రమైన అసమానతలు కొనసాగే విధంగా భిన్నమైన పాఠశాల వ్యవస్థలు ఉండడమే హక్కుల నిరాకరణ అవుతుందని హ్యూమన్ రైట్స్ వాచ్‌కు అనిపించలేదు. 6 నుండి 14 ఏళ్ల మధ్యనున్న బాలబాలికలకు ఎలిమెంటరీ విద్యను ఉచితంగా ఇవ్వాలని చట్టం చెప్పినపుడు ప్రభుత్వమే కామన్ స్కూళ్లను స్థాపించి, అందరికి సమానమైన అవకాశాలతో, మెరుగైన ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం దాని రాజ్యాంగ బాధ్యత అవుతుంది.

దళితులు గాని, గిరిజనులు గాని, మైనారిటీలు గాని, బాలికలు గాని, ఇతర అత్యంత బలహీన వర్గాలకు చెందినవారు గాని, భారత దేశంలో వివక్షకు, వెలివేతకు గురికావడానికి సామాజికార్థిక వ్యవస్థలో, దాని చరిత్రలో కారణాలు ఉన్నాయి. వాటిని అర్థం చేసుకుని, గుర్తించి, సామాజికార్థిక వ్యవస్థలోనికి వెళ్లి, అందరికీ ఉపాధి అవకాశాలను కల్పించి, వనరులను, సంపదలను సమానత్వ ప్రాతిపదిక మీద పంపిణీ చేసి, శ్రమశక్తి దోపిడీని నిర్మూలించడంలో విద్యారంగంలో ఉన్న సమస్యలకు కూడా దీర్ఘకాలికమైన, శాశ్వతమైన పరిష్కారం లభిస్తుంది.

(ముగిసింది)

(రచయిత డిటిఎఫ్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు) వీ

పోరాటాలే తెలంగాణ నవ నిర్మాణానికి నాంది

తెలంగాణ ఆకాంక్షలు నెరవేరేలా నవ నిర్మాణం జరగాలంటే తెలంగాణ సమాజం మళ్లీ పోరాటాలకు సిద్ధం కావలసిందే అని అంటున్నారు **గడ్డం వెంకటరాజం**

తెలంగాణ ప్రజల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా, విద్యార్థుల, యువకుల ఆత్మబలిదానాల ఫలితంగా తెలంగాణ భౌగోళిక రాష్ట్రంగా ఏర్పడింది. అనేక నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఫిబ్రవరి 18న లోక్‌సభలో ఏం జరిగిందో అంతా రహస్యం. కానీ ఫిబ్రవరి 20న రాజ్యసభలో జరిగిన చర్చను తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా కోట్లాది మంది భారతీయులు టివిలలో వీక్షించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం మహాపాపం అయినట్లు సీమాంధ్ర దళారులు వెంకయ్య నాయుడు, కెవిపి, సి.ఎం. రమేశ్ లాంటివారు చేసిన ఆందోళనను చూశారు. ఉత్కంఠభరితంగా అనేక నాటకీయ పరిణామాల నేపథ్యంలో చారిత్రక తెలంగాణ బిల్లు ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆమోదం పొంది, 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014'గా మన ముందుకు వచ్చింది.

తదనంతరం ఏప్రిల్ 30న తెలంగాణలో, మే 7న ఆంధ్రలో, జరిగిన ఎన్నికలలో టిఆర్ఎస్, టిడిపికి పూర్తి మెజారిటీ రాగా, దేశ వ్యాప్తంగా బిజెపి 282 ఎంపి సీట్లతో పూర్తి మెజారిటీ సంపాదించగా, పార్లమెంట్‌లో ప్రతిపక్షం వహించడానికి కావలసినంత మెజారిటీ కూడా రాకుండా కేవలం 44 స్థానాల వద్ద కాంగ్రెస్ ఊహించలేని విధంగా చతికిలపడి పోయింది. 2014 మే 26న మోడీ ప్రమాణ స్వీకారం మరునాడే కేంద్ర క్యాబినెట్ ఏకపక్షంగా సీమాంధ్ర పక్షపాతిగా ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే ఖమ్మం జిల్లాలోని 7 మండలాలను ఆంధ్రలో కలుపుతూ హుటాహుటిన పోలవరంపై ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. క్యాబినెట్ మీటింగ్ అనంతరం న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విలేకరుల సమావేశంలో పోలవరంపై ఎటువంటి చర్చ జరగలేదు అన్నాడు. కానీ మరునాడే ఆదివాసులకు అన్యాయం చేసే ఆర్డినెన్స్‌ను జారీ చేశారు. ఈ తతంగాన్ని అంతా గమనిస్తే మోడీ సర్కారు మొగ్గు ఎటువైపో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

ఈ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ తెలంగాణ అంతటా నిరసనల, బంద్‌ల రూపంలో ప్రజలు తమ ఆగ్రహ జ్వాలలను వ్యక్తపరిచారు. కాని ఈ సందర్భంలో బుద్ధిజీవులుగా మనం శాస్త్రీయంగా ఆలోచించ వలసిన అంశాలు అనేకం ఉన్నాయి. తెలంగాణ వచ్చిందని సంతోష పడి తెలంగాణ అంతటా సంబరాలు చేసుకుంటున్నాం. దాంతో పాటు పోలవరం తెలంగాణకు శాపంగా ఉందంటూ ఆందోళనలు చేస్తున్నాం. కేవలం పోలవరం వల్ల మాత్రమే తెలంగాణకు నష్టం జరుగు తున్నదా? ఇంకా ఇతర అంశాలు ఏమైనా ఉన్నాయా? అనే విషయాలను అర్థం చేసుకోవాలంటే ఒక్కసారి 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014'ను కొంచెం లోతుగా అధ్యయనం చేస్తే అర్థం అవుతుంది.

'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014'లోని కొన్ని ముఖ్య మైన అంశాలు. 1) 10 సంవత్సరాలు హైదరాబాద్ (జిహెచ్ఎంసి పరిధి) ఉమ్మడి రాజధాని. 2) సాంకేతిక, వైద్య, ఉన్నత విద్యా సంస్థల లో 10 సంవత్సరాలు ఉమ్మడి ప్రవేశాలు. 3) శాంతి భద్రతలు గవర్నర్ ఆధీనంలో ఉండడం. 4) పోలవరం జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి కేంద్రం ప్రాజెక్టును పూర్తి చేయడం. 5) ఉమ్మడి హైకోర్టు. 6) కృష్ణా, గోదావరి జలాలపై ఎపెక్స్ కౌన్సిల్‌ను వేయడం.

పై అంశాలు తెలంగాణ రాష్ట్రానికి ఏవిధంగా ప్రయోజనకరంగా ఉన్నాయో అర్థం అవుతుంది. పది సంవత్సరాలు ఉమ్మడి రాజధానిని తెలంగాణ ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ కేవలం రెండు సంవత్సరాల వరకే, అది కూడా హెచ్ఎండిఎ పరిధి వరకే ఉండాలని డిమాండ్ చేసినా ఫలితం లేదు. విద్య, ఉద్యోగ రంగాలలో పూర్తిగా అన్యాయం జరుగుతుందనే తెలంగాణ ఉద్యమం వచ్చింది. అయినా కూడా ప్రత్యేక రాష్ట్రంలో మళ్లీ ఉమ్మడి ప్రవేశాలు అనే అంశాన్ని ప్రవేశపెట్టారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా శాంతి భద్రతలు గవర్నర్ చేతిలో ఉండడం తెలంగాణ నాయకత్వాన్ని, ప్రజలను అవమానించినట్లే. ఇక అతి ప్రధానమైన అంశం పోలవరం ప్రాజెక్ట్.

ఆదివాసులకు శాపం - పోలవరం ప్రాజెక్ట్

నోరులేని అడవిబిడ్డలైన ఆదివాసులను ముంచే పోలవరం ప్రాజెక్ట్. దీనికి జాతీయ హోదా కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 90:10 నిష్పత్తిలో నిర్మాణం పూర్తి చేయడం. ఈ నిర్మాణం వల్ల అనేక నష్టాలు ఉన్నాయని, సహజ సౌందర్యమైన ప్రదేశాలు నీటిలో మునిగిపోవడం, రెండు లక్షల మందికిపైగా అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసులు నిరాశ్రయులు కావడం, పర్యావరణం దెబ్బతిని భూకంపాలు వచ్చే ప్రమాదముందని పర్యావరణవేత్తలు, మేధావులు, ఉద్యమకారులు హెచ్చరిస్తున్నా పాలక వర్గాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

మోడీ క్యాబినెట్ జారీ చేసిన ఆర్డినెన్స్ మూలంగా భద్రాచలం, పాల్వంచ రెవెన్యూ డివిజన్‌లలోని ఏడు మండలాల్లో 326 రెవెన్యూ గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్తున్నాయి. భద్రాచలం మండలంలో 117, కూనవరం మండలంలో 65, చింతూరులో 108, విఆర్‌పురంలో 73, వేలేరుపాడులో 65, కుక్కునూరు మండలంలో 59, బూర్గంపహడ్‌లో 35 హ్యాబిటేషన్లు ఆంధ్రలో చేరుతున్నాయి. జనాభా పరంగా రెండు లక్షల పది వేల మంది, మూడు లక్షల హెక్టార్ల అటవీ భూమి ఆంధ్రలో కలవనుంది. ఇంతభారీ నష్టం జరుగుతున్నా మాకే మాత్రం సంబంధం లేదు అన్నట్లుగా బిజెపి, టిడిపి, కాంగ్రెస్ నాయకులు పోలవరంపై రాజకీయాలు చేస్తున్నారు.

అసలు ప్రధాన ప్రశ్నేమిటంటే పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ఎవరి ప్రయోజనాల కొరకు? ప్రాజెక్ట్ నిర్మాణానికి అయ్యే భారీ వ్యయం వాస్తవంగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందా? లేదా అంతర్జాతీయ పెట్టుబడులు, వారి ఆసక్తులు, ప్రయోజనాలు ఏమైనా ఉన్నాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ

గతితర్కం - ఒక వివరణ

'వీక్షణం' గత సంచికలలో గతితార్కిక సూత్రాలపై జరిగిన చర్చ నేపథ్యంలో మరొక వివరణ ఇస్తున్నారు వై.వి. రమణారావు

మార్క్సిజం, గతితర్కం, మొదలైనవి ఇంకా వివాదాలకు కారణమవుతూనే ఉన్నందువల్ల, 'గతితర్కం' గురించి ఒక వివరణ రాయాలనిపించిన పర్యవసానమే ఈ వ్యాసం. ఇది, గతితర్కం, దాని సంబంధీకృత విషయాలు హెగెల్ – మార్క్స్, మొదలగు విషయాలపై ఒక కూర్పు వంటిది. లోతైన వివరాలకు పాఠకులు ఈ వ్యాసంలోనే పేర్కొన్న పుస్తకాలు చదువగలరు.

1. సంప్రదాయ / ఆకృతిక / అధిభౌతిక / జడ'తర్కం' గురించి: తార్కిక భావాభివర్గాలు మబ్బుల్లో నుండి ఊడిపడలేదు. మానవాళి సామాజిక, చారిత్రక అభివృద్ధి క్రమంలో అవి ఈ రూపాలను సంతరించుకున్నాయి. అవి స్త్రీ, పురుషుల మెదళ్లలో ప్రతిబింబించిన వాస్తవిక ప్రాథమిక సాధారణీకరణాలు.. ఒకానొక స్థాయి వద్ద ఆలోచనకు సంబంధించిన ఈ మౌలిక నియమాలన్నింటినీ వ్యవస్థీకరించి లిఖించారు. ఆకృతిక తర్కానికి (ఫార్మల్ లాజిక్) / జడ తర్కానికి / సంప్రదాయ తర్కానికి మూలమిదే! అనేక ఇతర విషయాలతో పాటు ఇది సాధించిన ఘనత కూడా అరిస్టాటిల్‌కే దక్కుతుంది... నిజానికి, ఈ ఆకృతిక తర్క భావాభివర్గాలు (కేటగిరీస్) దైనందిన జీవితానికి సంబంధించిన చాలా ఎక్కువ విషయాలకు వర్తిస్తాయి. కానీ, చలనంతోనూ, సంక్షుభితం గానూ, వైరుధ్యాలతోనూ, పరిమాణం గుణంగా మారే మార్పులతోనూ కూడిన మరింత సంక్లిష్ట ప్రక్రియలకు అవి సరిపోవు...

– ఆకృతిక తర్కాన్ని అరిస్టాటిల్ న్యాయప్రయోగాల (సిలజిసం) రూపంలో సమకూర్చాడు. ఉదాహరణకు 1) మనుషులందరూ మరణశీలురు (ముఖ్యంగా అనుమాన వాక్యం) 2) సీజర్ ఒక మనిషి (గౌణాంగ అనుమాన వాక్యం) 3) అందుచేత సీజర్ మరణ శీలుడు (వినిగమనం) దీన్ని, 'అన్వయ వ్యక్తాత్మక నిరుపాధిక ప్రకటన' (అప్పర్ మేటివ్ కేటగిరికల్) అంటారు. మరోరకం న్యాయప్రయోగం షరతుల రూపంలో (అయినట్లయితే...అలాంటప్పుడు) ఉంటుంది.

ఆకృతిక తర్కంలో –1) ఆగమన తర్కం (ఇండక్టివ్ లాజిక్), 2) నిగమన తర్కం (డిడక్టివ్ లాజిక్) అని రెండు రకాలు, వేల ఏండ్ల నుండి తత్వశాస్త్రంలో వాడుకలో ఉన్నాయి. అయితే, ఆకీతిక తర్క గజిబిజి చీకటిదారులు అతి గంభీరమైన చర్చలో నిమగ్నమైనట్లు భ్రమింప చేస్తాయి. అయితే, నిజానికది వాదిస్తున్నది 'ఏమీలేదు'... పునరుజ్జీవన కాలం నాటికి అరిస్టాటిల్ తర్కం పట్ల వ్యతిరేకత పెరగ సాగింది. మధ్యయుగాల నాటికి న్యాయ ప్రయోగం

పెట్టుబడిదారుల ప్రయోజనాల కొరకు కోస్టల్ కారిడార్ నిర్మాణం గురించి ఇంత వేగంతో పోలవరం నిర్మాణం చేయడానికి మోడీ సర్కార్ ఉత్సాహం చూపుతున్నది. భౌగోళిక తెలంగాణ వచ్చిందని సంతోషంతో ప్రభుత్వం, ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారు. అసలు రెండు లక్షల మంది ఆదివాసులను ముంచి, వారి జీవితాలను బలిచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ఎవరు సాధించమన్నారు? ఇంత మందిని బలి తీసుకుంటున్న తెలంగాణ ఎవరికొరకు? వారి జీవితాలను బలి తీసుకొని సంబరాలు జరుపుకోవడం ఎంతవరకు సమంజసమో ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

నరేంద్రమోడీ ప్రభుత్వం తెలంగాణపై కక్షగట్టినట్లుగా ఆయన క్యాబినెట్‌లో సీమాంధ్ర వారికి (ఆంధ్రప్రదేశ్ నుండి) ముగ్గురికి అవకాశం కల్పించి తెలంగాణకు ప్రాతినిధ్యం లేకుండా చేసి ఆ వెంటనే పోలవరంపై ఆర్డినెన్స్‌ను పాస్ చేశారు. చంద్రబాబు లాబీయింగ్‌కు తలొగ్గి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసే అవకాశాలు మన ముందు కనబడుతున్నాయి. ఇటీవల జరిగిన టిడిపి మహానాడులో తెలంగాణ రాష్ట్రం కోసం త్యాగాలకు పాల్పడ్డ విద్యార్థులకూ, యువకులకూ కనీసం సంతాపం తెలుపకుండా, తెలంగాణ రాష్ట్రాన్ని స్వాగతిస్తున్నట్లు కూడా తెలియజేయకుండా 2019 ఎన్నికలను టార్గెట్ చేస్తూ తెలంగాణలో కూడా మేము అధికారంలోకి వచ్చి మళ్లీ తెలుగువారిని ఒక్కటి చేస్తాం అనే కల్లబొల్లి పలుకులు పలుకుతున్నారు. తెలంగాణ ప్రజలు సంఘటితంగా లేకపోతే ఆంధ్ర దళారులు తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్రలకు పాల్పడవచ్చు. ఇటీవల ఉద్యోగుల పంపిణీ విషయాలలో ఎక్కడి ప్రాంతం వారు ఆ ప్రాంతంలోనే ఆయా ప్రభుత్వాల కిందనే విధులు నిర్వర్తించాలనే డిమాండ్ చేస్తున్నప్పటికీ, కొంత మంది ఆంధ్ర ఉద్యోగులను తెలంగాణకు, తెలంగాణ ఉద్యోగులను ఆంధ్రాకు కేటాయిస్తున్నారు. తెలంగాణ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న వారికి తెలంగాణకు కేటాయించే కుట్రలు పన్నుతున్నారు. వీటన్నింటి పరిణామాల నేపథ్యంలో తెలంగాణ వచ్చిందని సంతోషపడి సంబరాలు జరుపుకొని మనకు మనంగా ఉండిపోతే ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో జరిగిన అన్యాయం కంటే మరింత ఎక్కువగా అన్యాయం జరిగే అవకాశం ఉంది.

తెలంగాణ ఉద్యమం కొనసాగినంత కాలం కె. చంద్రశేఖర్‌రావు తెలంగాణ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిని దళితున్ని చేస్తానని వందల సార్లు అనేక సభలలో ప్రకటించాడు. కానీ తీరా ఎన్నికలు అయిన తర్వాత చూస్తే తానే సమర్థవంతమైన నాయకుడు అన్నట్లు కొంతమంది దళిత ఎంఎల్ఎల చేత ప్రకటించుకున్నాడు. అధికారంలోకి రాకముందే అధికార కాంక్ష ఎంత బలంగా ఉందో కెసిఆర్‌ను చూస్తే అర్థం అవుతుంది. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారు. వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయించు కోవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నది. చైతన్యవంతమైన ప్రజలుగా, సంఘటితంగా ఉంటూ పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణకూ, ఆదివాసులకూ తీవ్రనష్టాన్ని కలిగించే అక్రమ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా, ఉమ్మడి రాజధాని కేవలం రెండు సంవత్సరాల వరకే పరిమితం చేసే విధంగా, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరిచే విధంగా తెలంగాణ నవనిర్మాణానికి తోడ్పాటునందించే పోరాటాలకు సిద్ధం కావాలి. పోరాటాలే తెలంగాణ నవ నిర్మాణానికి నాంది.

(రచయిత ఉపాధ్యాయుడు)

అన్నిచోట్లా అప్రతిష్టపాలైంది. అపహాస్యానికీ, నిందలకూ గురైంది.

– ఆకృతిక తర్క ప్రాథమిక నియమాలు ఏవనగా :

1) సర్వ సమత నియమం ('ఎ'='ఎ') (ది లా ఆఫ్ ఐడెంటిటి)

2) వైరుధ్య నియమం ('ఎ', 'ఎ కాని దానికి' సమానం కాదు) (ది లా ఆఫ్ కాంట్రడిక్షన్) 3) వర్జిత మధ్యమ నియమం ('ఎ', 'బి'కి సమానం కాదు) (ది లా ఆఫ్ ఎక్స్‌క్లూడెడ్ మిడిల్)

హెగెల్ తన 'సైన్స్ ఆఫ్ లాజిక్' గ్రంథంలో, సర్వ సమత నియమాన్ని సమగ్రంగా విశ్లేషించి, అది ఏకపక్షమని, అందుచేత తప్పని నిరూపించాడు. 'ఎ', 'ఎ'కి సమానం ఎల్లవేళలాకాదని చాలా ఉదాహరణలతో సులభంగా నిరూపించవచ్చు. (ఉదాహరణ: ఎలక్ట్రాన్ స్థానం, చలనం).

– సంప్రదాయ తర్కంలోని లోపాలను గతితార్కిక దృక్పథం ఎంత మాత్రమూ లేని ఇతర తత్వవేత్తలు (ఉదా : అనుభవవాదులు) కూడా గ్రహించారు. ఆధునిక తర్కం, ఇంకా, సంకేతాలను సమీకరణాలలో ప్రవేశపెట్టి ప్రయత్నించినా, సర్వసమత నియమాన్ని క్లిష్టమైన చలన రూపాలకు వర్తింపజేసి, నిరూపించలేక పోయింది. (ఎలన్ వుడ్స్, టెడ్ గ్రాంట్ – 'ఆకృతిక తర్కం – గతితర్కం' లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ (ఎల్ఎస్‌సి), గుంటూరు)

2) గతితర్కం : డయలెక్టిక్స్ అనే పదానికి గ్రీకు భాషలో చర్చించుట, వాదించుట అని అర్థం. ఈ వాదనల్లో ఒక సమస్యకు సంబంధించిన పరస్పర వ్యతిరేక అంశాలను బహిర్గతం చేసి, వాటిని పరిష్కరించి సత్యాన్ని తెలుసుకోవడం ఈ పద్ధతి మౌలిక లక్ష్యం. ఈ పద్ధతిని హిరాక్లిటస్, సోక్రటీస్ మొదలైన ప్రముఖ గ్రీకు తాత్వికులు అవలంభించారు. గ్రీకు తాత్వికులలో 'ఎలియాటిక్' అనే వర్గం ఒకటి ఉండేది. వారిలో జినో అనే తాత్వికుడు ప్రముఖుడు. ఆయన ఈ పద్ధతిలో పరిశీలన జరిపి, అది అసత్యాలకు దారితీస్తుందని విమర్శించాడు. భారతీయ తాత్వికుడు నాగార్జునుడు కూడా ఈ పరిశీలనా పద్ధతినే వాడినా, కొనసాగించలేదు.

– హెగెల్ రంగప్రవేశం : హెగెల్ అనే జర్మనీ తాత్వికుడు గతి తర్కానికి ఒక నిర్దిష్టమైన రూపాన్ని ఇచ్చాడు. గతితర్కాన్ని ఉపయోగించి ఆయన, 'గతితార్కిక వాదాన్ని' రూపొందించాడు. ఆంగ్లంలో ఈ వాదాన్ని డయలెక్టిక్స్ అంటారు. 'డయా' అంటే 'రెండు' అని అర్థం. అంటే – ప్రతి సమస్యనూ రెండుగా విడదీసి పరిశీలించడం ఈ పద్ధతి సారాంశం. ఈ పద్ధతిలో విడదీసిన అంశాలను వ్యతిరేకాలు అని తాత్విక భాషలో అంటారు. ఈ వ్యతిరేకాల ఘర్షణ, పోరాటం (పోరు) వల్ల మార్పులు ఏర్పడతాయి. అంటే, ఈ ప్రపంచంలో జరిగే మార్పులన్నింటికీ మూలం 'వ్యతిరేకాల ఘర్షణ' అనే ఒక నూతన భావాన్ని, హెగెల్ ప్రప్రథమంగా వ్యక్తీకరించాడు. ఈ భావమే గతితార్కిక భావానికి మూలం...'ఈ వ్యతిరేకాల ఘర్షణ' అనే ఒక నూతన భావాన్ని, హెగెల్ ప్రప్రథమంగా వ్యక్తీకరించాడు. ఈ భావమే గతితార్కిక భావానికి మూలం...ఈ వ్యతిరేకాల ఘర్షణ (స్ట్రగుల్ ఆఫ్ అపోజిట్స్) ప్రపంచ పరిణామానికి చోదకశక్తిగా వివరించాడు. ఆయన పరిశీలనా విధానం ఈ కింది విధంగా ఉంటుంది.

సమస్యలో ఉన్న రెండు వ్యతిరేక అంశాలను ముందుగా గుర్తించాలి. వాటిలో ఒక దానిని 'భావనం' (థీసిస్) అనీ, మరొక దానిని 'ప్రతి భావనం' (యాంటీ థీసిస్) అని అంటారు. ఈ రెండు వ్యతిరేకాలు ఘర్షణ చెంది, తుదకు కలయికను, 'సహభావనాన్ని' (సింథసిస్) పొందుతాయి. ఈ మాదిరిగా ప్రపంచంలో ద్రవ్యం (మ్యాటర్)లో చలనం, అనగా, మార్పు (మోషన్ ఆర్ చేంజ్) ఏర్పడుతుంది. అనగా, భావనం (థీసిస్) – ప్రతి భావనం (యాంటీ థీసిస్) – సహ భావనం (సింతసిస్) అనే ఈ మూడు అంశాల వాదనకు 'గతితార్కికం' (డైలెక్టిక్స్) అని పేరు.

– బలాలు, విద్యుదావేశాలు, చర్యలు, అయస్కాంత ధృవాలు మొదలగునవి జంటలుగానే కానీ, విడిగా ఉండవని హెగెల్ కంటే ముందే శాస్త్రజ్ఞులు చెప్పారు. దానినే తర్వాత కాలంలో తత్వవేత్తలు తిరిగి కనుగొన్నారు.

కొన్ని వ్యతిరేక జంటలు : ధన విద్యుదావేశం – రుణ విద్యుదావేశం

అయస్కాంత ఉత్తర ధృవం – దక్షిణ ధృవం

బలం – ప్రతి బలం

చర్య – ప్రతి చర్య

– శాస్త్రీయ పద్ధతి – గతితర్కం : పరిశోధనలలో రాబట్టిన గమనికలను సూత్రబద్ధం చేయడానికి ఆగమన / అనుమాన (ఇన్‌డక్షన్) పద్ధతి అనేది కలదు. ఆ తర్వాత, సూత్రాల నుండి కొత్త విషయాలను రాబట్టడాన్ని నిగమనం (డిడక్షన్) అనే పద్ధతి అంటారు. ఈ రెండు పద్ధతులను శాస్త్రజ్ఞులు ప్రయోగించుతారు.

ఈ పద్ధతలను ఎలా ప్రయోగించాలో సూచించే నియమాలను గతితర్కం వివరిస్తుంది. పరిశోధనలో జరిగే పొరపాట్లను గతితార్కిక సూత్రాలు నివారించగలవు. అంటే, గతితర్కం శాస్త్రీయ పద్ధతికంటే ఉన్నతమైనదిగానే, మెరుగైనదనికానీ కాదు. కానీ, శాస్త్రీయం (సైన్‌టిసిజం) లో ఉన్న ఖాళీలను (గ్యాప్స్) గతితర్కం పూరించుతుంది. గతితర్కానికి, శాస్త్రీయ విధానానికి పూరణ (కాంప్లిమెంటరీ) గా మాత్రమే భావించాలి.

– జడతార్కిక పద్ధతి – వర్గ స్వభావం : సామాజిక శాస్త్రాలలో జడతార్కిక పద్ధతి తన వర్గస్వభావాన్ని నగ్నంగానే బయటపెట్టుకుంది. బాహాటంగానే అది ఆస్తిపర వర్గాల పక్షాన నిలుస్తుంది.

3) హెగెల్ తత్వం : 'పూర్వకాలపు ఆలోచనా, పరిశీలనా పద్ధతిని హెగెల్ 'జడతర్కం' అన్నాడు. వస్తువులు ముందుగా నిర్మితమైనవి, స్థిరమైనవి, మార్పులేనివి అని ఈ ఆలోచనా పద్ధతి భావిస్తుంది.', 'హెగెల్ దృష్టిలో, గతితర్కం అంటే – భావం స్వీయాభివృద్ధి. అఖండ భావం అనేది అనాదిగా అస్తిత్వంలో ఉన్నది. ఎక్కడ ఉన్నదో మాత్రం తెలియదు. యావత్తు వాస్తవ ప్రపంచానికి అదే నిజమైన సజీవమైన ఆత్మ. అది...అన్ని ప్రాథమిక దశల గుండా అభివృద్ధి చెందుతుంది.

'అఖండ భావం' గురించి హెగెల్ 'పరాయీకరణ' రూపంలో ఇలా అంటాడు – (ఎంగెల్స్ – ప్యూయర్‌బాపై)

'అఖండ భావం' (అబ్సల్యూట్ మైండ్) పరాయీకరణ చెందిన రూపంలోని 'ప్రకృతి' అనేది – తన స్వీయ పరాయీకరణకు తిరిగి వచ్చే ప్రక్రియగా (అంటే – అపరాయీకరణ చెందడం) – 'హద్దుగల మనసు' (ఫినైట్ మైండ్) అయిన 'మానవుడి'లో ఉంటుంది. ఆ రకంగా, మానవుని ప్రాథమిక నిర్మాణమే – ఆ అఖండ భావం ఈ సృష్టి నిర్మాణ ప్రక్రియను అందుకునే వైపుగా (పరాయీకరణ, అపరాయీకరణ ద్వారా) పయనిస్తుంది. (జడతార్కిక భౌతికవాదం – ఆధునిక విజ్ఞానం)

4. మార్క్స్ ప్రవేశం : హెగెల్ వారసత్వం, హెగెల్ వాదుల చేతుల్లో ప్రతి అంశానికి (జడతార్కిక భౌతిక వాదం – ఆధునిక విజ్ఞానం) (ఎల్ఎస్‌సి, గుంటూర్) ప్రతి పథకానికీ తగిలించే ఒక చట్రంగా మారింది. ఆలోచనా శక్తీ, స్థిరమైన జ్ఞానమూ కొరవడిన ప్రతి సందర్భంలోనూ గతితార్కిక పదజాలంతో కూడిన ఈ చట్రం ప్రత్యక్షమైంది...

హెగెల్ పద్ధతి కేవలం ఆలోచన నుంచి ప్రారంభిస్తుంది. కానీ, తిరుగులేని నిజాల నుంచి ప్రారంభించాల్సిన అవసరం ఉంది. హెగెల్ పద్ధతి – శూన్యం నుంచి, శూన్యం ద్వారా, శూన్యానికి పయనం అవుతుందని తనకు తానే ఆమోదించింది. ఈ రూపంలో అది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు...

హెగెల్ తర్కంలోని వాస్తవ ఆవిష్కరణల సారాంశాన్ని పరి గ్రహించాలి. భావవాద లోపాలులేని గతితార్కిక పద్ధతిని రూపొందించాలి... ఆ కర్తవ్యాన్ని స్వీకరించి నెరవేర్చినవాడు, నాటికీ, నేటికీ మార్క్స్ ఒక్కడే. (ఎంగెల్స్ – 'మార్క్స్' రాజకీయ అర్థశాస్త్ర విమర్శపై సమీక్షలో).

5. హెగెల్ గొప్పతనం, లోపాలు : హెగెల్ ఆలోచనా విధానానికీ, మిగతా

తాత్వికులందరి ఆలోచనా విధానానికీ తేడా ఏమంటే – దానికి అపారమైన చారిత్రక దృష్టి పునాదిగా ఉంది. దాని రూపం – నైరూప్యం, భావవాదం. అయినప్పటికీ హెగెల్ ఆలోచనల అభివృద్ధి, ప్రపంచ చరిత్ర అభివృద్ధితో పాటు కొనసాగింది. పైగా, ఆలోచనలకు గీటురాయి చరిత్రే అన్నది అసలు ఉద్దేశం. కనుక, వాటి మధ్య ఉన్న నిజమైన సంబంధాన్ని తిరగేసి తలకిందులుగా నిలబెట్టినప్పటికీ, దాని వాస్తవ సారాంశం, తత్వశాస్త్రంలో ప్రతిచోటా ప్రవేశించింది... చిర స్థాయిగా నిలిచే మేధావుల్లో ఆయన ఒకరు. చరిత్రలో ఒక అంతర్గత పొందికను, ఒక పరిణామాన్ని చూపించడానికి ప్రయత్నించిన మొదటి వ్యక్తి ఆయన... (ఎంగెల్స్ – పై పుస్తకంలో – ప్రజాశక్తి బుక్‌హౌస్)

'పరాయీకరణ' చైతన్యం గురించి హెగెల్ అద్భుత భావాలు, మార్క్స్ వాటిని దిద్దిన తీరు : (హెగెల్ 'మనసు' – అనువాదం : పొట్లూరి వెంకటేశ్వరరావు)

రాజు చుట్టూ సేవకులూ, పండితులూ ఉంటారు.

'రాజసభ' ప్రవేశానికి – క్రమశిక్షణా, విద్యా పాండిత్యాలూ ఉండాలి. స్వీయత్యాగం ఉండాలి. హెగెల్ మాటల్లో – ('పరాయీకరణ' లో సంస్కృతి ఉంది. పరాయీకరణ చైతన్యం కొందరికే సాధ్యం) అనే అర్థం ఉంది.

మార్క్స్ – పరాయీకరణపై మార్క్స్ సూత్రీకరణలు, హెగెల్ సూత్రీకరణల కంటే భిన్నమైనవి. శ్రామికుల పరాయీకరణకు, ఉత్పత్తి పరాయీకరణకు – అదనపు శ్రమ అవసరం. అప్పుడే 'సగటు మానవుడు', 'సాంస్కృతిక మానవుడు' అవుతాడు. సగటు మానవునికి సంస్కృతి సుదూరం. అది అతనికి అందని పండు. సంస్కృతి సగటు మానవుని చుట్టూ తిరుగుతుంటుంది. అవమానాలకు గురి చేస్తుంది.

హెగెల్ ఇలా అంటాడు : 'పరాయీకరణ మాటల్లో' కాలిన మనిషి, 'సంస్కృతి గల వర్గం'లో చేరగలడు. దీనర్థం – మనిషి, నాటి సామాజిక స్థితికి అలవాటుపడి (పరాయీకరణ పొంది), ఆ సమాజ స్థితిలోని జీవన విధానంలోనికి ('దోపిడీ ద్వారా' అని హెగెల్ చెప్పడు) చొచ్చుకుపోడు, ఆ విధాన ఫలాలైన భౌతిక సంపదను పొంది, అలా సంస్కృతి గల వర్గంలో చేరతాడు – అని. – వై.వి.ఆర్.

యజమాని, బానిస – ఇతరుల ఉద్దేశపూర్వక ఆమోదం సాధించ లేని విజయంతో ఏ వ్యక్తీ తృప్తిపడి ఉండలేడు. అంటే – అధికారం, గుర్తింపు – ఈ రెండింటి కోసం పోరాటం ఉంటుంది. ఈ పోరాటం లో – తమ పోటీదారుల కంటే కొంతమంది మరింత ఎక్కువ వేగం పెడతారు. 'యజమానులు' అవుతాడు.

– అతి తక్కువ వేగం పెట్టేవాళ్లు బానిసలు లేదా బాధితులు అవుతారు.

– ప్రాణాలు ఒడ్డి మరణాన్నైనా ఎదిరించి నిలబడే వాళ్లకి దాసులు అవుతారు.

– తన ప్రాణం కాపాడుకోవడానికి బానిస, యజమానికి లొంగి ఉంటాడు.– వై.వి.ఆర్.

ఇక్కడ హెగెల్ 'సమాజ స్థితి'నే (దానికదిగా ఉన్న స్థితినే) తీసు కుంటాడు. పాదార్థిక, సామాజిక సంబంధాల దృష్టితో ఇక్కడ చూడడు. – వై.వి.ఆర్.

నాగరికత కార్యకలాపాల వల్ల, మృత్యువును అధిగమించడం జరుగుతోంది. తన జీవితాన్ని ఫణంగా పెట్టి, మొదట 'యజమాని' అయినవాడు – ప్రకృతి శృంఖలాల్ని ఛేదించే వాడవుతాడు. అందులో బుద్ధిని నింపే క్రమానికి శ్రీకారం చుడతాడు.

ఇక్కడ హెగెల్ – 'ప్రకృతి' నుంచి 'చరిత్ర'కు మారుతున్నాడనీ, 'ఒట్టి బతుకు' నుంచి 'పశుత్వం' నుంచి 'స్వేచ్ఛ'కు మళ్లుతున్నాడనీ అలెగ్జాండర్ కొంజెవె చూపించాడు కూడ. (హెగెల్)

– హెగెల్ తన చివరి రోజుల్లో 'ఫినామినాలజీ'ని తన తాత్విక ఆవిష్కరణ యాత్రగా ప్రస్తావించాడని రొసెన్ క్రాంట్జ్ అన్నాడు.

– నీతి గతితర్కం : హెగెల్ చేసిన చారిత్రక అభివృద్ధి పరిశీలనా క్రమం–

1. గ్రీకు, రోమన్ నాగరికత నుండి, 2. తొలి, మధ్య యుగాల క్రైస్తవ మతం గుండా, 3. ప్రొటెస్టెంటిజమ్, ఫ్రెంచి విప్లవాల దాకా – పరిశీలించే మేరకు సాగాయి. ఈ పరిశీలన – 'స్వేచ్ఛ' ప్రధాన ధోరణులు, దశలు 'ఎలా విచ్చుకుంటాయో' తెలియజేసేట్టు సాగింది. ఆ రకంగా, ప్రాచీన 'ప్రపంచనీతి'లో గర్భితంగా ఉన్న, అంతర్గతంగా ఉన్న దాన్ని – గతితార్కికంగా సిద్ధింపచేసుకోవడం అవుతుంది.

ఈ విచ్చుకోవడం గతితార్కికం. ఏమంటే – ఇది ఊగిసలాట ద్వారా సాగుతుంది. ఇది ఘర్షణ ద్వారా సానుకూలం కావడం బట్టి – ప్రాచీన ప్రపంచంలో – దేవతలకీ, కుటుంబానికీ మధ్య ఘర్షణ; నగర నియమాలకీ మధ్య ఘర్షణ;

– ఆధునిక ప్రపంచంలో – వ్యక్తులు చాటుకునే దానికీ, సమాజం కోరుకునే సానుకూలం కావడం బట్టి దానికీ మధ్య ఘర్షణ.

ఈ భాగంలోనే 'పరాయీకరణ' సిద్ధాంతపు సూచనలు హెగెల్ చేశాడు. 1840లలో ఈ అంశం మార్క్స్‌ను ఆకర్షించింది. (ఎల్ఎస్సి, గుంటూరు)

– ఫినామినాలజీలో హెగెల్ ఆఖరి మాటల్లో ఒక విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాడు. 'తాత్వికంగా భావన చేసిన చరిత్రగతి – హెగెల్ దృష్టిలో పరమబుద్ధి అవతారం.' (ఎల్ఎస్సి, గుంటూరు)

– బుద్ధి ఒక్కటే వాస్తవం అంటాడు హెగెల్. పదే పదే ఈ విషయాన్ని చెపుతాడు. బుద్ధి మౌలిక లక్షణం స్వేచ్ఛ. పాక్షికంగా, పరిమితంగా ఉన్నదేదీ సంపూర్ణంగా స్వేచ్ఛాయుతం కాలేదు. ఒకే ఒక వాస్తవం అయిన బుద్ధి మాత్రమే – ఆ కారణంగా – అపరిమితం, ఏ శృంఖలాలూ లేనిది. 'మనసుని పరిశుద్ధం చేసి, స్వేచ్ఛాయుతం చేసే కార్యకలాపమే – తత్వశాస్త్రం కర్తవ్యం' అన్న పైథాగరస్, ప్లాటినస్, స్పినోజా లాగా, హెగెల్ కూడా అభిప్రాయపడ్డాడు.

హెగెల్ సర్వదా 'ఆలోచన' అభివర్గాల గురించీ, ఒక దానితో ఒకటిగా వాటికి ఉన్న సంబంధం గురించీ యోచించాడు.

'బుద్ధి అనేది – తాత్విక చింతనలో 'స్వీయ చైతన్య సంపూర్ణ తత్వం' గురించిన ఎరుకలో ఉంటుంది' – హెగెల్. (ఎల్ఎస్సి, గుంటూరు)

హెగెల్ గతితర్కం – త్రిపాదకాలు (గతితర్క నియమాలు) : హెగెల్‌ది 'గతితర్క భావవాదం'.

1. పరిమాణం, గుణంగా మారుతుంది. గుణం పరిమాణంగా మారుతుంది. 2. పరస్పర విరుద్ధ అంశాలు ఒకదానిలోకి మరొకటి చొచ్చుకుని పోతాయి. 3. అభావాన్ని అభావమొందించడం.

వీటినే గతితార్కిక నియమాలు లేదా 'త్రిపాదకాలు' అని అంటారు. ఎంగెల్స్ వీటిని వాడి, విశ్వవ్యాప్త నియమాలకు వర్తింపజేస్తూ, కొన్ని ఉదాహరణలూ, వివరణలూ ఇచ్చాడు. వాటిలో కొన్ని తప్పని తర్వాత తెలిసింది.

7. గతితర్కంపై మార్క్స్ : కాపిటల్ 1వ సంపుటం, 2వ ముద్రణకి 'తరువాతి మాట'లో మార్క్స్ ఇలా అంటాడు –

'గతితర్కం హెగెల్ చేతిలో మాయావాదానికి గురైంది అయిన ప్పటికీ, దాన్ని సమగ్రంగా, పూర్తి స్పృహతో సాధారణ రూపంలో వ్యక్తం చేసిన మొదటి వ్యక్తి హెగెల్ మాత్రమే. అతని గతితర్కం తల కిందులుగా ఉంది. మాయావాదపు పెంకులో ఉన్న హేతుబద్ధపు గుజ్జును గ్రహించాలంటే, దాన్ని సక్రమంగా దాని కాళ్లపై నిలబెట్టాలి.' – మార్క్స్ ఎంగెల్స్‌లకు ప్రమేయం లేకుండానే 1830లలో జోసప్ డీజెన్ అనే జర్మన్ కార్మికుడు స్వతంత్రంగా గతితార్కిక పద్ధతిని ఆవిష్కరించాడు.

'గతితర్కం' అనే భావనను మార్క్స్ సమాజానికి వర్తింపజేసి, చరిత్రగతిని దాని అభివృద్ధి దశలలో పరిశీలించాడు. ఆ రకంగా, గతితర్కం – గతితర్క

భౌతికవాదం – గతితార్కిక చారిత్రక భౌతిక వాదం అనే పద్ధతులు ఉనికిలోకి వచ్చాయి. అయితే 'చారిత్రక భౌతికవాదం' అనే మాటను మార్క్స్ ఎన్నడూ ఉపయోగించలేదు. తరువాత వాడుకలోకి వచ్చిన మాట 'గతితార్కిక భౌతికవాదం' విషయంలో కూడ ఆయన అంత సంతోషించేవాడు కాదు. 'చరిత్రని గురించిన భౌతికవాద భావనని గురించి లేక 'ఉత్పత్తి'కి సంబంధించిన భౌతికవాద పరిస్థితులను గురించి మాట్లాడేందుకు ఆయన ఎక్కువ ఇష్టపడేవాడు. అంటే, పూర్తిగా అభివృద్ధి చెందిన భావవ్యవస్థగా కాక, దాన్నొక పద్ధతిగా లేక వైఖరిగా ఆయన చూశాడు. – ('గతితర్కం' నుండి, ఎల్ఎస్సి, గుంటూరు)

– మార్క్స్ పరిశీలనా పద్ధతి : 'మార్క్స్‌కి తాను పరిశోధించే ఘటనల నియమాన్ని కనుగొనడం ముఖ్యం. ఒక నిర్దిష్ట చారిత్రక కాలపరిధిలో, ఒక నిర్దిష్ట రూపం నుండి, ఈ ఘటనల మధ్య పరస్పర సంబంధమున్న మేరకు పాలించే నియమం మాత్రమే ముఖ్యం కాదు. ఈ ఘటనల పరివర్తనకీ, వీటి అభివృద్ధికీ సంబంధించిన నియమం, అంటే, ఇవి ఒక రూపం నుండి మరో రూపంలోకి మారే పరివర్తన నియమం; ఒక సంబంధాల పరంపర నుండి, మరో రకం సంబంధాల పరంపరకి మారే పరివర్తన నియమం, మార్క్స్‌కి మరింత ముఖ్యం. ఆ నియమాన్ని కనుగొన్నాక, సామాజిక జీవితంలో అది ఏయే ఫలితాలుగా వ్యక్తమవుతుందో ఆయన వివరంగా పరిశీలిస్తాడు.... కనుక, అటువంటి సిద్ధాంతం ఒక వాస్తవాన్ని భావాలతో కాక, మరో వాస్తవంతోనే పోల్చి చూస్తుంది. మరో వాస్తవానికే పోటీ పెడుతుంది...' – ఈ రకంగా సాగిన మార్క్స్‌ని కాలం నాటి ఒక పత్రిక రచయిత, మార్క్స్ తన 'పెట్టుబడి' గ్రంథంలో రాసిన విధాన్ని విశ్లేషించినపుడు, దానికి మార్క్స్, 'అయితే, ఇది గతితార్కిక పద్ధతి కాక మరేమిటి?' అంటాడు.

8. గతితర్కంపై ఎంగెల్స్ : 'గతితర్కం' భావనని విశ్వవ్యాప్త నియమాలకి వర్తింపజేసి, దానికి 'గతితర్క విధానం' అని పేరుపెట్టి, హెగెల్ చెప్పిన మూడు గతితర్క నియమాలను (త్రిపాదకాలు' అంటారు) ప్రకృతిలోని అన్ని విషయాలకూ వర్తిస్తాయని అంటూ, వీటికి కొన్ని ఉదాహరణలు ఇచ్చి, వివరించాడు. అయితే, 'గతితర్కం' అంటే – చలనం ప్రధానం కలదిగానూ, ఒక విషయాన్ని పాక్షికంగా కాక, అన్ని విధాల పరిశీలన జరపాలనీ, అభివృద్ధిలోకి (లేదా మార్పు) వచ్చే విషయమే నిర్ణాయకమనీ చెపుతుంటాడు. 'అయితే, ఎంగెల్స్ ఇచ్చిన త్రిపాదకాలపై వివరణలు కొంత అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని శాస్త్రరంగాలకు (సైన్స్‌కి) వర్తించలేం అన్నది తర్వాతి కాలంలో తేలిపోయింది. దీనిపై తరువాత చూద్దాం.

9. గతితర్కంపై మావో : మావో ప్రకారం – అన్ని వస్తువుల అభివృద్ధి క్రమంలోనూ వైరుధ్యం ఉంటుందనీ, ప్రతి వస్తువు తాలూకు అభివృద్ధి క్రమంలోనూ మొదటి నుండి చివరిదాకా విరుద్ధాంశాల చలనం ఉంటుంది. 'చలనమే ఒక వైరుధ్యం' అని ఎంగెల్స్ అన్నాడని మావో చెబుతాడు.

10. గతితర్కంపై స్టాలిన్ : స్టాలిన్ గతితర్కాన్ని అభివృద్ధి పరచి, చారిత్రక భౌతికవాద పద్ధతిలో సమాజంలో జరిగిన మార్పులను (మార్క్స్ చూపించిన వాటినే) మరింత వివరంగా స్పష్టపరిచాడు, ఇలా – 'ప్రపంచం నిరంతర గమనమూ, అభివృద్ధీ కలిగి ఉన్నట్లయితే, పాతది చచ్చిపోతూ ఉండడం, కొత్తది ఉద్భవించుతూ ఉండడం అభివృద్ధి సూత్రమయినట్లయితే, మార్పు చెందని సామాజిక విధానాలు ఉండవని సుస్పష్టం. స్వంత ఆస్తి, దోపిడీ అనే 'శాశ్వత సూత్రాలు' ఉండవనుట స్పష్టం. రైతు, భూస్వామికీ; కార్మికుడు, పెట్టుబడిదారునికీ లొంగి ఉండాలనే 'శాశ్వత భావాలు' ఉండజాలవనుట స్పష్టం... అందుచేత, భూస్వామ్య విధానం స్థానే, పెట్టుబడిదారీ విధానం వచ్చినట్లుగానే, పెట్టుబడిదారీ విధానం స్థానే సోషలిస్టు విధానాన్ని నెలకొల్పవచ్చు.' ('చారిత్రక భౌతికవాదం' నుండి 'ఏ డిక్షనరీ ఆఫ్ మార్క్సిస్టు థాట్' అనువాదం: వైవిఆర్)

11. గతితర్కంపై మార్క్స్ భావనలు, నేటికీ వ్యాప్తిలో గల భావనలు: మార్క్సిస్ట్ సంప్రదాయంలోని 'గతితర్కం'పై గల అతి ముఖ్యమైన, లోతైన భావనలు ఏవంటే –

1. ఇది ఒక పద్ధతి, అతి సాధారణంగా శాస్త్రీయ పద్ధతి. ఇది –'జ్ఞాన సిద్ధాంతపు గతితర్కాన్ని' (ఎపిస్టెమొలాజికల్ డయలెక్టిక్స్) చెపుతుంది.

2. 'సత్తా శాస్త్రపు గతితర్కం'గా (ఆన్టలాజికల్ డయలెక్టిక్స్) పిలువబడే – వాస్తవాన్ని పాక్షికంగా గానీ, పూర్తిగా గానీ నిర్దేశించే కొన్ని నియమాలు, సూత్రీకరణల సమూహం.

3. 'సంబంధీకృత గతితర్కం'గా (రిలేషనల్ డయలెక్టిక్స్) ఇది చరిత్ర గతిని తెలుపుతుంది.

పై మూడు రకాల గతితర్కాలు మార్క్స్‌లో కనపడతాయి.

– మార్క్స్ హెగెల్‌కి ఎంత రుణపడి ఉన్నప్పటికీ, 1843 నుండి 1873 వరకు హెగెల్‌పై మార్క్స్ విమర్శలలో కొనియాడదగిన నిబద్ధతను చూపాడు.

1. ప్రాథమికంగా, మూడు ప్రధానమైన లక్ష్యాలను దాడికి ఎంచుకున్నాడు. అవి – (అ) హెగెల్ తలకిందుల భావనలు, (ఆ) హెగెల్ గుర్తింపు సూత్రం, (ఇ) హెగెల్ నిగూఢత్వం.

2. రెండవ రకంలో, ప్రకృతి స్వయం ప్రతిపత్తి, సామాజిక రూపాల చారిత్రక తత్వాలను నిలుకోవడంలో హెగెల్ విఫలతపై మార్క్స్ తన దృష్టిని కేంద్రీకరిస్తాడు.

– శాస్త్రీయ పద్ధతికి సమానార్థంగా మార్క్స్ తరచూ 'గతితర్కం' పదాన్ని వాడేవాడు... అయినా కానీ, మార్క్స్ పద్ధతి (అ) సహజమైనది, (ఆ) అనుభవాత్మకమైనా – రూఢివాదమైనదిగా కాక, 'వాస్తవికమైనది'.

జె.బి. సీజర్‌కి 1865, జనవరి 24న రాసిన ఉత్తరంలో మార్క్స్ ఇలా అంటాడు – 'శాస్త్రీయ గతితర్కం రహస్యం, ఒక ప్రత్యేక దశలోని ఉత్పత్తి విధాన అభివృద్ధికి సంబంధించిన వాటిని, ఉత్పత్తికి సంబంధించిన చారిత్రక సంబంధాల సైద్ధాంతిక వ్యక్తీకరణను – 'ఆర్థిక' రూపాలలో అవగాహన చేసుకోవడంలో ఉంటుంది.'

ఆ రకంగా, మార్క్స్ గతితర్కం – శాస్త్రీయమైనదీ, చారిత్రక మైనదీనూ. అందుచేత, మార్క్స్ గతితర్కం –

(అ) అనుభవాత్మకంగా తెరిచి ఉంచబడే విధానం (తన్ను తాను పరిపూర్ణమైనదని చెప్పుకోదు) (ఎంపిరికల్లి ఒపెన్ ఎండెడ్).

(ఆ) వస్తుగతంగా నిర్దేశింపబడినది.

(ఇ) చారిత్రకంగా ఒక వలయంచే పరివేష్టితమైనటువంటి గతితార్కిక దృగ్విషయ శాస్త్రం.


– గతితర్కంపై మూడు ప్రధాన భావనలు ఈ కిందివి –

1. గతితర్కం – అర్థరహితమైనదనే వారు (ఉదా. బెర్న్‌స్టీన్)

2. గతితర్కం – విశ్వవ్యాప్తంగా వర్తింపదగినది (ఉదా. ఎంగెల్స్)

3. గతితర్కం – భావనల, సామాజిక విషయాలకు మాత్రమే సంబంధించినది కానీ, ప్రకృతికి వర్తింపజేయలేనిది (ఉదా. మార్క్స్, లెనిన్, స్టాలిన్, మావో)

గతితర్కాన్ని హెగెల్, ఎంగెల్స్, మార్క్స్‌లు ఇలా భావించారనవచ్చు–



(అ) ఎంగెల్స్ : తనకు తెలియకుండానే, సహజమైన 'చరిత్ర' గతిని, 'ఒక కొత్త పరంభావం'గా నిరూపించబూనితే

(ఆ) లూకాక్స్ : తన కాలపు నమూనాగా ఉన్న తత్వశాస్త్రంలో, హెగెల్, ఏ 'పరంభావాన్ని' వాస్తవంగా తన్ను తాను తెలుసుకునేదిగా చూపించే వృథా ప్రయత్నం చేశాడో, దానినే 'చరిత్ర' చేరవల్సిన లక్ష్యంగా చూపించే ప్రయత్నం, లూకాక్స్ చేశాడు. కానీ,

(ఇ) మార్క్స్, తన రాజకీయార్థిక శాస్త్రంలో చూపినట్లు, శ్రామికులు గమ్యం, వారి పాత్రను – చరిత్ర నిర్మాణంలో కర్త – కర్మ పాత్రలకు పోలినవిగా చూపించాడు.

– త్రిపాదకాలపై స్టాలిన్, మావో, లెనిన్‌ల అభిప్రాయాలు:

(అ) స్టాలిన్: ఎంగెల్స్ చెప్పిన గతితర్క నియమాలలోని 3వ నియమాన్ని మొత్తానికే తిరస్కరించాడు.

(ఆ) మావో ప్రకారం, ఎంగెల్స్ ఒకటోవ నియమం, రెండవ నియమం ప్రత్యేక సందర్భం కాబట్టి, ఒకటోవ దానిని వదిలేశాడు.

(ఇ) లెనిన్ కాలం నుండి, గతితర్కంలోని ఈ ఒకటోవ నియమం పైన బద్ధ భారం అంతా తగ్గించబడింది.

12. గతితర్కం, 'త్రిపాదకాలపై ఎంగెల్స్ వివరణ'పైన విమర్శకు లెనిన్ ప్రతివిమర్శ: (గతితర్కం – ప్రజాశక్తి బుక్ హౌస్)

ఆత్మాశ్రయ సామాజిక శాస్త్రవేత్త ఎన్. మిహైలోఇస్కీ భౌతికవాదాన్నీ, ప్రత్యేకించి చారిత్రక భౌతికవాదాన్ని తిరస్కరించాడు. హెగెల్ అభివృద్ధి చేసిన 'తిరుగులేని గతితార్కిక క్రమాన్ని' ఆశ్రయించడం ద్వారా మాత్రమే మార్క్స్ తన వాదనలను రుజువు చేయగలిగాడని 'మిహైలోవిస్కీ' వాదించాడు. 'అంటే, భౌతికవాదులు 'తిరుగులేని గతితార్కిక క్రమం' పైన ఆధారపతారన్న మాట. మరోలా చెప్పాలంటే, వారు తమ సామాజిక సిద్ధాంతాలను హెగెల్ ప్రతిపాదకాలపై ఉంచుతారన్న మాట'

– మార్క్సిజం అంటే – హెగెల్ గతితర్కమే అన్న మూసబోసిన నింద ఇది. ఇప్పటికే దీనిని బూర్జువా విమర్శికులు మార్క్స్‌పై పదేపదే చేసి అరగదీశాడు. మార్క్స్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడలేని ఈ పెద్దలు మార్క్స్ వ్యక్తీకరణ పద్ధతిపైన దాడి చేస్తున్నారు. ఆ సిద్ధాంతాన్ని బలహీనపర్చే ఉద్దేశంతో దాని పుట్టుక గురించి రాద్ధాంతం చేస్తున్నారు. అవే పద్ధతులను మిహైలోవిస్కీ కూడా ఆశ్రయి స్తున్నాడనడంలో దాపరికం ఏమీ లేదు. ఆయన 'యాంటీ డూరింగ్' లోని ఒక అధ్యాయాన్ని తనకు సాకుగా ఉపయోగించుకుంటున్నాడు.

– మార్క్స్ గతితర్కంపై దాడి చేసిన 'డూరింగ్'కి ఎంగెల్స్ సమాధానం చెప్పాడు.

హెగెల్ త్రిపాదకాలతో మార్క్స్ ఎన్నడూ దేనినీ రుజువు చేయాలని కనీసం అనుకోను కూడా లేదని ఎంగెల్స్ స్పష్టం చేశాడు. వాస్తవ క్రమాలను – మార్క్స్ అధ్యయనం చేశాడు. పరిశోధన చేశాడు. పైగా వాస్తవకతకు అనుగుణంగా ఉండడమే సిద్ధాంతానికి గీటురాయి అని ఆయన పరిగణించాడని ఎంగెల్స్ పేర్కొన్నాడు.

గతితార్కిక పథకం గురించి పట్టుబట్టడమూ, త్రిపాదకాలు సరైనవేనని రుజువు చేయడానికి ఉదాహరణలను ఎంచుకోవడమూ – ఇది హెగెల్ వాద అవశేషం తప్ప వేరేమీ కాదు. వ్యక్తీకరణలో కూడా అవే అవశేషాలు ఇంకా ఉన్నాయి.

– 1858లో ఎంగెల్స్‌కి రాసిన ఉత్తరంలో మార్క్స్, 'లాసెలీ' గురించి ఇలా రాశాడు.

'ఈ మనిషి తన రెండో గ్రంథంలో రాజకీయ అర్థశాస్త్రాన్ని హెగెల్ తరహాలో ప్రదర్శిస్తానని అంటున్నాడు. విమర్శ ద్వారా ఒక శాస్త్రాన్ని గతితార్కికంగా ప్రదర్శించడం వేరు. ఒక రెడీమేడ్ నైరూప్య తార్కిక చట్రాన్ని శాస్త్రీయమని భ్రమింప చేసి, ఒక వ్యవస్థకు వర్తింపజేయడం వేరు. ఈ విషయాన్ని ఈ మనిషి క్రమంగా గ్రహించకతప్పదు'.

వాటి నుంచి శాస్త్రీయ సోషలిజం ఏనాడో బయటపడింది. దేనినైనా త్రిపాదకాల ద్వారా రుజువు చేయడం అన్నది అసంబద్ధమని ఎంగెల్స్ ప్రకటించాడు. ఆ తర్వాత ఎవరూ ఆ ప్రయత్నం చేయలేదు కూడా. అటువంటప్పుడు, ఈ గతితార్కిక క్రమాల గురించిన ఉదాహరణలకు ఉన్న ప్రాధాన్యం ఏమిటి? అవి కేవలం సిద్ధాంతం పుట్టుకను గురించి తెలియజేస్తాయి. అంతకుమించి మరేమి కాదన్నది స్పష్టం.

– ఎంగెల్స్ వాదనలలో సిద్ధాంతం పుట్టుక కాక, అంతకుమించి ఏదో ఉందని చెప్పగోరే మనిషి ఒక విషయాన్ని రుజువు చేయాలి. అది ఏమంటే – భౌతికవాదులు కనీసం ఒక్క చారిత్రక సమస్యనైనా తగిన వాస్తవాల ప్రాతిపదికపైన కాకుండా, కేవలం త్రిపాదకాల సాయంతో పరిష్కరించారని రుజువు చేయాల్సి ఉంటుంది.

దీనిని రుజువు చేయడానికి మిహైలోవిస్కీ ప్రయత్నించాడా? లేదు. ఏమాత్రం ప్రయత్నించలేదు.

– అధిభౌతిక పద్ధతికి వ్యతిరేకంగా, 'గతితార్కిక పద్ధతి' అని మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రస్తావించిన పద్ధతి సామాజిక శాస్త్రంలో శాస్త్రీయ పద్ధతి తప్ప, మరేమీ కాదు.

అంటే, సమాజం ఒక సజీవ అంగం. అది నిరంతర అభివృద్ధి స్థితిలో ఉంటుంది. (అంతేగానీ, యాంత్రిక సమ్మేళనం కాదు. మన చిత్తానుసారం ఎంచుకున్న విడి సామాజిక అంశాల కలయిక కాదు) సమాజాన్ని అధ్యయనం చేయాలంటే – దానిలోని ఉత్పత్తి సంబంధాల ను వస్తుగతంగా విశ్లేషించాలి. ఆ సామాజిక వ్యవస్థ దాని పని తీరులోని నియమాలను, దాని అభివృద్ధి నియమాలను పరిశోధించాలి.. కాబట్టి 'శాస్త్రీయ గతితర్కమంటే గతితార్కిక పథకం కాదు'.–లెనిన్ (ప్రజామిత్రులు బండారం, 1894)

13. ఉపసంహారం:

(ఆకృతిక తర్కం నుండి మొదలెట్టి, భావవాద గతితర్కం, భౌతిక వాద గతితర్కాలను చూశాం. గతితర్కం అంటే సామాజిక శాస్త్రాల్లో శాస్త్రీయ పద్ధతి తప్ప వేరుకాదన్న లెనిన్‌ని చూశాం. అయితే, బూర్జువా / పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికపర సిద్ధాంతమైన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని, బూర్జువా శాస్త్రవేత్తలు అశాస్త్రీయమైనది గానే జమకడతారు. ఆ కోవలోనే గతితర్కాన్ని కూడా శాస్త్రీయమని ఒప్పుకోరు. పైగా 'కమ్యూనిస్టు శాస్త్రం' అంటూ శ్రామిక సిద్ధాంత శాస్త్రాల్ని వారి శాస్త్రాలతో కలవనివిగా, అంటరానివిగా ఎంచుతారు. లేకుంటే, వారి వర్గ స్వభావాన్ని వారు అంగీకరించాల్సివస్తుంది. కానీ, కమ్యూనిజం ఒక కేవలం సిద్ధాంతంగానో, ఊహగానో తన్నుతాను ప్రకటించుకోదు. దాని బలం అంతా అశేష పీడిత ప్రజల దోపిడీ, వేదనలలోంచి పుట్టుకొచ్చే పోరాటంలో (మరీ ముఖ్యంగా, వర్గపోరాటంలో), తదనుగుణమైన ఆచరణ, దిద్దుబాటు, ఆచరణ.––– ఆ పరంపరంలోనే ఉంది. దాని ఈ పోరాట ప్రస్థానంలో ప్రపంచంలోని ఏ శాస్త్రంలో ఉన్న సామాజిక అభివృద్ధికరమైన అంశాన్నైనా తనలో ఇముడ్చుకోగల హక్కూ, చైతన్యం దానికి ఉన్నాయి. ఈ పార్శ్వం ఉన్నందువల్లనే 'మార్క్సిజం' అనేది 'శాస్త్రాలకే శాస్త్రం' అని పిలువబడడం. అంతేకానీ, 'మార్క్సిస్టు శాస్త్రం' అని వేరేగా లేదు. అలా ఉందని, ఇతర శాస్త్రాలలోని అభివృద్ధికర, శాస్త్ర, సాంకేతిక అంశాలను 'మార్క్సిస్టు శాస్త్రాని'కి అంటనివిగా, దూరం చేసే పోకడలు – అమానవీయమైనవి, భవిష్యత్‌లేనివి మాత్రమే కాక; శ్రామిక, కార్మికవర్గానికి అవి (పోకడలు) కీడు చేసేవియైననూ – జ్వాజ్వల్య మానమైన ప్రజా పోరాట ప్రస్థానంలో, వారి ఆచరణలో, అటువంటి అభివృద్ధికర శాస్త్రాంశాలను శ్రామికులు యథాలాపంగా పుణికి పుచ్చుకొని, ఆచరణలో పెడతారు.

(రచయిత ప్రభుత్వ ఉద్యోగి) వీ

కుల సమస్య-అంబేద్కరిజం-మరికొన్ని కోణాలు

- కె. రమేశ్

వీక్షణం పత్రికలో ఏప్రిల్ నుండి జూన్ వరకు 'కుల సమస్య – మార్క్సిస్టు అవగాహన – ఒక నోట్ ' మూడు భాగాలు చదివాను. కుల సమస్య పట్ల, అంబేద్కరిజం పట్ల ఒక స్పష్టమైన వైఖరి అందులో కనిపించాయి. ఈ సమస్యపై పూర్వం నుండి వివిధ కమ్యూనిస్టు పార్టీల, గ్రూపుల, సంస్థల అవగాహన లోపభూయిష్ఠంగా ఉన్న సంగతి అందరికి తెలిసిందే. అయితే ఈ సమస్యపై ఒక స్పష్టమైన వైఖరితో పాలసీ ఉండాలని, దాని వెలుగులో కుల సమస్యలపై, కుల నిర్మూలనపై, అంబేద్కరిజంపై కార్యక్రమాలు కొనసాగాలి. మొత్తం సమాజ మార్పుకై సాగే నూతన ప్రజాస్వామిక కార్యక్రమంగా వీటిని అంతర్భాగం చేయాలని తపించిన, ఆశించిన కార్యకర్తలు అన్ని కమ్యూనిస్టు విప్లవ సంస్థల్లోనూ గణనీయమైన సంఖ్యలో ఉన్నారనేది ఒక వాస్తవం. ఆ మధ్యకాలంలో జనశక్తి పార్టీలో వీరన్న వర్గం తీసుకొచ్చిన వాదనలను ఖండిస్తూ, కుల సమస్యలపై కమ్యూనిస్టుల వైఖరి ఎలా ఉండాలనే దానిపై జనశక్తి పార్టీ ఆనాటి రాష్ట్ర నాయకత్వం తీసుకొచ్చిన డాక్యుమెంట్, దాదాపు ఇదే అవగాహనలో (కుల సమస్య) ఉన్నట్లు జ్ఞాపకం. కుల సమస్య, కుల వ్యతిరేకోద్యమాలు, కుల నిర్మూలన, అంబేద్కరిజం – ఈ క్రమంలో అంబేద్కరిజం సృష్టించిన పలు సమస్యల్లో ఎవరూ అంతగా దృష్టి సారించని ఆచరణకు సంబంధించిన సమస్య ఒకటి – బుద్ధిజం. తన మరణానికి ఒక నెలా ఇరవై రోజుల ముందు స్వీకరించిన బౌద్ధమతం – దళితుల్లో ముఖ్యంగా మహారాష్ట్రలో ఇంత అనైక్యతను తెస్తుందని అంబేద్కర్ స్వయంగా ఊహించి ఉండరు.

మహారాష్ట్రలో దళితుల్లో మహార కులం సంఖ్యరీత్యా చాలా పెద్దది. కొన్ని సామాజిక, చారిత్రక కారణాల వల్ల, అంబేద్కర్ అదే కులానికి చెందన కారణం వల్ల కూడా కావచ్చు, అంబేద్కర్ కుల వ్యతిరేక ఉద్యమంలో మహార్లు పెద్ద సంఖ్యలో భాగం అయ్యారు. ఆ తర్వాత అంబేద్కర్‌తో పాటు బౌద్ధం స్వీకరించిన లక్ష మంది దళితుల్లో మహార్లే అధికం. ఇతరులు ఎవరైనా వ్యక్తులుగా మాత్రమే భాగమయ్యారు. ఆ తర్వాత కూడా ఈ క్రమం కొనసాగి దాదాపు తొంభై శాతం మహార్లు బౌద్ధులుగా గుర్తింపు పొందారు. మిగిలిన వారు క్రిష్టియన్లుగా, హిందువులుగా గుర్తింప బడుతున్నారు. ఇక ఇతర దళిత కులాలైన మాలురెగులు, చాంబార్లు, దొహార్లు మొదలైన వాళ్లెవరూ బౌద్ధంలోకి ఆనాడు వెళ్లలేదు. ఈ మధ్య ఒకటి రెండు చోట్ల చిన్న ప్రయత్నాలు జరిగినా అవేవీ సఫలం చెందలేదు. వారంతా హిందూ మత అవలంబికులు గానే గుర్తింపబడుతున్నారు. ఒక వైపు మహారంలో బౌద్ధ మత విధానాలు, పూజ, పునస్కారాలు, బౌద్ధ విహారాల నిర్మాణం విరివిగా కొనసాగుతూ, అందులో భాగంగానే పెళ్లిళ్లు, నామకరణాలు, గృహ ప్రవేశాలు, చావుల సందర్భాల్లో తమ ప్రత్యేకతలు చాటుకోవడం రోజురోజుకూ అధికమవుతుండగా ఇతర దళిత కులాలలో అగ్రకుల, ఒబిసి కులాల మాదిరిగానే హిందూ మత ఆచారాలు ఆచరించడం ఎక్కువ అవుతోంది. దీనిమూలంగా అంతవరకు కేవలం (అంటరాని కులాలే అయినప్పటికీ) కులపర, వృత్తిపర తేడాలతో ఉన్నటువంటి విభేదాలు ప్రస్తుతం సరికొత్త రూపం తీసుకుని – మతపరమైన విభేదాలు వారి మధ్య అనైక్యతకు ప్రధాన కారణంగా మారాయనేది ఒక వాస్తవం. ఈ సమస్యపై తీవ్రంగా ఆలోచించి, దళిత ఐక్యతకు దోహదపడే కార్యాచరణ విధానాన్ని రూపొందించుకోవడం కుల వ్యతిరేక దళితోద్యమ శ్రేయస్సు దృష్ట్యా, అలాగే విప్లవోద్యమ అవసరాల రీత్యాను ఎంతో అవసరం.

అయితే, ఈ సమస్యను గుర్తించేవారు ఎవరు? గుర్తించినా స్పందించేవారు ఎవరు? అంబేద్కరిస్టు ఉద్యమ నాయకులుగా, సంస్థలుగా ఉన్న శక్తులు దీనిని పట్టించుకోవడం లేదు. దళిత కులాల మధ్య అనైక్యత విషయంలో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో పరిస్థితుల్లో చిన్న, చిన్న తేడాలు ఉన్నపట్టికీ – పైన వివరించిన బుద్ధిజం కారణంగా మహారాష్ట్రలోని పరిస్థితులు మొత్తం దేశ పరిస్థితులకు చాలా భిన్నంగా ఉన్నాయనేది గుర్తించవలసిన విషయం. వివిధ రిపబ్లికన్ పార్టీల, దళిత పాంథర్‌కు చెందిన చిన్న చిన్న సంస్థల నాయకత్వాలు బుద్ధిస్టు దళిత మహారలకే చెందినవారు. ఇందులో భాగంగానే బౌద్ధ మహాసభ వంటి సంస్థలు వెలుగులోకి వచ్చి బౌద్ధమత కార్యక్రమాలను పెద్దఎత్తున వ్యాప్తిలోకి తేవడానికి కృషిచేస్తున్నాయి. ఈ నాయకత్వాలు తమ కుల పరిధిల్లోనే కార్యక్రమాలు కొనసాగిస్తూ బౌద్ధ (మహార్) ప్రజానీకాన్ని తమ చుట్టూ తిప్పుకుంటూ వివిధ పాలకవర్గ పార్టీలతో పొత్తులు, వాటాలకై వెంపర్లాడుతూ దోపిడీ పాలక వర్గాలకు సేవ చేస్తున్నాయి. వీరి ఆచరణ ఇట్లా ఉంటే, ఇతర దళిత కులాల ప్రజానీకం మతపరమైన తేడాల మూలంగా బౌద్ధ దళిత కార్యకర్తల ద్వారా ఈసడింపుకూ, హేళనకు గురవుతున్నందున మరింత దూరం జరుగుతూ తమ కులాల నాయకత్వాల మోసాలకు, పాలక పార్టీల వంచనకు గురవతున్నారనేది ఒక వాస్తవం. ఈ దూరం ఎంత దాకా చేరిందంటే మహారలు తప్ప మిగిలిన దళిత కులాల వారి ఇళ్లల్లో అంబేద్కర్ చిత్రపటం దాదాపు అదృశ్యమైందనేది ఒక చేదు వాస్తవం. మొత్తం భారతదేశాన్ని బౌద్ధమయం చేయాలన్న అంబేద్కర్ ఆలోచనలు వాస్తవ ఆచరణలో దళితుల్లోనే తీవ్రమైన అనైక్యతకు – అది కూడా అంబేద్కరిజం బలంగా ఉందనుకునే మహారాష్ట్రలో – దారి తీసింది. అంబేద్కరిజం అంటే బుద్ధిజం అనీ, అంబేద్కర్ పట్ల ఆచరణ, గౌరవం ఉంటే బౌద్ధాన్ని స్వీకరించ వలసిందేననీ, అలా కాదంటే అంబేద్కర్ పట్ల అవిధేయతగా అంబేద్కరిజం పట్ల అవిశ్వాసంగా గుర్తించబడుతున్నారు. ఇదే ప్రశ్నను కొద్ది సంవత్సరాల క్రితం బిఎస్‌పి అధినేత్రి మాయవతి స్వయంగా ఎదుర్కొన్నారు. బిఎస్‌పి అధికారికంగా మతపరమైన అంశాలను ముందుకు తేనప్పటికీ, అందులోని – మహారాష్ట్రకు చెందినంత వరకు – నాయకులు, కార్యకర్తలు ప్రధానంగా బుద్ధిస్టు దళితులే కావడం వలన వాస్తవ ఆచరణలో ఈ అంశం వివిధ రూపాలలో ముందుకొచ్చి దళితులు – దళితుల మధ్య, దళిత – ఒబిసిల మధ్య ఐక్యతకు ఒక అడ్డంకిగా మారింది. అయితే, ఈ సందర్భంగా మరొక ప్రశ్న ఉదయించక మానదు. అసలు అంబేద్కరిజం అంటే ఏమిటి? బౌద్ధమత మార్పిడితో కూడిన సామాజిక,

రాజకీయ ఉద్యమమా? లేక బౌద్ధ మతాన్ని పక్కన పెట్టిన సామాజిక రాజకీయ ఉద్యమమా? ఎన్నో వైరుధ్యాలతో కూడుకున్న అంబేద్కరిజాన్ని విశ్లేషిస్తున్నప్పుడు ఈ బౌద్ధ మతపరమైన అంశాన్ని గాలికి వదిలి వేయడం సాధ్యం కాదు. నేడు ఈ ప్రశ్న ఒక్క మహారాష్ట్రలో ప్రత్యక్షంగా ఎదురవుతున్నప్పటికి, ఒక సిద్ధాంతంగా దేశవ్యాప్తంగా అంబేద్కరిజంలో భాగంగా చూడవలసిన అవసరం ఉంది.

అట్లాగే, రాజ్యాంగ రచనా సమితికి అధ్యక్షుడుగా అంబేద్కర్ నిర్వహించిన పాత్ర కారణంగా, ఆయన పట్ల విధేయతతో రాజ్యాంగాన్ని ఒక మత గ్రంథం కన్నా పవిత్రంగా పరిగణిస్తూ, దాని రక్షకులుగా ముందుకు రావడం అంబేద్కరిస్టుల్లోని ఒక ప్రధాన ధోరణి. ఈ ధోరణి దేశవ్యాప్తంగా ఉన్నప్పటికీ మహారాష్ట్ర దళితోద్యమంలో ఇది మరింత ఎక్కువ. దోపిడీ పాలక వర్గాలకు ఉపయోగపడుతున్న భారత రాజ్యాంగాన్ని ప్రజానుకూల మైనదనే భ్రమలో దానిని వ్యతిరేకించే శక్తులను శత్రువులుగా పరిగణిస్తూ తమకు తెలియకుండానే పాలకవర్గాల పక్షం వహించడం జరుగుతోంది. ప్రజల కోసం, నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణం కోసం పోరాడుతున్న శక్తులకు వ్యతిరేకంగా అంబేద్కరిస్టు సాహితీ వేత్తలు, రాజకీయ నాయకులే గాక మధ్య తరగతి, విద్యావంతులు, మేధావి వర్గాలు కూడా వ్యాసాల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవడానికి ముందు షరతుగా ఆయా వర్గాలలో ఉన్న అవగాహనా లోపాన్ని సరిదిద్దడానికి అంబేద్కరిస్టు సిద్ధాంతంలోని ఈ లోపాల పట్ల సరైన అవగాహన కలిగించడానికి కృషి చేయక తప్పదు. ఆయా సందర్భాలలో అంబేద్కరిజంలోని వివిధ పార్శ్వాలతో సైద్ధాంతిక, రాజకీయ పోరాటం చేయక తప్పదు. బుద్ధిస్టు దళిత ప్రజానీకంపై గల అవకాశవాద, దళారీ రాజకీయ నాయకత్వాల పట్టును సడలించనిదే, మార్క్సిస్టు మార్గంలోకి తేవడం సాధ్యం కాదు. అందులో బౌద్ధమతం, రాజ్యాంగం అనే రెండు అంశాల పట్ల కేంద్రీకరించి పని చేయవలసిన ఆగత్యం ఉన్నది. ఈ పై అంశాలు నాకొక్కడికే తెలిసినవో, నేను కనిపెట్టినవో కావు గానీ, నా అనుభవంలో గ్రహించిన విషయాలు. కాబట్టి నలుగురితో పంచుకోవాలని రాస్తున్నాను. దాదాపు 30 సంవత్సరాల క్రితం నేను కూడా కుల సమస్యపై పాలసీ ఉండాలని, దాని వెలుగులో కార్యక్రమాలు ఉండాలని సంబంధిత సంస్థలో చర్చకు పెట్టడం జరిగింది.

గత కొద్ది సంవత్సరాలుగా ఈ అంశం పట్ల స్పష్టత ఏర్పడుతున్న క్రమాన్ని చూసి సంతృప్తి కలుగుతున్నప్పటికీ, ప్రజా సంఘాలలో అన్ని స్థాయిల్లోనూ మరింత లోతైన, స్పష్టమైన అవగాహనతో కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరం.

చివరగా ఒక్క మాట. మహారాష్ట్రలో మొదటి నుండి వివిధ రకాల అంబేద్కరిస్టు శక్తుల నుండి వ్యతిరేకతను ఎదుర్కొంటూ కూడా కార్యకర్తల నుండి నాయకత్వ స్థానాల దాకా, బౌద్ధిస్టు దళిత ప్రజా సమూహం నుండి ఎదిగి వచ్చిన వారే ఎక్కువ. అగమ్యగోచరంగా మారిన అంబేద్కరిజపు ప్రస్తుత స్థితి నుండి ముందుకు పోవాలనుకునే నిజాయితీ దళిత పోరాట శక్తులకు ఈ అనుభవాన్ని ఒక దిక్సూచిగా మార్చవలసిన అవసరం ఎంతగానో ఉంది.

(రచయిత మహారాష్ట్రలోని సామాజిక కార్యకర్త) వీ


వీక్షణం రచయితలకు సూచనలు

పన్నెండు సంవత్సరాలలో, నూట నలభైకి పైగా సంచికలలో వీక్షణం దాదాపు రెండు వేల ఐదు వందలకు పైన వ్యాసాలు, రచనలు ప్రచురించింది. వీటిలో నిడివిలోనూ, వస్తువులోనూ, చెప్పిన పద్ధతిలోనూ, సుబోధకతలోనూ చాల వైవిధ్యం ఉంది. ఈ వైవిధ్యాన్నంతా గౌరవిస్తూనే, పత్రికలో అచ్చయ్యే వ్యాసాలను ప్రామాణికం చేయడానికి రచయితలు ఈ కింది సూచనలు పాటిస్తే బాగుంటుందని భావిస్తున్నాం.

- రచన మరీ చిన్నది (ఒక పేజీ కన్న తక్కువ) కాకుండానూ, మరీ పెద్దది (నాలుగు పేజీల పైన) కాకుండానూ ఉంటే బాగుంటుంది. రచన ఐదు పేజీలకు మించితే రెండు మూడు సంచికలలో వేయవలసి వస్తుంది గనుక రచయిత అభిప్రాయం పాఠకులకు అందడం కష్టమవుతుంది. మూడు-నాలుగు పేజీల రచన (1800 - 2500 పదాలు) వీక్షణంకు సరిగ్గా సరిపోతుంది.
- చేతిరాతతో పంపేవారయితే వీలయినంత కుదురుగా, చదవడానికి వీలుగా, పంక్తుల మధ్య ఖాళీ వదులుతూ, కాగితానికి ఒకవైపునే రాసి పంపాలి. కంపోజ్ చేసి పంపేవారయితే, డబుల్ లైన్ స్పేసింగ్‌లో కాగితానికి ఒకవైపునే అచ్చువేసి పంపాలి. యూనికోడ్‌లో గాని, పేజ్‌మేకర్‌లో గాని కంపోజ్ చేసేవారు సాఫ్ట్ కాపీ సి.డి. ద్వారాగాని, ఇ మెయిల్ లోగాని పంపితే మంచిది.
- రచయితలు తప్పనిసరిగా తమ రచన ఫొటో కాపీ తమ దగ్గర ఉంచుకోవాలి.
- రచనతో పాటు తప్పనిసరిగా రచయిత సంక్షిప్త పరిచయం, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, ఇమెయిల్ వగైరా వివరాలు పంపాలి.
- వీక్షణం కార్యాలయానికి రచన అందిన వెంటనే అందినట్టుగా రచయితలకు సమాచారం పంపుతాం. రెండువారాలలోగా ఆ రచనను ప్రచురణకు స్వీకరిస్తున్నదీ లేనిదీ తెలుపుతాం. తక్షణ ప్రాముఖ్యత ఉన్న అంశం మీద రచన అయితే రెండు-మూడు నెలల లోపు అచ్చువేస్తాం. సాధారణ రచనలు అచ్చువేయడానికి ఆరు నెలల వరకూ పట్టవచ్చు.
- మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణం కు పంపగూడదు.
- దీర్ఘకాలిక తాత్విక, రాజకీయార్థిక, సామాజిక అంశాల మీద మాత్రమే కాక, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపైన కూడ రచనలు పంపాలని రచయితలకు విజ్ఞప్తి. ఆ విషయం మీదనే మరొకరు రాసినా, అన్ని దృక్పథాల రచనలు అచ్చు వేయడం వీక్షణం ఉద్దేశ్యం. క్షేత్ర పరిశోధనా నివేదికలు, విధానాల అమలు తీరుతెన్నులు, ప్రజాజీవితంలో మార్పులు, వివిధ దృక్కోణాలు, విభిన్న సామాజిక శాస్త్ర పరిశీలనాంశాలు వీక్షణంలో ప్రాధాన్య ప్రచురణాంశాలు. సాహిత్య రంగానికి సంబంధించిన రచనలకు వీక్షణంలో చోటు కల్పించడం సాధ్యం కాదు.
- రచయిత అభిప్రాయాలను మార్చడం ఎప్పుడూ జరగదు. కాని నిడివి దృష్ట్యాగాని, సాంకేతిక కారణాల దృష్ట్యాగాని రచనలు కుదించే, మార్చే పరిస్థితి రావచ్చు. ఇలా ఎడిట్ చేయడానికి రచయితలు ఆమోదించాలి.

మహిళలపై దాడులను ఖండించిన 'అగ్నిశిఖ'

- గోమతి



అగ్నిశిఖ – ప్రరవే స్పందన – సంపాదకవర్గం: కె. సుభాషిణి, డా. నళిని, కొండేపూడి నిర్మల, అనిశెట్టి రజిత, శివలక్ష్మి – ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక – 132 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: అన్ని పుస్తక కేంద్రాలు / కె. సుభాషిణి, subhashini.gprec@gmail.com; 9440254730

ప్రతిరోజూ మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యల ఘటనలకు సంబంధించి వార్తలు వింటూనే ఉన్నాం. నిందితుని శిక్షించేందుకు అనేక చట్టాలు ఉన్నాయి. ఇటీవలే నిర్భయ చట్టం వచ్చింది. అయినా అత్యాచారాలు, హత్యలు తగ్గడం లేదు. ఈ సంఘటనలపై అన్ని వర్గాల ప్రజల నుండి నిందితులకు శిక్ష పడాలి అనే అభిప్రాయం వ్యక్తమవుతూ వస్తున్నది. ఉరిశిక్షలు నేరానికి తగిన పరిష్కారం కాదని, నేరం జరగకుండా నివారించడం ఒకటే మార్గమని సమాజం తెలుసుకోవాలనే నేపథ్యంతో 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' సభ్యులు కథలు, కవితలు, వ్యాసాల సమాహారంతో 'అగ్నిశిఖ' అనే పుస్తకాన్ని మన ముందుకు తెచ్చారు. అందులో కాత్యాయని విద్మహే 'స్త్రీలపై అత్యాచారాల నిరోధానికి ఉపాధ్యాయ ఉద్యమాలు ఉధృతం కావాలి' అని అంటున్నారు. నిర్భయ ఉదంతం తర్వాత ఏర్పడిన వర్మ కమిటీ అత్యాచార నిరోధానికి అన్ని సూచనలు చేసినప్పటికీ వాటినన్నిటినీ పక్కన పెట్టి వద్దన్న ఉరిశిక్షను ప్రజాభిప్రాయానికి స్థానం కల్పించామన్నట్లుగా ఆర్డినెన్స్‌లో భాగం చేయడం అసలు విషయం నుంచి దృష్టి మళ్లించడమే అనే విషయాన్ని స్పష్టంగా చెప్పారు.

అత్యాచార ఘటనకు సంబంధించి అనేక రకాలుగా, అనేక కోణాలలో, అనేక మంది స్పందిస్తూ ఉంటారు. ఆ స్పందనలన్నింటిని ఏకం చేసి 'శరీర న్యాయం రెండో అధ్యాయం' కవితలో ఘంటశాల నిర్మల బాధితురాలి మనసుకు న్యాయం జరగదు గానీ, కంటితో చూసిందానికి శిక్ష పడేలా కోర్టులూ, శిక్షలూ అన్నీ రెండో అధ్యాయంలో జరుగుతాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.

'నిజాన్ని వదిలేసి నీడతో యుద్ధమా' అంటూ పి. వరలక్ష్మి 'నిర్భయ' సంఘటనను ఉటంకిస్తూ సంఘటనలు జరిగినపుడు ఏ పోలీసు వ్యవస్థను, చట్టాలనైతే తప్పుపడతారో వాటితోనే పరిష్కారాన్ని వెతికే విచిత్రమైన పరిస్థితి ఉందని, రాజ్యం ఒక అణచివేత సాధనంగా అత్యాచారాలను అమలు చేస్తోందన్న విషయం ప్రాథమికంగా మనం గుర్తిస్తేనేగాని మన పోరాటం ఎవరిపైన ఉండాలన్న స్పష్టత రాదని, చెపుతున్నారు. స్త్రీల సంఘటిత శక్తి ఎన్నో విధాలుగా పెరగాలని, సమీకృత శక్తులుగా మాత్రమే సామాజిక దుష్ట ప్రభావాలను, పరిణామాలను, అత్యాచారాలను ఎదుర్కొని నివారించగలమని, సామాజిక పాలనా నియమాలను సమానత్వ స్పృహతో శాసిస్తామని అనిశెట్టి రజిత అంటున్నారు.

డా. మల్లీశ్వరి 2007 ఆగస్టు 20న విశాఖ జిల్లా వాకపల్లిలో గ్రే హౌండ్స్ పోలీసులు గిరిజనులపై చేసిన సామూహిక అత్యాచారంపై 'భూమి చెపితే ఆకాశం నమ్మదా' అనే శీర్షికతో వాకపల్లి ఘటన పూర్వపరాలను వివరించారు. 'భయంతో కాదు నిర్భయంగా' అంటూ భండారు విజయ, 'స్త్రీలపై అత్యాచారాలు ఆపడమెలా' అంటూ రోజా రమణి, ప్రశ్నిద్దాం, నిరసిద్దాం అంటూ కొమర్రాజు రామలక్ష్మి, 'రాజ్యహింస బాధిత స్త్రీలకు దక్కని న్యాయం' అంటూ రత్నమాల, 'మన గురించి మనం ఆలోచించు కోవడం మరచిపోతే ప్రపంచం మనల్ని మరచిపోతుంది అని చరిత్రలో చాలా సార్లు రుజువైంది' అన్న జర్మన్ రచయిత్రి లూయిస్ ఓటూ పీటర్స్ మాటలను ఉటంకిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం జరగాలంటే స్త్రీలపై జరుగుతున్న హింసను నిరసించాలి, ప్రశ్నించాలి. మన చుట్టూ ఉన్నవారిని కూడా చైతన్య పరచాలని అంటున్నారు.

'అత్యాచారం ఆచారమైపోయిందా' అనే కృష్ణాబాయి వ్యాసం, 'మహిళలను మనుషులుగా చూడడమే స్త్రీ సమస్యకు శాస్త్రీయ పరిష్కారం' అనే శివలక్ష్మి వ్యాసం ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. డా. నళిని 'అత్యాచారాలను నిరసిస్తూ తక్షణ కోర్కెల సాధన కోసం ఉద్యమాలు పెంపొందాలి' అనే వ్యాసంలో అనాగరిక స్వేచ్ఛని, ఆధునికత పేరుతో అమలయ్యే స్వాతంత్ర్యాన్ని మంచినీళ్ల సిద్ధాంతంతో పోల్చడం జరిగింది.

'ఈ పోరాటాన్ని ఆపొద్దు ప్లీజ్' అంటూ తాయమ్మ కరుణ రాసిన కథనంలో బాధితురాలు 'నిర్భయ' కథనం ద్వారా తనపై జరిగిన అకృత్యానికి స్పందిస్తూ సమాజంలో ఇలాంటి దారుణాలు జరగకుండా అన్యాయం జరిగిన ఏ మహిళకైనా న్యాయం జరిగే వరకు పోరాటాన్ని ఆపొద్దు అంటూ తన స్పందన తెలియజేస్తున్నారు.

అలాగే కె. సుభాషిణి 'అరుణకోసం' కథలో బాధితుల పట్ల ప్రభుత్వం గానీ, ప్రభుత్వ యంత్రాంగంలో భాగమైన ఆసుపత్రుల్లో గానీ, చట్టాలు అమలు చేయాల్సిన పోలీసు స్టేషన్లో గానీ అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా ప్రతిబింబించేటట్లు చెప్పినారు. అలాగే శాంతి ప్రబోధ 'శిలలోని జల' కథ ఆలోచింపచేసేదిగా ఉంది.

ఇంకా ఈ సంకలనంలో 'విషవలయం' అనే కవిని కథ, 'బాధాశప్త నది' అనే కొండేపూడి నిర్మల కవిత, 'యుద్ధం' లక్ష్మి సుహాసిని కవిత, 'కాంక్షా భ్రమరం' మందరపు హైమావతి కవిత 'నెత్తుటి నదిలో నెలవంకలు' వి. ప్రతిమ కవిత, 'మృగతృష్ణ' పసుపులేటి గీత కవిత, డా. కందాల శోభారాణి 'పితృస్వామ్య సంస్కృతి అంతరించి పోవాలి' పుస్తక సమీక్ష, పి. సత్యవతి 'ఆ తప్పు నీదికాదు' అంటూ రాసిన 'తప్పెవరిది' బండారి సుజాత నవలా సమీక్ష ప్రతి ఒక్కరిని ఎంతో ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న రకరకాలైన హింసా రూపాలను, వాటి పరిష్కారాలను ఈ పుస్తకంలో ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరు చదవాల్సిన పుస్తకం ఇది.

(రచయిత ప్రభుత్వ ఉద్యోగిని) వీ

ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా అల్లం నారాయణ

తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా ప్రముఖ జర్నలిస్టు అల్లం నారాయణను నియమిస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యదర్శి ఆర్‌వి చంద్రవదన్ జూలై 3న ఉత్తర్వులు ఇచ్చారు. పదవీకాలం మూడేళ్లు.

శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్

తెలంగాణ తొలి శాసన మండలి ఛైర్మన్‌గా టిఎన్‌జిఒ మాజీ అధ్యక్షులు కె. స్వామిగౌడ్ జూలై 2న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలలో 34 మంది సభ్యులు పాల్గొనగా 21 మంది మాత్రమే వోటు వేశారు.

తెలంగాణ బంద్

పోలవరం ప్రాజెక్టు బిల్లు (ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ సవరణ బిల్లు) ను కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జూలై 11న ప్రవేశపెట్టగా పార్లమెంట్ అమోదించింది. ఈ బిల్లు ద్వారా ఖమ్మం జిల్లాకు చెందిన ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ 'పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక పోరాట సమితి' ఆధ్వర్యంలో జూలై 12న బంద్ నిర్వహించారు. ఈ బంద్‌కు తెలంగాణ పొలిటికల్ జెఎసితో పాటు టిఆర్ఎస్, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, న్యూడెమోక్రసీ పార్టీలు మద్దతునిచ్చి, పాల్గొన్నాయి.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభలు

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ తొలి మహాసభలు జూలై 12,13 తేదీలలో హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లోని రాణాప్రతాప్ మహరాజ్ ఫంక్షన్ హాలులో జరిగాయి. నూతన అధ్యక్షులుగా మద్దిలేటి, ప్రధాన కార్యదర్శిగా నలమాస కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సభకు హాజరైన వక్తలు భవిష్యత్ తెలంగాణ నిర్మాణం కోసం అందరు కలిసికట్టుగా పోరాడాల్సిందేనని, ఈ పోరాటానికి విద్యార్థులు కీలకమని, తెలంగాణ రాష్ట్రంలో కూడా హక్కుల కోసం పోరాడాల్సిందేనిని పిలుపునిచ్చారు.

పోలవరం వ్యతిరేక పాదయాత్ర

జూలై ఒకటి నుంచి 13 వరకు 'పీపుల్స్ ఎగెనెస్టు పోలవరం ప్రాజెక్టు' (పిఏపిపి) ఆధ్వర్యంలో ఒడిశాలోని పాడియం బ్లాక్ నుంచి చత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మీదుగా పోలవలం ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పాదయాత్ర నిర్వహించి, భద్రాచలంలో ముగించారు. ఈ యాత్రలో పిఏపిపి జాతీయ నాయకులు సున్నం వెంకటరమణతో పాటు దళిత సంఘాల, ప్రజా సంఘాల నాయకులు, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థులు, ముంపు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గంటి ప్రసాదం ప్రథమ వర్ధంతి

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జూలై 18న అమరుల బంధుమిత్రుల సంఘం (ఎబిఎంఎస్), విప్లవ రచయితల సంఘం (విరసం) ఆధ్వర్యంలో రాజ్యహింసకు వ్యతిరేకంగా గంటి ప్రసాదం మొదటి వర్ధంతి సభ జరిగింది.

మొండి బకాయిలు రు. 6525.34 కోట్లు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వివిధ బ్యాంకులలో మొండి బకాయిల మొత్తం రు. 6525.34 కోట్లు అని 'బ్యాంకు ఉద్యోగుల సంస్థ (ఎఐబిఇఎ) తన సర్వే ద్వారా వెల్లడించింది. ఈ మొండి బకాయిలలో అధిక భాగం పెట్టుబడిదారులు, బడా కంపెనీల యజమానులే ఉన్నారు. 413 మొండి బాకాయిల మీద వివిధ కోర్టులలో కేసులు కూడా నమోదు అయ్యాయి.

చేకూరి రామారావు మృతి

తెలుగు భాషా పరిశోధకులూ, విమర్శకులూ, సాహితీవేత్త చేకూరి రామారావు (చేరా) (80) జూలై 24న హైదరాబాద్‌లోని హబ్సిగూడలో ఉన్న ఆయన స్వగృహంలో అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయారు. ఆయన 1934 జూలై 1న ఖమ్మం జిల్లా, మదిర మండలం, ఇల్లెందులపాడులో జన్మించారు. ఆయన చేరాతలు, తెలుగువాక్యం, తెలుగులో వెలుగులు, చేరా పీఠికలు, వచన పద్యం – లక్షణ చర్చ, ఇంగ్లిష్ – తెలుగు పదకోశంలతో పాటు అనేక రచనలు చేశారు. స్మృతి కిణాంకం అనే వ్యాస సంపుటికి 2002లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వచ్చింది.

రైలు ఢీకొని బడి పిల్లల మృతి

మెదక్ జిల్లా, వెల్దుర్తి మండలం, మాసాయిపేట గ్రామం దగ్గర జూలై 24న తుప్రాన్‌లోని కాకతీయ టెక్నో స్కూల్ (ప్రైవేట్) బస్సు, రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను దాటుతుండగా నాందేడ్ ప్యాసెంజర్ ఢీకొనగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 14 మంది బడి పిల్లలతో పాటు బస్సు డ్రైవర్, క్లీనర్ కూడా చనిపోయారు. 22 మంది పిల్లలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ బస్సులో మొత్తం 38 మంది విద్యార్థులు ఉన్నారు.

ఎపి వార్షిక రుణ ప్రణాళిక

ఆంధ్రప్రదేశ్ వార్షిక రుణ ప్రణాళిక రు.91459 కోట్లుగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించగా, ఈ రుణ ప్రణాళికను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. ఈ ప్రణాళికలో ప్రాధాన్యత గల రంగాలకు రు. 77894 కోట్లు, ఇతర రంగాలకు రు. 13565 కోట్లు కేటాయించారు. ఇందులో వ్యవసాయ అనుబంధ రంగాలకు రు. 56019 కోట్లు, పంట రుణలక్ష్యం రు. 41978 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రు. 6356 కోట్లు, వ్యవసాయ అనుబంధం కార్యక్రమాలకు 7685 కోట్లు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు రు. 10850 కోట్లు, విద్యా రుణాలు రు.1926 కోట్లు, హౌసింగ్ రుణాలు రు. 4795 కోట్లు, ఇతర రంగాలకు రు. 43.4 కోట్లు కేటాయించారు.

ఓపెన్ కోటాపై ప్రభుత్వాలదే నిర్ణయం

ఓపెన్ కోటా (స్థానికులూ, స్థానికేతరులూ) కింద చేరిన ఉద్యోల విషయంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని కమల్‌నాథ్ కమిటీ రెండూ రాష్ట్ర ప్రభుత్వాలకు తేల్చి చెప్పింది. రెండు రాష్ట్రాల ఉద్యోగులను 58:42 నిష్పత్తిలో విభజించాలి. ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటా 58 శాతం. తెలంగాణ వాటా 42 శాతం. ఇందులో ప్రతి జిల్లా నుంచి, జోనల్, మల్టీ జోనల్ నుంచి 20 శాతం వరకు ఓపెన్ కోటాలో ఉద్యోగులు ఉంటారు.

బడా సంస్థల బకాయిలు రికవరీ చేయాలి

హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ జూలై 20న జరిగిన 'బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (బిఇఎఫ్ఐ) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి. వెంకటరమణయ్య మాట్లాడూ దేశంలోని వివిధ బడా సంస్థలూ, రాజకీయ నాయకులూ వివిధ బ్యాంకుల నుంచి రు. 2 లక్షల కోట్లకు పైగా రుణాలు తీసుకున్నారని, ఇందులో 1129 సంస్థలు రుణాలు తిరిగి రుణాలు చెలించడం లేదని తెలిపారు. బకాయిలకు సంబంధించిన ఒక బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

రాజధానికి సాగు భూమి వద్దు

వ్యవసాయానికి అనువైన భూముల్లో రాజధానిని, ఇతర రంగాలకు సంబంధించిన సంస్థలను నిర్మించొద్దని, దానికి ఒప్పుకునేది లేదని విశాఖపట్నంలో జూలై 27న జరిగిన కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షులు ఎన్. రఘువీరారెడ్డి అన్నారు. రాజధాని నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ఆ పార్టీ నాయకులు బొత్స సత్యనారాయణ, సుబ్బరామిరెడ్డి, జెడి శీలం, కొండ్రు మురళి హాజరయ్యారు.

తగ్గిన ఉపాధి కూలీలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'ఉపాధి హామీ పథకం' పన్నుల్లో జూలై నెలలో 20 లక్షల నుంచి 4.4 లక్షల వరకు కూలీలు తగ్గన్నారు. దీనికి కారణం 2014 జూన్ 12న జరిగిన కేబినెట్ సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపులపై చర్చ జరిగింది. ఈ చర్చలో గత సంవత్సరంలో 75 శాతం పనిని పూర్తి చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లను మాత్రమే కొనసాగించాలని సర్క్యులర్ విడుదల చేశారు. వీ

మావోయిస్టులతో చర్చల్లేవు

మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని, దాడులను తిప్పికొట్టేందుకు గ్రేహౌండ్స్ దళాల ఏర్పాటుకు నిధులు ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ మావోయిస్టుల ప్రభావిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డిజిపిలతో జూన్ 26న ఢిల్లీ జరిగిన సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ సమావేశానికి ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఒడిశా, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సి.ఎస్‌లు, డిజిపిలతో పాటు సి.ఆర్.పి.ఎఫ్, బి.ఎస్.ఎఫ్ అధికారులు, హోం మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ గోస్వామి తదితరులు హాజరయినారు.

భవనంకూలి కూలీల మృతి

చెన్నై శివారులోని మౌలవాక్కంలో జూన్ 27న పదకొండు అంతస్తుల భవనం కూలి 61 మంది కూలీలు మృతి చెందారు. ఈ ప్రమాద బాధితుల్లో ఎక్కువమంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయనగరం, శ్రీకాకులం, తమిళనాడుకు చెందిన మదురై, తేని జిల్లాలకు చెందిన 200 మంది కార్మికులు ఈ భవన నిర్మాణాల్లో పనిచేస్తున్నారు. కాంచిపురం జిల్లా మౌలవాక్కంలో ప్రైమ్ సృష్టి హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రెండేళ్ల నుంచే రెండు అపార్ట్‌మెంట్లను పక్కపక్కనే నిర్మిస్తోంది.

నానావతి కమిషన్ గడువు పొడిగింపు

గోద్రా అనంతరం జరిగిన అల్లర్లపై విచారణ జరుపుతున్న నానావతి కమిషన్ కాలపరిమితిని గుజరాత్ ప్రభుత్వం మరో రెండు నెలలు ఆగస్టు 31 వరకు పొడగిస్తూ జూన్ 30న ఉత్తర్వులు జారీచేసింది. 2002లో జరిగిన గుజరాత్ మారణకాండపై విచారణకు ఏర్పాటైన కమిషన్‌కు ఇది 22వ పొడగింపు. ఈ కమిషన్‌లో రిటైర్డ్ న్యాయవాదులు జి.టి. నానావతి, అక్షయ్ మెహతా సభ్యులుగా ఉన్నారు.

కేంద్రం ఏకపక్ష నిర్ణయం

సుప్రీం కోర్టు న్యాయమూర్తి పదవులకు కొలేజియం నలుగురి పేర్లను ప్రతిపాదించగా ముగ్గురి పేర్లను మాత్రమే రాష్ట్రపతి ఆమోదించాడు. కొలేజియం ప్రతిపాదించిన నలుగురిలో గోపాల్ సుబ్రమణ్యంను ఎన్‌డిఎ ప్రభుత్వం పక్కన పెట్టింది. జూన్ 31న పదవి విరమణ చేసిన జస్టిస్ బి.ఎస్. చౌహాన్‌కు ఏర్పాటు చేసిన వీడుకోలు సమావేశంలో జస్టిస్ లోథా కేంద్ర ప్రభుత్వం తనను సంప్రదించకుండానే గోపాల్ సుబ్రమణ్యం పేరును తొలగించి ఏకపక్ష నిర్ణయం తీసుకుందని అన్నారు. సోహ్రబుద్దీన్, కౌసర్‌బీ, ఇష్రత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ల కేసుల్లో స్వతంత్రంగా వ్యవహరించినందుకే గోపాల్‌పై కక్షకట్టిందని కాంగ్రెస్ ఆరోపించింది.

బిజెపి అధ్యక్షుడుగా అమిత్‌షా

భారతీయ జనతా పార్టీ (బిజెపి) జాతీయ అధ్యక్షుడిగా ప్రధానమంత్రి నరేంద్రమోడీకి అత్యంత సన్నిహితుడైన అమిత్‌షాను జూలై 9న నియమించారు. మాజీ అధ్యక్షుడు, హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన వారసుడిగా అమిత్‌షాను ప్రకటించారు. 2002 గుజరాత్‌లో జరిగిన మారణకాండలో అమిత్‌షాపై ప్రమేయం ఉందని ఆరోపణలు రావడంతో మంత్రి పదవి నుంచి తప్పుకున్నారు.

రంగరాజన్ కమిటీ - పేదలు

పేదరిక నిర్ధారణ కోసం యుపిఎ ప్రభుత్వం నియమించిన టెండూల్కర్ రిపోర్ట్‌పై వచ్చిన విమర్శలను దృష్టిలో ఉంచుకొని దానిపై సమీక్ష కోసం జస్టిస్ రంగరాజన్ నేతృత్వంలో కమిటీ వేసింది. టెండూల్కర్ రిపోర్ట్ ప్రకారం పట్టణాల్లో రోజుకు రు. 33, పల్లెల్లో రోజుకు రు. 27 అంతకన్నా ఎక్కువ ఖర్చు చేసేవారు పేదలు కారు. జస్టిస్ రంగరాజన్ రిపోర్ట్ ప్రకారం పట్టణాల్లో రోజుకు రు. 47, పల్లెల్లో రోజుకు రు. 32 మించి చేసేవారు పేదలు కారని పేర్కొంది. 2009-2010లో 38 శాతం పేదరికం ఉండగా, 2011-12 నాటికి 29.5 శాతానికి తగ్గిపోయిందని రంగరాజన్ కమిటీ కేంద్ర ప్రణాళిక శాఖ సహాయ మంత్రి రావ్ ఇందర్‌జిత్ సింగ్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొంది.

గవర్నర్ల మార్పు

యుపిఎ ప్రభుత్వంలో నియమించిన గవర్నర్‌లను తొలగించి ఎన్‌డిఎ ప్రభుత్వం కొత్త గవర్నర్‌లను నియమిస్తోంది. ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, నాగాలాండ్ గవర్నర్‌లు బి.ఎల్. జోషి, శేఖర్‌దత్, అశ్వనికుమార్‌లు ముందే పదవుల నుంచి తప్పుకోగా, హెలీక్యాప్టర్‌ల కుంభకోణం నేపథ్యంలో పశ్చిమబెంగాల్ గవర్నర్ ఎం.కె. నారాయణన్, గోవా గవర్నర్ బి.వి.వాంచూ రాజీనామా చేశారు. జూలై 15న కేంద్రం ఆరు రాష్ట్రాలకు గవర్నర్లను నియమించింది. యుపికి రామ్‌నాయక్, గుజరాత్‌కు ఓంప్రకాశ్ కోహ్లి, చత్తీస్‌గఢ్‌కు బలరాం దాస్ టండన్, పశ్చిమ బెంగాల్‌కు కేశరీనాథ్ త్రిపాఠీ, నాగాలాండ్‌కు పద్మనాభ ఆచార్య, హర్యానాకు కప్తాన్ సోలంకిలను గవర్నర్లుగా నియమించింది.

సత్యం రాజుకు సెబి ఫైన్

సత్యం రామలింగరాజును 14 ఏళ్లపాటు స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టకుండా స్టాక్ ఎక్స్ఛేంజ్ నియంత్రణ సంస్థ (సెబి) నిషేధం విధించింది. మోసం చేసి సంపాదించిన రు. 1849 కోట్లు తమ ఖాతాలో జమ చేయాలని ఆదేశించింది. రామలింగరాజుతో పాటు ఆయన సోదరుడు రామరాజు, సత్యం కంప్యూటర్స్ అధికారులు వడ్లమాని శ్రీనివాస్, జి. రామకృష్ణ, వి.ఎస్. ప్రభాకర గుప్తాలపై కూడ జూలై 15న నిషేధం విధించింది. 12 శాతం వార్షిక వడ్డీతో కలిపి మొత్తం రు. 3,069 కోట్లను నలభై ఐదు రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించింది.

సవ్యసాచి పండా అరెస్ట్

మావోయిస్టు పార్టీ నుండి బహిష్కరణకు గురైన సవ్యసాచి పండా ఒరిస్సా మావోవాది పార్టీని ఏర్పాటు చేశాడు. ఆయనను జూలై 18న బరంపురంలోని ఓ ఇంట్లో అరెస్ట్ చేసినట్లుగా ఒడిశా డిజిపి సంజీవ్ మారిక్ ప్రకటించారు. సవ్యసాచి పండాపై గజపతి, గంజాం, నయాగఢ్, రాయగడ, బరంపురం జిల్లాల్లో 61 కేసులు ఉన్నాయన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో మత ఘర్షణలు

జూలై 27న ఉత్తరప్రదేశ్‌లోని షహరన్‌పూర్‌లో సిక్కులకూ, ముస్లీంలకూ మధ్య ఒక భూ సంబంధమైన ఘర్షణలు చెలరేగింది. అది తీవ్రరూపం దాల్చి మత ఘర్షణలకు దారితీసింది. ఈ ఘర్షణల్లో ముగ్గురు మరణించగా పన్నెండు మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. షహరన్‌పూర్‌లోని ఆరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కర్ఫ్యూ పెట్టారు. వీ

ప్రపంచకప్ సాకర్ విజేత జర్మనీ

ఫీఫా 2014 ప్రపంచకప్‌ను జర్మనీ గెలుచుకుంది. జూలై 13న జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జర్మనీ ప్రత్యర్థి అర్జెంటీనాను 1–0 గోల్‌తో ఓడించి కప్పును కైవసం చేసుకుంది. ఫీఫా 20వ సాకర్ పోటీలకు బ్రెజిల్ ఆతిథ్యం ఇచ్చింది. జూన్ 12న ప్రారంభమైన ఈ ప్రపంచకప్‌లో మొత్తం 32 దేశాలు పాల్గొన్నాయి. బ్రెజిల్‌లోని 12 నగరాల్లోని మొత్తం 64 మ్యాచ్‌లు జరిగాయి. విజేత జర్మనీ రు. 210 కోట్లు, రన్నరప్ అర్జెంటీనా రు. 150 కోట్లు ప్రైజ్‌మనీగా అందుకున్నాయి. అత్యుత్తమ ఆటగాడుగా అర్జెంటీనా ఆటగాడు లియోనెల్ మెస్సీ ఎంపికయ్యాడు. అత్యధిక గోల్స్ (6) చేసి కొలంబియా ఆటగాడు జేమ్స్ రోడ్రిగెజ్ గోల్డెన్ బూట్ అందుకున్నాడు.

మలేషియా విమానం కూల్చివేత

ఉక్రెయిన్ – రష్యా సరిహద్దులో జూలై 17న ఘోర విమాన ప్రమాదం జరిగింది. నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డ్యామ్ నుంచి కౌలాలంపూర్ వస్తున్న మలేషియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఎంఎచ్17 క్షిపణి దాడిలో కుప్పకూలిపోయింది. అందులో సిబ్బందితో సహా ప్రయాణిస్తున్న మొత్తం 295 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో 280 ప్రయాణికులు కాగా, 15 మంది విమాన సిబ్బంది ఉన్నారు. ఉక్రెయిన్, దాని తిరుగుబాటుదారుల మధ్య జరుగుతున్న పోరులో భాగంగానే ఈ దాడి జరిగింది. ఉక్రెయిన్ తిరుగుబాటుదారులు, వారికి సహాయం అందిస్తున్న రష్యా ప్రభుత్వమే ఈ ప్రమాదానికి బాధ్యులు అని ఉక్రెయిన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. మృతుల్లో అత్యధికంగా నెదర్లాండ్స్‌కు చెందిన 192 మంది పౌరులు ఉన్నారు. ఈ గందరగోళం మధ్యనే జూలై 24న ఉక్రెయిన్ ప్రధాన మంత్రి అర్సెనీ యత్సెన్యుక్ తన పదవికి రాజీనామా చేశారు. రష్యా నుంచి ఉక్రెయిన్ విడిపోయిన తరువాత రెండు దేశాల మధ్య తీవ్ర పోరు సలుపుతోంది. ఈ పోరులో ఎందరో సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. తీవ్ర ఆస్తి నష్టం జరుగుతోంది.

ట్యునీషియాలో దాడులు

ట్యునీషియాలో జూలై 17న మిలిటరీ వాహనంపై జరిగిన దాడిలో 14 మంది సైనికులు మరణించారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలకు వెళ్తున్న సైనికుల వాహనంపై ఈ దాడి జరిగింది. 2011 ట్యూనీషియాలో మొదలైన ఉద్యమం ప్రభావంతో జరిగిన అధికార మార్పిడి తరువాత ఈ అరబ్ దేశంలో సైనికులకూ, తిరుగుబాటుదారుల మధ్య తీవ్ర దాడులు జరుగుతున్నాయి.

తైవాన్‌లో కుప్పకూలిన విమానం

తైవాన్ విమానయాన సంస్థకు చెందిన ఒక టర్బోప్రాప్ విమానం పెంఘు దీవులలో కుప్పకూలిపోవడంతో 48 మంది మరణించారు. పది మంది వరకూ గాయపడ్డారు. జూలై 23న ట్రాన్స్ ఏషియా విమానం జిఇ222 మాగొంగ్ ఏయిర్‌పోర్టులో ల్యాండింగ్ కోసం ప్రయత్నం చేసింది. భారీ వర్షాలతో వాతావరణం అనుకూలించక పోవడంతో ల్యాండింగ్ కోసం తిరిగి వస్తుండగా జనావాసాలపై కుప్పకూలింది. దుర్ఘటన జరిగిన సమయంలో విమానంలో సిబ్బందితో సహా 54 మంది ఉన్నారు.

ఇరాక్‌లో ఆగని దాడులు

ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో ఆత్మాహుతి దాడులు జరుగుతున్నాయి. జూలై 20న నగరంలో షియాలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతంలో జరిగిన బాంబు దాడిలో 27 మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. నగరానికి దక్షిణ ప్రాంతంలో ఉన్న అబుదషీర్ జిల్లాలో ఒక పోలీస్ చెక్‌పోస్ట్‌పై జరిగిన దాడిలో ఏడుగురు పోలీసులతో సహా తొమ్మిది మంది మరణించారు. ఇరవై మందికి పైగా గాయపడ్డారు. పశ్చిమ ప్రాంతంలోని జిహాద్ జిల్లాల్లో ఒకటి, ఉత్తర ప్రాంతంలో ఖడిమియా ప్రాంతంలో జరిగిన రెండు ఆత్మాహుతి దాడుల్లో 19 మంది మరణించారు. ఈ ఏడాది జనవరిలో పశ్చిమాన ఉన్న అన్బర్ ప్రావిన్స్‌లోని ఫల్లూజా నగరాన్ని ఉగ్రవాదులు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకూ జరిగిన ఉగ్రవాద దాడుల్లో కనీసం ఐదువేల మందికి పైగా సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోయారనీ, దాదాపు పన్నెండు లక్షల మంది నిర్వాసితులు అయ్యారనీ తెలిపింది.

లిబియాలో కొనసాగుతున్న పోరు

లిబియాలో ఇస్లామిస్ట్ తీవ్రవాదుల మధ్య భీకర పోరు నడుస్తోంది. జూలై 20న లిబియాలోని ప్రధాన విమానాశ్రయం ట్రిపోలీ ఎయిర్‌పోర్ట్‌పై దాడులు చేశారు. రాకెట్ లాంచర్లు, ట్యాంకులతో దాడి చేశారు. దీంతో విమానాశ్రయానికి తీవ్రనష్టం వాటిల్లింది. అధికారులు విమానాల రాకపోకలను రద్దుచేశారు. మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ గడాఫీ పాలనలో కలిసి పాలనలో భాగం పంచుకున్న సాయుధ బలగాలు ఇప్పుడు లిబియాలోని చమురు నిక్షేపాలు, ప్రభుత్వంపై పట్టుకోసం ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఇరువర్గాలను కాల్పుల విరమణ పాటించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తోంది.

అల్జీరియా విమాన ప్రమాదం

ఎయిర్ అల్జీరియాకు చెందిన ఎఎచ్5017 విమానం జూలై 24న ఉత్తర మాలిలో ప్రమాదానికి గురైంది. ఆఫ్రికా దేశం బుర్కినాఫాసో రాజధాని వాగడుగు నుంచి అల్జీరియాకు బయల్దేరిన విమానం మాలి దేశంలోని గాస్సీ ప్రాంతంలో కుప్పకూలిపోయింది. విమానంలోని మొత్తం 116 మంది ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. విమానం బయల్దేరిన సమయంలో తుఫాన్ వాతావరణం నెలకొందని బుర్కినాఫాసో ప్రభుత్వం పేర్కొంది.

గాజాపై తెగబడిన ఇజ్రాయిల్

పాలస్తీనీయులు నివాసం ఉంటున్న గాజా పట్టణంపై ఇజ్రాయిల్ భయంకరమైన దాడులతో యుద్ధ వాతావరణాన్ని నెలకొల్పి ఉంది. జూలై 8న ప్రారంభమైన ఈ దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు గాజాపై ఇజ్రాయిల్ దళాలు మూడు వేలకు పైగా దాడులు చేశాయి. వైమానిక, నౌక, సాయుధ శకటాల దాడులతో గాజా భీతిల్లిపోతోంది. రెండు వేలకు పైగా రాకెట్‌లను ప్రయోగించాయి. ఈ దాడులలో ఇప్పటి వరకు వెయ్యి మందికి వరకు చనిపోయారు. వేలాది మంది క్షతగాత్రులు అయ్యారు. మృతుల్లో చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. గాజాలోని ఇళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలను ఇజ్రాయిల్ దాడులకు లక్ష్యంగా చేసుకొంది. అంతర్జాతీయంగా కాల్పుల విరమణకు ఒత్తిడి వస్తున్నా ఇజ్రాయిల్ దాడులను విరమించు కోలేదు.

దక్షిణ సుడాన్‌లో కరువు పరిస్థితి

దక్షిణ సుడాన్‌లో కొనసాగుతున్న ఆధిపత్య పోరులో ప్రజలు ఆకలితో అలమటించిపోతున్నారు. అధ్యక్షుడు సాల్వా కీర్, ఉపాధ్యక్షుడు రీక్ మచార్ మధ్య గత డిసెంబర్ నుంచి నడుస్తున్న ఆధిపత్య పోరు తీవ్ర సంక్షోభానికి దారీ తీస్తోంది. దాదాపు నలభై లక్షల మంది అంటే మూడవ వంతు ప్రజలకు ఆహారం అందడం లేదు. ఇది ప్రపంచంలోనే అత్యంత దుర్భర పరిస్థితి. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎ.మల్లేశ్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 జూన్ నుండి 30 జూన్ 2014 వరకు తెలంగాణలోని 7 జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 5 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1611)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
తెలంగాణ	**-**	**23**	**-**	**68**	**87**	**27**	**18**	**16**	**8**	**19**	**28**	**31**	**38**	**34**	**167**	**122**	**-**	**-**	**-**	**19**	**34**
ఆదిలాబాద్	-	3	-	24	21	9	4	3	2	2	3	2	1	2	23	24	-	-	-	3	2
హైదరాబాద్	-	-	-	13	17	-	-	-	-	6	9	7	-	2	23	18	-	-	-	5	-
కరీంనగర్	వివరాలు అందలేదు																				
ఖమ్మం	-	-	-	4	8	1	3	1	1	2	-	2	-	3	19	17	-	-	-	-	22
మహబూబ్‌నగర్	-	4	-	4	12	-	1	2	-	1	11	12	25	14	46	19	-	-	-	-	-
మెదక్	-	16	-	6	8	9	4	2	4	2	2	5	9	2	9	9	-	-	-	2	3
నల్గొండ	వివరాలు అందలేదు																				
నిజామాబాద్	-	-	-	11	18	-	-	-	1	6	3	3	2	6	27	26	-	-	-	-	7
వరంగల్	-	-	-	6	3	8	6	8	-	-	-	-	1	5	20	9	-	-	-	9	
ఆంధ్రప్రదేశ్	**1**	**7**	**-**	**35**	**16**	**34**	**10**	**7**	**24**	**7**	**15**	**35**	**16**	**126**	**53**	**-**	**-**	**-**	**-**	**12**	**419**
అనంతపురం	-	5	-	5	9	-	-	-	-	3	1	1	2	5	19	-	-	-	-	-	1
చిత్తూరు	-	-	-	9	15	7	8	-	-	-	2	8	23	2	17	3	-	-	-	-	26
కర్నూలు	-	2	-	9	5	4	8	10	4	6	3	5	7	4	25	13	-	-	-	-	8
శ్రీకాకుళం	-	-	-	4	14	4	15	-	1	5	-	-	1	4	36	21	-	-	-	-	180
విశాఖపట్నం	1	-	-	8	12	1	3	-	2	10	1	1	2	1	29	16	-	-	-	12	204
మొత్తం	**1**	**30**	**-**	**103**	**142**	**43**	**52**	**26**	**15**	**43**	**35**	**46**	**73**	**50**	**293**	**175**	**-**	**-**	**-**	**31**	**453**

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం - ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
సామాజిక విద్య - ఒకమిథ్య	ఎ. నర్సింహారెడ్డి	100
ప్రజా ఎజెండా లేని		
పార్లమెంటరీ రాజకీయాలు	ఎ. నర్సింహారెడ్డి	40
ఒక ప్రేతాత్మక కథ	అరుంధతీ రాయ్	25
సమాధిలోకి సామ్రాజ్యవాదం	డి. పాపారావు	200
కొత్తకోణం	ఎనిశెట్టి శంకర్	80
ఫారన్‌హీట్ 451	ఎనిశెట్టి శంకర్	90
నిత్యజీవితంలో సోషలిజం	భూసారం శివన్న	100

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం-మతం

శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్‌సి, ఎస్‌టి నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా పూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు - రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు - అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు - మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందూవు నెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ - వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
మహోదయం	కె.వి.ఆర్.	200
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-1	శారదాంబ స్మారక కమిటీ	300
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-2	శారదాంబ స్మారక కమిటీ	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-3	శారదాంబ స్మారక కమిటీ	250
సాహిత్య సమాలోచన	కృష్ణాబాయి	300
సందిగ్ధ సందర్భం	సి.వి. సుబ్బారావు	40
సామాజికం	వి. చెంచయ్య	30
స్త్రీవాద సాహిత్యం	డా. నళిని	70
రియాలిటీ చెక్	పూడూరి రాజిరెడ్డి	250
మన ప్రపంచం	దుప్పల రవికుమార్	75

చరిత్ర-జీవిత చరిత్ర

కశ్మీర్‌లో ఒక నిషిద్ధ రాత్రి	బషారత్ పీర్	రు. 150
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	100
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఆర్.ఎస్.రావు స్మృతిలో	వ్యాస సంకలనం	50
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
టాల్‌స్టాయ్ పరిచయ వ్యాసాలు	యన్.వి.ఎస్. నాగభూషణాచార్యులు	30
నూరేళ్ల కాళోజీ	వరవరరావు	60
ఆకుల భూమయ్య రచనలు	తెలంగాణ విద్యార్థి గళం	40

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	న్యూవిస్టా పబ్లికేషన్స్	100
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్ని		

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
జనహృదయం జనార్దన్	సూరపనేని మోహనరావు	60
కోటి జ్ఞాపకాలు	విరసం ప్రచురణ	50
మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
రివిజనిజం	విరసం ప్రచురణ	75
జనతన జైత్రయాత్ర	విరసం ప్రచురణ	20
అంతర్యుద్ధంలో ఆదివాసులు	విరసం ప్రచురణ	20
ఆదర్శ జీవులు అమరులు	విరసం ప్రచురణ	30

కథ - నవల

దండకారణ్యంలో కథలు(2005-2012)	విరసం ప్రచురణ	100
రేపు కథ	వెర్నన్ గొంజాల్విస్	20
మిగిలేటోళ్లు	బాసిత్	50
కాంత పున్నం వెన్నెల	పద్మకుమారి	20
గంగానమ్మ	విజయ	15
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50
ఒంద్రుమట్టి	నల్లూరి రుక్మిణి	170

డివిడి

వీక్షణం (2003 - 2012)	200
సృజన (1966-1992)	240
అరుణతార (1970-2013)	125

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 157 - August 2014 • ISSN 2231-6892
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/07/2014 • Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16

వేలాది మంది అభిమానుల కోరిక
వీక్షణంను కాపాడుకుందాం
ఎందరో శ్రేయోభిలాషులు చాస్తున్న స్నేహహస్తం
వీక్షణం మనుగడ కోసం శాయశక్తులా కృషి చేద్దాం,
మూలనిధి ఏర్పాటు చేద్దాం

వీక్షణం ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కి చిరకాలం కొనసాగాలంటే చందాదారులు, పాఠకులు పెరగాలి. ప్రతినెలా కనీసం మూడు పేజీల ప్రకటనలు రావాలి. శక్తి ఉన్న దాతలు ఇతరులకు కానుకగా చందాలు, విరాళాలు ఇవ్వాలి. వీక్షణం చిరకాలం మనుగడ సాగించడానికి వీలుగా మూలనిధి ఏర్పడాలి. ఈ విశాల సహాయ చర్యలలో భాగంగా:

- **వీక్షణం పాఠకులలో ప్రతి ఒక్కరమూ కనీసం మరొక చందా చేర్పించవచ్చు**
- **వీక్షణం పాఠకులలో ప్రతి ఒక్కరమూ మన చందాతో పాటు కనీసం రు. 100 వీక్షణం మూలనిధికి విరాళంగా ఇవ్వవచ్చు**
- **కళాశాలలను, విద్యాసంస్థలను, ప్రభుత్వ, ప్రైవేటు గ్రంథాలయాలను వీక్షణం చందాదారులుగా చేర్పించి వీక్షణం మరింత మంది పాఠకులకు చేరువయ్యేలా చూద్దాం**
- **ప్రతి న్యూస్ ఏజెంట్ దగ్గరా వీక్షణం విడిప్రతులు అమ్మకానికి ఉండే ఏర్పాట్లు చేయవచ్చు**
- **ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న వీక్షణం పాఠకులు తమ బాధ్యతగా వారి సంవత్సరాదాయంలో కనీసం ఒక శాతం వీక్షణం మూలనిధికి విరాళంగా ఇవ్వవచ్చు**
- **సామాజిక జీవితంలో క్రియాశీలంగా ఉన్న, విస్తృత పరిచయాలు ఉన్న వీక్షణం అభిమానులు తమకు తెలిసిన దాతల నుంచి వీక్షణం మూలనిధికి విరాళాలు సేకరించవచ్చు**
- **విద్యాసంస్థల, ఆరోగ్య సంస్థల, సాధారణ వ్యాపార సంస్థల నిర్వాహకులతో పరిచయాలు ఉన్న అధ్యాపకులు, మిత్రులు, సామాజిక కార్యకర్తలు వీక్షణం కోసం ఆయా సంస్థల వ్యాపార ప్రకటనలు సేకరించవచ్చు**
- **వీక్షణం ప్రచారం కోసం, ఆర్థిక సహాయం అర్థించడం కోసం మీ ప్రాంతాలలో సమావేశాలు ఏర్పాటు చేయవచ్చు**

వివరాలకు

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao